# బోల్షివిక్

ఏఓబీ సమాచార పత్రిక

సీపీఐ (మావోయిస్టు)

సంపుటి - 12 సంచిక - 2 జులై - డిసెంబర్ 2022





'దున్నేవారికే భూమి-విప్లవ ప్రజారాజ్య కమిటీలకే అధికారం' లక్ష్యంతో
ఏఓబీలో కొనసాగుతున్న సాయుధ వ్యవసాయక విప్లవ కార్యక్రమం






# విషయసూచిక


సాయుధ వ్యవసాయక విప్లవ కార్యక్రమం - 4


ఏఓబీ జోన్ కనీస కార్యక్రమం - 11




కొరియా ప్రాంతం - ఏపీ, ఒడిశా ప్రభుత్వాలు - 23

ఫాసిజం ఒక భయంకరమైనది- కాని అస్థిరమైనది - 27



ఎస్ఐబీ - 36

ప్రజలకు లేఖ - 38





జోస్ మారియో సిసాన్ - 39

అమరుల జీవిత చరిత్ర - 41

పోరాట స్రవంతి - 45




అమరులకు నివాళి

# మీ త్యాగాల వెలుగులో ప్రజాయుద్ధమార్గం ప్రకాశవంతమైంది!
# లక్ష్యం చేరేదాక మీరు చూపిన మార్గం వదలం!!



భారత దేశంలో ప్రస్తుతం నెలకొని వున్న అర్ధ వలస, అర్ధ భూస్వామ్య సమాజాన్ని కూకటివేళ్ళతో పెళ్ళగించి, నూతన ప్రజాస్వామిక వ్యవస్థనూ, ఈ క్రమంలో సోషలిజాన్ని, అంతిమంగా కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) నేతృత్వంలో ప్రజలు వీరోచితంగా ఉద్యమిస్తున్నారు. ఈ ఉద్యమాన్ని అణచి వేసి, తమ అధికారాన్ని సుస్థిరం చేసుకొనేందుకూ, దోపిడీ పీడనలను కొనసాగించేందుకు ఈ దేశ దోపిడీ పాలక వర్గాలైన దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు, వారి యజమానులైన సామ్రాజ్యవాదులు తమ రాజ్యాంగ యంత్రం ద్వారా పార్టీపైనా, పీఎల్‌జీఏపైనా, ప్రజలపైన తీవ్రమైన సాయుధ అణిచివేతను కొనసాగిస్తున్నారు. ఈ అణచివేత 2009 సెప్టెంబర్ నుంచి గ్రీన్‌హంట్ బహుముఖ, సైనిక దాడి రూపంలో మరింత తీవ్రతరమై, 2017 ఫిబ్రవరి నుండి 'సమాధాన్-ప్రహార్' పేర్లతో ఈ దాడి అత్యంత పాశవికంగా, క్రూరంగా, మోసపూరితంగా కొనసాగుతున్నది. విరుద్ధ ప్రయోజనాల కోసం జరుగుతున్న ఈ యుద్ధంలో ప్రజల రాజ్యాధికారాన్ని నెలకొల్పే లక్ష్యంతో దోపిడీ వర్గాల రాజ్యంతో వీరోచితంగా పోరాడుతూ అనేక మంది ప్రజల ఉత్తమ పుత్రులు, పుత్రికలు తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తున్నారు. చరిత్ర పురోగమనానికి తమ వంతు కర్తవ్యంగా వీరోచితమైన త్యాగాలను చేస్తూ గొప్ప విప్లవ సాంప్రదాయాలను నెలకొల్పుతున్నారు. జులై నుండి డిసెంబర్ 2022 వరకు దేశవ్యాప్తంగా పదుల సంఖ్యలోనే పార్టీ, పీఎల్‌జీఏ, ప్రజాసంఘాల సభ్యుల నాయకత్వంతో పాటు, సాధారణ ప్రజలు నేలకొరిగారు. ప్రపంచ సోషలిస్టు విప్లవ నాయకుడు, ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపక చైర్మన్ కామ్రేడ్ జోస్ మారియో సిసాన్ డిసెంబర్ 16న అనారోగ్యంతో తుదిశ్వాస విడిచాడు. అలాగే భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) విప్లవోద్యమ సీనియర్ నాయకుడు కామ్రేడ్ ఎల్ఎస్ఎన్ మూర్తి (లక్కవరపు సత్యనారాయణ మూర్తి)దీర్ఘకాలంగా అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటూ డిసెంబర్ 21న కన్నుమూసాడు. సీఆర్‌సీ 1వ పీఎల్ కామ్రేడ్ సుంద్రి (పార్టీ సభ్యురాలు), కామ్రేడ్ మంగో(పార్టీ సభ్యురాలు)లు అనారోగ్యంతో ప్రాణాలు కోల్పోయారు. వీరితోపాటు దేశ వ్యాపితంగా అనేక మంది కామ్రేడ్స్ శత్రువుతో వీరోచితంగా పోరాడుతూ అమరులైనారు. మన ఈ కామ్రేడ్స్ అమరత్వం పార్టీకి, ఉద్యమానికి ఎనలేని నష్టాన్ని కల్పించింది. వారి కుటుంబాలకూ, శ్రేయోభిలాషులకు తీవ్రమైన దుఃఖాన్ని నింపింది. ఈ పరిస్థితులలో అమరుల కుటుంబాల, శ్రేయోభిలాషుల దుఃఖంలో పాల్పంచుకుంటూ, వారికి ఎస్‌జడ్‌సి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నది. అలాగే అమరుల ఆశయాలను సఫలీకృతం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తూ, వారికి తలవంచి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నది.

# 'దున్నేవారికే భూమి-విప్లవ ప్రజారాజ్యకమిటీలకే అధికారం' లక్ష్యంతో ఏఓబీలో కొనసాగుతున్న సాయుధ వ్యవసాయక విప్లవ కార్యక్రమం

నేడు మనదేశం పెట్టుబడిదారీ సమాజమా? లేక అర్ధవలస-అర్ధభూస్వామ్య సమాజమా? అనే విషయంపై దేశంలో పెద్దఎత్తున చర్చలు, వాద వివాదాలు నడుస్తున్నాయి. భారతదేశం పెట్టుబడిదారీ సమాజంగా మారిందనీ, 'దున్నేవారికే భూమి' నినాదానికి కాలం చెల్లిందనీ, దీర్ఘకాలిక ప్రజాయుద్ధపంథాకు నేడు ప్రాసంగికత లేదనీ, అది కాలం చెల్లిన సిద్ధాంతమని సామ్రాజ్యవాద, దళారీ పాలకవర్గాల ప్రయోజిక సంస్థలు, ఏజెంట్లు, రివిజనిస్టులు, విద్రోహశక్తులు పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. ప్రజలలో గందరగోళం సృష్టించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత 10 ఏళ్ళలో ఏఓబీ ప్రాంతంలో 'భూమి సమస్య కేంద్రం'గా సాయుధ వ్యవసాయక విప్లవ కార్యక్రమంలో భాగంగా జరిగిన భూ పోరాటాలు, నిర్వాసిత వ్యతిరేక పోరాటాలు పరిశీలిస్తే ప్రజలకు భూమి సమస్య కీలకమైనదనీ, 'దున్నేవారికే భూమి' అనేది నేటికీ రణనినాదంగా ఉందని రుజువవుతోంది.

దేశంలో అర్ధవలస-అర్ధభూస్వామ్య ఉత్పత్తి సంబంధాల మూలంగా ఒకవైపు భూస్వాముల చేతుల్లో భూమి బంధించబడి ఉండగా, మరోవైపు సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలు, దేశీయ కార్పొరేట్ సంస్థలు, ప్రభుత్వాలు 'అభివృద్ధి' పేరిట రైతాంగం నుండి బలవంతంగా భూమి గుంజుకోవడంతో లక్షలాది మంది రైతాంగం నిర్వాసితులవుతున్నారు. దేశంలో విశాల రైతాంగానికి భూమి సమస్యే ప్రధాన కేంద్రబిందువుగా మారింది. పర్యవసానంగా ఏఓబీ ప్రాంతంలో ఆదివాసీ రైతాంగం ఒకవైపున భూస్వాములనుండి 'దున్నేవారికే భూమి' ప్రాతిపదికన భూ ఆక్రమణ పోరాటాలనూ, మరోవైపునా బహుళజాతి సంస్థల ప్రయోజనాలకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అటవీ సంపదనూ, ఖనిజ వనరులను దోచుకోవడానికి వ్యతిరేకంగా నిర్వాసిత వ్యతిరేక పోరాటాలు చేస్తున్నారు. నిర్వాసిత సమస్య కూడా సారాంశంలో భూమి సమస్యనే.

గత దశాబ్దకాలంలో ఏఓబీ ప్రాంతంలో 'దున్నేవారికే భూమి-విప్లవ ప్రజారాజ్యాధికార కమిటీల(ఆర్‌పీసీ)కే అధికారం' అనే కేంద్ర నినాదంతో మావోయిస్టు పార్టీ నాయకత్వంలో క్రూరమైన శత్రుదమనకాండను ప్రతిఘటిస్తూ కొనసాగుతున్న సాయుధ వ్యవసాయక విప్లవ కార్యక్రమాన్ని పరిశీలిద్దాం.

### భూ పోరాటాలు

2009 నాటికే ఒడిశాలోని కొరాపుట్ జిల్లాలో నారాయణపట్నా, బందుగాం బ్లాక్‌లలో భూమి సమస్య కేంద్రంగా ఉవ్వెత్తున ఎగసిన సాయుధ రైతాంగ పోరాటం దేశవ్యాపితంగా గొప్ప ప్రభావం వేసింది. ఆదివాసేతర భూస్వాముల, షావుకార్ల కబ్జాలో ఉన్న సుమారు 5వేల ఎకరాల భూములను వేలాది మంది ఆదివాసీ రైతాంగం స్వాధీనం చేసుకున్నారు. శతాబ్దాలుగా పాతుకుపోయిన దోపిడీ సంబంధాలను కూలదోసి ప్రజలు వర్గ సంఘాలలో, మిలీషియాలో సంఘటితమవుతూ ప్రజారాజ్యాధికార అంగాలైన ఆర్‌పీసీలను ఏర్పర్చుకున్నారు. ప్రభుత్వ సంస్కరణలను తిప్పికొడుతూ తమ భూమి సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ప్రభుత్వం నుండి వేటినీ తీసుకోమనీ, ప్రభుత్వ కార్యకలాపాలను కొనసాగనివ్వమని ఒక నెల రోజులపాటు 'కార్యబంద్' ఆందోళనను చేపట్టి విజయవంతం చేసారు. ఈ పోరాటం భూస్వాములనూ, ప్రభుత్వ సాయుధ బలగాలను గడగడలాడించింది. పీడిత ప్రజల్లో రాజ్యాధికార పోరాటస్ఫూర్తిని నింపింది. అయితే ఈ పోరాటాన్ని అణచివేయడం కోసం ప్రభుత్వం భూస్వాములకు అండగా సాయుధ బలగాలను దింపి, కార్పెట్ సెక్యూరిటీ పేరుతో పోలీసు క్యాంపులను పెట్టి ప్రజలపై, రైతాంగంపై తీవ్రమైన దమనకాండను అమలు చేసింది. పార్టీ నాయకత్వంలో పీఎల్‌జీఏ అండతో రైతాంగం ప్రతిఘటించినప్పటికీ, 2012 నాటికి ఉన్నతదశకు చేరుకున్న ఈ ఉద్యమంపై ఒక వైపు ప్రభుత్వ సాయుధ బలగాల దాడి, మరోవైపు ఈ ఉద్యమంలో నాయకుడిగా కీలకపాత్ర పోషించిన నాచికలింగ మితవాద, అవకాశవాద రాజకీయాల గందరగోళం, విద్రోహం వలన 2013 నాటికి నారాయణపట్నా సాయుధ రైతాంగ పోరాటం వెనుకపట్టు పట్టింది. క్రూరమైన నిర్బంధకాండతో ఉద్యమం అణచివేయబడింది. అయినప్పటికీ అటువంటి క్లిష్ట పరిస్థితులలో పార్టీ చేసిన రాజకీయ కృషి మూలంగా ప్రజలు తమ విముక్తికి సరైనమార్గాన్ని అర్థం చేసుకుంటూ, గత పోరాట అనుభవాలు, గుణపాఠాల ఆధారంగా నూతన పోరాట రూపాలతో, నిర్మాణ ఎత్తుగడలతో ముందుకు వస్తున్నారు. నారాయణపట్నా బ్లాక్ సెంటర్‌లోనూ, పోలీస్‌క్యాంపుల పరిసరాలలోను ఉన్న భూములను పోలీసుల అండతో భూస్వాములు స్వాధీనం చేసుకున్నప్పటికీ, ప్రజలు ఆ భూముల్లో కూలీపనులను బహిష్కరించడం, పోస్టర్లు వేయడం, జెండాలు పాతడం వంటి రూపాల్లో

తమ నిరసనను తెలియజేస్తున్నారు. ఒకచోట అణచివేస్తే మరోచోట పోరాటాలు మొలకెత్తుతూనే వస్తున్నాయి.

నారాయణపట్నా పోరాటస్ఫూర్తి కొరాపుట్ జిల్లాలోని బందుగాం, లక్ష్మింపూర్, పొట్టంగి, నందపూర్, లమ్తాపుట్ బ్లాక్‌లకు విస్తరించింది. 2012 జనవరిలో లమ్తాపుట్ బ్లాక్, మ(తి)పుట్ ప్రాంతంలో స్థానిక భూస్వామి నిరంజన్ మొదిలి దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా 15 గ్రామాల ప్రజలు కదిలి వాడి ఆధీనంలో ఉన్న జీడిమామిడి తోటలు, నీలగిరి తోటలు, పంటపొలాలు మొత్తం కలిపి సుమారు 400 ఎకరాలను స్వాధీనం చేసుకున్నారు.

పొట్టంగి బ్లాక్‌లోని పుక్కిలి గ్రామానికి చెందిన జగత్‌రాయ్ అనే ఒక ఆదివాసేతర డోంబ్ భూస్వామి పేటూరు పంచాయితీ, పద్మాపురం అనే గ్రామంలో ఆక్రమించుకున్న 12 ఎకరాల ప్రజల భూములను 2013లో పార్టీ నాయకత్వంలో ప్రజలంతా కదిలి 70 నాగళ్ళతో భూములు దున్ని, ఎర్రజెండాలు పాతి, ఆ భూములను స్వాధీనం చేసుకున్నారు. ఇదే సమయంలో పొట్టంగి బ్లాక్, అంపవల్లి పంచాయితీ పెదపాడులో 15 ఎకరాల భూమినీ, గొల్లూరు పంచాయితీ, కొట్టూబు గ్రామంలో స్థానిక పెత్తందార్లకూ, భూస్వాములకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడి నీలగిరి తోటలను సాధించుకున్నారు. పేటూరు పంచాయితీలో కరెంట్ వెంకటరావు అనే ఆదివాసేతర దళారీ ఆక్రమించుకున్న పురిగూడ, గెమ్మెలిపాడు గ్రామాలకు చెందిన 10 ఎకరాల భూములను ఆ గ్రామాల ప్రజలు స్వాధీనం చేసుకున్నారు.

ఏఓబీ జోన్‌లో 2015-16లో పార్టీ గ్రామీణ ప్రాంతంలో 'సామాజిక సంబంధాలు, వర్గ పరిశోధన' చేపట్టి నివేదికను తయారు చేసింది. ఆ తర్వాత వివిధ డివిజన్స్‌నుండి ముఖ్యమైన నాయకత్వ కోర్‌తో జోన్ వర్క్‌షాప్‌ను నిర్వహించింది. ఆ వర్క్‌షాప్‌లో జరిగిన లోతైన చర్చల ద్వారా గడిచిన 3 దశాబ్దాలలో ఈ ప్రాంతంలో జరిగిన వర్గపోరాటం, దేశంలో ప్రభుత్వాలు అనుసరించిన ఎల్‌పీజీ విధానాల ఫలితంగా వ్యవసాయరంగంలో 'ఉత్పత్తివిధానం-ఉత్పత్తి సంబంధాల'లో కొన్ని మార్పులు వచ్చినప్పటికీ, మౌలికంగా మార్పురాలేదనీ, నేటికీ భూమి సమస్యనే ప్రజల కీలక సమస్యగా ఉందని ఒక నిర్ధారణకు వచ్చింది. దీని ఆధారంగా నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ విప్లవ కార్యక్రమాన్ని పురోగమింపజేసేందుకు ఏఓబీ ఎస్‌జడ్‌సీ ఒక సర్క్యులర్‌ను పార్టీ శ్రేణులకు అందించింది. ఈ సర్క్యులర్ మార్గదర్శకత్వంలో ఆయా డివిజన్స్‌లో పార్టీ నాయకత్వంలో నూతన ఎత్తుగడలతో సాయుధ వ్యవసాయక విప్లవ కార్యక్రమం కొనసాగింది.

ఎమ్‌కేవీబీ డివిజన్ కటాఫ్ ప్రాంతంలో బియానికుడి గ్రామానికి చెందిన పెత్తందారు, భూస్వామి అయిన బలరాం దోపిడీ, దౌర్జన్యాలనూ, అరాచకాలను 2016లో పార్టీ నాయకత్వంలో ప్రజలు ప్రశ్నించారు. దాంతో వీడు కుటుంబంతోసహా పారిపోయి పోలీసుల చెంతకు చేరాడు. వీడి ఇల్లు, పశువులు, ఇంట్లో సామానులు, 12 ఎకరాల భూమిని ప్రజలు స్వాధీనం చేసుకున్నారు.

గుర్రశెట్టి గ్రామంలో సుండి భూస్వాముల కబ్జాలో ఉన్న 300 ఎకరాల భూమిని 2012లో పార్టీ నాయకత్వంలో ప్రజలు స్వాధీనం చేసుకొని 6 గ్రామాలలోని సుమారు అర్హులైన 200 భూమిలేని పేదకుటుంబాలకు ఆ భూమిని పంచడం జరిగింది.

గుసొంపొదూర్ గ్రామానికి చెందిన పెత్తందారు, భూస్వామి, పోలీసు ఏజెంట్లయిన అన్నదమ్ములు గోపాల్, సహదేవ్‌లకు చెందిన 20 ఎకరాల భూములను ప్రజలు స్వాధీనం చేసుకొని భూమిలేని 13 వ్యవసాయ కుటుంబాలకు పంచారు.

బచ్చులిపొదూర్ గ్రామ పెత్తందారు దొన్నొకు చెందిన 8 ఎకరాల భూములను ప్రజలు స్వాధీనం చేసుకున్నారు. ఇదే గ్రామానికి చెందిన 30 ఎకరాల భూమి తాకట్టు పేరుతో పక్కనే ఉన్న ఒరపొదూర్ గ్రామంలో రెండు కుంటుంబాల చేతుల్లో ఉండగా, సంఘం నాయకత్వంలో ప్రజలు దాన్ని విడిపించుకొని 20 ఎకరాలను గ్రామంలో 27 కుటుంబాలకు పంపిణీ చేసి, మిగతా 10 ఎకరాల భూమిలో సమిష్టి వ్యవసాయం చేసే విధంగా నిర్ణయించారు. ఒరపొదూర్ గ్రామంలో పెత్తందార్ల ఆధీనంలో ఉన్న 40 ఎకరాల భూములను సంఘ నాయకత్వంలో ప్రజల స్వాధీనం చేసుకొని భూమిలేని 40 కుటుంబాలకు పంపిణీ చేసారు.

సిమిలిపొదూర్ గ్రామంలో ప్రజావ్యతిరేకులు క్రిష్టియన్ మతపెద్ద రాము, అతని తమ్ముడు రవిలకు చెందిన 3 ఎకరాల భూమిని ప్రజలు స్వాధీనం చేసుకొని గ్రామంలో 5 కుటుంబాలకు పంచారు.

గొబ్బరిపడ గ్రామానికి చెందిన తెగ నాయకుడు క్రూరమైన భూస్వామి పోలీసు ఏజెంటుగా కూడా మారి దళంపై దాడి చేయించాడు. ఇది బహిర్గతమై గ్రామం నుండి పారిపోయాడు. ఇతని 20 ఎకరాల సారవంతమైన పొలం, 30 క్వింటాళ్ళ ధాన్యం ప్రజలు జప్తు చేసుకుని పంపిణీ చేసుకున్నారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా, పెదబయలు ప్రాంతం, జామ్‌గూడ పంచాయితీ, గుంజివాడ గ్రామంలో బాలంనాయుడు, చింతలవీధి గ్రామంలో తిరుపతి పడాలు, చిలకవీధి గ్రామానికి చెందిన పెత్తందారులు కలిసి ఆక్రమించుకున్న 60 ఎకరాల భూములను 2016లో విప్లవ రైతుకూలీ సంఘం నాయకత్వంలో ప్రజలు స్వాధీనం చేసుకొని 3 గ్రామాలలో 65 నిరుపేద కుటుంబాలకు పంపిణీ చేసారు.

2017లో కటాఫ్ (గుమ్మ) ఏరియాలో ఒండ్రుపల్లి గ్రామంలో ఆధిపత్యశక్తుల చేతుల్లో ఉన్న 35 ఎకరాల భూమినీ, సిమిలిపొదూర్‌లో తెగపెద్ద, ప్రజావ్యతిరేకికి చెందిన 10 ఎకరాల భూమిని ఆ గ్రామాల్లో పేదరైతు కుటుంబాలకు పంపిణీ చేసారు.

తాబేరు, కొండింజెరి, నడిమింజెరి, మ(తి)బెడ, తోటగూడ, కోడిగొంది గ్రామాలలో భూ అసమానతలు తగ్గించడంలో భాగంగా ఎక్కువ భూములు కలిగి ఉన్న ధనిక రైతులనుండి వారి ఆమోదంతోనే సుమారు 30 ఎకరాలకు పైగా భూములను తీసుకొని భూమిలేని కుటుంబాలకు పంచారు.

ఈ కాలంలో ఉప్పచెరువు, డెంగగూడ గ్రామ పెత్తందార్లకు చెందిన భూములనూ, కొనసపుట్, జొడాంబ గ్రామాల భూస్వాముల కబ్జాలో ఉన్న భూములను కూడా ప్రజలు స్వాధీనం చేసుకున్నారు. పనసపుట్‌లోని భూస్వాములు భగీరథీ, జోగర్‌నాథ్ ఆధీనంలో ఉన్న 40 ఎకరాల భూములను పార్టీ నాయకత్వంలో కుమడగూడ గ్రామానికి చెందిన ప్రజలు స్వాధీనం చేసుకొని ఆ భూములలోనే నివాసాలు ఏర్పర్చుకొని నువగూడ అనే గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

గతంలో స్వాధీనం చేసుకున్న భూములలో నిర్బంధం, వ్యవసాయ పరికరాలులేని కారణంగా సాగులోకి రాని భూములను కూడా ఆ సమస్యలను పరిష్కరిస్తూ ఈ కాలంలో సాగులోకి తేవడం జరిగింది.

పెదబయలు ఏరియాలో కిల్లంకోట భూస్వాముల నుండి గతంలో స్వాధీనం చేసుకొని పంపిణీ చేసిన భూములు నిర్బంధం కారణంగా కొంతకాలం సాగులోకి రాలేదు. తిరిగి 2016లో పార్టీ ప్రజలతో ఈ విషయం చర్చించి సమస్యలు పరిష్కరించడంతో ఆ భూములు సాగులోకి వచ్చాయి. అలాగే గుంజివీధి భూస్వామి రాంనాయుడి భూములను 2015లో సంఘం నాయకత్వంలో 3 గ్రామాల ప్రజలు స్వాధీనం చేసుకున్నారు. రాంగూడ ఎన్‌కౌంటర్ తర్వాత పార్టీ దెబ్బతిన్నదని ప్రజలను బెదిరించి మళ్ళీ రాంనాయుడు ఆ భూములను ఆక్రమించుకొని కౌలుకు ఇచ్చాడు. 2017లో పార్టీ, సంఘం నాయకత్వంలో ప్రజలు ఆ భూములను స్వాధీనం చేసుకున్నారు.

నారాయణపట్నా భూ పోరాటన్ని అణచివేయడంలో భాగంగా ప్రభుత్వం, పోలీసులు సాయుధ దాడితోపాటు, అనేక విధాలుగా ప్రలోభాలకు గురిచేసి, కొంత మంది సంఘనాయకత్వాన్ని లొంగదీసుకున్నారు. అలా సంఘనాయకత్వం బలహీనపడి లొంగిపోయిన కొన్ని చోట్ల భూస్వాములు, షావుకార్లు, పోలీసుల అండతో తిరిగి ప్రజల భూములను అక్రమించుకున్నారు. అయినప్పటికీ ప్రజలు తమ భూములను రక్షించుకోవడానికి సిద్ధమయ్యారు. నారాయణపట్నానికి ఆనుకొని ఉన్న బందుగాం బ్లాక్‌లో భూ పోరాటానికి ద్రోహం చేసి, లొంగిపోయిన సంఘనాయకుడు బిర్సుని 2017 మార్చిలో 5 గ్రామాలకు చెందిన ప్రజలు పార్టీ నాయకత్వంలో ప్రజాకోర్టు నిర్వహించి దేహశుద్ధి చేయడంతోపాటు, అదేరోజు రాత్రి ప్రజలంతా కలిసి కత్తులపేట భూముల్లో జెండాలు పాతి భూములను స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత ఆ భూముల్లో ఏపుగా పెరిగి ఉన్న సెంటుగడ్డి (లెమన్‌గ్రాస్) ప్రజలు 3 రోజులపాటు సెంట్రీలు పెట్టుకొని కోసుకున్నారు. సెంటునూనే అమ్మగా వచ్చిన డబ్బులను ఒక్కొక్క గ్రామానికి 30 వేల చొప్పున పంచుకున్నారు. చివరకు 5 గ్రామాల ప్రజలు, సంఘనాయకత్వం షావుకార్లందరిని పిలిచి భూముల జోలికివస్తే సహించేది లేదనీ, భూముల కోసం దేనికైనా సిద్ధమేనని తేల్చి చెప్పారు.

2020లో కోరుకొండ ఏరియా, చింతలదూలి గ్రామ మునసబు గతంలో ప్రజల నుండి ఆక్రమించిన 10 ఎకరాల భూమినీ, సువ్వపల్లి గ్రామ మునసబు అక్రమించిన 8 ఎకరాల భూమిని విప్లవ ప్రజా కమిటీ నాయకత్వంలో ప్రజలు స్వాధీనం చేసుకున్నారు.

ఈ విధంగా 'దున్నేవారికే భూమి' ప్రాతిపదికన భూస్వాముల, షావుకార్ల, ప్రజావ్యతిరేకులైన తెగపెద్ద(ఆధిపత్య శక్తుల)ల స్వాధీనంలో ఉన్న భూములను పార్టీ, వర్గసంఘాల నాయకత్వంలో ప్రజలు పోరాడి, స్వాధీనం చేసుకొని భూమిలేని వ్యవసాయ కూలీ, పేదరైతాంగానికి పంపిణీ చేసి సాగులోకి తీసుకువచ్చారు.

### కాఫీతోటల స్వాధీన పోరాటం

విశాఖ మన్యంలో ఆదివాసులకు అడవిపై హక్కును దూరం చేస్తూ, ప్రభుత్వం 1980 దశకంలో ఏపీఎఫ్‌డీసీ ద్వారా నాలుగున్నర వేల హెక్టార్ల (10 వేల ఎకరాల) భూముల్లో కాఫీ ప్లాంటేషన్లను వేసింది. ఆదివాసీలను అందులో కూలీలుగా మార్చివేసింది. ఈ నేపథ్యంలో ప్రజల మౌలిక సమస్యగా ఉన్న భూమి సమస్య కేంద్రంగా మన పార్టీ 1990లో 'అడవిపై హక్కు ఆదివాసీలకే' అనే నినాదంతో కాఫీ పోరాటానికి నాంది పలికింది.

ప్రారంభంలో కొంతకాలం ప్రజల చైతన్యస్థాయి, నిర్మాణబలాన్ని దృష్టిలో పెట్టుకొని పార్టీ కాఫీ కార్మికుల కూలీరేట్ల పెంపుదల తదితర పాక్షిక డిమాండ్‌లపై ఉద్యమింపజేసింది. 2005 నాటికీ ప్రజలు దశాబ్దాలుగా సాగిన పోరాటాలలో రాటుదేలుతూ వర్గసంఘాలతో పాటు, మిలీషియా యూనిట్స్‌లో కూడా సంఘటితమై 2006 నాటికీ ప్రజారాజ్యాధికార అంగాలైన ఆర్‌పీసీ(విప్లవ ప్రజా కమిటీలు)లను ఏర్పర్చుకొని స్వావలంబనతో ప్రజాభివృద్ధి నమూనాగా తనదైన పరిపాలన(బీజప్రాయంగా)ను సాగించే పరిస్థితి నెలకొన్నది. ఈ స్థితిలో విశాఖ జిల్లా, ఈస్ట్ డివిజన్‌లోని గాలికొండ ఏరియా, పెద్దపాడు పాకెట్‌లో 10 గ్రామాల ప్రజలు కదిలి 2008లో 65 హెక్టార్ల మర్రిపాకల కాఫీ ఎస్టేట్‌ను స్వాధీనం చేసుకోవడంతో కాఫీతోటల స్వాధీన పోరాటం ప్రారంభమైంది. ఆ తర్వాత 2010లో 165 హెక్టార్ల కుంకుంపుడి ఎస్టేట్, 200 హెక్టార్ల లంకపాకల ఎస్టేట్‌ను ప్రజలు స్వాధీనం చేసుకున్నారు. అదే సంవత్సరం 110 హెక్టార్ల బలపం ఎస్టేట్‌ను అదే పంచాయితీకి చెందిన 33 గ్రామాల ప్రజలు సంఘటితమై స్వాధీనం చేసుకున్నారు. ఈ ఎస్టేట్‌లోని ప్రజలు కాఫీపోరాట కమిటీలను ఏర్పర్చుకొని ఎక్కడికక్కడ సభలు జరుపుకోవడం, ఏపీఎఫ్‌డీసీ ఉద్యోగులను పిలిచి ప్రజాకోర్టులు నిర్వహించి వాళ్ళను ఇక మీదట తోటల్లోకి అడుగుపెట్టకుండా బహిష్కరించడం, వాళ్ళ భవనాలు కూల్చివేయడం, కాఫీపండ్ల సేకరణ సమయం కావడంతో 33 గ్రామాల ప్రజలంతా వేలాది మంది కదిలి జాతరలా తోట్లల్లోకి వెళ్ళి పండ్లు ఏరడం ఒక నెల రోజులపాటు వెల్లువలా అత్యంత ఉత్సాహంగా సాగింది. ఈ క్రమంలోనే అల్లూరి వర్ధంతి దినమైన మే 7న కామన్ మిలీషియా నిర్మాణంగా గ్రామగ్రామాన మన్యం పితూరిసేన ఆవిర్భవించింది. ఈ నెల రోజుల కాలమంతా సీఆర్‌సీ 1వ కంపెనీ బలగాలు, స్థానిక బలగాలు ప్రజలతోనే ఉంటూ, ప్రజలతోనే తింటూ ప్రజలకు రక్షణ కల్పించడంతోపాటు, కాఫీపండ్లను సేకరించడంలో కూడా పాల్పంచుకోవడం ప్రజలకు గొప్ప ప్రేరణనిచ్చింది. అదే సంవత్సరం పెదవలస, సప్పర్ల ఎస్టేట్లను కూడా ప్రజలు స్వాధీనం చేసుకున్నారు. 2013 తర్వాత ఈ పోరాటం గొందిపల్లి(కొత్తూరు), ఆర్.వీ నగర్, సిరిబాల, చాపగడ్డ, ఏబులం ఏస్టేట్లకు విస్తరించింది. అయితే 2015లో 110 హెక్టార్ల గొందిపల్లి ఎస్టేట్ మాత్రమే ప్రజల చేతుల్లోకి వచ్చింది. మిగతా ఎస్టేట్‌లలో ప్రజలకూ, ఏపీఎఫ్‌డీసీకి మధ్య నేటికీ ఘర్షణ కొనసాగుతున్నది. మొత్తంగా 2017 నాటికి 1500 హెక్టార్ల కాఫీ ప్లాంటేషన్లను ప్రజలు స్వాధీనం చేసుకున్నారు. అయితే తీవ్రమైన శత్రునిర్బంధం వలన పెదవలస, సప్పర్ల ఎస్టేట్‌లలో నాయకత్వ శక్తులు దృఢంగాలేక, ప్రజలు బలహీనపడటంతో ఈ రెండు ఎస్టేట్‌లను ఏపీఎఫ్‌డీసీ తిరిగి స్వాధీనం చేసుకుంది.

ఈ పోరాటాలన్ని ఏ ఆటంకాలు లేకుండా సాఫీగా జరగలేదు. ఈ పోరాటాలకు ఆటంకంగా నిలిచిన ప్రజావ్యతిరేకులనూ, ప్రభుత్వ సాయుధ బలగాలను అత్యంత సాహసోపేతంగా ప్రతిఘటిస్తూ అడవిపై హక్కుకోసం ప్రజలు తెగించి పోరాడారు. ఏపీఎఫ్‌డీసీ అస్థిత్వానికి ప్రమాదకరంగా మారిన కాఫీతోటల ఆక్రమణ పోరాటాన్ని బలహీనపర్చడానికి శత్రువు అనేక ప్రయత్నాలను చేసాడు. పారామిలటరీ బలగాలతో క్యాంపులు పెట్టి కార్పెట్ సెక్యూరిటిని మరింత బలోపేతం చేయడం, క్రియాశీలంగా పనిచేస్తున్న కార్యకర్తలపైనా, ఏరియాలపైనా, గ్రామాలపైనా నిరంతరం పోలీసు దాడులు, కూంబింగ్‌లు పెరిగాయి.

ఈ పోరాటానికి నాయకత్వం, మార్గదర్శకత్వం అందిస్తున్న పార్టీపై, అండగా నిలిచిన పీఎల్‌జీఏ యూనిట్‌లపైన సమాచార ఆధారిత దాడులు తీవ్రతరమయ్యాయి. శత్రువు ఇంటలిజెన్స్ యంత్రాంగాన్ని బలోపేతం చేస్తూ, కమ్యూనికేషన్, రోడ్లు అత్యంత మారుమూల ప్రాంతాలకు విస్తరింపజేసారు. లంపెన్ శక్తులతో విప్లవ ప్రతీఘాతుక హంతక దళాలను ఏర్పరిచి కుట్రపూరిత హత్యలకు పాల్పడ్డారు. ప్రజలను భయంభ్రాంతులకు గురి చేయడానికి సంఘనాయకులైన వనగల ఎర్రబ్బాయి, కొర్ర లక్ష్మణరావులను పోలీసుల కాల్చి చంపి ఎన్‌కౌంటర్ కట్టుకథలల్లారు. అంతేకాకుండా సంఘనాయకులనూ, మిలీషియాను లొంగిపోవాల్సిందిగా నోటీసులు పంపడం, అక్రమంగా అరెస్టులు చేయడంతోపాటు, ప్రజల సంతలను, రవాణ సౌకర్యంగా ఉన్న బస్సులను బంద్ పెట్టడం, కాఫీ పండ్లలను షావుకార్లను కొననీయకుండా అడ్డుకోవడం వంటి ఎన్నో ఇబ్బందులను కలుగజేసారు. పోలీసులు కూంబింగ్‌లకు వచ్చినప్పుడు కాఫీ తోటలకు నిప్పుపెట్టి కాల్చివేసి ప్రజల చేతుల్లో తోటలు నాశనం అవుతున్నాయనీ, ప్రభుత్వం చేతుల్లో ఉంటే ప్రజలకు సంవత్సరమంతా పనులు దొరుకుతాయని కుట్రపూరిత ప్రచారం చేసారు. 2017లో ఏపీఎఫ్‌డీసీ అధికారులు గ్రామాలకు వచ్చి ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తూ తిరిగి కాఫీ తోటలు ఏపీఎఫ్‌డీసీకి అప్పగిస్తే, ప్లాంటేషన్ల నిర్వహణలో మెరుగుదల తెస్తామనీ, కూలీపనులు కల్పిస్తామని ప్రచారం చేస్తూ చేసిన ప్రతిపాదనను ప్రజలు తిరస్కరించారు. ఈ పోరాటాన్ని అణచివేయడానికి ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినప్పటికీ, ప్రజలు ఒకటి, రెండు ఎస్టేట్‌లలో మినహా మిగతా ఎస్టేట్‌లలో పట్టుదలగా కాఫీతోటల్ని వదిలిపెట్టకుండా సాగుచేసుకుంటున్నారు. దేశీయంగా, అంతర్జాతీయంగా కాఫీకున్న గిరాకి వలన దీని సాగుకు అన్ని విధాల అనుకూలంగా ఉన్న ఏజెన్సీ అన్ని మండలాల్లో లక్ష ఎకరాల్లో కాఫీ తోటలు పెంచడాన్ని లక్ష్యంగా నిర్ణయించుకున్న ప్రభుత్వం నేడు సబ్సిడీ, లోన్‌ల ద్వారా ఐటీడీఏ పథకంలో ప్రైవేటుగా ఆదివాసీ రైతులకు కాఫీ తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నది. అయితే ఇందులో కూడా అధికారుల అవినీతి, మోసాలు, రైతులకు గిట్టుబాటుధర లభించకపోవడం వంటి సమస్యల పరిష్కారం కోసం, అదే విధంగా తాము స్వాధీనం చేసుకున్న కాఫీతోటలను రక్షించుకుకోవడం, పోరాట ఫలితాలను కాపాడుకోవడం కోసం ప్రజలు దృఢంగా పోరాడక తప్పనిస్థితి నానాటికీ పెరుగుతుంది.

### నిర్వాసిత వ్యతిరేక పోరాటాలు

దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంతర్జాతీయ, దేశీయ బహుళజాతి కంపెనీల, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం అటవీ సంపదనూ, ఖనిజ వనరులను దోచిపెట్టడానికి వారికి అన్ని రకాల అనుమతులు మంజూరు చేస్తూ ప్రకృతినీ, సహజ వనరులను ధ్వంసం చేసి, ఆదివాసీలను అడవుల నుండి గెంటివేసి, నిర్వాసితులను చేసే విధానాలను అమలు చేస్తున్నాయి. అభివృద్ధి పేరుతో కోస్టల్ కారిడార్లు, సాగరమాల, పర్వతమాల, రోడ్లు, రైల్వేలైన్లు, డ్యాంలు, పవర్ ప్రాజెక్టులు, అభయారణ్యాలు, జాతీయపార్కులు, ప్లాంటేషన్స్, స్మార్ట్ సిటీలు, టూరిజం వంటివాటి కోసం ప్రజల భూములనూ, వ్యవసాయ క్షేత్రాలనూ, నివాస ప్రాంతాలను బలవంతంగా గుంజుకొని ప్రజలకు నిలువనీడ లేకుండా రోడ్డుపాలు చేస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఈ నిర్వాసిత సమస్యతో ఏఓబీ ప్రాంతంలో ప్రజలు తెగించి పోరాడుతున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో నేటి అల్లూరిసీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ మండలాలైన అరకు, అనంతగిరి, చింతపల్లి, జీ.కేవీధి, కొయ్యూరు మండలాల్లో, బాక్సైట్ తవ్వకాల కోసం 1998లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన బహుళజాతి కంపెనీలతో ఎమ్ఓయూలను కుదుర్చుకున్నది. ప్రభుత్వం తలపెట్టిన ఈ తవ్వకాల వలన ఈ 5 మండలాల పరిధిలో సుమారు 247 గ్రామాలలోని 50 వేల మంది ప్రజలు నిర్వాసితులవుతారు. ఈ పరిస్థితిలో బాక్సైట్ వెలికితీతకు వ్యతిరేకంగా ఆదివాసీ ప్రజానీకం నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. బాక్సైట్ వ్యతిరేకపోరాటం బద్ధలైంది. ఈ పోరాటానికి మన పార్టీ పీఎల్‌జీఏ మద్దతివ్వడమే కాకుండా నాయకత్వం వహించింది. పార్టీ నాయకత్వంలో ప్రజలు గ్రామ గ్రామాన బాక్సైట్ వ్యతిరేక కమిటీలను ఏర్పచుకొని సాధారణ ఆందోళనలూ, నిరసనలూ, సాంప్రదాయక ఆయుధాలు ధరించి ఊరేగింపులు, రాస్తారోకో, రహదారి దిగ్బంధనాలు, దిష్టిబొమ్మల దహనాలు, బంద్‌లు, సర్వేలకు వచ్చిన అధికారులను అడ్డుకోవడం, రాజకీయ నాయకులను నిలదీయడం వంటి పలు రూపాయలలో పోరాటాలు నిర్వహించారు. గ్రామాలపై, ప్రజలపై, సంఘనాయకులపై పోలీసుల దాడులను మిలిటెంట్‌గా ప్రతిఘటించారు. ఈ పోరాటాలను అణచివేయడం కోసం ముందువరుసన నిలిచిన తెలుగుదేశం పార్టీ ప్రచార కార్యదర్శి వెంకటరాజుని పీఎల్‌జీఏ ఖతం చేయడం, మరికొంత మంది తెలుగుదేశం నాయకుల ఇండ్లను ప్రజలు ధ్వంసం చేయడం జరిగింది. ఆ తర్వాత తెలుగుదేశం ప్రభుత్వం ఓడిపోవడంతో బాక్సైట్ గనుల తవ్వకాలకు తాత్కాలికంగా తెరపడింది. 2004లో కాంగ్రెస్ పార్టీ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అధికారంలోకి రాగానే అరకు ప్రాంతంలో బాక్సైట్‌ను జిందాల్ కంపెనీకీ, చింతపల్లి ప్రాంతంలో ఆన్‌రాక్ కంపెనీకీ, వై.రామవరం ప్రాంతంలో నాల్కో కంపెనీకి బాక్సైట్‌ని అప్పగిస్తూ ఒప్పందాలు చేసుకున్నాడు. అంతేకాకుండా రిఫైనరీల నిర్మాణానికి కూడా అనుమతులిచ్చాడు. "ప్రాణాలైనా ఇస్తాం-బాక్సైట్ తవ్వకాలకు అనుమతులివ్వం" అంటూ ఆదివాసీలు ఏకమై ముక్తకంఠంతో నినదించి పోరాటాన్ని కొనసాగించారు. ఆ తదుపరి 2014లో మళ్ళీ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు మన్యంలో 100 పోలీసు క్యాంపులు పెట్టైనా బాక్సైట్ తవ్వకాలను చేపడతామని ప్రకటన చేస్తే, పార్టీ నేతృత్వంలో పీఎల్‌జీఏ అండతో ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేస్తామని ప్రజలు బహిరంగంగా ప్రకటించారు. ప్రజాఉద్యమాన్ని అణచివేయడం కోసం ప్రభుత్వం తీవ్రమైన నిర్బంధాన్నీ, మహిళలపై అత్యాచారాలను కొనసాగించింది. వందలమందిపై అక్రమ కేసులు పెట్టి జైళ్ళలో నిర్బంధించింది. అయినప్పటికీ ప్రజలు సాంప్రదాయక ఆయుధాలు ధరించి కొండలకు కాపలా కాసారు. ప్రాణాలకు తెగించి పోరాడారు. పార్టీ పిలుపుతో 2013లో స్థానిక సంస్థల ఎన్నికలను 13 బాక్సైట్ ప్రభావిత పంచాయితీలలో ప్రజలు పూర్తిగా బహిష్కరించారు. ప్రజల ప్రతిఘటన ముందు టీడీపీ చంద్రబాబు ప్రభుత్వం తలవంచక తప్పలేదు. బాక్సైట్ తవ్వకాలను తాత్కాలికంగా నిలిపివేస్తానని ప్రకటించాడు. కానీ 97 జీవోను రద్దు చేయలేదు. 2018 సెప్టెంబర్‌లో మన్యంలో బాక్సైట్ తవ్వకాలకు అనుకూలంగా నిలిచిన కార్పొరేట్ గనుల మాఫియా, తెలుగుదేశం ఎమ్ఎల్ఏ కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్ఎల్ఏ సీవేరి సోమలను పీఎల్‌జీఏ ఖతం చేసింది. 2019లో తెలుగుదేశం ప్రభుత్వం చిత్తుగా ఓడిపోయి

అధికారంలోకి వచ్చిన వైఎస్ఆర్‌సీపీ జగన్ ప్రభుత్వం అనివార్య పరిస్థితులలో 97 జీవోను రద్దు చేస్తున్నట్లు ప్రకటించక తప్పలేదు. రెండు దశాబ్దాల బాక్సైట్ వ్యతిరేక పోరాటం ద్వారా ప్రజలు దోపిడీ ప్రభుత్వాల మెడలు వంచి గొప్ప రాజకీయ విజయాన్ని సాధించారు. 'అడవిమీద హక్కు ఆదివాసీలదే' అని నిరూపించారు.

విశాఖ ఏజెన్సీలో బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళన ఇతర ప్రాంతాలలో కూడా గొప్ప ప్రభావాన్ని వేసింది. ఆంధ్రా సరిహద్దులో ఒడిశా రాష్ట్రం పొట్టంగి బ్లాక్‌లో చిట్టెంగొండి, రక్తఖండి, పులికొండ (బాగ్‌డొంగర్) సింగమాలి పర్వతాలలో బాక్సైట్ తవ్వకాలకు ఆంధ్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఆ ప్రాంత ప్రజలు పోరాటాలలోకి కదిలారు. 2015 జూన్‌లో అరకులో జరిగిన బాక్సైట్ వ్యతిరేక ధర్నాలో 5 పంచాయితీల ప్రజలు పాల్గొన్నారు. ఆ తర్వాత అంపవల్లి పంచాయితీ, పెద్దపాడులో జరిగిన బహిరంగ సభకు 90 గ్రామాల నుంచి 2వేల మంది ప్రజలు హాజరై బాక్సైట్ తవ్వకాలను అడ్డుకుంటామని నినదించారు.

ఒడిశాలోని కొరాపుట్ జిల్లా, సిమిలిగూడ బ్లాక్, మాలిపర్వతంలో బాక్సైట్, అల్యూమినా ఖనిజాలను తవ్వితీసేందుకు నవీన్‌పట్నాయక్ ప్రభుత్వం 2003లోనే ఇండాల్కో కంపెనీకి అనుమతులు మంజూరు చేసింది. అప్పటినుండి గడిచిన 20 సంవత్సరాలుగా ఈ కంపెనీకి వ్యతిరేకంగా స్థానికంగా ఉన్న ప్రభావిత 4 పంచాయితీలకు చెందిన 40 గ్రామాల ప్రజలు 'మాలిపర్వత సురక్ష సమితి' ఆధ్వర్యంలో సంఘటితంగా, సమరశీలంగా పోరాడుతున్నారు. కంపెనీ మట్టిని తరలించే ప్రయత్నాలను అత్యంత మిలిటెంట్‌గా ఎదుర్కొంటున్నారు. కంపెనీ అనేకసార్లు నిర్వహించిన 'జనసునాని'(ప్రజాభిప్రాయ సేకరణ)ని కూడా 90% మంది ప్రజలు వ్యతిరేకిస్తునే ఉన్నారు. బాక్సైట్ తవ్వకాల కోసం కంపెనీ పోరాడే ప్రజలపై దాడులు చేయడమే కాకుండా ఉద్యమాన్ని అణచివేయడానికి అనేక మోసపూరిత కుట్రలు పన్నింది. ఉద్యమ నాయకత్వానికి లక్షల డబ్బులు ఎరచూపింది. అందులో నుండి తమకు అనుకూలమైన ఒక దళారీ సెక్షన్‌ను తయారు చేసుకుంది. అలా కంపెనీకి అమ్ముడుపోయిన అనంద్ కిర్సానీ అనే దళారిని 2013లో మన పీఎల్‌జీఏ ఖతం చేసింది. మరికొంతమంది దళారులను హెచ్చరించడంతో కొంతకాలం కంపెనీ తన ప్రయత్నాలను నిలిపివేసినప్పటికీ, మళ్ళీ వివిధ పద్ధతులలో సంస్కరణల ద్వారా ప్రజాభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలను కొనసాగించింది. అయినప్పటికీ, 2021 నవంబర్ 22న కంపెనీ నిర్వహించిన 'జనసునాని'ని ప్రజలు తీవ్రస్థాయిలో వ్యతిరేకించడమే కాకుండా కంపెనీపై కోర్టులో కేసు వేసారు. ఆ సందర్భంగా కంపెనీకి వ్యతిరేకంగా మిలిటెంట్‌గా కదిలిన ప్రజలపై పోలీసులు దాడి చేసి 31 మందిని అరెస్టు చేసి, అక్రమ కేసులు పెట్టి, జైళ్ళో నిర్బంధించారు. 2023 జనవరిలో జిల్లా కలెక్టర్, జడ్జీ పర్యావేక్షణలో మళ్ళీ 'జనసునాని' నిర్వహించాల్సిందిగా 2022 డిసెంబర్ 2న హైకోర్టు నోటీసు ఇచ్చింది. ఈ 'జనసునాని' ఎదుర్కోవడానికి కూడా ప్రజలు సన్నద్ధం అవుతున్నారు. ఈ ఉద్యమాన్ని అణచివేయడానికి ప్రభుత్వం, పోలీసులు, కంపెనీ, మాఫియా కుమ్మక్కయి ఎన్ని ప్రయత్నాలు చేసినా, గత 20 సంవత్సరాలుగా ప్రజలు తమ జీవనాధారమైన మాలిపర్వతాన్ని రక్షించుకునేందుకు దృఢంగా పోరాడుతున్నారు.

మల్కనగిరి జిల్లా, బలిమెల జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం వలన కటాఫ్ ప్రాంతంలో వందలాది ఎకరాల ప్రజల సాగుభూములు ముంపుకు గురయ్యాయి. వేలాది మంది ప్రజలు నిర్వాసితులయ్యారు. ఈ సమస్యపై ఈ ప్రాంత ప్రజలు 2009 నుండి బిచ్చినాంచల్ పోరాట కమిటీ నాయకత్వంలో వివిధ రూపాలలో ఆందోళన కొనసాగిస్తున్నారు. సుమారు 20 వేల మంది ప్రజలు బలిమెల డ్యాంపై దర్నా, రాస్తారోకో, చిత్రకొండ ప్రభుత్వ కార్యాలయాల దిగ్బంధనం చేపట్టి నిర్వాసితులైన ప్రజలకు భూములు కేటాయించాలనీ, ఈప్రాంత అభివృదిపట్ల ప్రభుత్వం వహిస్తున్న నిర్లక్ష్యాన్ని వీడి యువతకు ఉపాధికల్పన, ప్రజలకు తాగు, సాగునీరు విద్యా, వైద్యంలాంటి సమస్యలు తక్షణమే పరిష్కంచాలని డిమాండ్‌లతో వారం రోజులు ఆందోళనను కొనసాగించారు. పై డిమాండ్‌లతో ఎన్నికల బహిష్కరణ, ప్రభుత్వాధికారుల నిలవేత తదితర రూపాలలో నేటికీ ఆందోళన కొనసాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో రైతాంగం అరకొరగా మిగిలిన నది అంచున ఉన్న భూములు మాత్రమే సాగు చేసుకుంటున్నారు. అయితే ప్రభుత్వం తనకు అవసరమైనప్పుడల్లా రిజర్వాయర్ నీటిమట్టాన్ని పెంచడంతో ప్రతి సంవత్సరం నది అంచున ఉన్న ఆ కొద్దిపాటి భూముల్లో ప్రజల పంటలు ముంపుకు గురవుతున్నాయి. దీనికి వ్యతిరేకంగా కటాఫ్ ప్రాంత ప్రజలు వివిధ రూపాలలో ఆందోళనలు చేయడమే కాకుండా 2019 ముంపుకు గురైన పేద, ఆదివాసీ రైతాంగాన్ని ఆదుకునేందుకు ఒక సహాయక కమిటీని ఏర్పర్చారు. ఈ కమిటీ ప్రభుత్వ నిర్లక్ష్యాన్నీ, ప్రజావ్యతిరేక వైఖరిని ఎండగడుతూ, బాధిత ప్రజలను ఆదుకోవాల్సిందిగా ప్రజలకు పిలుపునిస్తూ విస్తృతంగా ప్రచారం చేసారు. ఈ పిలుపునందుకున్న ప్రజలు విశేషంగా స్పందించి స్వచ్ఛందంగా ధాన్యం, రాగులు, బట్టలు, డబ్బులు తీసుకొని స్వయంగా తరలివచ్చి 7వేల మంది ప్రజలతో ఊరేగింపు, బహిరంగ సభ నిర్వహించి ప్రజలకు ధాన్యాన్నీ, బట్టల్ని పంపిణీ చేసారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల్లో ఓట్లకోసం, అనివార్య పరిస్థితులలో 97 జీవోను రద్దు చేస్తానని హామి ఇచ్చి అధికారంలోకి వచ్చాక, 97 జీవోను రద్దు చేసినప్పటికీ, మళ్ళీ కొత్తగా 89 జీఓను ముందుకు తెచ్చి బాక్సైట్ తవ్వకాలకు అనేక ప్రయత్నాలు చేస్తున్నాడు. 2021 విశాఖ–తూర్పుగోదావరి జిల్లాలలో నాతవరం మండలంలో ప్రభుత్వ అనుమతితో మైనింగ్ మాఫియా బినామి పేర్లతో, లేటరైట్ ముసుగులో బాక్సైట్ తవ్వకాలు చేపట్టి తరలించుకుపోవడాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలు పెద్దఎత్తున పోరాడారు. తాజాగా 2022లో చింతపల్లి, కొయ్యూరు మండల సరిహద్దులోని ఎర్రవరం జలపాతం మీద భారీ జలవిద్యుత్(హైడ్రో పవర్‌ప్రాజెక్టు)కేంద్రాన్ని నిర్మించడానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి ఆదానిగ్రూప్‌కి కట్టబెట్టింది. ఈ ప్రాజెక్టు నిర్మిస్తే ఈ రెండు మండలాలోని 4 పంచాయితీల పరిధిలో సుమారు 3వేల ఎకరాల భూములను ప్రజలు కోల్పోతారు. 34 గ్రామాలు ముంపుకు గురై ప్రజలు నిర్వాసితులవుతారు. ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ స్థానిక ప్రజలు నిరసనలు, ఆందోళనలు, బంద్‌లు చేస్తున్నప్పటికీ, పాలకవర్గాలు వాటిని లక్ష్యపెట్టకుండా ప్రాజెక్టు నిర్మాణానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజలు మాత్రం బాక్సైట్ ఉద్యమ తరహాలో ఉద్యమిస్తామని బహిరంగంగా ప్రకటిస్తూ పోరాడుతున్నారు.

శ్రీకాకుళం జిల్లా, పలాస మండలం, రామకృష్ణాపురంలో గతంలో ప్రజలు పోరాడి సాధించుకున్న 30 ఎకరాల విలువైన భూములతోపాటు, దాని చుట్టుపక్కల ఉన్న 150 ఎకరాలకు పైగా, రైతుల భూములను

కూడా వైఎస్ఆర్‌సీపీ నాయకులు దువ్వాడ శ్రీధర్, మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్‌పీ విజయసాయిరెడ్డిలు కలిసి ఆక్రమించుకొని ఒక కార్పొరేట్ సంస్థకు వేలకోట్ల రూపాయలకు అప్పగించారు. అక్కడ స్మార్ట్‌సిటీ నిర్మాణం చేయడానికి శరవేగంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ దురాక్రమణకు వ్యతిరేకంగా వేలాదిమంది ప్రజలు పోరాడుతున్నారు. ఇదే జిల్లాలో కాసిబుగ్గ-పలాస జంట పట్టణాలకు ఆనుకొని ఉన్న సూదికొండ, నెమిలికొండలు కూడా అధికార పార్టీ నాయకులు దువ్వాడ బ్రదర్స్ ఆక్రమించుకొని కొండలు తవ్వి వేలకోట్ల విలువచేసే మట్టినీ, రాళ్ళను అమ్ముకుంటున్నారు. పలాస-కాశిబుగ్గల్లో జీడిపిక్కల ఫ్యాక్టరీలలో పనిచేసే పేద, శ్రామిక ప్రజలు ఎన్నో ఏళ్ళుగా ఈ కొండలమీదనే నివాసం ఉంటున్నారు. నేడు ఈ తవ్వకాల వలన తమ భూములనూ, నివాసాలను కోల్పోవాల్సి వస్తుంది. దీనికి వ్యతిరేకంగా అక్కడి ప్రజలు వినూత్న పోరాట రూపాలలో తమ నిరసనలనూ, ఆందోళనలను కొనసాగించి అత్యంత మిలిటెంట్‌గా పోరాడి మట్టి తవ్వకాలను అడ్డుకున్నారు.

మల్కనగిరి జిల్లా, పొడియా బ్లాక్, నీలిగూడ పంచాయితీలోని బురసమట్టేరు, కొత్తమట్టేరు, ఉస్కల్ పరిసర గ్రామాల ప్రజల భూముల్లో సిమెంట్ రాయి నిక్షేపాలు ఉన్నాయిని 2007లోనే ప్రైవేటు కాంట్రాక్టర్లు అక్కడ సిమెంట్ ఫ్యాక్టరీని నిర్మించే ప్రయత్నాలు చేసారు. ఆనాటి నుండి అక్కడి ప్రజలు దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ పోరాడుతున్నారు. ఆ ప్రజాపోరాటానికి ఆటంకంగా నిలిచిన జిల్లా బీజేపీ నాయకుడు ఇంద్రమాడిని పీఎల్‌జీఏ 2008లో ఖతం చేయడంతో కంపెనీ కొంతకాలం వెనక్కి తగ్గింది. తిరిగి 2012లో కంపెనీ యాజమాన్యం స్థానిక గ్రామ పెద్దలనూ, భూస్వాములను తమకనుకూలంగా మలుచుకొని భూములను లీజుకు ఇచ్చే విధంగా ఒప్పందాలు చేసుకుంటే ప్రజలు దాన్ని తిప్పికొట్టారు. సంఘనాయకత్వంలో 10 గ్రామాలకు చెందిన 15 వందల మంది ప్రజల సమక్షంలో దళారులను నిలదీసి ఫ్యాక్టరీ యాజమాన్య కుట్రలను తిప్పికొట్టారు. తిరిగి 2022 అక్టోబర్‌లో మళ్ళీ అక్కడ దాల్మియా కంపెనీ సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణానికి చేస్తున్న ప్రయత్నాలను ప్రజలందరూ వ్యతిరేకిస్తూ పెద్దఎత్తున కదిలి తమ నిరసనను తెలియజేసారు. ఈ సందర్భంగా పోలీసులు ఐదుగురిని అరెస్టు చేస్తే, వాళ్ళను విడుదల చేయాల్సిందిగా ప్రజలందరూ కదిలి పోలీస్‌స్టేషన్‌ను గేరావ్ చేసి విడిపించుకున్నారు.

'దున్నేవారికే భూమి-ప్రజారాజ్యాధికార కమిటీలకే అధికారం' అనే కేంద్రనినాదంగా సాగిన ఈ సాయుధ వ్యవసాయ విప్లవ కార్యక్రమం భూమితోపాటు అధికారాన్ని ప్రజలపరం చేసే ఓరియంటేషన్‌తో కొనసాగింది. ప్రజలు దోపిడీ ప్రభుత్వ అధికారాన్ని సవాల్ చేస్తూ 2013లో ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థలకు జరిగిన ఎన్నికలనూ, 2014లో, 2019లో జరిగిన లోక్‌సభ, శాసనసభ ఎన్నికలనూ, 2017లో ఒడిశాలో జరిగిన స్థానిక ఎన్నికలను బహిష్కరించాలని జరిగిన రాజకీయ క్యాంపెయిన్‌లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఎన్నికలు బహిష్కరించారు. చిత్రకొండ బ్లాక్‌లో 18 పంచాయితీలలోనూ ఎన్నికలు జరగలేదు. ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని పంచాయితీలలో ఎన్నికలు నిర్వహించబడలేదు. ప్రభుత్వం ఎంతటి సాయుధబలాన్ని ప్రయోగించినా, ప్రజలు ఎన్నికలను బహిష్కరించి ప్రత్యామ్నాయ ప్రజల రాజకీయ అధికార స్థాపన లక్ష్యంతో పోరాడారు.

ఈ విధంగా పెదబయలు, కటాఫ్ ఏరియాలలో 5 పాకెట్‌లలో ఆర్‌పీసీలు నిర్మాణం అయ్యాయి. మరికొన్ని పాకెట్స్‌లో ఆర్‌పీసీలు నిర్మించడానికి కావాల్సిన పరిస్థితులు పరిపక్వమయ్యాయి. అధికారానికీ, యుద్ధానికి మధ్య ఉండే గతితార్కిక సంబంధాన్ని ప్రజలు అర్థం చేసుకుంటూ శతృనిర్బంధాన్నీ, దాడులనూ, అరెస్టులనూ, అత్యాచారాలను వీరోచితంగా ప్రతిఘటిస్తూనే పోరాటాలు కొనసాగిస్తున్నారు. అంతేకాకుండా ప్రజలు స్వాధీనం చేసుకున్న భూములను సాగుచేసుకోవడానికీ, వ్యవసాయంలో అభివృద్ధి తీసుకురావడానికి వ్యవసాయ విప్లవ కార్యక్రమంలో భాగంగా భూమిచదును, సాగునీరు, తాగునీరు, విద్యా, వైద్యం, రవాణా తదితర ప్రజల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను పార్టీ, వర్గసంఘాల నాయకత్వంలో ప్రజలు అత్యంత క్రియాశీలంగా అమలు చేసారు.

## వ్యవసాయ విప్లవ కార్యక్రమం

**రైతాంగ సదస్సులు :-** 'దున్నేవారికే భూమి' సమస్య, వ్యవసాయక అభివృద్ధి, పంటలసాగు, గిట్టుబాటు ధరలు, మార్కెట్ దోపిడీ, అధికవడ్డీ సమస్య, పశుసంరక్షణ, తదితర అంశాలపై చర్చించడం కోసం 2017లో పెదబయలు ఏరియాలో 10 గ్రామాల రైతు ప్రతినిధులతోనూ, కటాఫ్ ఏరియాలో 5 గ్రామాల రైతు ప్రతినిధులతో పార్టీ 2 రైతాంగ సదస్సులు నిర్వహించింది. ఆ సదస్సుల్లో రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని పార్టీ ఎత్తుగడలను నిర్ధిష్టంగా అన్వయించడం జరిగింది.

**భూమి చదును :-** విప్లవకర భూసంస్కరణలలో భాగంగా విప్లవరైతుకూలీ సంఘాల నాయకత్వంలో పెదబయలు ఏరియా, కోంద్రు పాకెట్‌లో 8 గ్రామాల ప్రజలు నెల రోజుల సమిష్టిగా శ్రమ చేసి, కొండను తవ్వి భూమిని చదును చేసి భూమిలేని 79 కుటుంబాలకు పంపిణీ చేసారు. కటాఫ్ ఏరియాలో మర్రిబెడ గ్రామంలో భూమిచదును చేసి భూమిలేని 3 కుటుంబాలకు పంపిణీ చేసారు.

కోరుకొండ ఏరియా, ఈతలపాడు గ్రామంలో సాగుయోగ్యంలేక నిరుపయోగంగా ఉన్న బీడుభూమిని సంఘం నాయకత్వంలో గ్రామప్రజలంతా సమిష్టిగా నెలరోజులు శ్రమచేసి, 10 ఎకరాల భూమి చదును చేసారు. నీటిసౌకర్యం కల్పించి పొలం తయారు చేసారు. మొదటి రెండు సంవత్సరాలు సమిష్టిగా సాగుచేసి, 2020లో భూమిని గ్రామంలో 17 కుటుంబాలకు పంచారు.

**శ్రమసహకార బృందాలు :-** పేద రైతులకు దున్నుకోవడానికి పశువులు లేకపోవడం, పంట వేసే సమయంలో అనారోగ్యం పాలవ్వడం, ఒంటరి మహిళలు, వృద్ధులకు వ్యవసాయంలో తగిన సహకారం లేకపోవుట తదితర కారణాలతో కొన్ని కుటుంబాలు సకాలంలో పంటవేయలేకపోవడం లేదా అసలే సాగుచేయలేకపోవడం వలన నష్టం జరుగుతున్నది. ఈ పరిస్థితి అధిగమించి సకాలంలో పంటవేయడం, కోతలు, నూర్పిళ్ళవరకు 5 నుండి 10 కుటుంబాలు కలిసి శ్రమసహకార టీంలుగా ఏర్పడి పనిచేసే విధానం పెదబయలు, కటాఫ్ ఏరియాలలో మెజారిటీ గ్రామాలలో అమలులోకి వచ్చింది. దీని వలన ఒకరి సహకారం ఒకరికందడం, టీం స్పిరిట్‌తో వేగంగా పనిచేయడం, సకాలంలో పంటలు వేయడం, కోతలు, నూర్పిళ్ళు జరిగి దిగుబడిలోకూడా అభివృద్ధిని సాధించారు. అలాగే పంటపండనీ, తక్కువ పంట వచ్చిన కుటుంబాలకు ఎక్కువ దిగుబడి వచ్చిన కుటుంబాలు పంటలో కొంత భాగాన్ని వారికిచ్చి ఆదుకున్నారు.

**సమిష్టి వ్యవసాయం :–** కొన్ని గ్రామాలలో భూములు తక్కువగా ఉండటం, భూమిలేని పేదల భూమి సమస్యను పరిష్కారించుకోలేకపోవడం తదితర సమస్యలపై విప్లవరైతుకూలీ సంఘాలలో చర్చ జరిగి 2016లో కటాఫ్ ఏరియాలో తాబేరు, దకడపోదూరు గ్రామాల ప్రజలు సమిష్టి వ్యవసాయ టీమ్‌లుగా ఏర్పడి ఆ గ్రామాలలో 'భూములను కలిపే(భూమిలేనివాళ్ళను కలుపుకొని) సాగుచేద్దాం–పండించిన పంటను సమానంగా పంచుకుందాం' అని నిర్ణయించుకొని అమలు జరిపారు. ఫలితంగా సెంటు భూమి కూడా మిగలకుండా సాగులోకి తెచ్చారు. అధిగ దిగుబడిని సాధించారు. భూమిలేని వ్యవసాయ కూలీలకు కూడా ఫలసాయం అందింది. ఈ విషయం చుట్టుపక్కల గ్రామాలలో కూడా మంచి ప్రభావం వేయడంతో తదుపరి సంవత్సరం మరో 17 గ్రామాలకు ఈ సమిష్టి వ్యవసాయం విస్తరించింది.

**సాగునీరు :–** కటాఫ్ ఏరియాలో ఒండ్రపల్లి పంచాయితీ, సన్యాసిగూడ, తోటగూడ, గ్రామాల మధ్య కొండనుండి పారుతున్న నీరు ప్రజలకు ఉపయోగపడకుండా వెళ్ళి రిజర్వాయర్‌లో కలుస్తుంది. మరోవైపు నీటిసౌకర్యం లేక చాలా ఎకరాల ప్రజల భూములు సాగుకు నోచుకోకుండా పడావు పడి ఉన్నాయి. 2015లో పార్టీ ఈ సమస్యపై ప్రజలతో చర్చించగా, రెండు గ్రామాలలో చెక్‌డ్యాం నిర్మాణ కమిటీలు ఏర్పర్చుకొని ప్రజలు సమిష్టి శ్రమ ద్వారా నాలుగున్నర ఫీట్ల ఎత్తు, 8 మీటర్ల పొడవుతో కాలువకు అడ్డంగా చెక్‌డ్యాం నిర్మించారు. ఈ నీటిని భూములవరకు తీసుకుపోవడానికి 300 మీటర్ల కాలువను తవ్వారు. 45 రోజులపాటు ఈ పనిలో గ్రామంలోని ప్రతి కుటుంబం అత్యంత చురుగ్గా, పట్టుదలగా పాల్గొన్నారు. ఈ నిర్మాణకృషిని అడ్డుకోవడానికి శత్రువు అనేక ఆటంకాలు కల్పించినప్పటికీ, సెంట్రీలు పెట్టుకొని, పెంట్రోలింగ్‌లు చేస్తూ పూర్తిచేసారు. ఈ చెక్‌డ్యాం నిర్మాణంతో 50 ఎకరాల భూములకు సాగునీరు అందించి 60 కుటుంబాలకు భూములు పంపిణీ చేయడం జరిగింది.

2020లో పెదబయలు ఏరియాలో కోండ్రు, ఇంజెరిలో విప్లవప్రజాకమిటీ నాయకత్వంలో 6 గ్రామాల ప్రజలు సమిష్టి భాగస్వామ్యంతో నెల రోజులు పనిచేసి రెండు చెరువులను నిర్మించారు. ఈ చెరువుల ద్వారా చేపల పెంపకానికే కాకుండా కొంత సాగుభూమికి కూడా నీరు అందుతుంది. అలాగే కోరుకొండ ఏరియా, సువ్వపల్లి గ్రామంలో కూడా చెరువును తవ్వి చేపల పెంపకానికీ, భూములకు నీరు అందిస్తున్నారు.

**తాగునీరు :–** 2015లో మల్కనగిరి జిల్లా, కలిమెల బ్లాక్, పొడియా ఏరియా, సీతారాంపల్లి పంచాయితీ, ఒరేల్ గ్రామంలో పార్టీ నుండి కొంత ఆర్థిక సహాయం, ప్రజలు సమిష్టి శ్రమ ద్వారా నీళ్ళట్యాంక్, పైప్‌లైన్ నిర్మాణం చేసి, దానికి శీలకోట అమరుల పేరు పెట్టుకున్నారు. ఇది తాగునీటికోసమే కాకుండా ఈ నీటిద్వారా సమిష్టిగా కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు.

2018లో కటాఫ్ ఏరియాలో ప్రజలు ఊటనీటి చెలిమెలు తవ్వి, సిమెంట్‌తో కుండీలు కట్టి, వాటికి పైపులు అమర్చి పరిశుభ్రమైన నీటిని తాగేందుకు తీసుకున్న కార్యక్రమంలో భాగంగా జోడాంబ పంచాయితీలో గౌడ్‌పుట్, సిమిలిపోదూర్, జాంపూర్, లాడిగూడ గ్రామాలలో, ఒండ్రపల్లి పంచాయితీలో సన్యాసిగూడ, అర్లంగిపాడు, తోటగూడ, దకడపోదూర్, చదరం గ్రామాలలో, కోరుకొండ ఏరియాలోని ఈతలపాడు, చీకటిపల్లి, కొక్కులగడ్డ, గాజులమామిడి గ్రామాలలో ప్రజలు సమిష్టిగా స్వయంకృషి ద్వారా నిర్మించుకున్నారు. ఇందుకు అవసరమైన సిమెంట్, పైపులు వగైరా వస్తువులకు అయ్యే ఖర్చు నిమిత్తం అవసరమైన నిధులను గ్రామంలోని ప్రజలందరూ కొంత డబ్బు జమ చేసుకొని, పార్టీ నుండి ప్రజల సంక్షేమం కొరకు కేటాయించిన వాటినుండి సమకూర్చుకున్నారు.

**రవాణా సౌకర్యం :–** 'అభివృద్ధి' పేరుతో ప్రభుత్వం ఆదివాసీ ప్రాంతాలలో వనరుల దోపిడీకీ, మార్కెట్ విస్తరణకూ, ఉద్యమ అణచివేతకు కోట్ల రూపాయలు కేటాయించి నిర్మిస్తున్న రోడ్లను ప్రజలు వ్యతిరేకిస్తూ కటాఫ్ ఏరియాలోని పనసపుట్, ఒండ్రపల్లి, జోడాంబ పంచాయితీలలో అనేక గ్రామాల మధ్య రవాణా సౌకర్యం కోసం పాత రోడ్లను మరమత్తులు చేయడం, కొత్త రోడ్లను నిర్మించే పనులను ప్రారంభించి 20 గ్రామాల నుండి ప్రజలు వేలాదిగా కదిలి 2016లో 50 కిలోమీటర్లు, 2017లో 26 కిలోమీటర్ల రోడ్లను నిర్మాణం చేసుకున్నారు.

**అభివృద్ధి–సంక్షేమం :–** భూములను సాగులోకి తేవడం, ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చేయడంలో భాగంగా అడవులు నశించి, బోడికొండలుగా మారి, ఆహార పంటలసాగుకు ఉపయోగపడని భూములను జీడిమామిడి మొక్కలు నాటాలనే ప్రజల అభిప్రాయంతో కటాఫ్ ఏరియాలో 12 గ్రామాలలో, పెదబయలు ఏరియాలో 2 గ్రామాలలో 10వేల జీడిమామిడి మొక్కలను ప్రజలు నాటారు. ప్రజల పౌష్టికాహార సమస్యను మెరుగుపర్చడంలో భాగంగా 10 గ్రామాలలో వివిధ రకాలకు చెందిన 200 పండ్లమొక్కలనూ, 5 గ్రామాలలో ఒక్కో గ్రామానికి 50, 60 చొప్పున మునగ మొక్కలు నాటారు. సంఘ నాయకత్వంలో వివిధ రకాల కూరగాయల విత్తనాలను పంపిణీ చేయడంతో ప్రజలు కూరగాయలు పండించారు.

**విద్యా, వైద్యం :–** ఆదివాసీ గ్రామాలలో పేదలకు విద్యా, వైద్యం అందని ద్రాక్షే. ఈ సమస్యను పరిష్కరించుకోవడానికి కటాఫ్ ఏరియాలో ప్రజలు ప్రతి కుటుంబం నుండి వారి ఆర్థిక స్తోమతను బట్టి 50 రూ॥ల నుండి 100 రూ॥ల వరకు వైద్యనిధిని సేకరించుకుంటున్నారు. పార్టీ ప్రజాసంక్షేమం నిధి నుండి కొంత బడ్జెట్‌ని కేటాయించి మందులు తెప్పిస్తున్నది. ప్రతి గ్రామంలో యువతీ, యువకులకు మందులివ్వడంపై తర్ఫీదునిస్తున్నది. మెజారిటీ గ్రామాలలో ఈ పద్ధతిద్వారా ప్రజలకు వైద్యం అందిస్తున్నారు. అదే విధంగా ప్రజలే ముందుకు వచ్చి విద్య సమస్యను పరిష్కరించుకునేందుకు గ్రామాలలో చదువుకున్న యువతీ, యువకులను స్కూల్ టీచర్లుగా నియమించుకొని కటాఫ్ ఏరియాలోని 8 గ్రామాలలో ప్రజలే 'ప్రజా పాఠశాల'లను నిర్వహించుకుంటున్నారు.

ఆంధ్రా–ఒడిశా సరిహద్దు కటాఫ్, పెదబయలు ప్రాంతాలలో జరుగుతున్న వ్యవసాయక విప్లవాన్ని అణచివేయడం, నాయకత్వాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో 2015 నుండి 'ఆలౌట్ ఆపరేషన్' పేరుతో దాడిని ప్రారంభించాడు. రెండు రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేకంగా కేంద్రీకరించి 2016లో రాంగూడ వద్ద అతిపెద్ద దాడికి పాల్పడి పార్టీకి భారీ నష్టాన్ని కలుగజేసారు. అయినా వారి లక్ష్యం నెరవేరలేదు. ప్రజలు రాజ్యాధికార లక్ష్యంతో పోరాడుతూ ప్రభుత్వ సాయుధ బలగాలతో ప్రత్యక్షంగా తలపడ్డారు. సాంప్రదాయకఆయుధాలతో గ్రామాలపై పోలీసు దాడులనూ, అక్రమ

*తరువాయి భాగం 42వ పేజీలో...*

# ఆంధ్రా-ఒడిశా సరిహద్దు స్పెషల్ జోన్ ప్రస్తుత రాజకీయ పరిస్థితి-కనీస కార్యక్రమం

(సెప్టెంబర్ 2022)

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రస్తుత రాజకీయ పరిస్థితి

ఆంధ్రప్రదేశ్‌లో అధికార వైఎస్‌ఆర్‌సీపీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పరిపాలన 2022 మే నాటికి మూడు సంవత్సరాలు పూర్తిచేసుకున్నది. జగన్ అధికారంలోకి రాకముందు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీ చంద్రబాబునాయుడు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలనూ, టీడీపీ పట్ల ప్రజల్లో ఏర్పడ్డ వ్యతిరేకతను ఉపయోగించుకొని జగన్ అధికారంలోకి రావడానికి ప్రయత్నించాడు. టీడీపీ ప్రభుత్వం కేంద్రానికి లొంగిపోయి రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టిందని విమర్శించాడు. తను అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించేవరకు పోరాడుతాననీ, నవరత్నాలను అమలు చేస్తాననీ, యువతకు 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాననీ, ఉపాధ్యాయులు, ఉద్యోగుల కోసం సీపీఎస్ రద్దు చేస్తాననీ, పీఆర్‌సీని వెంటనే అమలు చేస్తాననీ, ఆదివాసీ వ్యతిరేక 97 జీవోను రద్దు చేస్తాననీ, మహిళలకూ, దళితులకూ, ఆదివాసీలకు ప్రత్యేక పథకాలను అమలు చేస్తానని ఎన్నికల ముందు ప్రజాసంకల్పయాత్రలో ఎన్నెన్నో మోసపూరిత హామీలను గుప్పించి, అన్ని సెక్షన్‌ల ప్రజలను భ్రమల్లో ముంచెత్తి, అరచేతిలో వైకుంఠాన్ని చూపించి అధికారంలోకి వచ్చాడు.

జగన్ అధికారంలోకి వచ్చి గడిచిన మూడు సంవత్సరాల కాలంలో అనుసరించిన ప్రజావ్యతిరేక విధానాలనూ, నియంత పరిపాలనను చూస్తే ఫాసిజాన్ని అమలు చేయడంలో చంద్రబాబును మించిన ఘనుడిగా, తండ్రిని మించిన తనయుడిగా ఘనతకెక్కడం కనిపిస్తుంది. అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచి తన దోపిడివర్గ నిజస్వరూపాన్ని చాటుతూ పాలనను ప్రారంభించాడు. రాష్ట్రంలో అప్పటివరకు చంద్రబాబుకు విధేయులుగా పని చేసిన ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్లను తొలగించాడు. అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఐఏఎస్‌లకూ, క్రూరమైన ఐపీఎస్ ఆఫీసర్లనూ, తనకు నమ్మిన బంట్లను కీలక స్థానాల్లో నియమించాడు. డీజీపీగా గౌతమ్‌సావాంగ్‌నూ, రాష్ట్ర హోంమంత్రిగా సుచరితను నియమించడం కూడా ఇందులో భాగమే. చంద్రబాబు హయంలో తీసుకున్న కొన్ని ముఖ్యమైన నిర్ణయాలను సమీక్షించే పేరుతో విద్యుత్ కొనుగోలు ఒప్పందం, పోలవరం డ్యాం నిర్మాణ కాంట్రాక్టు, రాజధాని నిర్మాణం, కియా కార్ల కంపెనీకి ఇచ్చిన ప్రోత్సాహకాలపైన ఏకపక్షంగా సమీక్షలు చేసాడు. పోలవరం కాంట్రాక్టు విషయంలో రివర్స్ టెండరింగ్ పేరుతో చంద్రబాబు నియమించిన 'నవయుగ' సంస్థను తొలగించి, తనకనుకూలమైన 'మెఘా' ఇంజనీరింగ్ కంపెనీకి కాంట్రాక్టు అప్పగించాడు. విద్యుత్ కొనుగోళ్ళ ఒప్పందంలో భారీ అవినీతి జరిగిందనీ, అవినీతిని అంతమొందిస్తానని ప్రగల్భాలు పలికి ఆయా సంస్థలతో కొత్త ఒప్పందాలతో చర్చలు జరిపి 45 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఒక ఉన్నతస్థాయి కమిటీని నియమించాడు. అయితే జగన్ ప్రభుత్వం సంబంధిత వ్యాపార సంస్థలను బ్లాక్‌మెయిల్ చేసి, బెదిరించి ముడుపులు సంపాదించి మరింత అవినీతికి పాల్పడిందనేదే అసలు వాస్తవం.

ఇక రాజధాని అమరావతి భూముల విషయంలో చంద్రబాబు, తన అనుచరులు ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిపారని ఆరోపిస్తూ, గత ప్రభుత్వ నిర్ణయాన్ని రద్దు చేస్తూ, పాలనా వికేంద్రీకరణ ద్వారానే అభివృద్ధి వికేంద్రీకరణ సాధ్యపడుతుందనే పేరుతో మూడు రాజధానుల నిర్ణయం తీసుకొని అసెంబ్లీలో బిల్లును ఆమోదింపచేసాడు. మూడు రాజధానుల నిర్ణయంలో అసలు మతలబేమిటంటే అమరావతి రాజధాని నిర్మాణంలో చంద్రబాబు, అతని అశ్రితులు, రియలెస్టేట్ వ్యాపారులు అక్రమంగా సంపాదించుకున్న స్థలాలను దెబ్బతీసి, విశాఖలో తాను, తన రియలెస్టేట్ మిత్రుల సంపదను పోగు చేసుకోవడమే తప్ప, నిజంగా వికేంద్రీకరణ ద్వారా ప్రజలకు అభివృద్ధినీ, సమన్వయాన్ని సాధించడమనేది ఎంతమాత్రమూ కాదు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ తన స్వార్థ ప్రయోజనాలకోసం ఎక్కడ వనరులుంటే అక్కడ దోచుకోవడమే తప్ప చంద్రబాబైనా, జగనైనా ప్రజల అభివృద్ధికోసం నిజాయితీతో పని చేస్తారనే దాంట్లో నిజం లేదు. రాజధాని సమస్యపైనా గడిచిన మూడు సంవత్సరాల కాలంలో ప్రజల ఆందోళనలనూ, కోర్టులో వేసిన పిటిషన్లను దృష్టిలో పెట్టుకొని అంతిమంగా హైకోర్టు తీర్పు జోక్యంతో తాత్కాలికంగా జగన్ మూడు రాజధానుల ప్రతిపాదనను రద్దు చేసినా బహుళ రాజధానులు ఏర్పరుస్తానంటున్నాడు. రాష్ట్ర విభజన జరిగి 8 సంవత్సరాలు గడిచినప్పటికీ, రాష్ట్ర పునర్వవస్థీకరణ-2013 చట్టంలో పొందుపరిచిన హామీలను కేంద్రం నేటికీ అమలు చేయలేదు. అయినప్పటికీ 5 సంవత్సరాలు అధికారంలో ఉన్న టీడీపీ చంద్రబాబు, గత 3 సంవత్సరాలుగా అధికారంలో కొనసాగుతున్న జగన్ కేంద్రంపై పోరాడకుండా అవకాశవాదంతో రాజీపడుతూ వచ్చారు. రాష్ట్రానికి నేటికీ రాజధాని నిర్మాణం జరగలేదు. పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించినప్పటికీ కేంద్రం నిధులు కేటాయించకపోవడంతో డ్యాం నిర్మాణం పూర్తి కాలేదు. పోలవరం నిర్వాసిత ప్రజలకు ఇప్పటికీ

పునరావాసం కల్పించలేదు. వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధికి నిధుల కేటాయింపు మాట పూర్తిగా మరిచిపోయారు. అంతరాష్ట్ర నదిజలాల పంపిణీ సమస్యను నేటికీ పరిష్కరించలేదు. విద్య, వైద్యం, సాగునీరు తదితర సమస్యలపై ఇచ్చిన హామీలు గాలిలో కలిసిపోయాయి. వీటికోసం కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లలో ఒకపైసా కూడా కేటాయించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. జగన్ మూడు రాజధానుల పేరుతో ప్రాంతాల మధ్య వైషమ్యాలను సృష్టిస్తూ, రాష్ట్ర ప్రజలను అసలు సమస్యల నుండి పక్కదారి పట్టించి కాలం వెళ్లబుచ్చుతున్నాడు. అందుకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలు రాష్ట్ర విభజన-2013 చట్టంలోని హామీల అమలుకై సమైక్యంగా ఉద్యమించాలి. రోడ్లు, భవనాల నిర్మాణానికి టెండర్లు వేసి, పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా చెల్లించడం లేదు. కోర్టు జోక్యం చేసుకొని వెంటనే బిల్లులు చెల్లించాలని ఆదేశించినప్పటికీ, ప్రభుత్వం అమలు చేయకపోవడంతో పోలవరం నిర్వాసితులు, కాంట్రాక్టర్లు, కూలీలు ఆందోళనలు కొనసాగిస్తున్నారు.

'నవరత్నాలు' పేరుతో ప్రజలకిచ్చిన హామీలను గత మూడు సంవత్సరాల కాలంలో 95 శాతం అమలు చేసామని జగన్ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటున్నది. నిజానికి ఈ సంక్షేమ పథకాలేవి ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించవు. ప్రజలను తమ సమస్యలపై పోరాడకుండా మభ్య పెట్టడం కోసం, సంస్కరణల మత్తులో ముంచి దోపిడీ వర్గాలు వారి కష్టార్జితాన్ని మరింతగా దోచుకోవడం కోసమే. 'నవరత్నాల' పథకాలన్నీ నగదు బదిలీ పథకాలే. ఆరోగ్యశ్రీ, అమ్మఒడి, ఫీజ్ రియంబర్స్‌మెంట్ వంటి పథకాల కింద పంపిణీ చేస్తున్న వేల కోట్ల రూపాయలు ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ళకూ, హాస్పిటల్స్‌కు చెల్లించబడుతున్నాయి. అంతిమంగా ఈ డబ్బంతా దేశ, విదేశీ కార్పొరేట్ ఖజానాలకే చేర్చబడుతున్నాయి. అమ్మఒడి పథకం 2021-22 విద్యా సంవత్సరంలో అసలు అమలు కాకపోవడమే కాకుండా, ఈ పథకం ద్వారా లబ్ది పొందాలంటే అనేక ఆంక్షలను ప్రవేశపెట్టారు. విద్యార్థులు 75 శాతం హాజరు ఉండాలనీ, కుటుంబంలో విద్యుత్ వాడకం 300 యూనిట్స్ మాత్రమే ఉండాలనీ, ఆధార్ కార్డులో కొత్త జిల్లాల పేర్లను నమోదు చేసుకోవాలనీ, బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ లింక్ చేయాలని ఇలా అనేక ఆంక్షలతో అమ్మఒడి పథకం నిజమైన లబ్దిదారులకు అందడం లేదు. 'నవరత్నాల' అమలు పేరుతో ఇప్పటి వరకు జగన్ ప్రభుత్వం 1.85 లక్షల కోట్లు ఖర్చు చేసింది. 2019 నాటికే రాష్ట్రం రెండున్నర లక్షల కోట్ల రూపాయల అప్పుల్లో కూరుకుపోయింది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో 79,191 కోట్ల ఋణం తీసుకొని దేశంలోని అత్యధికంగా అప్పులు తీసుకున్న రాష్ట్రంగా నిలిచింది. 2022 ఆగస్టు నాటికీ (8 నెలలు) చేసిన అప్పు 45,195 కోట్లు. ఏపీ రాష్ట్ర ఋణభారం ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికీ 5,35,600 కోట్లకు చేరుకుంటుందని ఒక అంచనా. ఇదే కాకుండా ఇతర ద్రవ్య సంస్థల, బ్యాంకుల వద్ద చేసిన అప్పులతో కలిపితే 7 లక్షల కోట్లకు పైగా ప్రజలపై ఋణభారం పడుతుంది. ఈ అప్పులకు వడ్డీలు కట్టడం కోసం మరిన్ని నూతన అప్పులను చేస్తుంది. అప్పుల భారాన్ని ప్రజలపై మోపి ప్రజల భూములనూ, ప్రభుత్వ ఆస్తులను అమ్మకానికి పెట్టడమే కాకుండా ప్రజలపై అనేక పన్నులనూ, చార్జీలను విధిస్తున్నారు. ప్రజల సొమ్మునే ఒక చేత్తో ఇస్తూ, మరో చేత్తో అంతకు మించి దోపిడీ పీడనలకు జగన్ ప్రభుత్వం పాల్పడుతున్నది.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రత్యేక హోదాతో రాష్ట్రానికి ఎన్నో ప్రయోజనాలు, ఉద్యోగాలు, పరిశ్రమలు వస్తాయని ఊదరగొట్టిన జగన్, నేడు కేంద్రం ప్రత్యేకహోదాతో సహా సమస్త విభజన హామీలను తుంగలోకి తొక్కినా నోరు మెదపడం లేదు. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రత్యేక ప్యాకేజీలకు ఎగనామం పెట్టారు. కేంద్రం రాష్ట్రానికి ఇచ్చిన హామీలను అమలు చేయమని గట్టిగా అడిగితే తనపై ఉన్న కేసుల విచారణ ఎక్కడ వేగవంతం చేస్తారోననీ, తన కేసుల నుండి రక్షించుకోవడం కోసం జగన్ కేంద్రంలోని మోడీ, అమిత్‌షాల ముందు పూర్తిగా మోకరిల్లాడు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టి కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఆమోదించి, అమలు చేస్తూ తన విధేయతను చాటుకుంటున్నాడు.

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అంతర్జాతీయ, దేశీయ కార్పొరేట్ సంస్థలకూ, ముఖ్యంగా అంబానీ, ఆదానీలకు దేశాన్ని ఒక సురక్షితమైన మార్కెట్‌గా చేసేందుకు ప్రయత్నిస్తున్నది. ఈ సురక్షితమైన మార్కెట్‌లో వారికి ఎటువంటి అవరోధాలు ఉండకూడదు కనుక అందుకవసరమైన అత్యంత అప్రజాస్వామిక, దేశవ్యతిరేక, ప్రజావ్యతిరేక, నిరంకుశ విధానాలతో కూడిన అనేక చట్టాలను రూపొందిస్తున్నది. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజాన్ని అమలు చేస్తున్నది. కశ్మీర్ ప్రజల స్వయం ప్రతిపత్తిని కాలరాచివేస్తూ 370, 35(ఏ) ఆర్టికల్ రద్దు, సీఏఏ, ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్, రైతువ్యతిరేక సాగు చట్టాలు, కార్మికచట్టాల సవరణ, త్రిపుల్‌తలాక్, విద్య కాషాయీకరణ, కార్పొరేటీకరణ, జాతీయ నూతన విద్యావిధానం, ఒకే దేశం, ఒకే పన్ను, ఒకే భాష, ఒకే విద్య, ఒకే మతం తదితర కేంద్ర విధానాలన్నింటిపైనా ఎలాంటి చర్చ లేకుండానే జగన్ పార్లమెంటులో తన పార్టీ ఎమ్‌పీలచేత ఆమోదముద్ర వేయించాడు. అంతే కాకుండా రామజన్మభూమి కూల్చివేత వివాదంలో సుప్రీంకోర్టు ఇచ్చిన అత్యంత అప్రజాస్వామిక, హిందుత్వ అనుకూల తీర్పుపై కూడా తన ఆమోదాన్ని తెలిపాడు. 'అగ్నిపథ్' పథకానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాడు. రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి తన సంపూర్ణ మద్దతును ప్రకటించాడు. కేంద్రం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాపితంగా రైతాంగం, కార్మికవర్గం, విద్యార్థులు, మతమైనారిటీలు, ప్రజాస్వామికవాదులు, సెక్యులరిస్టులు, నిరుద్యోగులు, మహిళలు, ఆదివాసీలు తమ నిరసనలు ప్రకటిస్తూ వివిధ రూపాలలో ఆందోళనలు చేస్తుంటే జగన్ మాత్రం కేంద్ర విధానాలకే మద్దతిస్తున్నాడు.

జగన్ కేంద్రప్రభుత్వ విధానాలకు జీ...హుజూర్ అనటమే కాకుండా సామ్రాజ్యవాదుల సేవలోనూ మునిగి తేలుతున్నాడు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విషయంలోనూ జగన్ మొదట వ్యతిరేకిస్తున్నట్లుగా మాట్లాడినప్పటికీ, తర్వాత స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కేంద్రప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల్లో భాగం కనుక, పైగా ఆ పరిశ్రమ నష్టాలతో నడుస్తుంది కనుక ప్రైవేటీకరణ తప్పదని ప్రధాని ప్రకటించడంతో ఒక అడుగు వెనక్కివేసి 'స్టీల్‌ప్లాంటు మిగులు 7000 ఎకరాలను అమ్మి అప్పులు తీర్చివేయవచ్చు' అని కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి ఎలాంటి ఇబ్బంది లేని ఉచిత సలహా పారేసి తన దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గస్వభావాన్ని ప్రదర్శించాడు. రిలయన్స్ కంపెనీ ఛైర్మన్ పరిమళ్ నత్వాజీకి ఏకంగా రాజ్యసభ సభ్యుడిగా రాష్ట్రం నుండి స్థానం కల్పించాడు. రాష్ట్రంలోని కీలక ఓడరేవులన్నింటినీ క్రమంగా ఆదాని కంపెనీకి అప్పగిస్తున్నాడు. నెల్లూరు జిల్లాలో కృష్ణపట్నం పోర్టు

సమీపంలో ఏపీజెన్‌కో నిర్వహణలోని థర్మల్ విద్యుత్ ప్లాంటును ప్రైవేటీకరణకు నిర్ణయం తీసుకున్నారు. వేలకోట్ల విలువచేసే ప్రభుత్వ భూములనూ, ఆస్తులను కారుచౌకగా అమ్మకానికి పెడుతున్నాడు. గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వలన రైతాంగం భూములను కోల్పోవడంతో పట్టణాలకు వలసలు పెరుగుతున్నాయి. అసంఘటిత కార్మికవర్గం కూడా పెరుగుతుంది. పారిశ్రామిక కారిడార్లను 2023-24 నాటికీ పూర్తి చేసే లక్ష్యంతో శరవేగంగా పనులు చేస్తున్నాడు. రాష్ట్రంలో జగన్ అమలు చేస్తున్న కార్పొరేట్ అనుకూల, కార్మిక వ్యతిరేక ప్రైవేటైజేషన్ విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు పెద్దఎత్తున ఆందోళనలు చేస్తున్నారు.

రాష్ట్రంలో ప్రభుత్వం, బడా భూస్వాములు, కార్పొరేట్ సంస్థలు, రియలెస్టేటర్లు, భూమాఫియాలు రైతుల భూములను ఆక్రమించి అంతర్జాతీయ విమానాశ్రయాలు, పర్యాటక కేంద్రాలు, హైవేరోడ్లు, కోస్టల్ కారిడార్లు, డ్యాంలు, క్రీడా మైదానాలు వంటివి ఏర్పర్చడానికి రైతుల వేలాది ఎకరాల పంట భూములను స్వాధీనం చేసుకోవడంతో, తమ భూములను కోల్పోయిన రైతులు, మత్స్యకారులు ఉపాధిని కోల్పోయి నిర్వాసితులవుతున్నారు. అయితే నేటికీ గ్రామీణ ప్రాంతంలో 80 శాతం భూమిలేని పేదరైతు, వ్యవసాయకూలీలు ఉన్నారు. 'రైతుభరోసా' పథకం ద్వారా రైతులకు మేలు చేస్తున్నానని చెబుతున్న ప్రభుత్వం రైతులకు అన్ని రకాల సబ్సిడీలను ఎత్తివేసి, బ్యాంకు ఋణాలను నిలిపివేయడంతో రైతాంగం ప్రైవేటు వడ్డీవ్యాపారులపై ఆధారపడుతున్నారు. నకిలీ ఎరువులు, విత్తనాలు, పురుగుమందులతో, అధిక ధరలతో, రైతుల పంటలకు గిట్టుబాటు ధరలేక, అప్పులబారంతో రైతాంగం ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. సంస్కరణలలో భాగంగా ప్రభుత్వం విద్యుత్ మోటర్‌లకు మీటర్లు బిగించడానికి సిద్ధమయ్యింది. రాష్ట్రంలో నేటికీ ఏ ఒక్క సాగునీటి ప్రాజెక్టు పూర్తి చేయలేదు.

ఆదివాసీల హక్కులను కాపాడుతానని వాగ్దానం చేసి, అధికారంలోకి వచ్చిన వెంటనే బాక్సైట్ తవ్వకాల నిలుపుదలకు 97 జీవోను రద్దు చేస్తూనే, మరోవైపు సంవత్సరం కూడా తిరక్కుండానే 89 జీవో జారీ చేసి, మన్యంలో బాక్సైట్ తవ్వకాల సర్వేలకు శ్రీకారం చుట్టాడు. బాక్సైట్‌ను తవ్వితీసి ఆన్‌రాక్ కంపెనీకి అప్పగించే ఒప్పందాన్ని పునరుద్ధరించాడు. జీఓ 3ను రద్దు చేసి ఆదివాసీ ఉపాధ్యాయ ఉద్యోగాలలో 100 శాతం రిజర్వేషన్‌కు తూట్లు పొడిచాడు. మన్యంలో ఆదివాసీ రైతాంగం ఏపీఎఫ్‌డీసీకి వ్యతిరేకంగా పోరాడి సాధించుకున్న కాఫీతోటలను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంటున్నది. విశాఖ జిల్లా, కొయ్యూరు మండలం, గానుగుల వద్ద చింతపల్లి మండల సరిహద్దు ప్రాంతంలోని ఎర్రవరం జలపాతంపై 1,200 మెగావాట్ల సామర్థ్యంతో జలవిద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. దీనితో 34 గ్రామాల ప్రజలు నిర్వాసితులు కాబోతున్నారు. ఆదివాసీలు పోరాడి సాధించుకున్న 1/70 చట్టాన్ని నీరుగార్చడానికి తీవ్రంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. 5వ, 6వ షెడ్యూల్డ్, పెసా, అటవీ హక్కుల చట్టాలు ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదు.

రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కొరకు పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతున్నారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని ఉద్యోగులకు అనుకూలమైన పీఆర్‌సీ, ఫిట్‌మెంట్, ఐఆర్, హెచ్‌ఆర్‌సీలను అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు కొనసాగుతున్నాయి. నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తానని జగన్ హామి ఇచ్చిన 2.30 లక్షల ఉద్యోగాలకు 'జాబ్‌క్యాలండర్' ప్రకటించాలని నిరుద్యోగులంతా ఆందోళనలు చేస్తున్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్ సమాన హక్కులు మాట అటుంచితే, రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు, హింస జరగని రోజంటూ లేదంటే అతిశయోక్తికాదు. 'దిశచట్టం' ప్రచార ఆర్భాటానికే తప్ప, మహిళల రక్షణకు ఏ మాత్రం ఉపయోగపడటంలేదు. అగ్రకుల భూస్వాములు, అధికార పార్టీ నాయకులు దళితులపై, మహిళలపై, ప్రజలపై దుర్మార్గమైన దాడులకు పాల్పడుతుంటే ప్రభుత్వం, పోలీసులు మాత్రం ఈ దాడులకు భాద్యులైన వారిని విడిచిపెట్టి, బాధితులపైనే కేసులు పెడుతున్నారు.

జగన్ ప్రభుత్వ పరిపాలనలో విద్య, వైద్య రంగాలు కార్పొరేటీకరణకు గురవుతున్నాయి. పాఠశాలల విలీనం పేరుతో ఇప్పటికే 5,250 ప్రాథమిక పాఠశాలలను మూసివేసింది. ఆన్‌లైన్ విద్యపేరుతో పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్యను దూరం చేసింది. రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ హాస్పిటళ్ళు నిర్మిస్తామని జగన్ చేసిన ప్రకటనలు ప్రచారానికే పరిమితమయ్యాయి. జగన్ ఉన్నట్టుండి ప్రాథమిక విద్య నుంచి ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీషు మాత్రమే ఉంటుందని ప్రకటించాడు. దీంతో ఈ నిర్ణయం పీడిత సెక్షన్‌ల పిల్లలకు ఉపయోగపడుతుందనీ, వారు కూడా ఇంగ్లీషు నేర్చుకొని చదువుల్లోనూ, ఉద్యోగాల్లోను సంపన్నుల పిల్లలతో పోటీపడి రాణించగలుగుతారని కొద్దిమంది వాధిస్తుంటే, మరికొందరు మాతృభాష తెలుగుకు అన్యాయం జరిగిందనీ, ప్రభుత్వ పాఠశాలలలో తెలుగు మీడియమే ఉండాలని వాధిస్తున్నారు. వాస్తవంగా ఈ ప్రభుత్వాలకూ, వాటిని నడుపుతున్న దోపిడీ వర్గాలకు ప్రభుత్వ పాఠశాలలపై శ్రద్ధకన్నా, కార్పొరేట్ పాఠశాలలపైనే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. నేడు ఏకంగా ప్రభుత్వ పాఠశాలలలో ఇంగ్లీషు మీడియం మాత్రమే ఉంటుందని ప్రకటించడం ఆచరణ సాధ్యం కాని మోసపూరిత నిర్ణయం. అందుకే ప్రాథమిక విద్యను మాతృభాషలోనే బోధించాలి. ఆ పైచదువులలో ఇంగ్లీషును రెండవ మాద్యమంగా చేర్చాలి. విద్యా, వైద్యం నేడు సామాన్య ప్రజల జీవితాలలో ముఖ్యమైన విషయాలుగా చేరిపోయాయి. వివిధ కారణాలతో పెరుగుతున్న అనారోగ్య సమస్యలు, వాటికి వైద్యం కోసం ప్రజలు వేలు, లక్షల రూపాయలు వెచ్చించాల్సి వస్తుంది. పిల్లలకు నాణ్యమైన ఉన్నత విద్యనందించడం తల్లిదండ్రులకు ప్రాథమిక కర్తవ్యంగా మారిపోయింది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ పోటీలో ఆంగ్లభాషతోపాటు, సాంకేతిక విద్య అవసరం పెరిగింది. అందుకు లక్షల రూపాయాలు ఖర్చు చేసి, కార్పొరేట్ విద్యాలయాల్లో బోధన గరపాల్సి వస్తున్నది. దానితో ప్రజల సంపాధనలో ఎక్కువ భాగం విద్య, వైద్యాలకే ఖర్చు చేయాల్సి వస్తుంది. అందుకే విద్య, వైద్యాలను ప్రభుత్వమే ప్రజలకు ఉచితంగా అందించాలనే డిమాండ్‌తో పోరాడాలి.

అధికార వికేంద్రీకరణ, ప్రజల వద్దకు పాలన పేరుతో గ్రామ, వార్డు, సచివాలయాలు, వాలెంటరీ వ్యవస్థను ఏర్పరిచి గ్రామస్థాయిలో అధికార కేంద్రీకరణను పెంచి లాఠీవ్యవస్థకు పునాదులు వేసారు. రాష్ట్రంలో నియంతృత్వ జగన్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజాఉద్యమాలన్నీ ఎదుర్కొంటున్న తీవ్రమైన సవాలు ఫాసిజం. కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న బ్రాహ్మణీయ హిందుత్వ

ఫాసిస్టు ఎజెండాను రాష్ట్రంలో జగన్ తూచ తప్పకుండా అమలు చేస్తున్నాడు. అత్యంత క్రూరమైన ఫాసిస్టు చట్టాలైన ఉపా, ఎన్ఐఏ చట్ట సవరణ, రాజద్రోహ చట్టాలను రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ భావాలు కలిగినవారిపై, ప్రజాస్వామికవాదులపై, ప్రజాసంఘాలపై చివరకు ప్రతిపక్షాలపై కూడా అమలు చేస్తున్నాడు.

సీపీఐ(మావోయిస్టు) నాయకత్వంలో గత నాలుగు దశాబ్దాలుగా 'జల్, జంగల్, జమీన్, ఆత్మగౌరవం, అధికారం' కోసం బలమైన సాయుధ రైతాంగ ఉద్యమాన్ని నిర్మించింది. ఆదివాసీలను నిర్వాసితులను చేస్తూ, బాక్సైట్ తవ్వకాలకు అనుమతులిస్తూ 97 జీవోను అమలు చేయాలని చూసిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆదివాసీలు, పీడిత ప్రజలు సమరశీలంగా, మిలిటెంట్‌గా, సాయుధంగా పోరాడి ప్రభుత్వం మెడలు వంచి జీఓను రద్దు చేయించారు. ఏపీఎఫ్‌డీసీ స్వాధీనంలో ఉన్న వేలాది ఎకరాల కాఫీతోటలను స్వాధీనం చేసుకొని భూమిలేని వ్యవసాయ కూలీ పేద రైతులకు పంపిణీ చేసుకున్నారు. 'దున్నేవారికే భూమి, విప్లవ ప్రజాకమిటీలకే రాజకీయాధికారం' కేంద్ర నినాదంతో సాయుధ వ్యవసాయక విప్లవాన్ని కొనసాగిస్తూ ప్రజాయుద్ధాన్ని అభివృద్ధి చేసి, విప్లవ ప్రజాకమిటీలను నిర్మాణం చేసి, బీజప్రాయంగా ప్రజల అధికారాన్ని స్థాపించుకున్నారు. నేడు ఈ విప్లవోద్యమ ప్రాంతాలలో వేలాది సాయుధ బలగాలను మోహరించి ఆదివాసీ సాయుధ రైతాంగ ఉద్యమాన్ని నిర్మూలించడానికి నిరంతరం కూంబింగ్‌లు, అక్రమ అరెస్టులు, జైలు నిర్బంధాలు, ఎన్‌కౌంటర్ హత్యలతో మారణకాండను సృష్టిస్తున్నారు.

రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే అధికారంలో ఉన్న వైఎస్ఆర్‌సీపీ గడిచిన మూడేళ్ళకాలంలో తన పరిపాలనపై ప్రజలలో వచ్చిన వ్యతిరేకత, నిరసనలు జగన్‌కు ఆందోళన కలిగిస్తున్నాయి. అందుకోసమే తన పరిపాలనలో గొప్ప విజయాలను సాదించామని పెద్దఎత్తున అసత్య ప్రచారాన్ని చేస్తూ, తన ఎమ్ఎల్ఏలందరూ వీటిని విస్తృతంగా ప్రచారం చేయాలని దిశానిర్దేశం చేసి, 'గడపగడప'కు కార్యక్రమాన్ని చేపట్టాడు. ఈ కార్యక్రమానికి వెళ్ళిన మంత్రులందరూ ప్రజల ప్రతిఘటనను ఎదుర్కోక తప్పడంలేదు. దానితో తన మంత్రులందరిపైన జగన్ తీవ్రమైన అసహనాన్ని వ్యక్తం చేస్తున్నాడు.

కేంద్రంలోని బీజేపీ తన విస్తరణకోసం ఒక్కో రాష్ట్రంలో ఒక్కో వ్యూహాన్ని అమలు చేస్తున్నది. ఏపీలో ఇప్పుడప్పుడే తమ పార్టీ బలమైన శక్తిగా ఎదగగలదన్న భ్రమలేవి బీజేపీకి లేవు. అధికార వైఎస్ఆర్‌సీపీ తన పెంపుడు కుక్కలాగా, నమ్మినబంటుగా ఉన్నందున దానితో బీజేపీకి పేచీ ఏమిలేదు. తమతో పొత్తులో ఉన్న పవన్‌కల్యాణ్ సామర్థ్యంపైన కూడా ఆ పార్టీకి పెద్దగా విశ్వాసం లేదు. ఇక టీడీపీ చంద్రబాబుతో పవన్‌కున్న డీల్ గురించి కూడా బీజేపీకి అవగాహన ఉంది. రాష్ట్రంలో అన్ని పార్టీలు కులసమీకరణలపై కూడా ఆధారపడుతున్నాయి. కొన్ని దశాబ్దాలుగా అధికారం కోసం అగ్రకుల కమ్మ, రెడ్లలోని బడా భూస్వామ్య, దళారీ పెట్టుబడిదారీ వర్గాలు ప్రధానంగా పోటీ పడుతుండగా, ప్రస్తుతం కాపులు కూడా ఈ పోటీలోకి దిగారు. కమ్మ కులస్తులు టీడీపీకి నాయకత్వం వహిస్తుండగా, రెడ్లు వైఎస్ఆర్‌సీపీ నాయకత్వంలో ఉన్నారు. ఈ రెండు పార్టీలు కాపులను తమవైపు తిప్పుకోవడం ద్వారా తమ బలాబలాల సమతూకంలో మార్పు తెచ్చుకోవాలని చూస్తున్నాయి. బీసీలు, దళితులు, ఆదివాసీలలోని దళారీ నాయకత్వాన్ని లోబర్చుకోవడానికి అన్ని పార్టీలు ఎత్తులు వేస్తున్నాయి. బీజేపీ కూడా ఈ ఆటలోకి దిగింది. కమ్మ కులస్తులను టీడీపీ నుంచి బయటకు లాగి, తద్వారా టీడీపీని బలహీనపర్చి, బీజేపీ బలపడాలని ప్రయత్నిస్తున్నది. అందులో భాగంగానే హైదరాబాద్‌లో అమిత్‌షా జూనియర్ ఎన్‌టీఆర్‌ను ప్రత్యేకంగా పిలుపించుకొని కలవటం వెనక ఉన్న మతలబు.

ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న టీడీపీ చంద్రబాబునాయుడు అధికార వైఎస్ఆర్‌సీపీ జగన్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలనూ, వైఎస్ఆర్‌సీపీపట్ల ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను ఉపయోగించుకొని రాజధాని అమరావతి భూముల విషయంలో, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, 'నవరత్నాల అమలు' తదితర అంశాలకు వ్యతిరేకంగా ప్రజాందోళనలు చేపట్టి ప్రజల్లో మద్దతు కూడగట్టడానికి చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తున్నాడు. ప్రస్తుత రాష్ట్ర సంక్షుభిత, ఆర్థిక, రాజకీయ పరిస్థితిని తమ ఓటుబ్యాంకుగా మార్చుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. అయితే రాష్ట్ర విభజన తర్వాత ఐదేళ్ళ చంద్రబాబు పరిపాలననూ, మూడేళ్ళ జగన్ పరిపాలనను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. టీడీపీ వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా ఉంటే అధికార పార్టీకి గట్టిపోటీ ఇవ్వలేదు. ఇప్పటికే ఉన్న జనసేన సహకారం ఒక్కటే సరిపోదు. వైఎస్ఆర్‌సీపీ వ్యతిరేక ఓట్లను చీలిపోకుండా చూడటానికి 'గ్రాండ్ అలయన్స్' ఏర్పాటు చేయాలని తలపోస్తుంది. అంటే బీజేపీతో కూడా జత కలవాలి. బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉన్న బలమైన పార్టీ కనుక దాని అండతో నిలబడటం కోసం, వారి స్నేహ హస్తం కోసం, బీజేపీ పెద్దల మనసుకు నచ్చే ప్రతిపాదనలు చేయడానికి కూడా టీడీపీ వెనకాడటం లేదు. కేంద్రంలో బీజేపీ మాత్రం రాజకీయ చదరంగంలో అధికార పార్టీ జగన్‌నూ, ప్రతిపక్ష చంద్రబాబును కూడా తన గుప్పెట్లో పెట్టుకొని నాటకీయంగా పావులను కదుపుతున్నది. బీజేపీ తెలంగాణలో అధికారంలోకి రావాలంటే తెలంగాణలోని టీడీపీ ఓటుబ్యాంకును తన ఖాతాలో వేసుకోవడానికి ఏపీలోని టీడీపీతో ఫ్రంట్ ఏర్పర్చుకోవాలని తెలంగాణ బీజేపీ నాయకులు కొందరు కేంద్రపెద్దలపై ఈ మధ్యకాలంలో ఒత్తిడి పెంచుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విభజిస్తూ కాంగ్రెస్ నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆంధ్ర ప్రాంత కాంగ్రెస్ నాయకత్వం పూర్తిగా వ్యతిరేకించింది. దానితో అనేక మంది కాంగ్రెస్ పార్టీని వీడి వైఎస్ఆర్‌సీపీలో చేరిపోయారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అత్యంత బలహీనంగా మారిపోయింది. ఒంటరిగా పోటీ చేసి గెలిచే పరిస్థితుల్లో లేదు. ఏదో ఒక కూటమిలో చేరక తప్పదు.

తెలుగు సినీ పరిశ్రమలో నూతనంగా ఎదిగిన ప్రాంతీయ దళారీ పెట్టుబడిదారివర్గం, కాపు కులంలోని బడా భూస్వామ్య, బూర్జువావర్గ ప్రతినిధిగా చిరంజీవి 'ప్రజారాజ్యంపార్టీ'ని ఏర్పాటు చేసాడు. కానీ ఆ వర్గాలు ఆశించిన రీతిలో ఆ పార్టీ అధికారంలోకి రాలేకపోయింది. దానితో అది కొద్ది కాలానికే బలహీనపడి కాంగ్రెస్‌లో విలీనమై చివరకు ఆ పార్టీని రద్దు చేసారు. దీన్ని విభేదిస్తూ అదే వర్గాలకు ప్రతినిధిగా పవన్‌కల్యాణ్ కొత్తగా 'జనసేన పార్టీ'ని స్థాపించాడు. కమ్యూనిస్టు భావజాలం, పూలే, అంబేడ్కర్, పేరియార్ సిద్ధాంతం, సామాజిక న్యాయం లాంటి కొత్త నినాదాలతో ఎన్నికల బరిలోకి దిగి గత ఎన్నికలలో సీపీఐ, సీపీఎమ్‌లతో పొత్తు పెట్టుకొని పోటీ చేసినప్పటికీ

విజయం సాధించలేదు. ఆ తర్వాత కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కూటమిలో చేరిపోయాడు. దానితో పవన్‌కల్యాణ్ రాజకీయ స్థిరత్వంపై ఎవరికి నమ్మకం లేకుండా పోయింది. ప్రస్తుతం వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక ఓట్లు చీలిపోకుండా ఉండటానికి ప్రతిపక్ష టీడీపీతో కలిసి పని చేస్తామని ప్రకటిస్తున్నాడు.

వామపక్షాలుగా ఉన్న సీపీఐ, సీపీఎమ్‌లు పైకి మాత్రం ప్రజాస్వామ్యాన్నీ, సోషలిజాన్ని వల్లెవేస్తూ సారంలో రివిజనిజాన్ని అనుసరిస్తున్నారు. ప్రజా సమస్యలపై కేవలం ప్రకటనలకే పరిమితమవుతూ ప్రజలు చేస్తున్న సమరశీల పోరాటాలనూ, ప్రజల మిలిటెన్సీని నీరుగారుస్తున్నారు. తమ రివిజనిస్టు విధానాలతో ప్రజలకు దూరమై పాలకపార్టీలకు తోకలుగా మారి దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల నియంతృత్వాన్ని పరిరక్షించేందుకు, ఆ వర్గాలకు సేవ చేసేందుకు అంకితమవుతున్నాయి.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అంటే ప్రజలు స్వేచ్ఛగా, ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఓట్లు వేసి, నాయకులును ఎన్నుకోవడం కాదని ఏనాడో తేలిపోయింది. రాజకీయ నాయకులు, బడా పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య అధిపతులు, రియలెస్టేట్ అధిపతులు, బడా కాంట్రాక్టర్లు, బడా భూస్వాములు ప్రజలను తీవ్రమైన దోపిడీ పీడనలకు గురిచేస్తూ, ఆ దోపిడీ సంపదను పంపిణీ చేసుకోవడంలో పోటీ పడుతూ అవకాశవాద కలయికలతో ఘర్షణలు పడుతున్నారు. ఈ దోపిడీవర్గ ముఠాలకు రాష్ట్రంలో రాజకీయంగా ప్రాతినిధ్యం వహిస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ, టీడీపీ, బీజేపీ, జనసేన, కాంగ్రెస్ వగైరా పార్లమెంటరీ పార్టీల మధ్య పోటీ రూపంలో ఈ ఘర్షణ వ్యక్తమవుతున్నది. కనుక రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా అది కేంద్రానికి లొంగి ఉంటూ, సామ్రాజ్యవాదులకూ, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలకు సేవ చేస్తుందే తప్ప, పీడిత ప్రజల మౌలిక సమస్యలేవీ పరిష్కరించదు.

## ఒడిశా రాష్ట్ర ప్రస్తుత రాజకీయ పరిస్థితి

2019 మేలో ఒడిశా రాష్ట్ర విధానసభకు జరిగిన ఎన్నికలలో బీజేడీ వరుసగా 5వసారి కూడా గెలిచి, నవీన్‌పట్నాయక్ అధికారాన్ని చేపట్టాడు. రాష్ట్రంలో నవీన్ తిరుగులేని నాయకుడిగా, బీజేడీ బలమైన పార్టీగా బూర్జువా మీడియాచేత ప్రశంసలు అందుకున్నాడు. దీనికి ముందు గత 20 సంవత్సరాలుగా సామ్రాజ్యవాద ఎల్‌పీజీ విధానాలను అమలు చేస్తూ, రాష్ట్రప్రజల సంపదను దోచిపెట్టడంలో దోపిడీవర్గాలకు అత్యంత విశ్వాసపాత్రుడిగా మారాడు. దోచుకున్న ప్రజల సంపద నుండి కొంత సొమ్మును అభివృద్ధి సంక్షేమం పేరిటా ప్రజల కళ్ళకు సంస్కరణల గంతలను కట్టి ఓటుబ్యాంకును పెంచుకున్నాడు. తన ప్రభుత్వ పాలనా విధానాలపై క్రమంగా పెరుగుతున్న ప్రజావ్యతిరేకతను పక్కదారి పట్టించి ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్‌లను ఎదుర్కోవడానికి ఎన్నికలకు ముందు అనేక జనాకర్షక, మోసపూరిత వాగ్దానాలను గుప్పించాడు. రైతులకు 'కలియా యోజనా'ను ప్రకటించి ఎన్నికలకు ముందే కోట్లాది రూపాయలను పంపిణీ చేసాడు. రాష్ట్రంలో ఉన్న మొత్తం 36,000 సెల్ఫ్‌హెల్ప్‌గ్రూపులకు ఆర్థిక సహాయం అందజేసాడు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రతిపత్తిని కల్పించాలనీ, దాని ద్వారానే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయనీ, వెనకబడిన ప్రాంతాలు అభివృద్ధి చెంది ఉపాధి లభిస్తుందని నమ్మిస్తూ, లక్షమంది ప్రజల సంతకాలను సేకరించి కేంద్రానికి అర్జీలు పంపాడు. 'మేక్ ఇన్ ఒడిశా' పేరుతో అంతర్జాతీయ మరియు దేశీయ కార్పొరేట్ సంస్థలను ఆహ్వానించి లక్షలాది మంది యువకులకు ఉద్యోగాలు వస్తాయని బూటకపు ప్రచారాన్ని కొనసాగించాడు. మహానది జలాల వివాదం, పోలవరం డ్యాం నిర్వాసిత సమస్యలతో రాష్ట్ర ప్రజలలో ప్రాంతీయ విద్వేశాలను రెచ్చగొట్టాడు. పై వాటితోపాటు, ఎన్నికల ప్రణాళికలో ప్రతి మనిషికి పుట్టుక నుండి మరణం వరకూ, పిల్లల నుండి వృద్ధుల వరకూ, ఆదివాసీల నుండి రైతుల వరకూ, విద్యార్థుల నుండి అసంఘటిత కార్మికుల వరకూ, గ్రామాల నుండి పట్టణాల వరకూ, యువకులకూ, మహిళలకు అనేక ప్రజాకర్షక పథకాలు ప్రకటించాడు. బీజేపీ అధికారంలోకి వస్తే రైతాంగానికి అమలు చేస్తున్న 'కలియా యోజన' నిలిపివేస్తుందని ప్రచారం చేసి బీజేపీపై వ్యతిరేకతను పెంచాడు. బాలాకోట్ సంఘటన ద్వారా బీజేపీ ముందుకు తెచ్చిన హిందుత్వ జాతీయతా భావనలు స్థానికంగా ప్రజలపై పెద్దప్రభావాన్ని వేయలేకపోయాయి. ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ బలహీనతల్ని ఉపయోగించుకున్నాడు. ఎమ్ఎన్‌సీలు, చిట్‌ఫండ్ కంపెనీలు, గనుల మాఫియా అందించిన వేలకోట్ల రూపాయల ఫండ్‌ను బీజేడీ ఎన్నికలలో ఖర్చు చేసి, అధికారంలోకి రాగలిగింది.

గడిచిన మూడు సంవత్సరాల కాలంలో ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలనూ, వాగ్దానాలను తుంగలో తొక్కింది. మహానది జలవివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకోవడానికి నేటి వరకు ఎలాంటి ప్రయత్నం చేయలేదు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా డిమాండ్ ఊసే ఎత్తడం లేదు. పోలవరం డ్యాం ముంపు సమస్యపై తమ అభ్యంతరమేమిటో తెలియజేయమంటూ సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించినా మౌనం వహిస్తున్నది. 'మేక్ ఇన్ ఒడిశా' అనేది స్వావలంబనతో కూడిన విధానం కాదు, కార్పొరేట్లకు సేవ చేసే విధానమనీ, అది రాష్ట్రాన్ని అభివృద్ధిపరచదనీ, ఉపాధిని కల్పించదని తేలిపోయింది. కేంద్రంలో బీజేపీ మోడీ ప్రభుత్వం 'నయా భారత్' నిర్మాణం పేరుతో తీసుకువచ్చిన సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల అనుకూల, బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు విధానాలన్నింటికీ ఆమోదం తెలిపి అమలు చేస్తున్నది. కశ్మీర్ స్వయం ప్రతిపత్తిని కాలరాస్తూ 370, 35 (ఏ) ఆర్టికల్ రద్దు, త్రిపుల్‌తలాక్, రైతు వ్యతిరేక మూడు సాగు చట్టాలు, సీఏఏ, ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్, అనేక ఫాసిస్టు అణచివేత చట్టాలనూ, మానిటైజేషన్, అగ్నిపథ్ లాంటి కేంద్ర ప్రజావ్యతిరేక ఆర్థిక, రాజకీయ విధానాలపై పార్లమెంట్‌లో ఎలాంటి చర్చ లేకుండానే తన ఎమ్‌పీల చేత ఆమోదింపజేసి బీజేడీ తన ప్రజావ్యతిరేక వైఖరిని ప్రకటించుకుంది.

రాష్ట్రంలో ప్రాకృతిక, సహజ, ఖనిజ సంపద, సారవంతమైన భూములు అనేక జీవనదులు, విస్తారమైన సముద్ర తీరప్రాంతం, కోట్లాది మంది శ్రమ జీవులు ఉన్నప్పటికీ, నేటికీ అత్యంత పేదరికాన్నీ, వెనకబాటుతనాన్ని ఎదుర్కొంటున్నది. మొత్తం జనాభాలో ఆదివాసీలు, దళితులు 39 శాతంగా ఉన్నారు. విస్తీర్ణంలో సుమారు 44.7 శాతం భూభాగంలో ఆదివాసీలు నివసిస్తున్నారు. కానీ వారికి అడవిమీద, సంపదమీద ఎలాంటి అధికారం లేదు. ప్రభుత్వాలు అనుసరించిన దోపిడీ విధానాలు, నిర్లక్ష్యం మూలంగా ప్రాంతీయ అసమానతలు తీవ్రస్థాయిలో పెరిగాయి. నేటికీ నూటికి 70 శాతం మంది భూమిలేని పేద రైతు, వ్యవసాయ కూలీలున్నారు. దారిద్ర్యరేఖకు దిగువన నేటికీ

35 శాతం మంది ప్రజలు ఉన్నారు. వారంతా అత్యంత దుర్భర జీవితం గడుపుతున్నారు. జనాభాలో సగం మంది ప్రభుత్వం పంపిణీ చేసే ఒక రూపాయికి కిలో బియ్యంపైనే ఆధారపడుతున్నారు. రాష్ట్రంలో 88 లక్షల హెక్టార్ల సాగుభూమి ఉన్నా, 77 శాతం భూములకు నీటి సౌకర్యం లేదు.

భూమి బడా భూస్వాముల, కార్పొరేట్ సంస్థల, ప్రభుత్వ, ఫారెస్టు డిపార్ట్‌మెంట్, దేవాలయాలు, డ్యాంల నిర్మాణం, హైవే రోడ్లు, విమానాశ్రయాలు, కోస్టల్ కారిడార్‌లు, రియలెస్టేటర్లు, భూమాఫియా కబ్జాలో కేంద్రీకరించబడింది. రాష్ట్రంలో ఇనుము, బాక్సైట్, మాంగనీస్, గ్రాఫైట్, బొగ్గు, బంగారం, యురేనియం, ప్లాటినమ్, లైమ్‌స్టోన్ తదితర విలువైన ఖనిజాలు ఉన్నాయి. కానీ ఈ సంపదపై విదేశీ బహుళజాతి సంస్థలకూ, దేశీయ దళారీ బూర్జువా వర్గాలకు అధికారాన్ని అప్పగిస్తూ, ప్రభుత్వ విధానాలు రూపొందించబడ్డాయి. కొరాపుట్‌లోని దేవమాలి, కొండంగిమాలి, కాశీపూర్, నియమగిరి, కర్లాపాట్, సీజు-కడ్జుమాల, గందమర్దన్ వరకు బాక్సైట్‌ను తవ్వితీసి రిఫైనరీ చేయడానికి ఎమ్‌ఎన్‌సీలకు అప్పగించింది. డింకియా, నువాగామ్ ప్రాంతాలలో పోస్కో కంపెనీని ప్రజలు ప్రతిఘటించి తరిమివేసిన తర్వాత తిరిగి జిందాల్ కంపెనీకి అనుమతినిచ్చి, ప్రభుత్వ సాయుధ బలగాలను మోహరించి, ప్రజా ప్రతిఘటనను అణచివేసి తవ్వకాలను ప్రారంభించడానికి ప్రయత్నిస్తున్నది. దేశంలో 54 శాతం అల్యూమినియం ఒక ఒడిశా రాష్ట్రంలోనే ఉత్పత్తి అవుతున్నది. రాష్ట్రాన్ని అల్యూమినియం రాజధానిగా మార్చడానికి నవీన్‌పట్నాయక్ 'విజన్-2030'ని ప్రారంభించాడు. 2019లో జరిగిన 'మేక్ ఇన్ ఒడిశా సమ్మేళన్'కు 30 దేశాలనుండి బడా కార్పొరేట్ సంస్థలు, స్వదేశీ దళారీలు హాజరై ఖనిజ, ఫుడ్ ప్రాసెసింగ్, ప్లాస్టిక్, పర్యాటక, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర 8 సెక్టార్లలో 3లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం 'సాగరమాల' పథకంలో భాగంగా గోపాల్‌పూర్ నుండి బాలేశ్వర్ వరకు బంగాళఖాతం సముద్రతీరం వెంట వందల కిలోమీటర్లలో కోస్టల్ కారిడార్‌ను నిర్మించి ఎమ్‌ఎన్‌సీ, సీబీబీలకు అప్పగించింది. దీనితో సముద్రంపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులు ఉపాధిని కోల్పోతున్నారు. రాష్ట్రంలో నదీజలాల పంపకం, రాష్ట్రాల సరిహద్దు గ్రామాల వివాదాలతోపాటు, నదులపై ప్రాజెక్టుల నిర్మాణ వివాదాన్ని బీజేడీ తన ఓటుబ్యాంకు రాజకీయాలకు వాడుకుంటున్నది. మహానది జలవివాదం పశ్చిమ ఒడిశా నుండి ఉపకుల ఒడిశా వరకు మొత్తం 14 జిల్లాలలో, పోలవరం మరియు వంశధార డ్యాంల ముంపు సమస్య దక్షిణ ఒడిశాపై, బ్రాహ్మణీ మరియు బైతరాని ముంపు సమస్య, పశ్చిమ, ఉత్తర ఒడిశా ప్రాంతాల ప్రజలు ప్రభావితమవుతున్నారు. ఈ నదీజలాలను ఎమ్‌ఎన్‌సీలకు కేటాయించడం వలన వ్యవసాయం, చిన్న పరిశ్రమలు, సాధారణ ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. స్మార్ట్‌సిటీల నిర్మాణం, పట్టణాలను ఆధునీకరించడం పేరుతో బస్తీవాసులను తరిమివేస్తున్నారు. అంతర్జాతీయ గుత్త సంస్థల, దేశీయ దళారీ పెట్టుబడిదారుల పెట్టుబడులను ఆకర్షించడానికి వారికి మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తూ, ప్రభుత్వం భూబ్యాంకులు ఏర్పాటు చేయడం, డ్యాంలు నిర్మించడం, నీటి, విద్యుత్ సరఫరాలను మెరుగుపర్చడం, హైవే రోడ్లు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, సెల్‌టవర్లు మొదలైన వాటిని నిర్మించడానికి వేలకోట్ల రూపాయల ప్రజాధనాన్ని ప్రభుత్వం చిత్తానుసారంగా ఖర్చు చేస్తున్నది. బీజేడీ నవీన్ ప్రభుత్వం ఎల్‌పీజీ విధానాలను మరింత వేగంగా దూకుడుగా అమలు చేస్తూ, విదేశీ, స్వదేశీ, కార్పొరేట్లకు ఎర్రతివాచీలు పరిచి ఆహ్వానిస్తూ, వారి పెట్టుబడులకూ, దోపిడీకి రాష్ట్రాన్ని స్వర్గదామంగా మారుస్తున్నది.

ప్రభుత్వం అనుసరిస్తున్న ఎల్‌పీజీ విధానాల మూలంగా లక్షలాది మంది ప్రజలు భూముల నుండీ, నివాస స్థలాల నుండి ఖాళీ చేయించబడుతూ నిర్వాసితులుగా మార్చబడుతున్నారు. వీరంతా వలసకూలీలుగా మారి దేశంలోని వివిధ ప్రాంతాలకు వెలుతున్నారు. రాష్ట్రంలో 13 శాతం మంది ప్రజలు వలసకూలీలుగా జీవనం కొనసాగిస్తున్నారు. వీరందరి సమస్య కూడా భూమి సమస్యతో ముడిపడి ఉంది. 'దున్నేవారికే భూమి' ప్రాతిపదికన వ్యవసాయక విప్లవం ఇరుసుగా గల నూతన ప్రజాస్వామిక విప్లవం ఒక్కటే రైతాంగానికి మార్గం.

గత నాలుగు దశాబ్దాలుగా 'జల్, జంగల్, జమీన్, ఆత్మగౌరవం, అధికారం' నినాదంతో మల్కనగిరిలోని కలిమెల, మోటు, కటాఫ్ ప్రాంతాలలో, రెండు దశాబ్దాలుగా కొరాపుట్ జిల్లాలోని నారాయణపట్నా, బందుగాం, బైపర్‌గూడ ప్రాంతంలో సాయుధ వ్యవసాయక విప్లవ పోరాటం కొనసాగుతుంది. వేలాది ఎకరాల ప్రభుత్వ, గిరిజనేతర, బడా భూస్వాముల, దోపిడీవర్గ తెగపెద్దలకు చెందిన భూములను స్వాధీనం చేసుకొని భూమిలేని వ్యవసాయ కూలీ పేదరైతాంగానికి పంపిణీ చేసింది. అనేక విప్లవ భూసంస్కరణలను అమలు చేసింది. సహకార, సమిష్టి వ్యవసాయాన్ని అభివృద్ధి చేసి, ఉత్పత్తిని పెంచి ప్రజల జీవన ప్రమాణాలను అభివృద్ధి చేసింది. నాల్కో, మాలి, దేవమాలి, బలిమెల నిర్వాసిత సమస్యలపై బలమైన ప్రజాఉద్యమాలను నిర్మించి అనేక గొప్ప విజయాలను సాధించింది. ప్రజాయుద్ధాన్ని అభివృద్ధి చేసి, పాత రాజకీయ వ్యవస్థను ధ్వంసం చేసి, విప్లవ ప్రజా కమిటీలను నిర్మించి బీజప్రాయంలో ప్రజలు అధికారాన్ని స్థాపించుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న విద్యా, వైద్యం, త్రాగు, సాగునీరు సమస్యలు, అభివృద్ధి తదితర సమస్యలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతూనే ప్రజల భాగస్వామ్యంతో పరిష్కరించుకున్నారు. నేడు ఈ ప్రాంతాలలో వేలాది సాయుధ బలగాలను మోహరించి విప్లవోద్యమాన్ని అణచివేసి ప్రజలను లొంగదీసుకొని తమ పాత అధికారాన్ని పునస్థాపించడానికి అది అన్నిరకాల ప్రయత్నాలను కొనసాగిస్తున్నది. 5వ, 6వ షెడ్యూల్డ్ ప్రాంతాలలో ఆదివాసీలకు కల్పించిన 1/56, పెసా తదితర చట్టాలు, హక్కులు అమలుకు నోచుకోవడం లేదు. అటవీ, మైదాన, పట్టణ పరిసర ప్రాంతాలలో భూనిర్వాసిత సమస్యతోపాటు, పర్యావరణ సమస్యలు పెరుగుతున్నాయి.

రాష్ట్రంలో సంఘటిత, అంసఘటిత కార్మికుల సంఖ్య పెరుగుతున్నది. అయితే ప్రధానంగా అసంఘటిత, వలస కార్మికుల సంఖ్య ఘననీయంగా పెరిగింది. వారి జీవన పరిస్థితులు అత్యంత దయనీయంగా ఉన్నాయి. నాల్కో, ఆర్‌ఎస్‌పీ(రూర్కేలా స్టీల్ ప్లాంట్), ఎన్‌టీపీసీ(నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్) తదితర కంపెనీలలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను పెద్ద ఎత్తున తొలగిస్తున్నారు. కార్మికుల, ఉద్యోగుల సంఖ్యను తగ్గిస్తున్నారు. దానితో ఉద్యోగ భద్రతకు గ్యారంటీ లేకుండా పోయింది. రాష్ట్రంలో 15,000 చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రభుత్వం మూసివేసింది. ప్రభుత్వ రంగంలోనే అనేక

పరిశ్రమలలో ఉత్పత్తి సామర్థ్యాన్ని తగ్గించి, ఉద్దేశపూర్వకంగానే వాటిని దివాలా తీయించి, కారుచౌక రేట్లకు అమ్మకానికి పెడుతున్నది. మానిటైజేషన్‌లో భాగంగా ప్రభుత్వ పరిశ్రమలను అద్దెకిస్తున్నది.

మహిళలపై భూస్వామ్య, తెగ పితృస్వామ్యం అమలవుతూ, ఎల్‌పీజీ విధానాల అమలు ప్రారంభమైన తర్వాత సామ్రాజ్యవాద అశ్లీల సంస్కృతితోడై, మహిళలపై అణచివేత, అత్యాచారాలు, అపహరణాలు, హత్యలు పెరిగాయి. మహిళల శరీరాలతో వ్యాపారం చేయడం పెరిగింది. ప్రతి సంవత్సరం ప్రభుత్వ గణాంకాల ప్రకారమే 10,000 మంది బాలికలు అత్యాచారానికి గురవుతున్నారు. సంవ్సరానికి సుమారు 5000 మందికి పైగా మహిళలు మాయం చేయబడుతున్నారు. ప్రతి సంవత్సరం ఆదివాసీ, దళిత బాలికలు, యువతులు సుమారు 30,000 మంది ఉపాధి పనుల కోసం పట్టణాలకు తరలించబడుతున్నారు. అందులో అనేక మంది లైంగిక దాడులకు గురవుతున్నారు, మాయం చేయబడుతున్నారు. నేటికీ సమాన పనికీ సమాన వేతనం పొందలేకపోతున్నారు.

కేంద్రంలో బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిస్టు మోడీ రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మతమైనారిటీలపైన దాడులు పెరిగాయి. ఈ దేశ పౌరులే అయినా ముస్లింలు, క్రిష్టియన్‌లు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని భయంతో జీవిస్తున్నారు.

కేంద్రం తీసుకువచ్చిన జాతీయ నూతన విద్యావిధానంతో విద్య కాషాయీకరణ, కార్పొరేటీకరణకు గురవుతున్నది. ఎల్‌పీజీ విధానాలలో భాగంగా అప్పటికే విద్యరంగం నుండి ప్రభుత్వాలు వైదొలగి ప్రైవేటీకరణను ప్రోత్సాహించడంతో పేద, ఆదివాసీ, దళితుల పిల్లలు విద్యకు దూరం అవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను ప్రభుత్వం భర్తీ చేయడం లేదు. పారా టీచర్ వ్యవస్థను కొనసాగించడంతో రాష్ట్రంలో వేలాది మంది జీఎస్ (గొన శిక్షక్), ఎస్ఎస్‌లు సంవత్సరాల తరబడి ఉద్యోగ పర్మినెంట్ కోసం, వేతన పెంపుదల కోసం, వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నారు. అర్హులైన లక్షలాది మంది నిరుద్యోగులు ఉపాధి కల్పన కోసం పోరాడుతున్నారు.

విద్యతోపాటు వైద్యరంగాన్ని ప్రైవేటీకరించిన ప్రభుత్వం ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో కోతలు విధిస్తూ వస్తున్నది. అట్టహాసంగా ప్రారంభించిన 'ఆరోగ్య భీమా' పథకం పూర్తిగా కార్పొరేట్ వైద్యశాలలకు ఉపయోగపడుతున్నది. ఆదివాసీ గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వం ప్రాథమిక వైద్యాన్ని కూడా పేదలకు అందించలేకపోతున్నది.

గతం నుండి ప్రభుత్వాలు అనుసరిస్తున్న దోపిడీ విధానాలు, నిర్లక్ష్యం మూలంగా వివిధ ప్రాంతాల మధ్య తీవ్రమైన అసమానతలు(అభివృద్ధిలో) పెరుగుతూ వచ్చాయి. దానితో వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి నినాదంతో చాలా కాలం నుండే దక్షిణ ఒడిశాలోని ప్రజలు, ప్రజాస్వామిక పద్ధతిలో ఆందోళనలు చేపట్టారు. అందుకు 1995లో కేబీకే (కొరాపుట్, బొలంగిరి, కలహండీ, మల్కనగిరి, నవరంగ్‌పూర్, నువాపడా, సోన్‌పూర్, రాయగడ) అభివృద్ధి పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాయి. దానికి ఆర్ఎల్‌టీఏపీ (రివైజుడ్ లాంగ్ టర్మ్ ఆక్షన్ ప్లాన్)ని రూపొందించి 7 సంవత్సరాల కాలపరిమితిని నిర్ణయించారు. 1995 నుంచి 1998 వరకు మూడు సంవత్సరాలలో కేవలం 20.40 కోట్ల రూపాయలను మాత్రమే ఖర్చు చేసారు. ఆ తర్వాత దానిని సమీక్షించి ఈ పథక కాలాన్ని మొత్తం 9 సంవత్సరాలకు పొడిగించి 5,527.41 కోట్ల (కేంద్రం 4,487.11, రాష్ట్రం 740.29)నిధులను కేటాయించాయి. అయితే 9 సంవత్సరాలు గడిచిన తర్వాత కూడా ఆ నిధులను పూర్తిగా ఖర్చు చేయలేదు. కింది నుండి పై వరకు రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు తీవ్రమైన అవినీతికి పాల్పడటంతో కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అయ్యింది. ఈ ప్రాంత అభివృద్ధి 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అన్న చందంగా మిగిలిపోయింది. కానీ ప్రభుత్వం మాత్రం 2006తో ఆ పథకం ముగిసిపోయినట్లుగా ప్రకటించింది. నేటికీ ఈ ప్రాంతం అన్ని రంగాలలో తీవ్రమైన అసమానతలనూ, వెనకబాటుతనాన్ని, కోస్తా బడా భూస్వాముల, దళారీల దోపిడీకీ, రాజకీయ ఆధిపత్యానికి గురవుతున్నది.

మల్కనగిరి జిల్లాలోని బలిమెల డ్యాం నిర్మాణం మూలంగా వందలాది గ్రామాలు, వేలాది హెక్టార్ల అటవీ, వ్యవసాయ సాగు భూములు ముంపుకుగురై, వేలాది మంది ప్రజలు నిర్వాసితులుగా మారారు. ఆ ప్రాంతమే బిచ్చినాంచల్(కటాఫ్)గా మారిపోయింది. ప్రజలకు ప్రభుత్వం ఎలాంటి ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించలేదు. పైగా ఆ ప్రాంతాన్ని దశాబ్దాలపాటు తీవ్ర నిర్లక్ష్యానికి గురి చేసింది. సీపీఐ(మావోయిస్టు) నాయకత్వంలో ఈ ప్రాంత ప్రజలు నిర్వాసిత సమస్యతోపాటు, భూమి, ఈ ప్రాంత అభివృద్ధి డిమాండ్‌లతో దశాబ్దకాలానికి పైగా పోరాడుతున్నారు. ఈ ప్రాంతంలో జరుగుతున్న సాయుధ రైతాంగ పోరాటాన్ని అణచివేయడానికి నవీన్‌ప్రభుత్వం వందకోట్ల ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించి ఆ నిధులతో రోడ్లు, బ్రిడ్జిలు, సెల్‌టవర్లు, పోలీసు క్యాంపుల నిర్మాణం చేసి, అణచివేత చర్యలను తీవ్రతరం చేసింది తప్ప, అభివృద్ధికి పాటుపడింది ఏమిలేదు. ఒడిశాలోని కొరాపుట్, ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతం కొఠియా పంచాయితీలోని 32 గ్రామాల పరిధిలో ఉన్న బంగారం, బాక్సైట్, గ్రాఫైట్ తదితర విలువైన ఖనిజ సంపదపై కన్ను వేసిన రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఆ వనరుల లూఠీకోసం సరిహద్దు సమస్యను సృష్టించాయి. ఎక్కడాలేని విధంగా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు, అన్ని డిపార్ట్‌మెంట్లు కేంద్రీకరించి పోటాపోటీగా అభివృద్ధి పేరుతో వందలకోట్ల రూపాయలు ఖర్చుచేస్తూ, రోడ్లు, పోలీస్టేషన్, సెల్‌టవర్లు, టూరిజం అభివృద్ధి, హెలిపాడ్ల నిర్మాణం, నీరు, విద్యుత్ సరఫరాలపై ఖర్చు చేస్తూ, ఈ ప్రాంతాన్ని కార్పొరేట్లకు అప్పగించాలని తాపత్రయపడుతున్నాయి.

రాష్ట్రవ్యాపితంగా ప్రజలు తమ మౌలిక, దైనంధిన సమస్యలపై ఆందోళనలకు దిగుతున్నారు. అందులో విద్య, వైద్యం, సాగు, తాగునీరు, హైకోర్టు స్థాయి బెంచ్, నూతన జిల్లాలు, నూతన బ్లాక్‌లు, పరిశ్రమల స్థాపన, రైల్వే లైన్లు, రైల్వేస్టేషన్ల నిర్మాణం, ఆదివాసీల రిజర్వేషన్ సమస్య, జంగల్ జమీన్ పట్టా, ఉపాధి కల్పన, వేతనాల పెంపు, అధిక ధరలు, ప్రభుత్వ పన్నులు తదితర సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారు. అయితే ఈ ఉద్యమాలు ప్రధానంగా రివిజనిస్టుల, గాంధేయవాదుల, ఎన్‌జీఓల నాయకత్వంలో ఆర్థికవాద ధోరణితో కొనసాగుతున్నాయి.

రాష్ట్రంలో దోపిడీ పాలకవర్గ రాజకీయ పార్టీలు నేటికీ బలమైన రాజకీయ శక్తిగానే ఉన్నాయి. అందులో అధికార బీజేడీ గ్రామస్థాయి నుండీ రాష్ట్రస్థాయి వరకు అన్ని వర్గాల ప్రజలలో పునాదిని కలిగి ఉన్నది. ఎల్‌పీజీ విధానాలు, ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందినవారినుండి ఒక నూతన మధ్య తరగతి వర్గం తయారయింది. ఈ వర్గం బీజేడీకి బలమైన సామాజిక పునాదిగా

పని చేస్తున్నారు. సంస్కరణల అమలు ద్వారా ప్రజలలో ఓటుబ్యాంకును పెంచుకున్నది. ప్రభుత్వ విధానాల రూపకల్పన, వాటి అమలులో నిరంకుశ బూర్జువావర్గం(ఉన్నత అధికారవర్గం)పై ఆధారపడే నవీన్ అందులో బలమైన శక్తులను కూడగట్టుకున్నాడు. ఒడిశా ప్రాంతీయతను సాధారణ ప్రజలలో బలంగా నెలకొల్పగలిగాడు. వ్యక్తిగత జీవితంలో ధనార్జనా, అవినీతికి దూరంగా ఉంటాడనే పేరును సంపాదించుకున్నాడు. విదేశీ, స్వదేశీ కార్పొరేట్లకూ, బడా భూస్వామ్య వర్గాలకు అనుకూలమైన పాలనా కొనసాగించడంలో సమర్థుడనే విశ్వాసాన్ని ఆ వర్గాలలో కల్పించాడు. కార్పొరేట్ మీడియా ద్వారా నవీన్ ప్రభుత్వ విధానాలను ఎత్తిపడుతూ పెద్దఎత్తున జరిగే ప్రచార ప్రభావం ప్రజలపై ఉంది. తన పార్టీ రాజకీయ భావజాలం లౌకికవాదమని ప్రకటించుకున్నప్పటికీ, హిందుత్వ అనుకూల(సాఫ్ట్)వాదిగా పని చేస్తున్నాడు. పై విషయాలన్నింటికీ తోడు ప్రతిపక్షాలు బలహీనంగా ఉండటం అనేది బీజేడీ బలం అని చెప్పుకోవచ్చు. తిరిగి మరోసారి అధికారంలోకి రావడానికి ప్రతిపక్షాలు బలపడకుండా చూడటానికి అన్ని రకాల ఎత్తులు వేస్తున్నాడు. కేంద్రంలోని బీజేపీతో పూర్తిగా శతృత్వ వైఖరిని ప్రదర్శించకుండా అనుకూలంగా వ్యవహరిస్తూనే, రాష్ట్రంలో బీజేపీ బలపడకుండా పావులు కదుపుతున్నాడు.

బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి 2019లో అన్ని రకాల శక్తీయుక్తులను ఒడ్డి ప్రయత్నించింది. కానీ నవీన్ పాలనా విధానాలపై కన్నా అది హిందుత్వ జాతీయతను ముందు పెట్టి ప్రజల్లోకి వెళ్ళింది. స్థానికంగా అది ప్రజలపై బలమైన ప్రభావాన్ని వేయలేకపోయింది. అయితే విధానసభలో గెలిచిన స్థానాలు తక్కువే అయినప్పటికీ, లోక్‌సభ స్థానాలలో దాదాపు సగం స్థానాలను గెలుచుకుంది. నవీన్‌తో పూర్తిగా శతృత్వ వైఖరిని ప్రదర్శించకుండా రాష్ట్రంలో బలపడటానికి కేంద్ర నాయకత్వం కేంద్రీకరిస్తూ నూతన నాయకత్వ శక్తులను కూడగట్టుకుంటున్నది. కాంగ్రెస్, బీజేడీ నుండి కొందరు అసమ్మతివాదులు బీజేపీలో చేరుతున్నారు.

కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రాన్ని అనేక దశాబ్దాలపాటు పాలించింది. దాని పాలనలో ప్రభుత్వం రూపొందించిన విధానాలు ఏవి ప్రజల వరకు వెళ్ళేవికావు. ప్రభుత్వ యంత్రాంగం బలహీనంగా ఉండటంతోపాటు, అవినీతితో కూడుకొని ఉండేది. కాంగ్రెస్ రాష్ట్ర పార్టీలో తీవ్రమైన అనైక్యత, కేంద్ర అధిష్టానం చేతిలో కీలుబొమ్మలుగా పని చేసే ముఖ్యమంత్రులుండటం, ప్రతి 5 సంవత్సరాల పాలనలో అనేక మంది ముఖ్యమంత్రులు మారడం, స్థిరమైన పాలనను అందించకపోవడంతో ప్రజల్లో కాంగ్రెస్‌పట్ల విముఖత, అవిశ్వాసం పెరిగింది. కాంగ్రెస్ దేశవ్యాపితంగా ఎదుర్కొంటున్న దాని సంస్థాగత సంక్షోభాన్ని నేడు ఒడిశాలో కూడా ఎదుర్కొంటున్నది. అది ప్రజల్లోకి వెళ్ళి నూతన శక్తులను కూడగట్టుకోలేక కునారిల్లిపోతున్నది.

సీపీఐ, సీపీఎమ్ లాంటి రివిజనిస్టు పార్టీలు ఉన్నప్పటికీ, అవి ఏదో ఒక బూర్జువా పార్టీకి తోకలుగా మారిపోయి, వారి పల్లకిని మోస్తున్నాయి. రాష్ట్రంలో ఒకటి, రెండు స్థానాలకు మాత్రమే పరిమితమై ఎన్నికలలో గెలుస్తున్నాయి. క్రమంగా ఆ స్థితిని కూడా కోల్పోతున్నాయి.

రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి అధికార బీజేడీ ప్రతిపక్ష బీజేపీ మధ్య ప్రధాన పోటీ నెలకొని ఉంది. సామ్రాజ్యవాద, దళారీ నిరకుంశ బూర్జువా, భూస్వామ్య వర్గాలకు సేవచేస్తూ, ప్రస్తుత అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ పార్టీలలో ఏది అధికారంలోకి వచ్చినా ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించవు. సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలను అమలుచేస్తున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో కొనసాగుతున్న బీజేడీని రాజకీయంగా ప్రధాన టార్గెట్లుగా ఎంచుకోవాలి. అదే సమయంలో ప్రతిపక్షాలుగా ఉన్న కాంగ్రెస్, రివిజనిస్టు సీపీఐ, సీపీఎమ్‌లను ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై ఆ పార్టీల వైఖరిని ప్రశ్నిస్తూ నిలదీయాలి.

జోన్‌లోని ప్రస్తుత రాజకీయ పరిస్థితిలో ప్రజలముందున్న కీలకమైన రాజకీయ కర్తవ్యం కేంద్రంలోనూ, ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాలలోను అధికారంలో కొనసాగుతున్న ప్రజావ్యతిరేక, అభివృద్ధి నిరోధక, ప్రతీఘాతుక ప్రభుత్వాలకు వ్యతిరేకంగా విశాల ప్రజలను ఐక్య ఉద్యమాలకు సిద్ధం చేయడమే. ఆంధ్రప్రదేశ్‌లో భూమి, విస్థాపన సమస్యలపై ఆదివాసీలు, రైతాంగం, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఎల్‌పీజీ విధానాలకు వ్యతిరేకంగా సంఘటిత, అసంఘటిత కార్మికవర్గం పోరాడుతున్నారు. ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి ఆందోళన బాట పట్టారు. నిరుద్యోగులు ఉపాధి కల్పన కోసం ఉద్యమిస్తున్నారు. ప్రజలు రాజధాని సమస్య రాయలసీమ, ఉత్తరాంధ్ర వెనకబాటుతనంపై, విద్యా, వైద్యం తదితర సమస్యలపై దళితులు, మహిళలు, ఆదివాసీలు, మతమైనారిటీలు తమ ప్రత్యేక సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఆందోళన చేస్తున్నారు. ఒడిశా రాష్ట్రంలో భూమి, విస్థాపన, ఎల్‌పీజీ విధానాలు, ప్రాంతాల వెనకబాటుతనం, అభివృద్ధి, విద్యా, వైద్యం, ఉపాధికల్పన, ఉద్యోగుల సమస్యలపై వివిధ వర్గాల, సెక్షన్ల ప్రజలు తమ డిమాండ్ల సాధనకై రాష్ట్రవ్యాపితంగా సమరశీలమైన పోరాటాలు చేస్తున్నారు.

## మన కార్యక్రమం

**1. రైతాంగం**

- గ్రామీణ ప్రాంతంలో కొత్త, పాత భూస్వాముల దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడాలి.
- వలసలను నివారించడంలో భాగంగా రాష్ట్రంలో ఉన్న అదనపు భూములను దళిత, రైతుకూలీ, పేద రైతాంగానికి పంచిపెట్టి నీటి పారుదల సౌకర్యం కల్పించాలి.
- రైతాంగానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సరసమైన ధరలకు ప్రభుత్వమే సరఫరా చేయాలి.
- రైతులను అప్పుల భారి నుండి రక్షించడంలో భాగంగా వడ్డీవ్యాపార దోపిడీనీ, ప్రైవేటువడ్డీ వ్యాపారాన్ని రద్దు చేయాలి.
- రైతాంగానికి 10 సంవత్సరాల వరకు వడ్డీలేని పంటఋణాలు ఇవ్వాలి.
- ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు ఆర్థిక సహకారం అందించాలి. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి.
- ప్రాజెక్టుల పేరుతో ప్రజలను నిర్వాసితులను చేయడం ఆపివేయాలి.
- ప్రత్యామ్నాయ పంటలు వేసే రైతులకు ప్రోత్సహకంగా ఆర్థిక సహకారం చేయాలి.

● రియలెస్టేట్ అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడాలి.

● ఋణమాఫీకై కల్తీ విత్తనాలకు వ్యతిరేకంగా కాంట్రాక్టు వ్యవసాయానికి వ్యతిరేకంగా పోరాడాలి.

● ప్రభుత్వరంగ సంస్థల ద్వారా వ్యవసాయోత్పత్తులను రైతులనుండి నేరుగా కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలి.

● రైతుల భూములను లాక్కొని కార్పొరేట్ శక్తులకు ధారదత్తం చేసే దుర్మార్గపు కార్యక్రమాలకు స్వస్తి చెప్పాలి.

● రైతులు తాము పండిస్తున్న పంటలను నిల్వ చేసుకొనుటకు ప్రతి మండల సెంటర్‌లో కోల్డ్‌స్టోరేజ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

● కరువులు, తుపాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులకు తక్షణమే సహాయమందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలి.

● రసాయనాల విషవలయంలో చిక్కుకున్న వ్యవసాయానికి స్వస్తిపలికి సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రత్యామ్నాయంగా అభివృద్ధి పరచాలి.

## 2. కార్మికవర్గం

◆ విశాఖస్టీల్‌ప్లాంటు, క్రిష్టపట్నంపోర్టు, గంగవరం, బందరుపోర్టు తదితర ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలి.

◆ నాల్కో, ఆర్ఎస్‌పీ, ఎన్‌టీపీసీ వంటి సంస్థలలో ఉద్యోగుల తొలగింపును నిలిపివేయాలని పోరాడాలి.

◆ యూనియన్ పెట్టుకునే హక్కు వంటి ప్రాథమిక హక్కుతో సహా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాల అమలుకై ఉద్యమించాలి.

◆ బాలకార్మిక వ్యవస్థ, వారిని అమానవీయంగా దోపిడీ, పీడనలకు గురి చేయడాన్ని వ్యతిరేకంగ పోరాడాలి.

◆ పారిశుద్ధ కార్మికులపై, తదితరులపై అమానవీయ దోపిడీ రూపాలకూ, పద్ధతులకు వ్యతిరేకంగా పోరాడాలి.

◆ యావత్ ఉత్పత్తిరంగంలో కాంట్రాక్టు కార్మికులనూ, ఔట్‌సోర్సింగ్ కార్మికులనూ, క్యాజువల్ కార్మికులను పర్మనెంట్ చేయాలి.

◆ చేనేత, చిన్నతరహా ఉత్పత్తిదారుల హక్కుల కోసం పోరాడాలి.

◆ శ్రమ ఆధారిత చిన్న, మధ్య తరహా పరిశ్రమలు నెలకొల్పాలి.

◆ నిజవేతనాల పెంపుదలతోపాటు, సమానపనికీ సమాన వేతనం కోసం ఉద్యమించాలి.

◆ అసంఘటిత కార్మికుల, వలస కార్మికుల సంక్షేమంకోసం ప్రభుత్వ పథకాలు రూపొందించి అమలు చేయాలి.

◆ ప్రమాదాలు జరిగినప్పుడు న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలి. ఆ కుటుంబంలో మరొకరికి ఉద్యోగం కల్పించాలి.

◆ కనీస వేతన చట్టాల అమలుకై ఉద్యమించాలి.

## 3. మత్స్యకారుల సమస్య

⬣ కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 'సాగరమాల' పథకానికి వ్యతిరేకంగా పోరాడాలి.

⬣ షిప్‌యార్డులు, పోర్టుల నిర్మాణాలు, ట్రాలర్స్, మరబోట్లు, కోస్టల్ కారిడార్‌ల ద్వారా విస్థాపనకు గురిచేస్తున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి.

⬣ విద్య, ఉపాధిలో రిజర్వేషన్లకోసం ఆందోళనలు చేపట్టాలి.

⬣ మత్స్యకారుల అభివృద్ధికోసం ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు రూపొందించి అమలు చేయాలి.

⬣ మరబోట్లు, ట్రాలర్స్ ద్వారా చేపలవేటను నిషేధించాలి.

⬣ చేపలవేట నిషేధ సమయంలో ఒక్కొక్క మత్స్యకారుల కుటుంబానికి నెలకు 10,000 రూపాయలు తక్కువ కాకుండా ఆర్థిక సహకారం అందించాలి.

⬣ అరెస్టయి ఇతర దేశాల జైళ్ళలో ఉన్న మత్స్యకారులను విడుదలయ్యే విధంగా ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలి.

## 4. రాజధాని సమస్య

▲ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వవస్థీకరణ-2013 చట్టంలోని హామీలను కేంద్రప్రభుత్వం నేటికీ ఏఒక్కటి అమలు చేయలేదు. గడిచిన 8 సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వాలు (టీడీపీ, వైఎస్ఆర్‌సీపీ) కేంద్రంతో అవకాశవాద పద్ధతులను అనుసరిస్తూ రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టాయి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలు రాష్ట్ర పునర్వవస్థీకరణ 2013 చట్టంలోని హామీల అమలుకై ఉద్యమించాలి.

▲ రాజధాని నిర్మాణంకోసం అధిక నిధులు కేటాయించే విధంగా కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.

▲ రాజధాని నిర్మాణం కోసం ఆందోళన చేస్తున్న ప్రజలపై అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తివేయాలి.

## 5. అసమానాభివృద్ధి

### రాయలసీమ

★ రాయలసీమ ప్రాంత అభివృద్ధి కోసం 'ప్రత్యేక ప్యాకేజీ'ని అమలు చేయాలని ఉద్యమించాలి.

★ రాయలసీమ ప్రాంతంలో వివిధ ఖనిజ, అటవీ సంపద ద్వారా వస్తున్న ఆదాయం ఆ ప్రాంత అభివృద్ధి కోసం కేటాయించాలి.

★ రాయలసీమలో కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి.

★ సాగునీరు, త్రాగునీటి కోసం ఏర్పాటు చేసిన హంద్రినీవా, తెలుగుగంగా, వెలుగొండ, గాలేరునది ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలి.

★ వైద్య, విద్యరంగానికి సంబంధించిన సంస్థలను ఏర్పాటు చేయాలి.

★ చేనేతరంగ అభివృద్ధికోసం పథకాలు రూపొందించి అమలు చేయాలి.

★ హైకోర్టును కర్నూల్‌లో ఏర్పాటు చేయాలి.

★ చిన్న, మధ్యతరహా శ్రమ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి, మెజారిటీ ప్రజలకు ఉపాధి కల్పించి వలసలను నివారించాలి.

### ఉత్తరాంధ్ర

■ ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం 'ప్రత్యేక ప్యాకేజీ' అమలు చేయాలి.

■ సాగునీటి పథకాల ద్వారా వ్యవసాయనికి సాగునీటి సౌకర్యాలు కల్పించాలి.

■ జీడిపిక్కల పరిశ్రమ, చేనేత పరిశ్రమ, కొబ్బరితోటలు, చెరుకు అభివృద్ధి, బెల్లం తయారు కేంద్రాలను ప్రభుత్వమే ఏర్పాటు చేయాలి.

■ జూట్ మిల్లులను పురుద్ధరించి దానిలో పనిచేసే కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి.

■ జాతీయస్థాయి కలిగిన వైద్య సంస్థలనూ, కిడ్నీ వ్యాధుల పరిశోధన కేంద్రాన్నీ, నార పరిశోధనా కేంద్రాన్నీ, హెూమియో వైద్య కళాశాలను శ్రీకాకుళంలో ఏర్పాటు చేయాలి.

■ జీడిమామిడికి సంబంధించిన పరిశోధన కేంద్రాన్ని టెక్కలిలో ఏర్పాటు చేయాలి.

■ విద్య, వైద్య సంస్థలను విశాఖలో కాకుండా ఇతర ఉత్తరాంధ్ర పట్టణాల్లో నెలకొల్పాలి.

■ పాడేరులో మెడికల్ కాలేజీ, పశువైద్య కళాశాల, బీఈడీ కాలేజీ ఏర్పాటు చేయాలి.

■ అరకులో ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు చేయాలి.

■ ఉత్తరాంధ్రలో మరో కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి.

■ కాఫీ, జీడి, కొబ్బరి ఇంక ఇతర చిన్నతరహా, మధ్యతరహా శ్రమ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి ఉపాధి కల్పించాలి.

■ టూరిజం పేరుతో అరకులోయ తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్న అశ్లీల, వ్యబిచార సాంస్కృతికి వ్యతిరేకంగా పోరాడాలి.

**దక్షణ కోస్తా ప్రాంతం**

ఈ ప్రాంతంలో కూడా అనేక వెనుకబడిన ప్రాంతాలు ఉ న్నాయి. ప్రకాశం జిల్లాలో గుండ్లకమ్మ ఎత్తిపోతల ప్రాజెక్టు, గుంటూరు జిల్లా, పల్నాడు ప్రాంతంలో దమ్మర్లగొంది ఎత్తిపోతల ప్రాజెక్టు వంటి వాటితోపాటు ఇతర ప్రాంతాల్లో కూడా అభివృద్ధి పనులు చేపట్టాలి.

**ఒడిశా**

⬣ కేబీకే (కోరాపుట్, బొలంగిరి, కలహండీ, మల్కనగిరి, నవ్‌రంగపూర్, నువపడ, సోనాపూర్, రాయ్‌గఢ) ప్రాంత అభివృద్ధి కోసం ప్రత్యేక ప్యాకేజిని ప్రకటించి అమలు చేయాలి.

⬣ అంతరాష్ట్ర నదీ జలాల సమస్య, సరిహద్దు ప్రాంతాల సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలి.

## 6. ఆదివాసీలు

▲ ఆదివాసీ ప్రాంతాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలి.

▲ గ్రామసభలు నిర్వహించి ప్రజల అభిప్రాయ సేకరణతోనే పనులు చేపట్టాలి.

▲ పెసా చట్టం, 5వ, 6వ షెడ్యూల్‌లనూ, 1/70 (ఏపీ), 1/56 (ఓఎస్) చట్టాలను ఖచ్చితంగా అమలు చేయాలి.

▲ ఆదివాసులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి.

▲ కొండరెడ్లు, నూకదొరలు, దుర్వ (ఒడిశాలో)లకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలి.

▲ రిజర్వేషన్లలో ఆదివాసీల కోట ప్రస్తుతం ఉన్న 7 శాతాన్ని 11 శాతానికి పెంచాలి.

▲ 2006 అటవీహక్కులచట్టం ప్రకారం లబ్దిదారులకు పట్టాలు ఇవ్వాలి.

▲ రాష్ట్ర, కేంద్ర, ఆదివాసీ ప్రభుత్వ యూనివర్సిటీలను ఏర్పాటు చేయాలి.

▲ జల్, జంగల్, జమీన్, ఆత్మగౌరవం, అధికారం నినాదంతో పోరాటాన్ని కొనసాగించాలి.

▲ ఆదివాసీ ప్రాంతాలలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

▲ అటవీ ఉత్పత్తులపై ఆదివాసులకు హక్కు కల్పించాలి.

▲ ఐటీడీఏలకు నిధులు ఎక్కువగా కేటాయించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి.

▲ కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నూతన అటవీ సంరక్షణ నియమాలను రద్దు చేయాలి.

▲ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసులను నిర్వాసితులను చేసే అన్నిరకాల విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి. నిర్వాసితులైన ఆదివాసులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలి.

▲ రైతులు పండించిన పంటలకు, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరకై పోరాడాలి.

▲ గ్రామసభల అనుమతి లేకుండా గ్రామాలలో పోలీసు క్యాంపులు పెట్టరాదు. ఇప్పటివరకు పెట్టిన క్యాంపులను ఎత్తివేయాలి.

▲ బినామి పేర్లతో బాక్సైట్ తవ్వకాలను తవ్వితీసే 89 జీవోకు వ్యతిరేకంగా పోరాడాలి.

▲ ఆదివాసీ మహిళలపై పోలీసు పారా మిలటరీ బలగాలు చేసిన అత్యాచారాలపై న్యాయవిచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

▲ ఆదివాసీలను హిందువులుగా రికార్డు చేసే ప్రభుత్వ కుట్రలను ఎండగట్టాలి.

## 7. దళిత సమస్య

● దళితులు తమ అస్థిత్వం కోసం, ఆత్మగౌరవం కోసం జరుపుతున్న పోరాటాలను బలపర్చాలి.

● కులవివక్ష, సాంఘీక అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడాలి.

● మనిషి ద్వారా చేసే పారిశుద్ధ్యాన్ని నిర్మూలించేందుకు పోరాడాలి.

● రిజర్వేషన్ విధానం సక్రమంగా అమలు చేయాలి. దళితుల్లో వర్గీకరణను బలపర్చాలి.

● దళితులపై కులదురహంకారులు చేసే అన్ని రకాల దాడులను వ్యతిరేకించాలి.

## 8. మైనార్టీలు

● ముస్లీంలు, క్రిష్టియన్‌లపై హిందుమతోన్మాదులు చేసే దాడులను వ్యతిరేకించాలి.

● పేద ముస్లింలకు విద్య, ప్రభుత్వరంగాల్లో 4 శాతం రిజర్వేషన్లను కల్పించాలి.

● సీఏఏ, ఎన్ఆర్సీ, ఎన్పీఆర్ చట్టాలను రద్దు చేయాలి.

● వక్ఫ్‌బోర్డు ఆస్తులకు రక్షణ కల్పించాలి.

● ఉర్దు పత్రికను ప్రభుత్వం ప్రోత్సహించాలి.

● సచార్ కమిటీ నివేదిక అమలు కోసం పోరాడాలి.

**9. మహిళా సమస్య**

☆ మహిళలపై అమలు జరుగుతున్న (తెగ, ఫ్యూడల్, పెట్టుబడిదారి) అన్ని రకాల పితృస్వామిక, దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడాలి.

☆ మహిళలకు సమాన హక్కుల కోసం పోరాడాలి.

☆ లింగభేదంతో నిమితం లేకుండా సమానపనికి సమానవేతనం కోసం పోరాడాలి.

☆ మహిళలపై జరుగుతున్న పరువు హత్యలు, హింస, వివక్ష, ప్రేమోన్మాద దాడులు, లైంగిక వేధింపులు, వరకట్న హత్యలను ఖండించాలి.

☆ అశ్లీల సాహిత్యానికీ, సామ్రాజ్యవాద విషసంస్కృతికి వ్యతిరేకంగా, స్త్రీని విలాస వస్తువుగా చూపెడుతున్న వ్యాపార ప్రకటనలకు వ్యతిరేకంగా, వివిధ రకాలుగా మహిళలపై జరుగుతున్న హింసలకూ, వేధింపులకు వ్యతిరేకంగా పోరాడాలి.

☆ మహిళలపై పని స్థలాల్లో జరుగుతున్న వివిధ రకాల వేధింపులకూ, అత్యాచారాలకూ, హింసలకు వ్యతిరేకంగా పోరాడాలి.

☆ బాల్య వివాహాలు, బహుభార్యత్వానికి వ్యతిరేకంగా పోరాడాలి.

☆ మహిళలలో కులాంతర, మతాంతర, ప్రేమ వివాహాలను ప్రోత్సహించాలి.

**10. విద్య**

▲ విద్య 'కార్పొరేటీకరణ'కు వ్యతిరేకంగా ఉద్యమించాలి.

▲ విద్యార్థి సమస్యల పరిష్కారానికై ఉద్యమించాలి.

▲ మతృభాషలోనే ప్రాథమిక విద్యాభోదన జరగాలి. ఆ పై తరగతులలో ఆంగ్ల మాధ్యమాన్ని రెండవ భాషగా చేర్చాలి.

▲ విద్యను కాషాయీకరణ చేయడాన్ని వ్యతిరేకించాలి.

▲ ఫీజు రియంబర్స్‌మెంట్‌ను అమలు చేయాలి.

▲ హస్టల్ వసతి సౌకర్యాలు కల్పించాలి.

▲ కామన్‌స్కూల్ విద్యావిధానానికై పోరాడాలి.

▲ ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలను పునరుద్దరించాలి. పిల్లలు చదువుకునేందుకు మౌలిక సౌకర్యాలు కల్పించాలి.

▲ పాఠశాలల్లో, కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.

▲ శాస్త్రీయ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టాలి.

▲ కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 'జాతీయ నూతన విద్యావిధానం' అమలుకు వ్యతిరేకంగా పోరాడాలి.

ప్రైవేట్‌స్కూల్స్‌లో, ప్రైవేట్ కాలేజీలలో రిజర్వేషన్ విధానం అమలు కోసం పోరాడాలి.

▲ ఆన్‌లైన్ విద్య ద్వారా పేద, మధ్య తరగతి విద్యార్థులను విద్యకు దూరం చేసే ప్రభుత్వ కుట్రలకు వ్యతిరేకంగా పోరాడాలి.

▲ ప్రాథమిక పాఠశాలలను హైస్కూళ్ళలో విలీనం చేసే ప్రభుత్వ కుట్రలను ఎండగట్టాలి.

**11. వైద్యం**

● వైద్యం 'ప్రైవేటీకరణ'కు వ్యతిరేకంగా పోరాడాలి.

● పేద, మధ్య తరగతి ప్రజలందరికీ ప్రభుత్వం ఉచితంగా వైద్య సదుపాయాలు కల్పించాలి. ● కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం రేట్లు తగ్గించాలి.

● కార్పొరేట్ హాస్పత్రుల్లో అధిక బిల్లుల వసూళ్ళకు వ్యతిరేకంగా పోరాడాలి.

● గ్రామీణ ప్రాంతంలో ప్రతి పంచాయితీ సెంటర్‌లో ప్రభుత్వ ఆసుపత్రిని నెలకొల్పాలి.

● కాంట్రాక్టు హెల్త్ వర్కర్స్ నర్సులను పర్మినెంట్ చేయాలి.

**12. నిరుద్యోగం**

▫ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.

▫ నిరుద్యోగ యువతీ, యువకులకు నిరుద్యోగ బృతిని కల్పించాలి.

▫ నిరుద్యోగ సమస్యలపై పోరాటాలు నిర్వహించాలి.

▫ కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన 'అగ్నిపథ్' పథకానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి.

**13. పౌర, ప్రజాస్వామిక హక్కులు**

◇ ఎన్ఐఏ దాడులను ఆపాలి. ఉపా చట్టాన్నీ, రాజద్రోహ తదితర ఫాసిస్టు చట్టాలను రద్దు చేయాలి.

◇ అక్రమంగా అరెస్టు చేసి జైళ్ళలో పెట్టిన ఉద్యమకారులను బేషరతుగా విడుదల చేయాలి.

◇ పౌర, ప్రజాస్వామిక హక్కులకు గ్యారంటీ ఇవ్వాలి. ప్రజలకు సభలు, సమావేశాలు పెట్టుకునే స్వేచ్ఛ ఉండాలి.

◇ పౌర, ప్రజాస్వామిక శక్తులపై హిందూమతోన్మాద దాడులకు వ్యతిరేకంగా పోరాడాలి.

**14. నిర్వాసిత సమస్య**

☆ ప్రాజెక్టులు, గనులు, టూరిజం పేరుతో ప్రజలను నిర్వాసితులను చేయడం ఆపివేయాలి.

☆ విస్థాపనకు గురైన ఆదివాసీలు, రైతులు, మత్స్యకారులకు పునరావాసం కల్పించి చట్టబద్దంగా నష్టపరిహారం చెల్లించాలి.

☆ పోలీసు క్యాంపులు, ఫైరింగ్ జోన్స్, విమానాశ్రయాలు, అభయారణ్యాలు, టూరిజం, స్మార్ట్‌సిటీలు, కోస్టల్ కారిడార్, భూ బ్యాంకులు, హైవేలు, డ్యాం నిర్మాణాలు, రియలెస్టేట్ తదితర పేర్లతో ప్రజల భూములను ధౌర్జన్యంగా లాక్కుంటున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి.

☆ విస్థాపనకు వ్యతిరేకంగ జరుగుతున్న అన్ని రకాల పోరాటాలను సమర్థించాలి.

★ కొరియా ప్రాంతంలోని విలువైన ఖనిజ సంపదను లూటీ చేసి, ప్రజలను నిర్వాసితులను చేయడానికి కుట్రపన్నుతున్న ఆంధ్ర, ఒడిశా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి.

### 15. ఉద్యోగులు

- ఏపీలో సీపీఎస్‌ను రద్దు చేస్తూ పీఆర్‌సీ, ఫిట్‌మెంట్, ఐఆర్, హెచ్‌ఆర్‌సీల అమలుకై ఉద్యమించాలి.
- ఓఎస్‌లో పారా టీచర్స్‌ను పర్మినెంట్ చేసి వేతనాలు పెంచాలి.
- ప్రైవేటు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఉపాధ్యాయ వేతనాల పెంపు, ఉద్యోగ భద్రతకై ఉద్యమించాలి.

### 16. పర్యావరణం

- సామ్రాజ్యవాద అనుకూల ఎల్‌పీజీ విధానాలను అమలు చేయడం ద్వారా పర్యావరణ విధ్వంసానికి పాల్పడుతున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి.

దేశంలో 75 ఏళ్ళుగా అమలవుతున్న అర్ధవలస-అర్ధభూస్వామ్య విధానాల మూలంగా దాదాపు గత 55 సంవత్సరాలుగా మన పార్టీ నాయకత్వంలో జరుగుతున్న వర్గపోరాట ప్రభావంరీత్యా, ప్రత్యేకంగా 3 దశాబ్దాలుగా అమలవుతున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల ఫలితంగా దేశవ్యాపితంగా అర్ధభూస్వామ్యం సాపేక్షికంగా బలహీనపడింది. వక్రీకరించబడిన పెట్టుబడిదారీ సంబంధాలు సాపేక్షికంగా పెరిగాయి. దేశంలో గత 75 సంవత్సరాలలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, పర్యావరణ తదితర అంశాలలో పలు గణనీయమైన మార్పులు వచ్చాయి. అయినప్పటికీ నేటి అర్ధవలస-అర్ధభూస్వామ్య వ్యవస్థ వర్గ సంబంధాలలో ప్రధానంగా మౌలికమార్పేమి జరగలేదు. భారత విప్లవ స్వభావంలో మౌలిక మార్పేమి ఉండదు. అయితే ప్రస్తుత నిర్దిష్ట సామాజిక పరిస్థితులకనుగుణంగా వర్గపోరాట కార్యక్రమాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉంది.

రెండు రాష్ట్రాలతో కూడుకొని ఉన్న ఏఓబీ జోన్‌లో నేడు వర్గ వైరుధ్యాలు దినదినం మరింత తీవ్రతరమవుతున్నాయి. ప్రజలు, భూమి, నిర్వాసిత, ఎల్‌పీజీ విధానాలు, నిరుద్యోగం, ప్రజాస్వామ్యం, వివిధ సామాజిక సముదాయాలు ప్రత్యేక సమస్యలను ఎదుర్కొంటున్నాయి. దేశంలో నూటికి 65 శాతం మంది ప్రజల సమస్య నేటికీ భూమితోనే ముడిపడి ఉంది. అందులో నూటికి 80 శాతం పేద రైతులు, వ్యవసాయ కూలీలకు దున్నుకోవడానికి భూమిలేదు. అయితే గతంలోలాగా భూమి మొత్తం భూస్వాముల చేతిలోనే కాకుండా నేడు పాత, కొత్త భూస్వాములు, కార్పొరేట్ సంస్థలు, ప్రభుత్వం, రియలెస్టేట్ వ్యాపారం, టూరిజం, ఫామ్‌హౌజ్‌లు, ఎన్ఆర్ఐలు, కోస్టల్ కారిడార్‌లు, అంతర్జాతీయ విమానాశ్రయాలు, హైవేరోడ్లు, పట్టణీకరణ తదితరాల పేరిట భూములు ఆక్రమించబడుతున్నాయి. గ్రామీణ ప్రాంతంలో భూమిలేని వ్యవసాయ కూలీ, పేదల సంఖ్య నానాటికి పెరుగుతున్నది. కనుక ఈ సమస్యకు 'దున్నేవారికే భూమి' ప్రాతిపదికన వ్యవసాయక విప్లవమే పరిష్కారం. వర్గపోరాటం తాకిడికి దెబ్బతిన్న పాత భూస్వాములు వేరు వేరు రంగాలలోకి ప్రవేశించినప్పటికీ, తమ రాజకీయ ఆధిపత్యాన్ని మళ్ళీ పునరుద్ధరించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కొత్త భూస్వాములు, బడా కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులు, పంచాయితీ వ్యవస్థ, మతం, పాత తెగ వ్యవస్థ, ఎన్‌జీఓలు, పోలీసు వ్యవస్థను బలోపేతం చేసి వారి మద్దతుతో నూతన తరహా భూస్వామ్య వ్యవస్థ కూటమిగా ఏర్పడి ప్రజలను అన్ని రకాలుగా దోపిడీ పీడనలకు గురి చేస్తూ, గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయక విప్లవాన్ని అడ్డుకుంటున్నారు. ఈ ముఠానే ప్రస్తుత అర్ధవలస-అర్ధభూస్వామ్యాన్ని పరిరక్షించడానికి పునాదిగా పని చేస్తూ, సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బడా బూర్జువా, భూస్వాముల ప్రయోజనాలను కాపాడుతున్నారు. ఈ ముఠాను దెబ్బతీయకుండా ప్రస్తుత ఈ దోపిడీ వ్యవస్థను ధ్వంసం చేయలేము. అందుకు అనుగుణంగా వర్గపోరాటాన్ని తీవ్రతరం చేయాలి.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను అమలు చేయడానికి దేశంలోని దళారీ పాలకులు పూనుకోవడంతో ఆర్థికంగా, రాజకీయంగా, పరాధీనస్థితిని ఎదుర్కొంటున్నది. అనేక ప్రభుత్వరంగ పరిశ్రమలు ప్రైవేటీకరించబడ్డాయి, మూసివేతకు గురయ్యాయి. దానితో కార్మికవర్గం ఉపాధిని కోల్పోతున్నది. వక్రీకరించబడిన పెట్టుబడిదారి సంబంధాలు, అసంఘటిత, వలస, కార్మికవర్గాన్ని పెంచాయి. వారికి ఎలాంటి ఉద్యోగ భద్రత, హక్కులు లేవు. సంఘటిత, అసంఘటిత కార్మికవర్గాన్ని సంఘటితం చేసి, ఎల్‌పీజీ విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలకు నాయకత్వం వహించాలి.

'నయాభారత్' నిర్మాణం పేరుతో బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు విధానాల అమలు వేగవంతం తీవ్రతరమవుతున్నది. దానితో సమాజంలోని అన్ని వ్యవస్థలు ఫాసిజం ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. దేశంలోని అన్ని పీడితవర్గాల, సెక్షన్‌ల ప్రజలను సమీకరించి బలమైన రాజకీయ ఉద్యమం నిర్మించాలి. దేశం ఎదుర్కొంటున్న మరో ముఖ్యమైన సమస్య నిరుద్యోగం. ఈ సమస్య పరిష్కారం కోసం విద్యార్థులనూ, యువజనులను సమీకరించి కేంద్ర, రాష్ట్ర ఎల్‌పీజీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి. స్వావలంబనతో కూడిన అభివృద్ధి, ప్రజలకు నిజమైన ప్రజాస్వామ్యం కోసం విశాల ప్రజలను సమీకరించి సమరశీల ఉద్యమాలు నిర్మించాలి. ఆదివాసీలు, దళితులు, మహిళలు, మతమైనారిటీలను కూడగట్టి వారి సమస్యలపై పోరాటాలకు నాయకత్వం వహించాలి.

పై ఈ కార్యక్రమం గరిష్ట కార్యక్రమంగా ఉంటుంది. ఈ కార్యక్రమాన్ని కనీస కార్యక్రమంతో అనుసందానించుకొని ప్రస్తుత రాజకీయ పరిస్థితిని వినియోగించుకొని జోన్‌లో తాత్కాలిక వెనుకపట్టులో ఉన్న విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకొని పోవాలి. ఈ కనీస కార్యక్రమంపై కలిసివచ్చే అన్నివర్గాల పీడిత ప్రజలు, సామాజిక సముదాయాలు, ప్రజాపక్షం వహించే ప్రజాస్వామికవాదులు, ప్రగతిశీలశక్తులు, నిజమైన దేశభక్తులు, సంస్థలు, పార్టీలను కలుపుకొని విశాల ఐక్యసంఘటనను ఏర్పర్చి సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్యవర్గ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి. ఈ పోరాటాల లక్ష్యం ప్రజలను రాజకీయంగా చైతన్యపరుస్తూ, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసేదిగా కొనసాగాలని కోరుతున్నాం. ✹

*కామ్రేడ్స్! బోల్షివిక్ పత్రికపై మీ విలువైన సూచనలూ, సలహాలూ, అభిప్రాయాలను తెలియజేస్తారని కోరుతూ ... సంపాదకులు*

# కొఠియా ప్రాంతంలో నిక్షిప్తమై ఉన్న వనరులపై కన్ను వేసిన ఆంధ్రా-ఒడిశా ప్రభుత్వాలు

ఆంధ్రా-ఒడిశా సరిహద్దు వివాదస్పద కొఠియా ప్రాంతంలో రెండు రాష్ట్రాలకు సంబంధించిన ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు గత కొద్దికాలంగా విస్తృతంగా పర్యటనలు చేపడుతున్నారు. ఆ ప్రాంతంలో ఉన్న 34 ఆదివాసీ గ్రామాల ప్రజలపై అమితమైన ప్రేమను ఒలకబోస్తూ అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నారు. ప్రజలకు ఏమి కావాలో అన్ని సమకూర్చుతామని ప్రకటించడం, నిరంతరం ఆయా గ్రామాలలో పర్యటించి ప్రజల అవసరాలను ముందు తామే గుర్తించి పరిష్కరిస్తున్నట్లు ఫోజులు పెడుతున్నారు. గతంలో "మా సమస్యలు పరిష్కరించండి బాబోయ్" అంటూ రాజకీయ నాయకుల, సంబంధిత అధికారుల కాళ్ళు, వేళ్ళు పట్టుకొని బ్రతిమిలాడి చివరకు లంచం ఇస్తే తప్ప, మంచం దిగనివాళ్ళు నేడు రాత్రింబవళ్ళు అనే తేడా లేకుండా అన్ని శాఖల అధికారులు ఆయా గ్రామాలకు వెళ్ళి ప్రజలకు ఏమి కావాలో అడిగి తెలుసుకుంటున్నారు. తమ రాష్ట్ర ప్రభుత్వ పథకాలు చాలా గొప్పవనీ, వాటిని అందిపుచ్చుకొని అభివృద్ధి సాధించాలనీ రెండు రాష్ట్రాల అధికారులు ఆయా గ్రామాలలో పర్యటించి పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. ఇక రాజకీయ నాయకులకైతే ప్రజలపై ప్రేమ టన్నులకొలది పుట్టుకొస్తున్నది. సంబంధంలేని వరుసలతో ఈ ప్రాంత "ప్రజలు మా కన్నబిడ్డల్లాంటివాళ్ళు, వారి అభివృద్ధికే మేము అంకితమ'ని డైలాగ్‌లతో సినియాక్టర్స్‌ను మించిపోయే విధంగా తమ అద్భుతమైన నటనను ప్రదర్శిస్తూ రక్తికట్టిస్తున్నారు. ఈ ప్రాంత ప్రజలను తమకు అనుకూలంగా మలుచుకోవడానికి రెండు రాష్ట్రాలకు సంబంధించిన అధికారులు, రాజకీయ నాయకులు అనేక కార్యక్రమాలను ప్లాన్ చేసుకొని నిరంతరం ఆ ప్రాంతంలో పర్యటించడం నేడు సర్వసాధారణంగా మారిపోయింది.

భారతదేశంలో అధికార మార్పిడి జరిగి నేటికీ 75 సంవత్సరాలు పూర్తి చేసుకొని 'ఆజాదీకా అమృత్ మహోత్సావ్' పేరుతో పెద్ద ఎత్తున పండుగలు చేసుకుంటున్న ఈ దేశ పాలకులకు నిన్నటి వరకు ఆ ప్రాంత ప్రజలనుగానీ, వాళ్ళ జీవన పరిస్థితి గురించిగాని ఎటువంటి పట్టింపులు లేక తీవ్ర నిర్లక్ష్యం వహించినవాళ్ళు, నేడు తమ వర్గ స్వభావానికి భిన్నంగా ఆయా ప్రాంతాలలో పర్యటించి ఆ ప్రాంతాన్ని స్వర్గధామంగా చేసి, ప్రజలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోతామని నమ్మబలకడం వెనుక ఏమి గూడుపుఠాని జరుగుతుందనేది జాగ్రత్తగా పరిశీలించాలి. తరతరాలుగా ఈ ప్రాంత అభివృద్ధిపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాలకవర్గాలు ఇప్పుడు హఠాత్తుగా ఎందుకు ఇంత ప్రేమగా వ్యవహరిస్తున్నారనేది పరిశీలించినప్పుడు, ఈ ప్రాంతంలో అపారమైన ప్రాకృతిక, ఖనిజ సంపదలున్నాయని వివిధ సర్వేలలో బయటపడటంతో వాటిని కాజేయడంలో భాగంగా ముందుగా ఈ ప్రాంత ప్రజలను తమకు అనుకూలంగా మార్చుకొని, తర్వాత వాళ్ళను ఖాళీ చేయించి నిర్వాసితులను గావించి, ఈ ప్రాంత వనరులను దోచుకుపోవడానికి గత 64 సంవత్సరాలుగా ఆంధ్రా-ఒడిశా రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడుతున్నాయి.

***ముందుగా ఈ ప్రాంత ఆర్థిక, సాంఘీక, రాజకీయ, సామాజిక పరిస్థితిని అర్థం చేసుకుందాం.***

ఒడిశా రాష్ట్రం, కొరాపుట్ జిల్లా హెడ్‌క్వార్టర్ నుండి 46 కిలోమీటర్లు, ఆంధ్రరాష్ట్రం, పార్వతీపురం మన్యం జిల్లా హెడ్‌క్వాటర్స్ నుండి 64 కిలోమీటర్ల మధ్యన 148 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఎత్తైన దేవమాలి పర్వాతానికి అందుబాటులో ఈ వివాదస్పద ప్రాంతం ఉంది. ఈ ప్రాంతంలో వేగావతి, చంపావతి, బోదురుగడ్డ లాంటి జీవనదులతోపాటు, అనేక నీటి పాయలు నిత్యం ప్రవహిస్తూ, కొండ దిగువ ప్రాంతంలో ఉన్న వేలాది ఎకరాల భూములకు సాగునీటితోపాటు, అనేక గ్రామాలకు త్రాగునీరు అందిస్తున్నాయి. కొండ దిగువులో ఉన్న రైతాంగం ఈ నీటి వనరులపై ఆధారపడి రెండు పంటలు పండిస్తున్నారు. ఈ ప్రాంతంలో 2011 లెక్కల ప్రకారం 2,400 ఇళ్ళు, 10,000 మంది జనాభా ఉంది. వీరిలో పురుషులు 4,876(48.45%), మహిళలు 5,187(51.5.5%), పిల్లలు 1,953 మంది ఉన్నారు. ఈ మొత్తం జనాభాలో 89.19% మంది ఆదివాసీలు కాగా, దళితులు 1.74%, ఇతరులు 9.07% ఉన్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. వీరిలో అత్యంత వెనుకబడి ఉన్న కువ్వి ఆదివాసీలు 5,000 వరకు ఉండగా, రాణా, కొఠియా, దొర తదితర ఇతర ఆదివాసీ ప్రజలు మరో 5,000 మందికి పైగా జీవిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఈ సంఖ్య 15,000 మంది జనాభా వరకు ఉండవచ్చునని తాజా ప్రభుత్వ గణాంకాలు తెలియజేస్తున్నాయి. విభిన్న తెగల సాంస్కృతి, సాంప్రదాయాలు, పండుగలతోపాటు, వివిధ రకాల భాషలు, యాసలతో అత్యంత వైవిధ్యభరితంగా ఆ ప్రాంతం ఉంటుంది. 90% మంది ప్రజలు కొండపోడు మీద ఆధారపడి జీవిస్తున్నవారే. ఎత్తైన కొండల ప్రాంతం కావడంతో ఈ ప్రాంతం అత్యంత చల్లదనంగా ఉంటుంది. అందుకే దీనికి అందుబాటులో ఉన్న దేవమాలి కొండను ఒడిశా ప్రభుత్వం పర్యాటకకేంద్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించి ఆ కొండలపైనున్న మెజారిటీ గ్రామాలను ధౌర్జన్యంగా తరిమివేసి, అనేక 'యూ' పాయింట్స్ నిర్మాణం చేసింది. ఈ ప్రాంతంలో విలువైన అటవీ సంపదతోపాటు, అనేక వనమూలికల చెట్లు, మొక్కలు విస్తారంగా లభిస్తాయి. అందుకే అనేక ప్రాంతాల నుండి ప్రజలు వచ్చి వాటిని సేకరించుకొని పోతుంటారు. ఈ ప్రాంతంలో బంగారం, ప్లాటీనియం, మాంగనీస్, బాక్సైట్, గ్రాఫైట్, లైమ్‌స్టోన్, రంగురాళ్ళు తదితర విలువైన ఖనిజ సంపద పెద్దఎత్తన ఉన్నట్లు వివిధ సర్వేలల్లో బయటపడింది.

వీటితోపాటు నిత్యం ప్రవహించే జలపాతాలు ఈ ప్రాంతం సొంతమని చెప్పాలి.

పైన చెప్పిన సకల సంపదలు కల్గిన ఈ ప్రాంతం గత బ్రిటీష్ పాలకుల దగ్గర నుండి నేటి భారత పాలకవర్గాల వరకు అనేక దశాబ్దాలుగా తీవ్రమైన నిర్లక్ష్యానికి గురవుతూ వస్తుంది. అపారమైన నీటి వనరులు ఈ ప్రాంతంలో ఉన్నప్పటికీ, వాటిని వినియోగించే విధంగా ప్రభుత్వాలు శ్రద్ధ కనబర్చకపోవడంతో ఆ నీరు వృధాగా క్రింది ప్రాంతాలకు పోతుంది. భూములను చదును చేయడం, ఆ భూములుకు నీటి పారుదల సదుపాయం కల్పించగలిగితే ఈ ప్రాంతంలో వేసవికాలంలో కూడా బంగారం లాంటి పంటలు పండించవచ్చు. సరైన ప్రభుత్వ సహకారం లేకపోవడంతో ప్రజలే తమ శ్రమశక్తిని ధారపోసి కొన్ని పొలాలను తయారు చేసుకొని వాటి ద్వారా ఆరకొర పంటలను పండించుకుంటున్నారు. ప్రధానంగా ఈ ప్రాంతంలో మెట్ట పంటలైన జొన్నలు, రాగులు, సజ్జలు, కందులు, పసుపు, సామలు, ఊదలు తదితర పంటలపై ప్రధానంగా ఆధారపడి జీవిస్తున్నారు. వీటితోపాటు, అడవిలో దొరికే చింతపండు, అడ్డాకులు, కొండచీపుర్లు, ఉసిరికాయలు సేకరించి వాటిని సుదూర ప్రాంతాలకు తీసుకొనిపోయి అమ్మడం ద్వారా కొంత ఆదాయాన్ని పొందగల్గుతున్నారు. ఉన్న నీటి వనరులను ఉపయోగించుకొని కొన్ని గ్రామాలలో కూరగాయలు, అల్లం, మిరప తదితర పంటలు పండించి అందుబాటులో ఉన్న సంతలు, బ్లాక్ సెంటర్స్‌కు తీసుకుపోయి అమ్ముకుంటున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, అడవి జంతువుల బారి నుండి పగలు, రాత్రనక కాపలాకాస్తూ, పండించిన అరకొర పంటలకు వడ్డీ వ్యాపారుల దోపిడీ, మరోవైపు సంతల్లో దళారుల, షావుకార్ల మోసాలు, పండిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో నేటికీ ఆ ప్రాంతంలో ప్రజలు కటిక పేదరికాన్ని అనుభవిస్తున్నారు. పండిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలనీ, పంటను చెడిపోకుండా నిలువ చేసుకునేందుకు శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలనీ, సంతల్లో వసూళ్ళు చేసే ఆశీలు బంద్ చేయాలనీ, రౌడీల ధౌర్జన్యం అరికట్టాలని కొరాపుట్ జిల్లా, పొట్టంగి బ్లాక్ సెంటర్ నుండి కుందిలి గ్రామం వరకు 2012లో 6000 మందికి పైగా రైతాంగం ర్యాలీ, ధర్నా నిర్వహించి సంబంధిత అధికారులకు డిమాండ్ పత్రాలు అందజేసినా, 'దున్నపోతు మీద వర్షం పడ్డ' చందంగా ఏ ప్రభుత్వ అధికారులు గానీ, రాజకీయ నాయకులు గాని స్పందించలేదు. ఒకవైపు రోజు రోజుకు పెరిగిపోతున్న నిత్యవసర సరుకుల ధరలు, అరకొరగా పండుతున్న పంటలకు గిట్టుబాటుధర లేకపోవడంతో బ్రతుకు బారంగా మారింది. అందుకే ఈ ప్రాంతం నుండి ప్రజలు నిరంతరం వలసలు పోతుంటారు. వలసలు పోయినప్పటికీ అక్కడ కూడా వీళ్ళు యజమానుల, దళారుల దోపిడీ, ధౌర్జన్యాలకు గురవుతూనే ఉన్నారు. వలసలు పోయిన ఎంతోమంది మహిళలపై పని స్థలాలలో అత్యాచారాలకు గురికావడం పరిపాటిగా మారిపోయింది. నేటికి ఈ ప్రాంత ప్రజల పరిస్థితి "ముందుకుపోతే నుయ్యి, వెనుకకుపోతే గొయ్యి" అన్న చందంగా కొనసాగుతుందని చెప్పడం అతిశయోక్తి కాదు.

ఈ ప్రాంత ప్రజలకు వైద్యం అందని ద్రాక్షే అని చెప్పాలి. వందలాది మంది ప్రజలు మలేరియా, టైఫాయిడ్, క్షయవ్యాధి, చర్మవ్యాధులు తదితర రోగాల బారినపడి నిత్యం బాధపడుతున్నారు. సీజనల్ వ్యాధుల మూలంగా పదుల సంఖ్యల్లో మరణాలు సంభవిస్తున్నాయి. ఈ ప్రాంతంలో రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఎటువంటి త్రాగునీటి సదుపాయాలు కల్పించకపోవడంతో, కాలువలలో పారే కలుషితమైన నీరునే తాగుతూ అనేక అనారోగ్యాలకు గురవుతున్నారు. వర్షాకాలం ఈ సమస్య మరింత సీరియస్‌గా ఉంటుంది. ఈ కాలంలో కలరా, మలేరియా, డయేరియా లాంటి వ్యాదులకు గురై అనేక మంది ప్రజలు మరణాలు సంభవిస్తున్నాయి. అన్ని రంగాలలో భారతదేశం అభివృద్ధిపథంలో దూసుకుపోతుందని పాలకవర్గాలు గొప్పలు చెప్పుకుంటున్నాయి. కానీ ఆ అభివృద్ధి ఫలాలు ఎవరికి దక్కుతున్నాయనేది జగమెరిగిన సత్యమే. అధికార మార్పిడి జరిగి నేటికీ 75 సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఒక కొఠియా గ్రామంలో తప్ప మరెక్కడా హాస్పిటల్ నిర్మాణాలు చేపట్టలేదు. కొఠియా ఆసుపత్రిలో కూడా వైద్యులు, మందులు అందుబాటులో ఉండవు. చాలా సందర్భాలలో ప్రజలు వెళ్ళి ఎటువంటి వైద్య సదుపాయం పొందక నిరాశగా తిరిగి వచ్చిన ఘటనలు కోకొల్లలు. రెండు రాష్ట్రాల నుంచి ఏఎన్ఎమ్, ఆశాదీదీ లాంటివాళ్ళు ఆ ప్రాంతం కోసం కేటాయించబడినప్పటికీ, వాళ్ళు ఆ ప్రాంతానికి పోయి ప్రజలకు వైద్యం అందించిన సందర్భాలు అత్యంత స్వల్పమనే చెప్పాలి. దాంతో వైద్యంకోసం సుదూర ప్రాంతాలకు పోయి, వేలకొలది రూపాయలు ఖర్చుపెట్టి వైద్యసదుపాయం పొందాల్సిన అవసరం ఏర్పడుతుంది. అందుకే నేటికీ ఈ ప్రాంతంలో ప్రజలు చెట్లమందులు, భూత వైద్యులను ఆశ్రయిస్తూ, అనేక మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. సరైన పోషకాహారంలేని కారణంగా అనేక మంది చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీల మరణాలు కూడా ఈ ప్రాంతంలో ఎక్కువగానే నమోదవుతున్నాయి. కొఠియాలో డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది, మందులు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు అనేక సందర్భాలలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినప్పటికీ,పెడచెవిన పెట్టాయి. నేటికీ ఈ విషయంలో పెద్దమార్పు కనిపించడం లేదు.

ఇక విద్యలో అయితే ఈ ప్రాంతం అత్యంత వెనుకబడి ఉంది. 2011 లెక్కల ప్రకారం అక్షరాస్యత 17.75% మాత్రమే. ఇందులో పురుషులు 24.69% కాగా, స్త్రీలు 11.22% మాత్రమే చదువుకుంటున్నారు. నిన్నటి వరకు ఒక కొఠియా గ్రామంలోనే 5వ తరగతి వరకు ఉన్న ప్రాథమిక పాఠశాల తప్ప, మిగతా ఏ గ్రామంలో కూడా పాఠశాల పనిచేయడం లేదు. ఈ పాఠశాలకు కూడా ఉపాధ్యాయులు రెగ్యులర్‌గా రాకపోవడం, హాస్టల్ సదుపాయం ఉన్నప్పటికీ, కిచెన్ తదితర పనులు పిల్లలే చేసుకోవడంతో చదువుపై సరైన శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. మిగతా కొన్ని గ్రామాలలో పాఠశాలలు పేరుకు నిర్మాణమై ఉన్నప్పటికీ, ఆ పాఠశాలలకు ఉపాధ్యాయులు దూర ప్రాంతమనే పేరుతో ఎవ్వరు హాజరు కారు. రాష్ట్రప్రభుత్వ పర్యావేక్షణ కూడా లేకపోవడంతో నేటికీ మెజారిటీ పిల్లలు చదువుకు దూరంగా ఉంటున్నారు. అయితే కొన్ని గ్రామాలలో ప్రజలు చాలా తక్కువ శాతమే అయినప్పటికీ, తమ పిల్లలను ఆంధ్రలో ఉన్న మక్కువ, కురుకుట్టి, సాలూరు ప్రాంతాలలో, ఒడిశాలోని పొట్టంగి, కుందిలి, కొరాపుట్, సిమిలిగూడ తదితర ప్రాంతాలలో చదివిస్తున్నారు.

***ఇప్పుడు ఈ ప్రాంతంలో రెండు రాష్ట్రాల పాలకవర్గాల మధ్య ఘర్షణలకు గల మూలకారణాలను పరిశీలిద్దాం.***

ముందు చెప్పిన విధంగా ఈ ప్రాంతంలో ఉన్న విలువైన సంపదను దోచుకోవడానికి గత బ్రిటీష్ ప్రభుత్వకాలం నుండి ఘర్షణలు

మొదలైనాయి. అప్పుడు కూడా గ్రామాల సరిహద్దులు, భౌగోళిక విభజనపై ఎటువంటి స్పష్టతలేదు. బ్రిటీష్‌కాలంలో కలకత్తా ప్రెసిడెన్స్‌లో, ఒడిశాలోని గంజాం జిల్లాతోపాటు, శ్రీకాకుళం, సాలూరువంటి ప్రాంతాలు ఉండేవి. 1936లో ఒడిశారాష్ట్రం ఏర్పాటు చేసినప్పుడు మాత్రం అప్పటివరకు గంజాం జిల్లాలో ఉండే శ్రీకాకుళం, సాలూరు, పార్వతీపురం, కురుపాం, పాలకొండ తదితర ప్రాంతాలను మద్రాస్ ప్రెసిడెన్స్‌లో ఉన్న విశాఖలో కలిపారు. కానీ ఈ విలీన ప్రక్రియలో అప్పటికీ ఉన్న 21 గ్రామాల(ఇప్పుడు ఆ ప్రాంతంలో 34 గ్రామాలు ఉన్నాయి)పై స్పష్టత ఇవ్వలేదు. దీనితో మద్రాస్, కలకత్తా ప్రెసిడెన్సీలు సైతం ఈ 21 గ్రామాలు తమవంటే తమవని ఘర్షణలు పడుతూ వచ్చారు.

బూటకపు స్వాతంత్ర్యం ప్రకటన అనంతరం కూడా ఈ వివాదానికి తెరపడలేదు. 1953లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరణ సమయంలో సైతం ఈ డిస్పూట్ గ్రామాలపై కేంద్రప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో, ఆ వివాదం అలాగే కొనసాగుతూ నేడు మరింత ముదిరి పాకాన పడింది. ఈ విషయంపై ఒడిశా ప్రభుత్వం 1963 సంవత్సరంలో సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ ప్రాంతం తమదేనని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ధౌర్జన్యంగా "మా ప్రాంతాన్ని ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేస్తుందని" తమ వాదనలను సుప్రీంకోర్టులో వినిపించింది. అయితే సుప్రీంకోర్టు ఈ విషయంపై ఎటువంటి తీర్పును ప్రకటించకుండా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయాన్ని పాటిస్తూ యథాస్థితిని కొనసాగించాలనీ, కేంద్రప్రభుత్వం ఈ సమస్యను పార్లమెంటులోనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చింది. గతంలో అనేక సందర్భాలలో రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉన్నతాధికారులు సమావేశమై చర్చించినప్పటికీ, ఈ సమస్యకు పరిష్కారమార్గం కనుగొనలేకపోయారు. ఈ ప్రాంతంలో ఉన్న అపారమైన వనరులను దృష్టిలో పెట్టుకొని వాటిని వదులుకోవడానికి రెండు రాష్ట్ర పాలకవర్గాలు సిద్ధపడకపోవడంతో, నేటికీ ఈ సమస్యకు పరిష్కారం దొరకక మరింత జఠిలమవుతూ వస్తుంది. ఒకవైపు చర్చలు కొనాసాగిస్తూనే, మరోకవైపు రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఆ ప్రాంత ప్రజలను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి అనేక మోసపూరిత ఎత్తుగడల్ని అనుసరిస్తూ వస్తున్నారు.

పైన చెప్పిన విధంగా ఆ ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యత రీత్యా గతంలో కొనసాగిస్తూ వస్తున్న ప్రభుత్వ సంస్కరణలను 2018 నుండి రెండు రాష్ట్ర ప్రభుత్వాలు మరింత తీవ్రతరం చేసాయి. గతంలో ఏపీప్రాంత ప్రజలు, ఒడిశాప్రాంత ప్రజలు తమకు కనీస అవసరాలైన కూడు, గుడ్డ, నీడ, విద్య, వైద్యం, త్రాగునీరు, సాగునీరు, ఫారెస్టువాళ్ళ దోపిడీ, ధౌర్జన్యాలు అరికట్టాలనీ, పోడు భూములకు పట్టాలివ్వాలని తదితర సమస్యల పరిష్కారం కోరుతూ, అనేక సందర్భాల్లో ప్రభుత్వ కార్యాలయాల ముందు ధర్నాలు, మీటింగ్‌లు నిర్వహించి సంబంధిత ప్రభుత్వ అధికారులకు తమ డిమాండ్ పత్రాలు అందజేసినప్పటికీ, ఆ సమస్యలు పరిష్కరించకుండా వాటికి భిన్నమైన కార్యాచరణను దోపిడీవర్గాలు ఈ ప్రాంతంలో అమలు చేస్తున్నాయి. భవిష్యత్‌లో తమ దోపిడీకి అనుకూలంగా ఉండేందుకు అవసరమైన ముందస్తు ప్రణాళికలు రూపొందించుకొని వివిధ పథకాలను అమలు చేస్తున్నాయి. అందులో భాగంగానే ఈ ప్రాంతంలో పోలీస్‌స్టేషన్ నిర్మాణాలు, పెద్దఎత్తున డబుల్ లైన్ రోడ్ల నిర్మాణాలు, కమ్యూనికేషన్ వ్యవస్థను బలోపేతం చేసుకోవడంలో భాగంగా మొబైల్ టవర్ నిర్మాణాలు చేపట్టడం, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తున్నారు. ఇదే 'నిజమైన అభివృద్ధి' అని తమ అనుకూల ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అందులో భాగంగానే ఈ ప్రాంతంలో నేడు దోపిడీవర్గాలు కోట్లాది రూపాయల నిధులను వెచ్చించి కొనసాగిస్తున్న పై 'అభివృద్ధి నమూనా' ఎవరి ప్రయోజనాలకనేది మనం అర్థం చేసుకోవాలి.

### నిర్దిష్టంగా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రాంతంలో అభివృద్ధి సంక్షేమం పేరుతో అమలు చేస్తున్న కార్యక్రమాలను పరిశీలిద్దాం

ఒడిశా ప్రభుత్వం ఈ ప్రాంతంలో 2018 నుండి 150 కోట్ల నిధులను వెచ్చించి పలుగుచెన్నేరు, పట్టుచెన్నేరు, దొలియాంబ, ఎగువశెంబి, దిగువశెంబి, మునకర్ర, నేరళ్ళవలస, కుంబిమడ, దొరలతాడివలస మీదుగా పొట్టంగి (బ్లాక్ సెంటర్)వరకు డబుల్ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఈ గ్రామాల మీద నుండే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని నిధులు కేటాయించింది. ఈ రోడ్డు నిర్మాణం మూలంగా అనేక మంది ప్రజలు పంటభూములు కోల్పోతారు. ఈ రోడ్డు నిర్మాణం ద్వారా నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం ఎటువంటి నష్టపరిహారం చెల్లించకుండా ధౌర్జన్యంగా ఆ భూములపై నుండి రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. మరోవైపు కొఠియా గ్రామం దగ్గర ప్రజలు కష్టపడి సాగుచేసుకుంటున్న భూములను ధౌర్జన్యంగా లాక్కొని ఆ ప్రాంతంలో 2 కోట్ల వ్యయంతో ఆధునిక పద్ధతిలో పోలీస్‌స్టేషన్ నిర్మాణం చేపట్టింది. గతంలో ఈ గ్రామంలోనే పోలీస్ అవుట్‌పోస్ట్ నిర్మాణం ఉండేది. 1998లో బుడ్డిగడ్డ, బోడిపాడు, 2000లో కలిమెల, మోటు పోలీసు క్యాంపులపై పీఎల్‌జీఏ బలగాలు దాడులు చేసి, అనేక ఆధునాతన ఆయుధాలు, అమ్యునేషన్ స్వాధీనం చేసుకోవడంతో ఆ దాడులకు బయపడిన ఒడిశా ప్రభుత్వం కొఠియా అవుట్‌పోస్టుతో సహా, అనేక క్యాంపులను మన బలమైన ఉద్యమ ప్రాంతాలనుంచి ఎత్తివేసి, మైదాన ప్రాంతాలకు తరలించింది. అప్పటినుండి 2020 వరకు ఆ గ్రామంలో క్యాంపు నిర్మాణం చేపట్టలేదు. అయితే 2018 నుండి ఈ ప్రాంతంలో రెండు రాష్ట్రాల పాలకవర్గాల మధ్య ఘర్షణలు తీవ్రతరమయ్యాయి. దానితో 2020లో కొఠియా గ్రామంలో పోలీస్‌స్టేషన్‌తోపాటు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని ఒడిశా ప్రభుత్వం నిర్మించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా త్వరలోనే ఈ ప్రాంతంలో పోలీస్‌స్టేషన్ నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు విజయనగరం ఎస్‌పీ ఎమ్ దీపిక ప్రకటించింది. పైన చెప్పిన విధంగా ఒడిశా ప్రభుత్వం సర్కిల్ పోలీస్‌స్టేషన్ నిర్మాణంతోపాటు, మొబైల్ టవర్ నిర్మాణం, రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు పర్యటించడానికి అనుగుణంగా 3 కోట్లతో హెలిప్యాడ్ నిర్మాణాన్ని చేపడుతున్నారు. కొఠియా గ్రామంలో గతంలో 5వ తరగతి వరకు ఉన్న ప్రాథమిక పాఠశాలను ఆదర్శ విద్యాలయం పేరుతో 6వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేసారు. ఇక్కడ చదువుతోపాటు, విద్యార్థులకు హాస్టల్ సదుపాయం, ఉచితంగా బస్సు సర్వీసు ఒడిశా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటితోపాటు అగ్రికల్చరల్ సెంటర్, బీపీఎల్ కార్డులు 800, జాబ్‌కార్డులు 1800ల కుటుంబాలకూ, 690 మందికి 'బీజూ

పక్క ఆవాస్ యోజనా' కింద ఇల్లు నిర్మించి ఇవ్వాలని నిర్ణయించింది. 2021 ఫిబ్రవరిలో స్థానిక ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ ఈ ప్రాంత ప్రజలను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి 18 కోట్ల ప్యాకేజ్‌ను ప్రకటించి ఆ నిధులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకూ, హాస్టళ్ళకు మౌలిక సదుపాయాలు మెరుగుపర్చడం కోసం కేటాయిస్తున్నట్లు ప్రకటించాడు.

2018 నుండి ఈ ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడానికి తీవ్రంగా ప్రయత్నం చేస్తూ వస్తుంది. 500 మంది లబ్ధిదారులకు ఇళ్ళు నిర్మించి ఇస్తామని ప్రకటించింది. ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, ఆదర్శ విద్యాలయాలు, ఆరోగ్య కేంద్ర నిర్మాణం చేపట్టే ప్రణాళికలు రూపొందించింది. 1.68 కోట్ల నిధులతో నీటి సదుపాయం, 10 చెక్‌డ్యాంలు, 1.46 కోట్లతో ఫీల్డ్‌ఛానల్ నిర్మాణం, ఉచితంగా కరెంట్, ఉపాధిహామి పథకం కింద పనులు కల్పిస్తామని ప్రకటించింది. గంజాయిబధ్ర, పలుగుచెన్నేరు, పట్టుచెన్నేరు గ్రామాల్లో అంగన్‌వాడి కేంద్రాలను నిర్మిస్తుంది. నిత్యావసర సరుకులు అందించేందుకు పట్టుచెన్నేరు గ్రామంలో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసి పట్టుచెన్నేరు, సల్పగూడ, ఎగువశెంబి గ్రామాలకూ, పలుగు చెన్నేరు గ్రామంలో స్టాక్‌పాయింట్ ఏర్పాటు చేసి పలుగుచెన్నేరు, డోలియాంబ, ముడకర్ర గ్రామాలకూ, నేరళ్ళవలసలో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసి పనుకవలస, దొరలదాడివలస, రణసింగి, పణికి, సింహగడ్డ, గాలగబిడేరు, మూలతాడివలస గ్రామాలకూ, దూలిబధ్రలో స్టాక్‌పాయింట్ ఏర్పాటు చేసి ఎగువశెంబి, కొఠియా, దూలిబధ్ర, ఎగువ గంజాయిబధ్ర గ్రామాలకు సరుకులు అందజేసే విధంగా ప్లాన్ చేస్తున్నారు.

పైన చెప్పిన విధంగా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రాంతంలో అభివృద్ధి సంక్షేమం పేరుతో అమలు చేసిన  కార్యక్రమాలు ప్రజలను అభివృద్ధిపథంలోకి తీసుకుపోవాలనే ఉద్దేశంతో చేసినవి ఎంతమాత్రం కావు. ముందు చెప్పిన విధంగా ఈ ప్రాంతంలో  నిక్షిప్తమై ఉన్న అపారమైన ఖనిజ, అటవీ, జలవనరులను కొల్లగొట్టి తమ జేబులు నింపుకోడానికి చేస్తున్న ప్రయత్నాలు మాత్రమే. అందుకే రెండు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు నిరంతరం ఈ ప్రాంతంలో పర్యటనలు చేపట్టడం పరిపాటిగా మారింది. మరోవైపు ఈ ప్రాంతంలో ఉన్న 15,000 జనాభాలో 4,000 మందికి రెండు రాష్ట్ర ప్రభుత్వాలు వేరు వేరుగా ఓటర్‌కార్డులను జారీ చేసాయి. వివిధ సందర్భాలలో జరిగే ఎన్నికల సమయంలో ఆ ప్రాంత ప్రజలను తమకు అనుకూలంగా ఓట్లు వేయించుకునేందుకు రెండు రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ముందుగా ఆ ప్రాంతంలో తమకు అనుకూలమైన ఒక దళారీ సెక్షన్‌ను తయారు చేసుకొని, వారి ద్వారా ప్రజలను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. తమ ప్రభుత్వాలకు అనుకూలంగా ఓట్లు వేయకపోతే రేషన్, పెన్షన్ తదితర సంక్షేమ కార్యక్రమాలు ఆపివేస్తామని పరోక్షంగా ప్రజలను బెదిరిస్తున్నారు. దాంతో ప్రజలు అరకొరగా అందుతున్న సంక్షేమ కార్యక్రమాలు ఎక్కడ అందకుండా పోతాయోననే ఆందోళనతో తప్పనిసరి పరిస్థితులలో రెండువైపులా ఎన్నికలలో పాల్గొంటున్నారు. ఏ ప్రభుత్వానికి అనుకూలంగా ఎక్కువ శాతం ఓట్లు పోలవుతాయో వాటిని పరిగణలోకి తీసుకొని, ఆ ప్రాంత ప్రజలు తమకే అనుకూలంగా ఉన్నారనే వాదనను ముందుకు తేవడానికి పాలకవర్గాలు దీనిని ఒక ఆయుధంగా ఉపయోగించుకుంటున్నారు.

మరోకవైపు రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను పావులుగా ఉపయోగించుకొని ఒకరిపై మరొకరు దాడులకూ, ఘర్షణలకు పూనుకుంటున్నాయి. ఒక ప్రభుత్వం చేసే అభివృద్ధి కార్యక్రమాలను మరొక ప్రభుత్వం అడ్డుకుంటున్నది. తమ ప్రభుత్వం కొనసాగించే సంక్షేమ కార్యక్రమాలు మాత్రమే తీసుకోవాలని ప్రజలపై వత్తిడి చేస్తుంది. ఒక రాష్ట్ర ప్రభుత్వ అధికారులుగానీ, రాజకీయ నాయకులుగాని ఆ ప్రాంతంలో పర్యటిస్తే మరొక రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున పోలీసు బలగాలను ఆయా ప్రాంతాలలో మోహరించి యుద్ధ వాతావరణాన్ని తలపించే విధంగా ఆయా గ్రామాలనూ, దారులను పూర్తి తన కంట్రోల్‌ల్లో ఉండే విధంగా వ్యవహరిస్తున్నారు. రోడ్లు, దారులకు అడ్డంగా ముళ్ళకంచెలు, బారీకేట్లను నిర్మిస్తున్నారు. ఈ మధ్య కాలంలో దిగువ గంజాయిబధ్ర గ్రామంలో నెలకొల్పిన అంగన్‌వాడీ బిల్డింగ్‌ను గుర్తు తెలియని వ్యక్తుల పేరుతో వాటిని జేసీబీతో కూల్చివేసారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ ప్రాంతంలోని దిగువ గంజాయిబధ్ర గ్రామంలో మెడికల్ క్యాంపు పెట్టాలని ప్రయత్నం చేస్తే, ఒడిశా ప్రభుత్వం అడ్డుకొని డాక్టర్లనూ, అధికారులను వెనుకకు పంపించారు. ఒడిశా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కరెంట్ తీగలను ఆంధ్ర అధికారులు తొలగించారు. రెండు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జరుగుతున్న ఘర్షణలలో పైన చెప్పినవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. పాలకవర్గాలు తమ స్వార్థ ప్రయోజనాలకోసం జరుగుతున్న కుమ్ములాటలో అమాయక ప్రజలు నలిగిపోవడం నేడు ఆ ప్రాంతంలో జరుగుతున్న ఒక యదార్థవాస్తవం.

మరోవైపు ఈ ప్రాంతంలో ఉన్న అపారమైన జలవనరులను దోచుకోవడానికి భారత దళారీ బూర్జువా వర్గానికి చెందిన నరేంద్రమోడీ ఆప్తమిత్రుడు ఆదాని కన్నుపడింది. దొరల తాపివలస గ్రామపరిసరాలలో 2,200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని చేసే కేంద్రాన్ని సుమారు 1500 కోట్ల పైచిలుకు పెట్టుబడితో నిర్మించడానికి ప్రణాళికలు రూపొందించారు. ఈ కేంద్రం ఏర్పాటు చేస్తే సుమారు 10 గ్రామాల ప్రజలు నిర్వాసితులు కావల్సి వస్తుంది. తరతరాలుగా కష్టపడి సాగు చేసుకుంటున్న తమ భూములు, ఇళ్ళు, గొడ్లు, గోదా సర్వస్వం కోల్పోయి బికారులుగా మారే పరిస్థితి ఉంది. అసలే కరువు కాటకాలతో, అర్ధాకలితో బ్రతుకుతున్న ప్రజలు ఉన్న భూములు కోల్పోతే వారి జీవితాలు అగమ్యంగా మారే పరిస్థితులు దాపురిస్తాయి. ఈ ఆదాని గ్రూపు గతంలో ఒకసారి ఈ ప్రాంతంలోనే జలవిద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రయత్నం చేస్తే, ప్రజలు మావోయిస్టు పార్టీ నాయకత్వంలో ప్రతిఘటించి ఆనాడు నిర్మాణం కాకుండా అడ్డుకోగలిగారు. గత చేదు అనుభవాలను దృష్టిలో పెట్టుకున్న ఆదానిగ్రూపు ఈ సారి రెండు రాష్ట్ర పాలకవర్గాల సహకారంతో తన పథకాన్ని సాకారం చేసుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. మరోకవైపు రెండు రాష్ట్ర ప్రభుత్వాలు దోపిడీవర్గాలకు కొమ్ముకాసే కుట్రలను ప్రజలు గమనిస్తున్నారు. గతంలో ఆదానిగ్రూపును ఈ ప్రాంతం నుండి తన్ని తరిమేసిన ప్రజలు, మరోసారి తమ అస్థిత్వం కోసం పోరాటానికి సిద్ధమవుతున్నారు.

ప్రస్తుతం వివాదస్పద కొఠియా ప్రాంతంలో రెండు రాష్ట్ర పాలకవర్గాలు ప్రజలను మభ్యపెట్టి కొనసాగిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై అప్రమత్తంగా ఉంటూ విమర్శనాత్మకంగా

***తరువాయి భాగం 43వ పేజీలో...***

# ఫాసిజం-కార్మికవర్గం...

– జార్జి డిమిట్రోవ్

*1935లో మాస్కోలో జరిగిన కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ 7వ ప్రపంచ కాంగ్రెస్‌కు కామ్రేడ్ జార్జ్ డిమిట్రోవ్ సమర్పించిన రిపోర్టును ఆ తర్వాత ఫాసిజానికి వ్యతిరేకంగా 'కార్మికవర్గ ఐక్యసంఘటన' పేరుతో విమోచనా ప్రచురణలు పుస్తకంగా తీసుకువచ్చారు. నేడు ప్రపంచం భయంకరమైన ఫాసిజం ప్రమాదంలో జీవిస్తున్నది. అది ఏ రూపంలో ఉన్నా దాని వర్గస్వభావం ఒక్కటే, దానికున్న మూలాలు ఒక్కటే. కనుక ప్రస్తుత పరిస్థితులలో పాఠకులకు ఇది ఉపయోగపడుతుందని భావించి ప్రచురిస్తున్నాం ... సంపాదకులు*

కామ్రేడ్స్,

రాబోయే కొత్త ఫాసిస్టుదాడిని గురించి ప్రపంచకార్మికవర్గాన్ని హెచ్చరిస్తూ, దానిని ఎదుర్కొని పోరాడవలసిందిగా కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ తన 6వ కాంగ్రెస్‌కు ముందు పిలుపునిచ్చింది. "తక్కువగానో, ఎక్కువగానో అభివృద్ధి చెందిన రూపంలో ఫాసిస్టు ధోరణులు, ఫాసిస్టు ఉద్యమ బీజాలు ప్రతిచోట కానవస్తున్నాయని" కాంగ్రెస్ పేర్కొన్నది.

ప్రస్తుతం అత్యంత తీవ్రమైన ఆర్థికసంక్షోభం బ్రద్ధలుకావడంతో, పెట్టుబడిదారీ విధానంలోని సాధారణ సంక్షోభం మరింతగా పదునెక్కడంతో, శ్రమజీవులు మరింతగా విప్లవాత్మకంగా మార్పు చెందడంతో ఫాసిజం విస్తృతమైన దాడికి పూనుకున్నది. శ్రమజీవులను అణిచి వుంచడానికి అవసరమైన అసాధారణ నిర్బంధ చర్యలను కొనసాగించడానికీ, కొల్లగొట్టడానికి సామ్రాజ్యవాద యుద్ధానికి తయారు కావడానికీ, సోవియట్ యూనియన్‌పై దాడి చేయడానికీ, చైనాను పాదాక్రాంతం చేసుకొని విభజించుకోవడానికీ, ఈ విధమైన అన్ని చర్యలద్వారా విప్లవాన్ని అడ్డుకొనుటకు పాలక బూర్జువావర్గాలు ఫాసిజాన్ని మరింతగా ఆశ్రయిస్తున్నాయి.

సామ్రాజ్యవాద శక్తులు సంక్షోభ భారాన్ని మొత్తంగా శ్రమజీవుల మూపులపై మోపడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. అందుకే వాటికి ఫాసిజం అవసరం.

వీరు తమ మార్కెట్ల సమస్యలను బలహీనదేశాలను పాదక్రాంతం చేసుకొనుటద్వారా, వలసవాద దోపిడీ తీవ్రతరం చేయడం ద్వారా పరిష్కరించుకొనుటకు ప్రయత్నిస్తున్నారు. యుద్ధం ద్వారా ప్రపంచాన్ని తిరిగి పునర్విభజించుటకు ప్రయత్నిస్తున్నారు. అందుకే వాటికి ఫాసిజం అవసరం.

ప్రపంచ కార్మికవర్గానికి రక్షణదుర్గమైన సోవియట్ యూనియన్‌పై మిలటరీ దాడులు చేయడం ద్వారా, కార్మికుల, రైతుల విప్లవోద్యమాన్ని నాశనం చేయుటకు, విప్లవ శక్తుల పెరుగుదలను అరికట్టాలని ప్రయత్నిస్తున్నారు. అందుకే వాటికి ఫాసిజం అవసరం.

అనేక దేశాలలో, ముఖ్యంగా జర్మనీలో ఈ సామ్రాజ్యవాద శక్తులు ప్రజలు నిర్ణయాత్మకంగా విప్లవోన్ముకం కాకముందే కార్మికవర్గాన్ని ఓటమికి గురిచేసి, ఫాసిస్టు నియంతృత్వాన్ని నెలకొల్పుటలో విజయం సాధించారు.

కానీ, ఫాసిజం విజయం పొందడానికి దారితీసిన లక్షణాలేమిటి? ఒకవైపు బూర్జువావర్గంతో చేతులు కలిపే సోషల్ డెమొక్రసీ వర్గసంకర, విచ్ఛిన్నకర విధానం కారణంగా నిర్మాణరాహిత్యమై, నిర్వీర్యమైపోయిన కార్మికవర్గపు బలహీనతను ఎత్తిచూపిస్తుంది. మరొకవైపు కార్మికవర్గపు ఐక్యపోరాటాలు విప్లవమంటేనే భయపడుతున్న, ఇంకెంత మాత్రం పాత పద్ధతులైన బూర్జువా ప్రజాస్వామ్యం, పార్లమెంటరీ విధానముల ద్వారా ప్రజలపై తన వర్గ నియంతృత్వాన్ని కొనసాగించలేని బూర్జువావర్గపు బలహీనతను కూడా ఎత్తిచూపిస్తున్నది.

సోవియట్ కమ్యూనిస్టు పార్టీ 17వ కాంగ్రెస్‌లో కామ్రేడ్ స్టాలిన్ జర్మనీలో ఫాసిజం విజయాన్ని గురించి ఈ విధంగా చెప్పారు.

"సోషల్ డెమొక్రసీ కార్మికవర్గానికి చేసిన విద్రోహం ఫలితంగా ఫాసిజానికి దారి సుగమమయింది. ఫాసిజం విజయం పొందడమంటే అది కార్మికవర్గం యొక్క బలహీనతకు మాత్రమే నిదర్శనంగా పరిగణించరాదు. అది బూర్జువావర్గం యొక్క బలహీనతకు కూడా నిదర్శనంగా పరిగణించాలి. ఎందుకంటే బూర్జువావర్గం ఇప్పటికే బూర్జువా ప్రజాస్వామ్యం, పార్లమెంటరీ పంథా అనే పాత పద్ధతుల్లో పరిపాలించే శక్తిని కోల్పోయింది. తత్ఫలితంగా దేశీయంగా అది అత్యంత భయానకమైన పరిపాలనా విధానాల్ని చేపట్టాల్సి వచ్చింది. ప్రస్తుతం అది తనెదుర్కుంటున్న పరిస్థితికి శాంతియుత విదేశాంగ విధాన ప్రాతిపదికపై పరిష్కారాన్ని కనుగొనుట దానికి సాధ్యం కాదన్న వాస్తవానికిది నిదర్శనంగా పరిగణించాలి. అందుకే అది యుద్ధోన్మాద విధానాలను చేపట్టాల్సిన పరిస్థితికి నెట్టబడింది".

## ఫాసిజం యొక్క వర్గ స్వభావం

కామ్రేడ్స్,

కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ యొక్క 13వ ప్లీనరీ కార్యవర్గపు సమావేశంలో ఫాసిజాన్ని గురించి సరిగ్గానే చెప్పబడింది. అధికారంలో ఉన్న ఫాసిజం అత్యంత అభివృద్ధి నిరోధకమైన, అత్యంత జాతీయ దురహంకారపూరితమైన, ఫైనాన్స్ పెట్టుబడియొక్క తీవ్ర సామ్రాజ్యవాద శక్తుల భయానక నగ్ననియంతృత్వమే.

జర్మనీ తరహా ఫాసిజం అత్యంత అభివృద్ధి నిరోధకమైన ఫాసిస్టురకం. సోషలిజంతో తనకు ఏ మాత్రం సంబంధం

లేకపోయినప్పటికీ, ఎగ్గు, సిగ్గు లేకుండా తనను జాతీయ సోషలిజంగా పిలుచుకుంటున్నది. హిట్లర్ ఫాసిజం బూర్జువా జాతీయవాదమే కాదు. అది అనాగరిక జాతీయ దురహంకారము. కార్మికవర్గాన్నీ, రైతాంగం, పెటీబూర్జువా, మేధావివర్గాలలోని విప్లవశక్తులను రెచ్చగొట్టి, అనేక రకాలుగా చిత్రహింసలకు గురిచేసే రాజకీయ బంధిపోట్ల ప్రభుత్వం. అది మధ్యయుగాలనాటి క్రూరత్వానికీ, మృగత్వానికీ, ఇతర దేశాలు, జాతులపట్ల పట్టపగ్గాలులేని దురాక్రమణపూరిత విధానానికి ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వం.

జర్మన్ ఫాసిజం అంతర్జాతీయ అభివృద్ధి నిరోధకుల కూటమికి అగ్రగామిగా పనిచేస్తున్నది. అది సామ్రాజ్యవాద యుద్ధానికి ప్రధాన ప్రోత్సాహకారిగా పని చేస్తున్నది. అది మొత్తం ప్రపంచ శ్రమజీవులందరి మహత్తర పితృభూమి అయిన సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా యుద్ధాన్ని మొదలుపెట్టుటకు ప్రయత్నిస్తున్నది.

ఓటోబాయర్ పేర్కొన్నట్లుగా, ఫాసిజం రాజ్యాధికారంయొక్క రూపం కాదు. “కార్మికవర్గం, బూర్జువావర్గం రెండింటికి అతీతంగా ఉంటుంది”. బ్రిటిష్ సోషలిస్టు నాయకుడు బ్రెయిల్‌ఫోర్డు “రాజ్యాంగయంత్రాన్ని పెటీబూర్జువావర్గం హస్తగతం చేసుకున్న తిరుగుబాటు” కాదని పేర్కొన్నాడు. ఇది పూర్తిగా తప్పు. ఫాసిజం వర్గాతీత ప్రభుత్వం ఎంతమాత్రమూ కాదు. ఫైనాన్స్ పెట్టుబడిపై అధికారం చెలాయించే పెటీబూర్జువాయొక్కగానీ, కిరాయి కార్మికవర్గపు ప్రభుత్వంగాని ఏ మాత్రము కాదు. ఫాసిజం ఫైనాన్స్ పెట్టుబడి యొక్క అధికారమే. కార్మికవర్గం, రైతాంగం, మేధావివర్గాలలో గల విప్లవశక్తులపై భయానకమైన కక్షసాధింపు చర్యలు కొనసాగించడానికి ఏర్పర్చబడిన నిర్మాణసంస్థే ఫాసిజం. విదేశాంగ విధానానికి సంబంధించినంతవరకు ఇతర దేశాలపట్ల అతిహేయమైన విద్వేశాన్ని రెచ్చగొట్టే అత్యంత కరుడుగట్టిన జాతీయ దురహంకారమే ఫాసిజం.

ఫాసిజం యొక్క ఈ నిజమైన లక్షణాన్ని ప్రత్యేకించి నొక్కి చెప్పాల్సి ఉంది. ఎందుకంటే అనేక దేశాలలో ఫాసిజం తన సోషల్ వాగాడంబరతతో సంక్షోభభారంతో గాడితప్పిన పెటీబూర్జువా ప్రజానీకాన్నీ, కార్మికవర్గంలోని అత్యంత వెనకబడిన విభాగానికి చెందిన కొంతమంది కార్మికులను కూడా తన అనుచరులుగా మలుచుకోగలిగింది. వీరు ఫాసిజం యొక్క నిజవర్గ స్వభావాన్ని గురించిగానీ, దాని నిజలక్షణాలను గురించిగాని అర్థం చేసుకొని ఉంటే దాన్ని ఎన్నటికీ బలపర్చి ఉండరు.

ఫాసిజం యొక్క అభివృద్ధి, ఫాసిస్టు నియంతృత్వం ఆదేశం యొక్క చారిత్రక, సాంఘీక, ఆర్థిక పరిస్థితులను బట్టి, ఆదేశం యొక్క జాతీయ ప్రత్యేకతలను బట్టి, అంతర్జాతీయంగా ఆదేశం యొక్క ఉనికిని బట్టి వివిధ దేశాలలో, వివిధ రూపాలలో ఉంటుంది. కొన్ని దేశాలలో ప్రధానంగా ఫాసిజానికి విస్తృత ప్రజాపునాది లేనటువంటి, ఫాసిస్టు బూర్జువావర్గ శిబిరంలోని వివిధ గ్రూపులమధ్య పోరాటం తీవ్రరూపంలో సాగుతున్నటువంటి దేశాలలో ఫాసిజం పార్లమెంటును వెంటనే రద్దు చేయడానికి సాహసించదు. అంతేకాక బూర్జువాపార్టీలు, సోషల్ డెమొక్రటిక్ పార్టీలు కూడా కొంత మేరకు చట్టబద్ధంగా పని చేయడానికి అవకాశం ఇస్తుంది. మిగతా దేశాలలో ఎక్కడ విప్లవం బద్దలవుతుందని పాలక బూర్జువావర్గం భయపడుతుందో, అక్కడ ఫాసిజం తనకు ఎదురులేని రాజకీయ గుత్తాధికారాన్ని వెంటనే నెలకొల్పుకోవడానికి పూనుకోవడమో లేక తనకు ప్రత్యర్థులుగా ఉన్న పార్టీలు, గ్రూపులపై భయోత్పాతపాలనను బాధించడాన్ని తీవ్రం చేస్తుంది. ప్రధానంగా దాని పరిస్థితి గడ్డుగా తయారైనప్పుడు, తన వర్గస్వభావాన్ని మార్చకోకుండానే నగ్నమైన బీతావహమైన నియంతృత్వాన్నీ, పచ్చి ధగాకోరు పార్లమెంటరీ పద్ధతులను మిలితం చేసి తన పునాదిని విస్తృతం చేసుకోవడానికి ఫాసిజాన్ని ఇది అడ్డుకోలేదు.

ఫాసిజం అధికారానికి రావడం అంటే ఒక బూర్జువా ప్రభుత్వం స్థానంలో మరొక బూర్జువా ప్రభుత్వం మాములుగా అధికారానికి రావడం కాదు. బూర్జువావర్గం యొక్క రాజ్యాంగాధికారం అంటే బూర్జువా ప్రజాస్వామ్యం యొక్క రూపం స్థానంలో మరొకతరహా ప్రభుత్వ రూపాన్నీ–బహిరంగ, భయానక నియంతృత్వాన్ని నెలకొల్పడమే. ఈ తేడాను గమనించకపోవడమంటే తీవ్రమైన తప్పు చేయడమే. ఈ తప్పు చేయడమంటే ఫాసిస్టులు అధికారం స్వాధీనం చేసుకునే ప్రమాదానికి వ్యతిరేకంగా జరిపే పోరాటంలోకి పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని విశాలమైన శ్రమజీవులను సమీకరించడానికీ, బూర్జువావర్గ శిబిరంలోని వైరుధ్యాలను వినియోగించుకోకుండా విప్లవ కార్మికవర్గాన్ని అడ్డుకొనడమే. ఫాసిస్టు నియంతృత్వ స్థాపనకై బూర్జువా ప్రజాస్వామిక దేశాలు ప్రస్తుతం శ్రమజీవుల ప్రజాస్వామిక స్వేచ్ఛాస్వాంతంత్రాలను నాశనం చేయిటకూ, పార్లమెంటరీ హక్కులను కుదించి, అపహాస్యం చేస్తూ, విప్లవోద్యమంకై నిర్బంధం తీవ్రతరం చేయుటకు అవసరమైన బూర్జువా అభివృద్ధి నిరోధక చర్యలు వేగంగా తీసుకుంటున్న విషయాన్ని తక్కువగా అంచనా వేయడం చాలా తీవ్రమైన తప్పు అవుతుంది.

కామ్రేడ్స్,

ఫాసిజం అధికారంలోకి రావడం మాములుగా ఏదో ఒక కమిటీ లేక ఫైనాన్స్ పెట్టుబడి ఏదో ఒక తేదీన నిర్ణయించుకొని ఫాసిస్టు నియంతృత్వాన్ని ఏర్పరుస్తారని అతితేలికగా అనుకోకూడదు. వాస్తవానికి ఫాసిజం సాధారణంగా బూర్జువా పార్టీల, పరస్పర అంగీకారంతోనూ, కొన్ని సందర్భాలలో కొత్త బూర్జువా పార్టీలు, పాత బూర్జువా పార్టీలకు వ్యతిరేకంగా జరిపే పోరాటక్రమంలోనూ, లేదా ఈ బూర్జువా పార్టీలలోని కొన్ని నిర్దిష్టమైన గ్రూపులు ఫాసిస్టు శిబిరంలోని మిగతా గ్రూపులతో పోరాడే క్రమంలోనూ అధికారంలోనికి వస్తుంది. ఈ పోరాటం కొన్ని సందర్భాలలో జర్మనీ, ఆస్ట్రియా మొదలైన దేశాలవలే సాయుధ ఘర్షణ రూపం తీసుకోవచ్చు. ఇవన్నీ ఒక విషయాన్ని మరుగుపర్చలేవు. అదేమంటే ఫాసిస్టు నియంతృత్వాన్ని నెలకొల్పే ముందు బూర్జువా ప్రభుత్వాలు సాధారణంగా అనేక ప్రాథమిక దశలు దాటవలసి ఉంటుందనీ, ఆ క్రమంలో అనేక అభివృద్ధి నిరోధక చర్యలు ప్రవేశపెట్టుటద్వారా ఫాసిజం అధికారంలోకి రావడానికి ప్రత్యక్షంగా మార్గం సుగమం చేస్తాయనే వాస్తవాన్ని మరుగుపర్చలేవు. బూర్జువావర్గం చేపట్టే అభివృద్ధి నిరోధక చర్యలనూ, ఫాసిజం పెరుగుదలను దాని సన్నాహక దశలలోనే ఎవరైతే ఎదిరించి పోరాడరో వారు ఫాసిజం విజయాన్ని అడ్డుకోవడంలో విఫలవ్వడమే కాక ఫాసిజం విజయానికి మార్గం సుగమం చేసినవాళ్ళు కూడా అవుతారు.

సోషల్ డెమొక్రాటిక్ నాయకులు ఫాసిజం యొక్క అసలైన వర్గస్వభావాన్ని ప్రజల దృష్టికి రాకుండా కప్పిపెట్టి దాస్తున్నారు. అంతకంతకు అధికమవుతున్న బూర్జువా అభివృద్ధి నిరోధక చర్యలకు వ్యతిరేకంగా పోరాడుటకు ప్రజలకు పిలుపు ఇవ్వలేదు. అందుచేత ఫాసిస్టుదాడి తీవ్రమైనటువంటి నిశ్చయాత్మకదశలో జర్మనీ శ్రమజీవులలోని అత్యధికభాగం, అనేక ఇతర ఫాసిస్టు దేశాలలోని

శ్రమజీవులలోని అత్యధికభాగం పెనురాక్షసిలాంటి పెట్టుబడి యొక్క రక్తదాహంగల వికృతరూపమే ఫాసిజం అన్న విషయాన్ని, ఫాసిజం వారికి అత్యంత దుర్మార్గమైన శతృవని గుర్తించలేకపోవడానికీ, దాన్ని నిరోధించడానికి ఆ ప్రజలు సంసిద్ధులు కాకపోయినా గొప్ప చారిత్రక బాధ్యతను ఈ సోషల్ డెమోక్రటిక్ నాయకులు వహించక తప్పదు.

ఫాసిజం ప్రజానీకంపై ప్రభావం కలగజేయుటకు గల కారణాలేమిటీ? ప్రజలయొక్క తక్షణ అవసరాలు, డిమాండ్‌లపై తన వాగాడంబర విజ్ఞప్తులతో ఫాసిజం ప్రజలను తనవైపు ఆకర్షించుకోగలిగింది. ఫాసిజం ప్రజల్లో బలంగా పాతుకుపోయిన ఈర్ష్యాద్వేషాలను రెచ్చగొట్టడానికి పూనుకోవడమే కాక, వారి విప్లవ సాంప్రదాయాలనూ, న్యాయపక్షపాతాన్నీ, అభివృద్ధికర మనోభావాలను కూడా చాకచక్యంగా ఉపయోగించుకోగలిగింది. బడాబూర్జువా వర్గానికి తొత్తులు, సోషలిజానికి బద్ధశతృవులైనటువంటి జర్మన్ ఫాసిస్టులు తమకుతాము "సోషలిస్టుల"మనీ, తాము అధికారంలోకి రావడమే "విప్లవ"మనీ ప్రజానీకం ముందు ఎందుకు చిత్రించుకున్నారు? ఎందుకంటే జర్మనీ శ్రమజీవుల హృదయాలలో గాఢంగా అత్తుకుపోయిన విప్లవంపైన విశ్వాసం, సోషలిజంపైన గల అభిమానాలను తాము ఉపయోగించుకోదలచుకున్నారు గనుకనే.

ఫాసిజం అత్యంత తీవ్రవాద సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు కృషి చేస్తుంది. అవమానానికి గురిచేయబడిన జాతియొక్క ప్రయోజనాలను కాపాడే మొనగాడుగా తాను ప్రజలముందు ఫోజు పెడుతుంది. దెబ్బతిన్న జాతీయ భావాలను రెచ్చగొడుతుంది. "వర్సైయిల్స్ సందిని వ్యతిరేకించండి" అనే నినాదంతో జర్మన్ ప్రజానీకపు అండను జర్మన్ ఫాసిస్టులు సాధించిన తీరు దీనికి ఉదాహరణగా పేర్కొనవచ్చును.

ఫాసిజంయొక్క లక్ష్యం ప్రజానీకాన్ని విచ్చలవిడిగా దోచుకోవడమే. బూర్జువా దోపిడీదొంగలు, బ్యాంకులు, ట్రస్టులు, ద్రవ్యపెట్టుబడిదారులపట్ల శ్రమజీవులలో ఉన్న తీవ్రమైన ద్వేషాన్ని ఆసరా చేసుకొని ఫాసిజం పెట్టుబడిదారీ వ్యతిరేక వాగాడంబరతతో కూడిన విజ్ఞప్తులు చేస్తుంది. ప్రజల్లో ఉన్న రాజకీయ వెనుకబాటుతనాన్ని ఆసరాగా చేసుకొని ఆ క్షణానికి తగిన ఆకర్షణీయమైన నినాదాలు ఇస్తుంది. జర్మనీలో "వ్యక్తి సంక్షేమం కంటే అందరి సంక్షేమం గొప్పది", ఇటలీలో "మన ప్రభుత్వం పెట్టుబడిదారీ ప్రభుత్వం కాదు, సహకార పద్ధతిలో నడిచే ప్రభుత్వం", జపాన్‌లో "దోపిడీరహితమైన జపాన్ కొరకు", అమెరికాలో "సంపదను పంచుకొండి" లాంటి నినాదాలు ఇస్తున్నారు.

ఫాసిజం ప్రజలను అత్యంత అవినీతిపరులు, ధుర్మార్గుల కోరలకు ఎర చేయడమేకాక "నిజాయితీ కలిగిన అవినీతి రహితమైన ప్రభుత్వం" అన్న మోసపూరితమైన డిమాండ్‌తో ప్రజలముందుకొస్తుంది. బూర్జవా ప్రజాస్వామ్య ప్రభుత్వాలతో విసుగుచెంది తీవ్రమైన నిస్పృహకు లోనైనా ప్రజల అసంతృప్తిని వినియోగించుకొనుటకు ఫాసిజం అవినీతిని కపటబుద్ధితో నిరసిస్తుంది (ఉదాహరణకు జర్మనీలో బార్మెట్, స్లార్కెల్ ఉదంతాలు, ఫ్రాన్స్‌లో స్టావిస్కీ ఉదాంతం లాంటి అనేక ఉదంతాలు).

అత్యంత అభివృద్ధి నిరోధక బూర్జువావర్గాల ప్రయోజనాలకోసమే పాత బూర్జువా పార్టీలతో విసుగు చెంది వాటిని వదిలి బయటకు వచ్చే ప్రజలలోనికి ఫాసిజం ప్రవేశిస్తుంది. కానీ పాత బూర్జువా ప్రభుత్వాలమీద తీవ్రమైన దాడులు కొనసాగిస్తున్నట్లు, పాత బూర్జువా పార్టీలకు వ్యతిరేకంగా రాజీలేని వైఖరి అవలంభిస్తున్నట్లు ప్రజల్లో ప్రభావాన్ని కలగజేస్తుంది.

ప్రతిదేశంలోని జాతీయ ప్రత్యేకతలకు అనుకూలంగా, ఆ దేశ సమాజంలోని వివిధ సాంఘీక వర్గాల ప్రత్యేకతలకనుకూలంగా రూపొందించిన వాగాడంబర నినాదాలతో ఫాసిజం ఇతర రకాల అభివృద్ధి నిరోధక బూర్జువా శక్తులను కపటత్వంతోనూ, అసహనంతోను మించిపోతుంది. కార్మికవర్గంలోని ఒక భాగంతోసహా, పేదరికంతో, నిరుద్యోగంతో, మనుగడకే భద్రతలేని దుస్థితిలో మగ్గుతున్న పెటీబూర్జువా ప్రజానీకం ఫాసిజం యొక్క జాతీయ దురహంకారపూరిత సామాజిక వాగాడంబర నినాదాల ప్రభావానికి కొట్టుకుపోతారు.

కార్మికవిప్లవోద్యమంపైనా, అసంతృప్తి చెందియున్న ప్రజానీకంపైన దాడిచేసే పార్టీగా ఫాసిజం అధికారంలోనికి వస్తుంది. కానీ తాను అధికారంలోకి రావటాన్ని బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా "మొత్తం జాతి" విముక్తికై జరిగే "విప్లవో"ద్యమంగానూ, జాతికి "మోక్షం"గాను చిత్రించుకొంటుంది (ఈ సందర్భంలో ముస్సొలిని ఇచ్చిన "రోమ్‌నగరంపైకి నడవండి", పిల్‌సుడ్స్కి ఇచ్చిన "వార్సాపైకి నడవండి", జర్మనీలో హిట్లర్ ఇచ్చిన "జాతీయ సోషలిస్టు విప్లవం" నినాదం లాంటిది మనం గుర్తుంచుకోవాలి).

కానీ ఫాసిజం ఏ ముసుగులు ధరించినా, అది తనను ఏ రూపంలో చిత్రించుకున్నా, ఏ పద్ధతిద్వారా అధికారంలోకి వచ్చినా –

– శ్రామిక ప్రజలపై పెట్టుబడి సాగించే అత్యంత క్రూరమైన దాడి ఫాసిజం.

– విశృంఖలమైన జాతీయదురంహంకారం, దురాక్రమణ యుద్ధమే ఫాసిజం.

– పచ్చి అభివృద్ధి నిరోధకమైనది, విప్లవ ప్రతీఘాతుకమైనది ఫాసిజం.

– కార్మికవర్గం యొక్క శ్రమజీవులందరియొక్క అత్యంత దుర్మార్గమైన శతృవు ఫాసిజం.

విజయాన్ని పొందిన ఫాసిజం ప్రజలకేమిచ్చింది?

ఫాసిజం కార్మికులకు "మెరుగైన వేతనం" వాగ్దానం చేసింది. కానీ వాస్తవానికది వారి జీవనస్థాయిని తగ్గించి దరిద్రులను మరింత దారిద్ర్యానికి గురిచేస్తుంది. అది నిరుద్యోగులకు పని చూపిస్తానని వాగ్దానం చేసింది. కానీ వాస్తవంలో వారిని మరింత ఆకలి, బాధలకూ, గత్యంతరంలేని వెట్టిచాకిరికి గురిచేస్తుంది. వాస్తవంలో అది కార్మికులకూ, నిరుద్యోగులకూ, పెట్టుబడిదారీసమాజంలో ఎలాంటి హక్కులులేని హీనులుగా దిగజారుస్తుంది. వారి కార్మికసంఘాలను నాశనం చేస్తుంది. వారికి సమ్మెహక్కు లేకుండా చేస్తుంది. కార్మికవర్గ పత్రికలు లేకుండా చేస్తుంది. వారిని ఫాసిస్టు సంస్థలలో నిర్బంధంగా చేరేలా చేస్తుంది. వారి సాంఘీక భద్రతా నిధులను కొల్లగొడుతుంది. ఫాక్టరీలనూ, మిల్లులను బ్యారక్‌లుగా మార్చి, కార్మికులపై పెట్టుబడిదారుల విశృంఖల, ఏకపక్షనియంతృత్వపాలనను నెలకొల్పుతుంది.

శ్రామిక యువకులకు ఫాసిజం బంగారు భవిష్యత్తుకు రాచబాట వేస్తానని వాగ్దానం చేస్తుంది. కానీ అది వాస్తవంలో యువకార్మికులను పెద్దఎత్తున పనులనుంచి తొలగించడం, నిర్బంధ వెట్టిచాకిరి శిబిరాలలోకి నెట్టడం, దురాక్రమణ యుద్ధానికి సైనికులుగా తయారు

చేయుటకు నిర్బంధ మిలటరీ శిక్షణలాంటివి వారికి ప్రసాదించుతుంది.

ఫాసిజం ఆఫీసుల్లో పనిచేసే కార్మికులకూ, చిన్న ఉద్యోగస్తులకూ, మేధావులకు జీవన భద్రతను కలిగిస్తాననీ, ట్రస్టులయొక్క తిరుగులేని పట్టును నాశనం చేస్తాననీ, బ్యాంకు పెట్టుబడియొక్క దోపిడీని తుడిచిపెడతానని వాగ్దానం చేసింది. కానీ వాస్తవంలో అది వారికి లోగడ కంటే ఎక్కువ మోతాదులో అనిశ్చితమైన, దరిద్ర్యమైన భవిష్యత్తును ప్రసాదించుతుంది. తన అధికారంతో మరింతగా అడుగులకు మడుగులొత్తే నూతన బ్యూరోక్రసీ యజమాయిషీ క్రిందకు వారిని నెట్టివేస్తుంది. భరించలేని ట్రస్టుల నియంతృత్వాన్ని నెలకొల్పుతుంది. ఇంతకుముందు కని విని ఎరగని స్థాయిలో అవినీతినీ, నికృష్టమైన పరిస్థితులను పెంచి పోషిస్తుంది.

ఫాసిజం చితికిపోయి పేదరికంతో మ్రగ్గుతున్న రైతాంగానికి ఋణబాధలనుండి విముక్తి కల్పిస్తాననీ, కౌళ్ళను రద్దు చేస్తాననీ, నష్టపరిహారం లేకుండా భూస్వాముల నుండి భూములను స్వాధీనం చేసుకుంటానని ఇవన్నీ భూమిలేనీ, చితికిపోయిన రైతుల శ్రేయస్సుకొరకు చేపడతానని వాగ్దానం చేసింది. కానీ వాస్తవంలో అది ఇంతకు ముందు కనీ వినీ ఎరగని స్థాయిలో శ్రమ జీవులైన రైతాంగాన్నీ ట్రస్టుల, ఫాసిస్టు ప్రభుత్వ యంత్రాంగపు దోపిడీకీ, అణచివేతకు గురి చేయడమే కాకుండా, విస్తృతరైతాంగ ప్రజాబాహుళ్యాన్ని బడా భూస్వాముల, బ్యాంకుల, వడ్డీవ్యాపారుల దోపిడీకి మరింతగా గురిచేస్తుంది.

"జర్మనీ రైతుల రాజ్యంగా ఉంటుంది. అలా కాకపోతే దానికి మనుగడే లేదు"నీ హిట్లర్ ఉద్ఘాటించాడు. అయితే జర్మన్ రైతాంగం హిట్లర్ పరిపాలనలో ఏం పొందగలిగారు? అంతకుముందే రద్దుగావించబడిన ఋణాల విముక్తా? లక్షలాది రైతుల కొడుకులు, కూతుళ్ళు గ్రామాలు విడిచి కఠిక దరిద్రులుగా బ్రతికేలా చేసిన రైతుల ఆస్తులపై వారసత్వ హక్కుపై చేసిన చట్టమా? స్వేచ్ఛగా తమ ఇష్టం వచ్చిన చోట కూలీలుగా పనిచేసుకునే ప్రాథమిక హక్కును కూడా రద్దు చేయడం వలన వ్యవసాయ కార్మికులు అర్ధబానిసలుగా మార్చివేయబడ్డారు. శ్రమజీవులైన రైతులు తాము పండించిన పంటకు మార్కెట్‌లో అమ్ముకునే అవకాశాన్ని కూడా కోల్పోయారు.

ఇక పోలెండ్‌లో?

పోలీష్ వార్తాపత్రికా జాస్ ఈ విధంగా రాసింది. "పోలీష్ రైతు మధ్యయుగాలలో ఉపయోగించిన పద్ధతులు, సాధనాలు ఉపయోగిస్తున్నాడు. అతడు తన ఇంటి స్టౌలో నిప్పు చేసి తన పొరుగువాడికి అరువు ఇచ్చేవాడు. అగ్గిపుల్లను అనేక భాగాలుగా చీల్చి వాడుకుంటున్నాడు. అతడు మురికి సబ్బునీళ్ళను ఇతరులకు అరువు ఇస్తున్నాడు. ఉప్పునీటికొరకు ఉప్పుచేపల ముళ్ళను మరగబెట్టుకొనుచున్నాడు. ఇదేదో కట్టుకథ కాదు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న వాస్తవ పరిస్థితి. ఎవరైనా ఇందులో నిజాన్ని ప్రత్యక్షంగా చూస్తే ఒప్పుకోగలరు".

కామ్రేడ్స్! ఇది కమ్యూనిస్టు రాసింది కాదు. ఒక అభివృద్ధి నిరోధక పోలీష్ పత్రిక రాసింది. అన్ని తెలుసుకోవడానికి ఇదొక్కటే చాలదు.

ప్రతిరోజు ఫాసిస్టు జర్మనీ నిర్బంధ శిబిరాలలో, గెస్టపో (జర్మనీ గూఢచారి శాఖ) నేలమాళిగలలో, పోలెండ్‌లో చిత్రహింసలు పెట్టే గదులలో, బల్గేరియా, పిన్‌లాండ్‌లలోని రహస్య పోలీస్ సెల్‌లలో, బెల్‌గ్రేడ్‌లోని "గ్లావ్నియాబి"లో, దుమేనియాలోని "శిగురాంజ"లో, ఇటాలియన్ దీవులలో మానవజాతి మహోజ్వల భవిష్యత్ కోసం పోరాటం సాగించే కార్మికవర్గపు, విప్లవరైతాంగ ఉత్తమ పుత్రులు అత్యంత ధారుణమైన చిత్రహింసలకూ, అవమానాలకు గురిచేయబడుతున్నారు. వారిని పెడుతున్న చిత్రహింసలు, అవమానాల ముందు జారిస్టు రహస్య పోలీసుల అత్యంత హేయమైన నికృష్టపు చర్యలు వెలవెలబోతాయి. క్రూరులైన జర్మన్ ఫాసిస్టులు భార్యల ముందే వారి భర్తలను రక్తపు ముద్దలుగా చితకగొడుతున్నారు. హత్యచేసిన శవాల హస్తికలను పోస్టులు, పార్సిల్స్ ద్వారా వారి తల్లులకు పంపుతున్నారు. సంతాన నిరోధక ఆపరేషన్లు రాజకీయయుద్ధంలో ఒక పద్ధతిగా రూపొందించారు. చిత్రహింసలు పెట్టే గదులలో చిక్కిన ఫాసిస్టు వ్యతిరేకులకు విషపూరితమైన ఇంజక్షన్‌లు ఇవ్వడం, వారి చేతులను ఇరగగొట్టడం, వారి గుడ్లను పీకివేయడం, వారిని వేలాడదీసి వారి శరీరాలలోకి నీళ్ళను పంప్‌చేయడం, బ్రతికి ఉండగానే వారి శరీర భాగాలపై ఫాసిస్టు స్వస్థిక్ గుర్తులను చెక్కుతున్నారు.

జర్మనీ, పోలెండ్, ఇటలీ, ఆస్ట్రియా, బల్గేరియా, యుగోస్లావేకియాలలో చంపబడినవారీ, గాయపడ్డవారీ, అరెస్టుచేయబడినవారీ, అంగవిహీనులను చేయబడినవారీ, చిత్రహింసలపాలు చేసి చంపబడినవారి వివరాలకు సంబంధించి విప్లవపోరాటయోధుల సహాయక అంతర్జాతీయ సంస్థ అయిన "అంతర్జాతీయ ఎర్ర సహాయం" సంస్థ తయారు చేసిన వివరాల పట్టిక నా వద్ద ఉన్నది. ఒక్క జర్మనీలోనే జాతీయ సోషలిస్టులు అధికారంలోకి వచ్చిన తర్వాత 4,200పైగా ఫాసిస్టు వ్యతిరేక కార్మికులు, రైతులు, ఉద్యోగులు, మేధావులు, కమ్యూనిస్టులు, సోషల్ డెమోక్రాట్లు, ప్రతిపక్ష క్రిష్టియన్ సంస్థకు చెందిన సభ్యులు చంపబడ్డారు. 3,17,800 మంది అరెస్టు చేయబడ్డారు. 2,18,600 మంది గాయపడటం ఒళ్ళు జలదరించే చిత్రహింసలకు గురిచేయబడ్డారు. ఆస్ట్రియాలో గత సంవత్సరం ఫిబ్రవరిలో జరిగిన పోరాటాల నుండి "క్రిష్టియన్" ఫాసిస్టు ప్రభుత్వం 1900 మంది విప్లవ కార్మికులను హత్య చేసింది. 10,000 మందిని గాయపర్చి అంగవిహీనులను చేసింది. 40,000 మందిని అరెస్టు చేసింది. కామ్రేడ్స్; ఈ పట్టిక సంపూర్ణమైన జాబితా కాదు.

అనేక ఫాసిస్టు దేశాలలో శ్రమజీవులనుభవిస్తున్న చిత్రహింసలు పంచుకుంటే మనలో పెల్లుబికే క్రోదావేశాలను వర్ణించుటకు నాకు మాటలు రావడం లేదు. అనేక పెట్టుబడిదారీ దేశాలలో నిత్యజీవితంలో కార్మికవర్గంపైన తెల్లబీభత్సం కొనసాగిస్తున్న చిత్రహింసలు, దోపిడీకి సంబంధించి నేను పైన పేర్కొన్న అంకెల వివరాలు పూర్తి చిత్రీకరణలను, నూరవవంతు ప్రతిబింబించవు. శ్రమజీవులపై ఫాసిజం జరుపుతున్న లెక్కలేనన్ని క్రూరమైన దాడులు వర్ణించడానికి అనేక సంపుటాలు కూడా సరిపోవు.

అత్యంత ప్రగాఢమైన ఉద్వేగ భావాలతో ఫాసిస్టుకసాయిగాళ్ళపట్ల తీవ్ర ద్వేషంతో ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో అమరులైన వేలాది మంది కమ్యూనిస్టులు, సోషల్ డెమోక్రట్లు, ఏ పార్టీకి చెందని కార్మికులు, రైతులు, అభ్యుదయ మేధావివర్గానికి చెందిన ప్రతినిధులు, ముఖ్యంగా చిరస్మరణీయులైన జర్మనీకి చెందిన జాన్‌శీర్, ఫియాటేషుల్జ్, లట్టెన్సలు ఆస్ట్రియాకు చెందిన కోలోమాన్ వాలిస్క్, మ్యూనిచ్‌రీటర్‌లు, హంగేరియాకు చెందిన సల్లాయ్, ఫర్ట్సలు, బల్గేరియాకు చెందిన కోఫార్డ్‌జీవ్, లూటీబ్రోస్కీ, వాయ్‌కోల్‌లాంటి అమరవీరుల సంస్కరణార్థం

మనం కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ పతాకాన్ని అవనతం చేద్దాం.

ఈ వేదిక నుండే మనం మన మహాసభ గౌరవాధ్యక్షుడు, జర్మన్ కార్మికవర్గ నాయకుడైన కామ్రేడ్ థాల్‌మాన్‌కు అభినందనలు తెలియజేద్దాం (బిగ్గరగా హర్షధ్వానాలు. అందరు లేచి నిలబడతారు). కామ్రేడ్స్ రకోసి, గ్రామ్‌స్కీలకు మన అభినందనలు (బిగ్గరగా హర్షధ్వానాలు అందరు లేచి నిలబడతారు). యాంటీకెయినన్, యాంకోపానోవ్‌లకు మన అభినందనలు. విప్లవ ప్రతీఘాతకులచే ఖైదు చేయబడిన స్పానిష్ సోషలిస్టుల నాయకుడు కాబెరెల్లోకు, 18 సంవత్సరాల నుండి జైళ్ళో మగ్గుతున్న టామ్‌మూనేకు, పెట్టుబడిదారీ విధానానికీ, ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుతూ ఖైదీలుగా వున్న వేలాది మందికి మనం అభినందనలు తెలియజేద్దాం (బిగ్గరగా హర్షధ్వానాలు). వారికి మన మాటగా "పోరాటసహయోధులారా! సాయుధులైన సోధరులారా, మిమ్ముల్ని మేము మరచిపోలేదు. మేము మీతోనే ఉన్నాం. మా జీవితాల్లో ప్రతిక్షణం, ప్రతి రక్తపు బొట్టు మీ విముక్తికై ధారపోస్తాం. సిగ్గులేని ఫాసిస్టుపాలన నుండి శ్రమజీవులందరి విముక్తికై కృషి చేస్తాం" (బిగ్గరగా హర్షధ్వానాలు. అందరు లేచి నిలబడతారు).

కామ్రేడ్స్, బూర్జువావర్గం అనాగరికమైన భీభత్సంద్వారా శ్రమజీవులపై ఆధిక్యతనూ, నానాటికి పెరుగుతున్న విప్లవ శక్తుల పురోగతిని చాలాకొద్దికాలం అడ్డుకొనుటలో సఫలమైనా, అది బూర్జువావర్గాన్ని దాని పతనావ్యస్థనుండి తప్పించలేదని లెనిన్ మనల్ని హెచ్చరించాడు.

లెనిన్ ఈ విధంగా రాసాడు. "జీవితం దాని పని అది చేసుకుపోతుంది. బూర్జువావర్గం వెర్రెక్కిన అసందర్భపు ప్రేలాపనతో తీవ్రస్థాయికి వెళ్ళి తప్పుల్ని చేయనియ్యండి; ముందుగా బోల్షివిక్‌లపైన పగ తీర్చుకోనియ్యండి; అనేక వందలాది, వేలాదిమంది నిన్నటి, రేపటి బోల్షివిక్కుల(ఇండియా, హంగేరి, జర్మనీ మొదలగు)ను చంపడానికి కృషి చేయనియ్యండి; ఆ విధంగా చేయడం ద్వారా చరిత్ర కాలగర్భంలో మట్టికరుచుకుపోయిన అన్ని వర్గాల మాదిరి బూర్జువావర్గం కూడా అదే పద్ధతిలో ప్రవర్తించుతున్నది. ఏది ఏమైనా భవిష్యత్ తమదేనని కమ్యూనిస్టులు అర్థం చేసుకోవాలి. గొప్ప విప్లవ పోరాటంలో అత్యంత తీవ్రమైన మనోభావాలనూ, బూర్జువావర్గపు వెర్రి అసందర్భపు ప్రేలాపనలను ప్రశాంతంగా, నెమ్మదిగా, ఉద్రేకరహితంగా అంచనా వేయడాన్ని జోడించి కృషి చేయగలం (తప్పనిసరిగా).

మొత్తం ప్రపంచ కార్మికవర్గం, మనం లెనిన్, స్టాలిన్‌లు సూచించిన పంధాను అనుసరించితే, బూర్జువావర్గం ఎన్ని తంటాలు పడినా నాశనం కావడం తధ్యం (హర్షధ్వానాలు).

## ఫాసిజం యొక్క విజయం అనివార్యమా?

ఫాసిజం ఎందుకూ, ఏ విధంగా విజయం పొందగలిగింది?

ఫాసిజం కార్మికవర్గం, శ్రమజీవుల యొక్క అత్యంత దుర్మార్గమైన శత్రువు. ఫాసిజం జర్మనీ, ఆస్ట్రియా, ఇతర ఫాసిస్టు దేశాలలో పదింట తొమ్మిది మంది ప్రజలకు శత్రువు. ఈ దుర్మార్గమైన శత్రువు ఎందుకూ, ఏ విధంగా విజయం సాధించగలిగింది?

సోషల్ డెమోక్రాట్ నాయకులు బూర్జువావర్గం పట్ల అనుసరించిన రాజీ విధానంవల్ల కార్మికవర్గం అనేక చీలికలకు గురై రాజకీయంగా, నిర్మాణరీత్యా బూర్జువావర్గం సాధిస్తున్న దాడులను ఎదుర్కొనడంలో నిరాయుధం చేయబడుటవలన ఫాసిజం ప్రధానంగా అధికారంలోనికి రాగలిగింది. సోషల్ డెమోక్రట్ల పట్టునుండి ప్రజలను విడిపించి ఫాసిజానికి వ్యతిరేకంగా నిర్ణయాత్మక పోరాటానికి నాయకత్వం వహించడానికి కమ్యూనిస్టు పార్టీలు చాలినంత బలంగా లేకపోవడం కూడా మరొక కారణం.

అందువల్ల లక్షలాది సోషల్ డెమోక్రటిక్ కార్మికులు తమ కమ్యూనిస్టు సోదరులతోపాటు ఫాసిస్టు అనాగరిక భీభత్సానికి ఎందుకు గురి చేయబడుతున్నారో తీవ్రంగా ఆలోచించాలి. 1918లో జర్మనీ, ఆస్ట్రియాలలో విప్లవం బ్రద్దలైనప్పుడు ఆస్ట్రియా, జర్మనీ కార్మికవర్గాలు ఆస్ట్రియాకు చెందిన ఒటోబాయర్, ఫెడరిక్ ఎడ్లర్, కారల్ రెన్నర్‌ల, జర్మనీకి చెందిన ఎబర్ట్, షేడ్‌మన్‌లాంటి సోషల్ డెమోక్రట్ నాయకులను అనుసరించకుండా రష్యా బోల్షివిక్కుల మార్గాన్ని అనుసరించి ఉన్నట్లుయితే లెనిన్, స్టాలిన్‌ల మార్గాన్ని అనుసరించి ఉన్నట్లయితే ఫాసిజం ఈనాడు ఆస్ట్రియా, జర్మనీ, ఇటలీ, హంగేరీ, పోలెండ్, బాల్కన్ దేశాలలో ఉండేది కాదు. బూర్జువావర్గానికి బదులుగా కార్మికవర్గం చాలాకాలం కిందటే యూరప్ పరిస్థితిపై ఆధిపత్యాన్ని సంపాధించగలిగేది (హర్షధ్వానాలు).

ఆస్ట్రియన్ సోషల్ డెమోక్రాటిక్ పార్టీనే ఉదాహరణగా తీసుకుందాం. 1918 విప్లవం దాని స్థాయిని అత్యంత ఉన్నత శిఖరాలకు పెంచింది. దాని చేతుల్లో అధికారం కలిగి ఉంది. సైన్యంలోనూ, ప్రభుత్వ యంత్రాంగంలోను బలమైన స్థానాలకు కలిగి ఉంది. ఈ స్థానాలపై అధారపడటం ద్వారా ఫాసిజాన్ని మొగ్గలోనే త్రుంచివేయగలిగేది. కానీ అది కార్మికవర్గపు స్థానాలను ఒకదాని తర్వాత మరొకటి ప్రతిఘటన లేకుండానే వదులుకుంది. బూర్జువావర్గం తన అధికారాన్ని గట్టిపరుచుకొనుటకూ, రాజ్యాంగాన్ని రద్దు చేయుటకూ, ప్రభుత్వ యంత్రాంగం, సైన్యం, పోలీసు సిబ్బంది నుండి సోషల్ డెమోక్రటిక్ కార్యకర్తలను తొలగించివేయిటకూ, కార్మికుల్ని నిరాయుధుల్ని చేయుటకు అది అనుమతినిచ్చింది. ఫాసిస్టు బంధిపోట్లు సోషల్ డెమోక్రటిక్ కార్మికుల్ని నిరాటంకంగా హత్య చేయిటకు అది అవకాశం ఇచ్చింది. హుటెన్‌బర్గ్ ఒప్పందపు శరదులను అంగీకరించడం ద్వారా ఫ్యాక్టరీలలో ఫాసిస్టు శక్తులు ప్రవేశించుటుకు వీలుకలిపించింది. అదే సందర్భంలో సోషల్ డెమోక్రటిక్ నాయకులు పాలకవర్గం, కార్మికవర్గంపై బలప్రయోగానికి దిగితే పార్టీ సార్వాత్రిక సమ్మెకు పిలుపునివ్వడం ద్వారా, సాయుధ పోరాటానికి పిలుపి ఇవ్వడం ద్వారా బూర్జువావర్గపు దాడిని త్రిప్పికొట్టి కార్మికవర్గ నియంతృత్వాన్ని స్థాపించుటకు ప్రయత్నించు మార్గం వింజ్ కార్యక్రమంలో సూచించబడిందని చెప్పి కార్మికుల్ని మోసం చేసారు. కార్మికవర్గంమీద ఫాసిస్టుదాడికి సన్నాహం అయ్యే మొత్తం విధానం రాజ్యాంగ ముసుగులో కార్మికవర్గంపై సాగించబడుతున్న హింసాకాండ గొలుసులో అది ఒక లింకు కానట్టు! ఫిబ్రవరిలో జరిగిన పోరాట సందర్భంలోగానీ, ఆ పోరాటాలు జరిగే క్రమంలోగాని ఆస్ట్రియా దేశపు సోషల్ డెమోక్రటిక్ నాయకులు వీరోచితంగా పోరాడుతున్న గట్స్ బందను అశేష ప్రజానీకం నుండి ఏకాకుల్ని చేసి ఆస్ట్రియన్ కార్మికవర్గం అపజయంపాలు కావడానికి కారకులయ్యారు.

జర్మనీలో ఫాసిజం యొక్క విజయం అనివార్యమా? అనివార్యం కాదు. జర్మన్ కార్మికవర్గం దానిని నిరోధించగలిగి ఉండేది.

ఆ విధంగా చేయాలంటే జర్మన్ కార్మికవర్గం ఫాసిస్టు వ్యతిరేక ఐక్య కార్మికవర్గ ఐక్యసంఘటనను ఏర్పాటు చేయుటకు వత్తిడి చేసి ఉండాల్సింది. సోషల్ డెమోక్రటిక్ నాయకులు కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా సాగిస్తున్న ప్రచారాన్ని ఆపు చేయించి, ఫాసిజానికి వ్యతిరేకంగా ఐక్యసంఘటనకు కలిసి రావాలని కమ్యూనిస్టుపార్టీ పదే పదే చేస్తున్న విజ్ఞప్తులను ఆమోదించాలని ఒత్తిడితెచ్చి ఉండాల్సింది.

ఫాసిజం దాడి చేస్తున్నప్పుడు, బూర్జువావర్గం క్రమక్రమంగా బూర్జువా ప్రజాస్వామ్య హక్కులను రద్దు చేస్తున్నప్పుడు సోషల్ డెమోక్రట్లు నోటిమాట తీర్మానాలతో సంతృప్తి చెంది ఉండవలసింది కాదు. నిజమైన ప్రజాపోరాటంతో త్రిప్పికొట్టి ఉండవలసింది. అప్పుడు జర్మన్ బూర్జువావర్గం తన ఫాసిస్టు పథకాలను పూర్తి చేసుకోవడం మరింత కష్టతరమై ఉండేది.

బ్రాన్‌ను, సెవరింగ్‌ల ప్రభుత్వం "లీగ్ ఆఫ్ రెడ్ ఫ్రంట్ ఫైటర్స్" పైన విధించిన నిషేధాన్ని అడ్డుకొని దాదాపు 10 లక్షల సభ్యత్వం కలిగిన "రీచ్‌బ్యానర్"కు 'లీగ్'కు మధ్య పోరాట ఐక్యతను సాధించుటకు పూనుకొని, ఈ రెండు సంస్థలను సాయుధం చేసి, ఫాసిస్టు మూకలను ఎదిగించి, నిర్మూలించుటకు పూనుకోవలసిందిగా బ్రాన్, సెవరింగ్‌ల ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఉండాల్సింది.

ఫాసిజానికి వ్యతిరేకంగా తక్షణ చర్యలు తీసుకోవలసిందిగా ఫాసిస్టు నాయకులను అరెస్టు చేయిటకు, వాళ్ళ ముద్రణాలయాలను మూసివేయాల్సిందిగా, వాళ్ళ భౌతిక వనరులన్నింటినీ స్వాధీనం చేసుకోవాల్సిందిగా, ఫాసిస్టు ఉద్యమానికి ఆర్థిక సహాయం అందిస్తున్న పెట్టుబడిదారుల ఆస్తులను స్వాధీనం చేసుకోవాల్సిందిగా, ఫాసిస్టు సంస్థలన్నింటినీ నిషేధించాల్సిందిగా ప్రష్యన్ ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న సోషల్ డెమోక్రటిక్ నాయకులపై జర్మన్ కార్మికవర్గం ఒత్తిడి తెచ్చి ఉండాల్సింది.

ఇంతేకాక అన్ని రకాల సాంఘీక సహాయం చర్యలను పున:స్థాపించి విస్తృతపరిచేలా చేసి, అప్పుల వసూళ్ళపై నిషేదాన్ని విధింపజేసి ఆర్థిక సంక్షోభంలో చిక్కుకొని నలిగిపోయిన రైతాంగానికి సహాయాన్ని అందజేయుటకు బ్యాంకులపైనా, ట్రస్టులపైనా పన్నులు విధించాలని డిమాండ్ చేసిఉండాల్సింది. ఈ విధంగా చేయడం ద్వారా జర్మన్ కార్మికవర్గం శ్రమజీవులైన రైతాంగపు అండదండలను సాధించుకోగలిగేది. జర్మనీలోని సోషల్ డెమోక్రట్లు అలా చేయకపోవడంవల్ల పెద్దనేరం చేసారు. అందువల్లనే ఈ ఫాసిజం విజయం సాధించగలిగింది.

రైతాంగపోరాటంతో కార్మికవర్గ తిరుగుబాటు జోడించబడిన అనుకూలమైన వాతావరణంగల స్పెయిన్‌లాంటి దేశంలో బూర్జువావర్గం, భూస్వామ్య (ప్రభు) వర్గం అనివార్యంగా విజయం సాధించి ఉండేవారా?

విప్లవ ప్రారంభపు రోజులనుండి స్పానిష్ సోషలిస్టులు అధికారంలో ఉన్నారు. వాళ్ళు కమ్యూనిస్టులు, అరాచకవాదులతో సహా అన్నిరకాల భావాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కార్మికవర్గ సంస్థలమధ్య పోరాటఐక్యతను సాధించారా? వారు కార్మికవర్గాన్ని ఒకే ఐక్యకార్మికవర్గ సంస్థక్రింద ఐక్యపరుచుటకు కృషి చేసారా? రైతాంగాన్ని విప్లవంవైపు మలుచుకొనుటకు భూస్వాముల, చర్చి, మఠాలయొక్క మొత్తం భూములను రైతాంగానికనుకూలంగా స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేసారా? కెటలోనియన్‌ల, బాస్క్యూల జాతీయ స్వయంనిర్ణయాధికారం కొరకూ, మొరాకో విముక్తి కొరకు పోరాడటానికి వారు ప్రయత్నించారా? సైన్యం నుండి రాచరిక అనుకూల, ఫాసిస్టు అనుకూల శక్తులను తొలగించి అది కార్మికుల, రైతులవైపు మరల్చుటకు ప్రయత్నించారా? ప్రతి ప్రజాఉద్యమాన్ని అణచివేస్తున్న, ప్రజలచే తీవ్రంగా అసహ్యించుకోబడుతున్న సివిల్‌గార్డ్‌లను వారు రద్దు చేసారా? గిల్ రోబుల్స్ నాయకత్వంలోని ఫాసిస్టుపార్టీనీ, కేథలిక్ చర్చి యొక్క చర్చిని దెబ్బతిసారా? లేదు. ఈ పనులలో ఏ ఒక్కటి చేయలేదు. అభివృద్ధి నిరోధక బూర్జువా, భూస్వామ్య వర్గాల ఫాసిస్టుల దాడిని తిప్పికొట్టడానికి ఐక్యంగా కృషి చేయడానికి కలిసిరావలసిందిగా కమ్యూనిస్టులు పదే పదే చేసిన ప్రతిపాదనలను వారు తిరస్కరించారు. కోర్టోస్ (పార్లమెంట్)లో అభివృద్ధి నిరోధకులు మెజారిటీ సాధించుటకు అవకాశం కల్పించే ఎన్నికల చట్టాలను చేసారు. ప్రజాఉద్యమాలను అణచివేసే చట్టాలను చేసారు. వీరోచిత ఆస్టురియా గని కార్మికులపై విచారణ జరుపుటకు అవకాశం కల్పించే చట్టాలను చేసారు. భూమికోసం పోరాడుతున్న రైతాంగాన్ని సివిల్ గార్డ్‌ల చేత కవ్వించడం లాంటి చట్టాలను వారు చేసారు.

ఈ విధంగా సోషల్ డెమోక్రట్లు కార్మికవర్గ శ్రేణులను చీల్చడం ద్వారా, నిర్మాణాన్ని విచ్ఛిన్నం చేయడం ద్వారా జర్మనీలో, ఆస్ట్రియాలో, స్పెయిన్‌లో ఫాసిజం అధికారంలోకి రావడానికి మార్గం సుగమం చేసారు.

కామ్రేడ్స్! కార్మికవర్గం తన సహజ మిత్రవర్గాలనుంచి వేరుపడిపోవడం కూడా ఫాసిజం విజయం పొందడానికి మరొక కారణంగా పేర్కొనవచ్చు. కార్మికవర్గం పేరుతో సోషల్ డెమోక్రట్లు రైతాంగ వ్యతిరేక విధానాన్ని అనుసరించడం వల్లన రైతాంగ ప్రజా బాహుళ్యాన్ని తనవైపు త్రిప్పుకొని విజయాన్ని సాధించడానికి ఫాసిజానికి అవకాశం ఏర్పడింది. అధికారంలో ఉన్న అనేక సోషల్ డెమోక్రటిక్ ప్రభుత్వాలు కార్మికవర్గానికి సంబంధించిన ప్రభుత్వాల విధానాలనే రైతాంగం చూడగలిగింది. అందుకు కారణం ఈ ప్రభుత్వాలు రైతుల అవసరాలు తీర్చుటకు గానీ, రైతులకు భూములు పంచడం గురించిగాని పట్టించుకోకపోవడమే. జర్మనీలో సోషల్ డెమోక్రట్లు భూస్వాముల జోలికి పోలేదు. పైగా వ్యవసాయ కార్మికుల సమ్మెలపై దెబ్బతిసారు. దీని ఫలితంగా హిట్లర్ అధికారంలోకి రావడానికి చాలాముందు నుండే, జర్మనీలోని వ్యవసాయ కార్మికులు సంస్కరణవాద కార్మికసంఘాలను వదిలి ఎక్కువ సందర్భాలలో స్టాల్ హెల్మ్, జాతీయ సోషలిస్టులవైపు చేరడం జరిగింది.

ఫాసిజం యువకులలోని శ్రేణులలోకి చొచ్చుకుపోవడం ద్వారా విజయం పొందగలిగింది. కానీ సోషల్ డెమోక్రాట్లు కార్మికవర్గ యువకులను వర్గపోరాటాలనుండి ప్రక్కకు మరల్చారు. అదే సందర్భంలో విప్లవ కార్మికవర్గం యువజనులను చైతన్యపరిచి అవసరమైన కృషిని అభివృద్ధి పరచడం, వారి నిర్దిష్ట ప్రయోజనాలు, డిమాండ్ సాధన కొరకు పోరాటాన్ని నిర్మించుటకు తగిన జాగరూకతను ప్రదర్శించలేకపోయింది. అందువల్లనే ఫాసిజం విజయం సాధించగలిగింది. ఫాసిజం మిలిటెంట్ కార్యక్రమానికి యువజనుల ఆవశ్యకతను గుర్తించగలిగింది. గనుకనే యువజనులలో చెప్పుకోదగిన

భాగాన్ని తన పోరాట శ్రేణులలోకి ఆకర్షించుకోగలిగింది. నూతన తరానికి చెందిన యువతీ, యువకులకు యుద్ధం తెచ్చిపెట్టే భయానక దుష్పరిణామాలు అనుభవేద్యం కావు. వారు ఆర్థికసంక్షోభ బారాన్నీ, నిరుద్యోగాన్నీ, బూర్జువా ప్రజాస్వామ్య విచ్ఛిన్నాన్ని చవిచూసారు. ఆశాజనకమైన భవిష్యత్ గోచరించని విశాల యువజనులు తాను అధికారంలోకి రావడం జరిగితే ఆకర్షణీయమైన భవిష్యత్‌ను వారికి కలిగిస్తానని తన వాగాడంబర నినాదాలతో ఫాసిజం కొనసాగించిన ప్రచారానికి వారు లోనయ్యారు.

ఫాసిజానికి వ్యతిరేకంగా మనం సాగిస్తున్న పోరాటంలో కమ్యూనిస్టు పార్టీలు చేసిన అనేక పొరపాట్లు అడ్డంకిగా తయారైన విషయాన్ని ఈ సందర్భంలో పరిగణలోకి తీసుకోక తప్పదు.

మన శ్రేణుల్లో ఫాసిస్టు ప్రమాదాన్ని సహించలేనంత తక్కువ అంచన వేసినవారు కూడా ఉన్నారు. ఈ ధోరణి ఈ నాటికి కూడా ప్రతి చోట అధిగమించబడలేదు. ఈ ధోరణికి సంబంధించినదే మన పార్టీలలో ఇంతకు ముందు నుంచి "జర్మనీ, ఇటలీ కాదు" అనే అభిప్రాయం ఉండేది. దీనర్థం ఫాసిజం ఇటలీలో విజయం పొందినప్పటికీ, జర్మనీలో విజయం పొందే ప్రశ్న ఉత్పన్నం కాదు. ఎందుకంటే జర్మనీ పారిశ్రామికంగా, సాంస్కృతికంగా బాగా అభివృద్ధి చెందిన దేశం. 40 సంవత్సరాల కార్మికోద్యమ సాంప్రదాయం కలిగిన దేశం. కనుక ఫాసిజం విజయం పొందుట అసాధ్యం. అలానే ఈనాడు 'సాంప్రదాయక' బూర్జువా ప్రజాస్వామ్య దేశాలలో ఫాసిజానికి తావే లేదని మరొక అభిప్రాయాన్ని మనం ఎదుర్కొంటున్నాం. ఇలాంటి అభిప్రాయాలు ఫాసిస్టు ప్రమాదం జాగరూకతను బలహీనపర్చుటకు తోడ్పడ్డవి. అలా తోడ్పడినవి కూడా దీనివలన ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో కార్మికవర్గాన్ని సమీకరించడం కష్టమవుతుంది.

ఫాసిస్టు తిరుగుబాట్లను కమ్యూనిస్టులు గుర్తించలేదనె విషయంలో ఎవరైనా అనేక ఉదాహరణ పేర్కొవచ్చు. బల్గేరియాలో 9-6-1923న తిరుగుబాటు జరిగినప్పుడు మన పార్టీ నాయకత్వం 'తటస్థ', వాస్తవంలో అవకాశవాద వైఖరిని అవలంభించుట జ్ఞాపకం చేసుకొండి. 1926, మేలో పోలెండ్‌లో పిల్‌స్డూస్కీ యొక్క ఫాసిస్టు తిరుగుబాటు స్వభావాన్ని గుర్తించలేకపోవడం వలన, పోలీష్ విప్లవానికి చోధకశక్తులను తక్కువ అంచన వేయడం వలన కమ్యూనిస్టుపార్టీ నాయకత్వం జరుగుతున్న ఘటనల వెంట కొట్టుకుపోయింది. పిన్‌లాండ్‌లో మన పార్టీ ఫాసిజం నెమ్మదిగా, క్రమక్రమంగా అభివృద్ధి చెందుతుందనే తప్పుడు అభిప్రాయంలో ఉండి, బూర్జువావర్గంలోని నాయకత్వ స్థానంలో ఉన్న గ్రూపు ఫాసిస్టు తిరుగుబాటుకు సన్నాహాలు చేస్తున్న సంగతిని గ్రహించలేకపోయింది. ఫాసిస్టు తిరుగుబాటు వచ్చినప్పుడు పార్టీ, కార్మికవర్గం దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

జర్మనీలో జాతీయ సోషలిజం అప్పటికే ప్రమాదకరమైన ప్రజాఉద్యమంగా తయారైన పరిస్థితులలో, బ్రూనింగ్ ప్రభుత్వం ఫాసిస్టు నియంతృత్వ ప్రభుత్వంగా అప్పటికే రూపొందించినట్లు భావించిన కొంతమంది కామ్రేడ్స్ ముఖ్యంగా హెంజ్, న్యూమన్‌లాంటివారు అతిశయంతో "హిట్లర్ చేప్తున్న 'మూడవ సామ్రాజ్యం' రావటం అంటూ జరిగితే, అది 6 అడుగుల లోతునా భూస్థాపితం చేయబడుతుంది. దాని పునాదులపై విజయవంతమైన కార్మికవర్గ అధికారం స్థాపించబడుతుంద"ని ప్రకటించారు.

జర్మనీలో మన కామ్రేడ్స్ చాలా కాలందాక వర్సైయిల్స్ సంధి ఫలితంగా ప్రజలలో రగులుకుంటున్న క్రోదావేషాలనూ, గాయపర్చబడిన జాతీయ భావాలను అంచనా కట్టడంలో విఫలులైనారు. రైతాంగం, పెటీబూర్జువా శ్రేణులలోని ఊగిసలాటలు అంతగా పరిగణలోనికి తీసుకోవలసినది కాదన్నట్లు వ్యవహరించారు. వారు సాంఘీక, జాతీయ విముక్తి కార్యక్రమాన్ని చాలా ఆలస్యంగా రూపొందించారు. వారు ప్రజలముందు ఉంచినప్పుడు అది వారి అప్పటి స్థాయికీ, వారి నిర్దిష్టమైన డిమాండ్‌లకు అనుగుణంగా లేకపోయింది. ఈ కార్యక్రమాన్ని వారు ప్రజలలో ఎక్కువగా ప్రచారం కూడా చేయలేకపోయారు.

అనేక దేశాలలో ఫాసిజానికి వ్యతిరేకంగా అవసరమైన పోరాటాన్ని అభివృద్ధి చేయుటకు బదులు ఫాసిజం యొక్క 'సాధారణ' లక్షణాలను గురించి పనికిమాలిన చర్చలకు పూనుకోవడం. పార్టీ వాస్తవంగా ఎదుర్కొంటున్న రాజకీయ సమస్యలను చేపట్టి పరిష్కరించే విషయంలో కూడా సంకుచిత ఒంటెత్తు ధోరణులను అనుసరించారు.

కామ్రేడ్స్,

ఫాసిజం విజయం చెందడం గురించి మాట్లాడటంకానీ, కార్మికవర్గం అపజయం పొందడంలో సోషల్ డెమోక్రాట్ల చారిత్రక బాధ్యతను ఎత్తిచూపడంలోగానీ, ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో మనం చేసిన తప్పులను ఎత్తిచూపడంలో గతాన్ని త్రవ్వితోడాలని ఉద్దేశ్యం మాత్రమే మనది కాదు. మనం వాస్తవ జీవన విధానాన్నుండి విడిపోయిన చరిత్రకారులము కాము. కార్మికవర్గంయొక్క చురుకైన పోరాట యోధులుగా లక్షలాది కార్మికుల మనసులలో తీవ్రంగా వేధిస్తున్న ఫాసిస్టు వియజాన్ని అడ్డుకొనగలిగి ఉండేవాళ్ళమా? అయితే ఎలా? అన్న ప్రశ్నకు చెప్పవలసిన బాధ్యత మనపై ఉంది. లక్షలాది కార్మికులకు మన సమాధానం; అవును, కామేడ్స్, ఫాసిజం యొక్క మార్గాన్ని మనం అడ్డుకొనగలిగేవాళ్ళం. అది తప్పకుండా సాధ్యమే. ఈ పని కార్మికులు, రైతాంగం కష్టజీవులైన మనందరిపై ఆధారపడి ఉంది.

ఫాసిజం విజయాన్ని అడ్డుకోగలిగేవారమా అన్నది మొట్టమొదటగా కార్మికవర్గం మిలిటెంట్ కార్యక్రమాలను నిర్వర్తించడంపైనా; పెట్టుబడిదారీ విధానం, ఫాసిజం సాగిస్తున్న దాడిని త్రిప్పికొట్టుటకు కార్మికవర్గ శ్రేణులు ఒకే ఒక్క మిలిటెంట్ సైన్యాన్ని సంఘటితపడుటపైనా ఆధారపడి ఉంటుంది. కార్మికవర్గం తన పోరాట ఐక్యతను సాధించుకున్న తర్వాత, రైతాంగం, పట్టణ పెటీబూర్జువా, యువకులు, మేధావులపై ఫాసిజం ప్రభావాన్ని సడలింపజేసి, ఒక సెక్షన్‌ని తటస్తం చేసి, మరొకసెక్షన్‌ను తమవైపు త్రిప్పుకొనగలిగి ఉండేవారు.

రెండవవది; ఫాసిజానికి వ్యతిరేకంగా శ్రమజీవుల పోరాటాన్ని సరైన పంథాలో నడిపించగలిగిన బలమైన విప్లవపార్టీ కలిగి ఉండటం మీద అది అధారపడి ఉంటుంది. ఫాసిజం దాడి సాగిస్తున్నప్పుడు కార్మికులను తిరోగమించవలసినదిగా పద్ధతి ప్రకారం పిలుపునిచ్చే పార్టీ, ఫాసిస్టు బూర్జువావర్గం తన స్థానాలను పటిష్టం చేసుకోవడానికి అవకాశమిచ్చే పార్టీ కార్మికులు తప్పనిసరిగా అపజయం పాలు కావడానికి మాత్రమే తోడ్పడుతుంది.

మూడవది; కార్మికవర్గం రైతాంగంపట్ల, పట్టణ, పెట్టీబూర్జువా ప్రజానీకం పట్ల సరైన విధానం అవలంభిస్తున్నదా? లేదా అనే దానిపై ఆధారపడి ఉంటుంది. ఈ ప్రజలకు సంబంధించి వారి ఎట్ల ఉన్నారో అట్లానే వాళ్ళను పరిశీలించాలి తప్ప, మనం కోరుకున్న విధంగా వారు

ఉన్నారని ఊహించకూడదు. పోరాట క్రమంలోనే వారు తమ అనుమానాలనూ, ఊగిసలాటలను అధిగమించగల్గుతారు. వారి వర్గస్వభావరీత్యా తప్పనిసరి అయిన ఊగిసలాటపట్ల మనం ఓర్పుతో కూడిన వైఖరిని అనుసరించినప్పుడే, కార్మికవర్గం రాజకీయంగా వారికి సహాయం అందించగల్గినప్పుడే వారు ఉన్నతస్థాయికి చెందిన విప్లవ చైతన్యాన్ని, కార్యచరణను అందుకోగల్గుతారు.

నాల్గవది; విప్లవ కార్మికవర్గం అప్రమత్తతలో ఉండి సరైన కాలంలో తగిన చర్యలు తీసుకుంటుందా? లేదా అనే దానిపై అది ఆధారపడి ఉంటుంది. ఫాసిజం తనని దిక్కు తోచని స్థితికి నెట్టివేయడానికి అనుమతించరాదు. ఫాసిజానికి ముందు చొరవకు అవకాశమివ్వరాదు. ఫాసిజం తన శక్తులను కూడదీసుకొనకముందే దానిపై నిర్ణయాత్మకమైన దెబ్బ తీయాలి. ఫాసిజం తన స్థానాలను పదిలపర్చుకోవడానికి అవకాశం ఇవ్వరాదు. ఫాసిజం ఎక్కడా, ఎప్పుడు తలెత్తిన దాన్ని త్రిప్పికొట్టాలి. ఫాసిజం నూతన స్థానాలను పొందకుండా చూడాలి. ఫ్రెంచ్ కార్మికవర్గం పై విషయాలను చాలా విజయవంతంగా చేస్తున్నది.

ఫాసిజం అభివృద్ధి చెందకుండా అడ్డుకొనడానికీ, అధికారానికి రాకుండా చేయడానికి ఇవి ప్రధాన షరతులు.

## ఫాసిజం-ఒక భయంకరమైనది-కాని అస్థిరమైన శక్తి

బూర్జువా ఫాసిస్టు నియంతృత్వం ఒక భయంకరమైన శక్తి. అయితే అది అస్థిరమైనది.

ఫాసిస్టు నియంతృత్వం యొక్క అస్థిరతకు ప్రధాన కారణాలు ఏమిటి?

బూర్జువావర్గ శిబిరంలో తలెత్తిన శతృవైరుధ్యాలు, అనైక్యతను అధిగమించడానికి ఫాసిజం కృషి చేస్తున్న సందర్భంలో ఈ శతృవైరుధ్యాలు మరింత తీవ్రరూపం దాల్చడానికై దాని కృషి దోహదం చేస్తుంది. ఇతర రాజకీయ పార్టీలను హింసాత్మకంగా నాశనం చేయడంద్వారా తన రాజకీయ గుత్తాధికారాన్ని నెలకొల్పుకొనుటకు ఫాసిజం ప్రయత్నిస్తుంది. కానీ పెట్టుబడిదారీ విధానం ఉనికి, వివిధ వర్గాల ఉనికి కారణంగా తీవ్రతరమయ్యే వర్గవైరుధ్యాలు తప్పనిసరిగా ఫాసిజం యొక్క రాజకీయ గుత్తాధికారాన్ని తొలిచివేసి బ్రద్దలుకావడానికి దారితీస్తుంది. కానీ సోవియట్ దేశ పరిస్థితి ఇదికాదు. అక్కడ కార్మికవర్గ నియంతృత్వం, కార్మికవర్గపార్టీ రాజకీయ గుత్తాధికారం ద్వారా నెలకొల్పబడినప్పటికీ, ఆ రాజకీయ గుత్తాధికారం కోటానుకోట్ల శ్రమజీవుల ప్రయోజనాలకనుగుణ్యమైనది కాబట్టి, వర్గరహిత సమాజ స్థాపనకు మరింతగా కృషి చేయుటకు తోడ్పడుతుంది. ఫాసిస్టు దేశాలలో ఫాసిస్టుపార్టీ తన గుత్తాధికారాన్ని ఎక్కువకాలం నిలుపుకొనలేదు. ఎందువలనంటే దాని లక్ష్యం వర్గవైరుధ్యాలనూ, వర్గాలను రద్దు పరుచుట కాదు. అది బూర్జువా పార్టీల చట్టబద్ద ఉనికిని రద్దు చేస్తుంది. బూర్జువా పార్టీలలో అనేకం రహస్యంగా తమ ఉనికిని నిలబెట్టుకొనుచున్నాయి. అయితే కమ్యూనిస్టు పార్టీ రహస్యంగా పనిచేసే పరిస్థితులలో కూడా అభివృద్ధి చెందుతూ, నిలద్రొక్కుకొని, రాటుదేలి ఫాసిస్టు నియంతృత్వానికి వ్యతిరేకంగా కార్మికవర్గం జరిపే పోరాటానికి నాయకత్వం వహిస్తుంది. అందువల్ల వర్గవైరుధ్యాలు సమ్మెటపోట్ల కింద ఫాసిజం యొక్క రాజకీయ గుత్తాధికారం అనివార్యంగా బ్రద్దలై నశించిపోతుంది.

ఫాసిస్టు నియంతృత్వ అస్థిరతకు మరొక కారణం ఫాసిజం తన వాగాడంబరంతో చేసే పెట్టుబడిదారీ వ్యతిరేక నినాదాలకూ, గుత్తపెట్టుబడిదారీ వర్గాన్ని దారిదోపిడీ దొంగల పద్ధతిలో మరింతగా పెంచి పోషించే దాని చర్యలకు మధ్యగల తేడా ఫాసిజం యొక్క వర్గస్వభావాన్ని నగ్నంగా బహిర్గతం చేయుటవల్ల దాని ప్రజాపునాది సంకుచితమై కదిలిపోవటమే.

అంతేకాక, ఫాసిజం యొక్క విజయం ప్రజానీకంలో తీవ్రమైన ద్వేషాన్నీ, కోపాన్ని పెంచుతుంది. ప్రజలు విప్లవీకరించబడి ఫాసిజానికి వ్యతిరేకంగా కార్మికవర్గ ఐక్యసంఘటనకు శక్తివంతమైన ప్రోత్సాహకారిగా అది దోహదం చేస్తుంది.

ఆర్థిక జాతీయ విధానాన్ని అనుసరించడం ద్వారా, యుద్ధ తయారీలకోసం జాతీయాదాయంలో ఎక్కువభాగం గుంజుకోవడం ద్వారా ఫాసిజం మొత్తం దేశంలోని ఆర్థిక పరిస్థితిని క్షీణింపజేస్తోంది. పెట్టుబడిదారీ రాజ్యాల మధ్య ఆర్థికయుద్ధాన్ని తీవ్రతరం చేస్తుంది. అది బూర్జువావర్గంలో తలెత్తే ఘర్షణలకు చాలా పదునైన, కొన్ని సందర్భాలలో రక్తపాతంతో కూడుకొన్న ఘర్షణలకు దారితీసే స్వభావాన్ని సంతరింపజేస్తోంది. కనుక అది ప్రజల దృష్టిలో ఫాసిస్టు ప్రభుత్వాధికార స్థిరత్వాన్ని గురించిన అంచనాను తగ్గించి వేస్తుంది. జర్మనీలో గత సంవత్సరం జూన్ 30వ తేదీన జరిగినట్లుగా ప్రభుత్వమే తన అనుచరులను హత్య చేస్తుంది. ఫాసిస్టు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఫాసిస్టు బూర్జువావర్గంలోని మరొక సెక్షన్ సాయుధపోరాటం సాగిస్తున్నప్పుడు (ఆస్ట్రియాలోని జాతీయ సోషలిస్టు పుచ్, పోలెండ్, బల్గేరియా, ఫిన్‌లాండ్ తదితర దేశాలలోని ఫాసిస్టు ప్రభుత్వాలకై వేరు వేరు ఫాసిస్టు గ్రూపులు జరిపిన హింసాత్మక దాడులు)– ఇలాంటి స్వభావం కలిగిన ప్రభుత్వం విశాల పెటీబూర్జువా ప్రజానీకం దృష్టిలో తన అధికారాన్ని ఎక్కువకాలం నిలబెట్టుకొనగలదనే నమ్మకం కలిగించజాలదు.

కార్మికవర్గం బూర్జువా శిబిరంలోని శతృవైరుధ్యాలనూ, ఘర్షణలను తనకనుకూలంగా వినియోగించుకోగలగాలి. అయితే ఫాసిజం దానంతటదే నాశనమవుతుందనే భ్రమలను కలిగి యుండరాదు. ఫాసిజం దానంతటదే పతనం కాదు. బూర్జువా శిబిరంలో తప్పనిసరిగా తలెత్తే ఘర్షణలను సరిగా వినియోగించుకోగలిగిన కార్మికవర్గం యొక్క విప్లవ కార్యాచరణ మాత్రమే ఫాసిస్టు నియంతృత్వాన్ని బలహీనపర్చి కూలద్రోయగలదు.

బూర్జువా ప్రజాస్వామ్యం యొక్క అవశేషాలను నాశనం చేయడం ద్వారా, బహిరంగ హింసాకాండను ఒక ప్రభుత్వరూపం స్థాయికి తీసుకుపోవడం ద్వారా ఫాసిజం శ్రమజీవులలో ప్రజాస్వామ్య భ్రమలు చట్టబద్ద అధికారం అంటే విలువ లేకుండా చేస్తుంది. ఫాసిజానికి వ్యతిరేకంగా కార్మికులు ఆయుధాలు పట్టుకున్న దేశాలలో ముఖ్యంగా జరిగింది. ఉదా: స్పెయిన్, ఆస్ట్రియా, అస్ట్రియాలో షుట్‌బండ్, కమ్యూనిస్టుల వీరోచిత పోరాటాలు ఓడిపోయినప్పటికీ, ప్రారంభం నుండి ఫాసిస్టు నియంతృత్వపు స్థిరత్వాన్ని కదిలించివేసాయి. స్పెయిన్‌లో శ్రమజీవులపైన బూర్జువావర్గం తన ఫాసిస్టు కబంధహస్తాన్ని చాచటంతో విజయవంతం కాలేకపోయింది. ఆస్ట్రియా, స్పెయిన్‌లలో జరిగిన సాయుధపోరాటాలు, అత్యధిక కార్మికవర్గ ప్రజలలో విప్లవవర్గపోరాటం యొక్క ఆవశ్యకతను మరింతగా గుర్తించేటట్లు చేయగలిగాయి.

కారల్ కాట్స్కీ లాంటి రెండవ ఇంటర్నేషనల్ యొక్క కాలంచెల్లిన సిద్ధాంతకర్తలు, బూర్జువావర్గ తొత్తులు, పచ్చి దగుల్బాజీలు మాత్రమే ఆస్ట్రియాలోనూ, స్పెయిన్‌లోను కార్మికులు ఆయుధాలు చేపట్టి ఉండవలసింది కాదని కార్మికులను నిందించడానికి పూనుకోగలరు. ఆస్ట్రియా, స్పెయిన్‌లలోని కార్మికవర్గం విద్రోహి కాట్స్కీ సలహాలను పాటించి ఉన్నట్లయితే ఈనాడు ఆ దేశాలలోని కార్మికోద్యమం పరిస్థితి ఏ విధంగా ఉండి ఉండేది. కార్మికవర్గ శ్రేణులలో నిరాశ, నిస్పృహలు అలుముకొని ఉండి ఉండేవి.

> లెనిన్ ఈ విధంగా చెప్పారు; "... అంతర్యుద్ధం పాఠశాలవంటిది. అది ప్రజలపై తన ప్రభావం కలగజేయకుండా వదలదు. అది ఒక కఠినమైన పాఠశాల. దాని సంపూర్ణ పాఠ్యాంశాలలో విప్లవ ప్రతీఘాతుక విజయాలు, రెచ్చిపోయిన అభివృద్ధి నిరోధకుల రాజకీయ వ్యభిచారాలు, తిరుగుబాటు దారులపై పాత ప్రభుత్వాలు విధించి అమలు జరిగిన అనాగరిక క్రూరశిక్షలు మొదలైనవి తప్పనిసరిగా చేరి ఉంటాయి. కానీ శుద్ధ పాడింత్య ప్రకర్షకులు, మానసికంగా వృద్ధులైన పీనుగులు మాత్రమే ఈ బాధాకరమైన పాఠశాలలలో దేశాలు చేరటాన్ని గురించి వాపోతారు. ఈ పాఠశాల పీడితవర్గాలకు అంతర్యుద్ధం ఎలా కొనసాగించాలో భోదిస్తుంది. విప్లవ విజయాన్ని ఎలా సాధించాలో నేర్పుతుంది. తరతరాలుగా అణగద్రొక్కబడిన, మందకొండిగా ఉన్న అమాయకులైన బానిసల హృదయాలను గూడుకట్టుకొని ఉన్న ద్వేషం మొత్తాన్ని ఈనాడు సమాజంలో బానిసలుగా బ్రతుకుతున్న ప్రజాహృదయాలలో ప్రోది చేసి వారి హృదయాలలో వారనుభవిస్తున్న అవమానకరమైన భానిసత్వాన్ని గురించి చైతన్యపరిచి, వారిని గొప్ప చారిత్రాత్మక కర్తవ్య నిర్వహణకు పూనుకునేలా ఈ పాఠశాల చేస్తుంది".

జర్మనీలో ఫాసిస్టు విజయం క్రొత్తగా ఫాసిస్టు దాడులకు ఊపునిచ్చిందని మనందరికీ తెలుసు. ఆస్ట్రియాలో డాల్‌ఫుస్‌ను రెచ్చగొట్టడానికి దారితీసింది. స్పెయిన్‌లో ప్రజలయొక్క విప్లవవిజయాలపై విప్లవ ప్రతీఘాతకులు కొత్తగా దాడులు చేయడానికి తోడ్పడింది. పోలెండ్‌లో రాజ్యాంగం ఫాసిస్టు సంస్కరణలకు గురిచేయబడింది. ఫ్రాన్స్‌లో 1934 ఫిబ్రవరిలో ఫాసిస్టు సాయుధ దళాలు తిరుగుబాటు చేయడానికి ప్రయత్నించాయి. కానీ ఈ విజయం, ఫాసిస్టు నియంతృత్వపు వెర్రివీరావేశం అంతర్జాతీయ స్థాయిలో ఫాసిస్టు వ్యతిరేక కార్మికవర్గ ఐక్యసంఘటన యొక్క ప్రతిఘటనా ఉద్యమం యొక్క ఆవశ్యకతను స్పష్టం చేసింది. కార్మికవర్గంపై ఫాసిజం తలపెట్టిన సార్వత్రిక దాడికి సూచనగా నిలిచిన రీబ్‌స్టాగ్ దగ్ధం, కార్మికసంఘాలనూ, ఇతర కార్మికవర్గ సంస్థలను స్వాధీనపర్చుకొని కొల్లగొట్టడం, ఫాసిస్టు బ్యారక్స్; నిర్బంధ శిబిరాలనుండి చిత్రహింసలకు గురిచేయబడుతున్న ఫాసిస్టు వ్యతిరేక శక్తుల బాధామయమైన మూల్గులు, ఇవన్నీ సోషల్ డెమోక్రటిక్ నాయకులనుసరించిన అభివృద్ధి నిరోధక, విచ్ఛిన్నకర పాత్ర యొక్క ఫలితమేననీ, ముంచుకొస్తున్న ఫాసిస్టు ప్రమాదానికి వ్యతిరేకంగా సంయుక్త పోరాటానికి కలిసిరావలసిందిగా కమ్యూనిస్టులు చేసిన ప్రతిపాదనలను జర్మన్ సోషల్ డెమోక్రటిక్ నాయకులు నిరాకరించిన ఫలితంగా ఏర్పడ్డ పరిణామాలేనని ప్రజలకు స్పష్టం చేస్తున్నది. ఈ పరిణామాలన్నీ ఫాసిజాన్ని ఓడించడానికి కార్మికవర్గ శక్తులన్నీ ఐక్యం కావలసిన ఆవశ్యకతను ప్రజలు గుర్తించేలా చేస్తున్నవి.

హిట్లర్ విజయం కూడా ఫ్రాన్స్‌లో ఫాసిజానికి వ్యతిరేకంగా ఐక్యసంఘటన ఏర్పడటానికి నిర్ణయాత్మమైన ప్రోత్సాహకారిగా పని చేసింది. హిట్లర్ విజయం ఫ్రాన్స్ దేశానికి చెందిన కార్మికులలో జర్మన్ కార్మికులకు పట్టిన గతి తమకు కూడా పడుతుందనే భయాన్ని కలిగించడమే కాక, తమ జర్మన్ వర్గసోదరులను చిత్రహింసలపాల్జేస్తున్న వారిపట్ల ద్వేషాన్ని రగుల్చడమేగాక జర్మన్ కార్మికవర్గానికి పట్టినగతి తమ దేశంలో ఎట్టి పరిస్థితులలోనూ సంభవించకుండా చూడాలనే పట్టుదలను వారిలో దృఢపరిచింది.

అన్ని పెట్టుబడిదారీ దేశాలలో ఐక్యసంఘటనలు కట్టాలనే శక్తివంతమైన ఆకాంక్ష, అపజయం అందించిన గుణపాఠాలు వమ్ముకాలేదని సూచిస్తుంది. కార్మికవర్గం ఒక నూతన పద్ధతిలో పనిచేయడం మొదలైంది. ఐక్యసంఘటనా నిర్మాణ కృషిలో కమ్యూనిస్టు పార్టీ చూపిన చొరవ, ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో విప్లవ కార్మికులు ప్రదర్శించిన మహోన్నతమైన ఆత్మార్పణ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ యొక్క గౌరవ ప్రతిష్టలను ఇంతకుముందు కనీవినీ ఎరుగనంతటి స్థాయికి పెంచాయి. అదే సమయంలో రెండవ ఇంటర్నేషనల్‌ల్లో తీవ్రమైన సంక్షోభం అభివృద్ధి చెందుతుంది. అది స్పష్టమైన వైఖరితో వ్యక్తమై, జర్మన్ సోషల్ డెమోక్రసీ దివాళాకోరు విధానం తర్వాత మరింత తీవ్రరూపం దాల్చింది.

ఫాసిస్టు జర్మనీ అనుసరించుతున్న భయంకర అనాగరిక చర్యలు అంతిమ పరిశీలనలో బూర్జువావర్గంతో సోషల్ డెమోక్రాట్లు అనుసరించిన వర్గసంకర విధానం ఫలితమేనన్న వాస్తవాన్ని సోషల్ డెమోక్రాటిక్ కార్మికులు మరింత స్పష్టంగా గుర్తించ గలుగుతున్నారు. ఈ ప్రజలు జర్మన్ సోషల్ డెమోక్రాటిక్ నాయకులు కార్మికులను ఏ మార్గాన నడిపించారో ఆ మార్గాన తిరిగి ప్రయాణించకూడదని మరింత స్పష్టంగా గ్రహించగలుగుతున్నారు. రెండవ ఇంటర్నేషనల్ శిబిరంలో ఈనాడున్నంతగా సిద్ధాంత విభేదాలు ఏనాడు లేవు. సోషల్ డెమోక్రాటిక్ పార్టీలన్నింటిలో వేరుచేసే విధానం చోటుచేసుకుంటుంది. అభివృద్ధి నిరోధకులకు ప్రక్కప్రక్కనే వారి శ్రేణులలో కూడా రెండు ప్రధాన శిబిరాలు ఏర్పడుతున్నాయి. కమ్యూనిస్టులతో ఐక్యసంఘటనను తీవ్రంగా నిరసిస్తూ, అన్నివిధాల సోషల్ డెమోక్రాట్లు, బుర్జువావర్గాల కూటమిని కాపాడుకోవడానికి తాపత్రయపడుతున్న అభివృద్ధి నిరోధక శిబిరంలో కొంతమంది, వేరొకవైపు బూర్జువావర్గంపట్ల అనుసరించే వర్గసంకర విధానాలపట్ల అనుమానాలను వ్యక్తం చేస్తూ, కమ్యూనిస్టులతో ఐక్యసంఘటన కట్టుటకు సంసిద్ధతను వ్యక్తం చేస్తూ రాను రాను విప్లవవర్గపోరాట దృక్పథాన్ని అనుసరించుటకు సిద్ధమవుతున్న విప్లవశక్తుల శిబిరం, ఇలా రెండు వర్గాలుగా వారి శ్రేణులలో పరిస్థితి రూపం తీసుకొనుచున్నది.

ఆ విధంగా పెట్టుబడిదారీవిధానం పతనోన్ముఖమవుతున్న ఫలితంగా తలెత్తిన ఫాసిజం రాబోవుకాలంలో మరింతగా విచ్ఛిన్నమగుటకు కారణమవుతుంది. ఆ విధంగా మార్క్సిజాన్నీ, కార్మికవర్గ విప్లవోద్యమాన్ని పూడ్చిపెట్టడానికి బయల్దేరిన ఫాసిజం జీవితం యొక్క గతితార్కిక సూత్రాల ఫలితంగా, వర్గపోరాటం ఫలితంగా, దానంతటదే తన గోరిని నిర్మించడానికి తోడ్పడే; పెట్టుబడిదారీవిధానాన్ని గొయ్యి త్రవ్వి పూడ్చిపెట్టే శక్తుల అభివృద్ధి క్రమాన్ని మరింత వేగిరపర్చడానికి పూనుకొనుచున్నది (హర్షధ్వానాలు).

# శత్రు గుఢాచారి వ్యవస్థ

## 6వ అనుభవం

భారత విప్లవోద్యమంలో భాగంగా కొనసాగుతున్న ఏఓబీ ఉద్యమంపై శత్రువు ఆది నుండి తీవ్రమైన దమనకాండను అమలు చేస్తూ వస్తున్నాడు. ఈ ప్రాంతంలో ఉన్న ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులకు తోడు, వ్యూహాత్మక, భౌగోళిక అనుకూలతలరీత్యా విప్లవోద్యమం బలపడితే దోపిడీవర్గాలకు ఏర్పడే ప్రతికూలతలను దృష్టిలో పెట్టుకొని ఎప్పటికప్పుడు తన అణచివేత పద్ధతులకు పదునుపెడుతూ వస్తున్నాడు. ప్రధానంగా విప్లవోద్యమానికి నాయకత్వం లేకుండా చేయడం కోసం అనేక కుట్రపూరితమైన ఎత్తుగడలను దోపిడీవర్గాలు అనుసరిస్తున్నాయి. రాంగూడ సంఘటన నుండి అనేక గుణపాఠాలు తీసుకున్న ఏఓబీ విప్లవోద్యమం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, తనను తాను కాపాడుకుంటూ విప్లవోద్యమానికి నాయకత్వాన్ని అందిస్తున్నది. అయితే నాయకత్వాన్ని నిర్మూలించేందుకు శత్రువు తన ప్రయత్నాలను నిరంతరం కొనసాగిస్తూ వస్తున్నాడు. ఇందులో భాగంగా 2020లో శత్రువు జీపీఎస్ ద్వారా మనలను గుర్తించి దెబ్బతీసే ఎత్తుగడలను అమలు చేసాడు. 10 రోజులలోనే 3 సార్లు ఎన్‌కౌంటర్లకు గురై తక్కువ నష్టాలతో నాయకత్వం, పీఎల్‌జీఏ శ్రేణులు బయటపడ్డాయి. ఈ అనుభవాన్ని మా బోల్షివిక్ పాఠకులతో పంచుకోవడం ద్వారా ఈ అనుభవం అందరికీ ఉపయోగపడుతుందని భావిస్తున్నాం.

మన నాయకత్వంమధ్య, దళాలమధ్య సమన్వయం కోసం వాకీలను ఉపయోగిస్తున్న విషయం పోలీసులు చాలా కాలం క్రితమే గుర్తించారు. ముఖ్యంగా నాయకత్వం 'మోటోటర్బో' డిజిటల్ సెట్స్‌ను వినియోగించడానికి ప్రయత్నిస్తుందని కూడా శత్రువు తెలుసుకోగలిగాడు. దానితో ఏపీఎస్ఐబీకి చెందిన ఒక పోలీసు అధికారి ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని నాయకత్వాన్ని దెబ్బతీసే పథకంతో రంగంలోకి దిగాడు. జీపీఎస్‌లను అమర్చిన 'మోటోటర్బో' వాకీలను ఒక కాంట్రాక్టర్‌ను ఉపయోగించుకొని మనకు ఎలాంటి అనుమానం రాకుండా మన పార్టీ సానుభూతిపరుడు ద్వారా పార్టీ నాయకత్వానికి అందేలా ప్లాన్ చేసాడు. అవి 2020 జూన్‌లో మన చేతికి చేరాయి.

అయితే వాటిని వెంటనే వినియోగంలోని తీసుకురాకుండా డంపు చేయడం జరిగింది. నెల రోజుల తర్వాత ఆ వాకీలను ప్రోగ్రామింగ్ చేయడం కోసం మన వద్దకు తెచ్చుకున్నా. ఆ సందర్భంగా మనం ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌లలో జీపీఎస్‌లు ఉన్నాయా? లేవా అనేది చెక్ చేయడం కోసం మనం అనుసరిస్తున్న పద్ధతిలో పరిశీలించాం. కానీ ఎలాంటి అనుమానం కలుగలేదు. అదే రోజు బ్యాటరీ చార్జింగ్ పెట్టగా అది కొన్ని గంటల్లోనే డిస్‌చార్జ్ అయిపోయింది. ఎందుకలా జరిగిందో అర్థంకాక తిరిగి రెండవసారి చార్జ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా క్యాంపులో నాయకత్వ కామ్రేడ్స్‌తోపాటు కొంత ఎక్కువ సంఖ్యలోనే పీఎల్‌జీఏ బలగాలు ఉన్నాయి. మన రక్షణకోసం చుట్టుపక్కల మిలీషియా టీంలు ఎంగేజ్ అయి ఉన్నాయి. ముందు రోజు వాకీ చార్జ్ చేసి ఆన్ చేసిన మన దేరా సమీపానికి ఉదయాన్నే శత్రుబలగాలు రావడాన్ని గమనించిన మన స్కౌట్ టీంలు క్యాంపును అప్రమత్తం చేయడంతో ఆ దేరాను ఖాళీ చేసి కొంతదూరం వెళ్ళాం. అయితే దానికి కొద్ది సమయం ముందే వాకీ బ్యాటరీ డిస్‌చార్జ్ కావడం జరిగింది. దానితో శత్రువు మనం ఉన్న స్థలాన్ని ఖచ్చితంగా గుర్తించలేక, అదే రోజు సాయంత్రం తన బలగాలను వెనక్కి తీసుకున్నాడు. ఈ విషయాన్ని మనం ఖచ్చితంగా అంచనా కట్టలేకపోయాం. ఐదు రోజులు గడిచిన తర్వాత ఒకరోజు సాయంత్రం సమయం 6గం॥లకు వాకీలు మళ్ళీ చార్జ్ చేయడం జరిగింది. ఆ తర్వాత రోజు ఉదయానికే మనం ఉన్న ప్రాంతానికి అన్ని వైపుల నుండి శత్రుబలగాలు మన దేరా సమీపానికి వచ్చాయి. అయితే అప్పటికే వాకీల బ్యాటరీలు డిస్‌చార్జ్ కావడంతో శత్రువు ఖచ్చితంగా మన దేరాను గుర్తించలేకపోయాడు. శత్రువురాకను ముందే గమనించిన మనం, ఆ ప్రాంతం నుండి ఖాళీ చేసి సురక్షితంగా తప్పించుకున్నాం.

ఈ రెండు సంఘటనలు జరిగిన తర్వాత పరిస్థితిని సమీక్షించుకొని, స్థానికంగా శత్రువుకు నమ్మకమైన ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్ ఉండి ఉండవచ్చునీ, నాయకత్వ కదలికలు శత్రువుకు అర్థమై ఉంటాయని భావించి, శత్రువు కేంద్రీకరణ దృష్టిలో పెట్టుకొని అక్కడ(పెదబయలు) నిర్వహించుకోవాల్సిన ఎస్‌జడ్‌సీ సమావేశాన్ని ఆపుకొని, కటాఫ్ ఏరియాలో నిర్వహించుకోవడానికి ప్లాన్ జరిగింది. పెదబయలు ఏరియా నుండి బయలుదేరి కటాఫ్ ఏరియాకు వెలుతున్నప్పుడు తిరిగి ఆ వాకీలను మళ్ళీ చార్జ్ చేయడం జరిగింది. ఆ రోజు రాత్రంతా ప్రయాణం చేసాం. జులై 16వ తేదీ ఉదయం 6గం॥లకు కటాఫ్ ఏరియాలోని దొరగూడ గ్రామానికి చేరుకొని మకాం వేసాం. మకాం వేసిన కొద్దిసేపటికే దేరాను చుట్టుముడుతున్న బలగాలకు మన పెట్రోలింగ్‌టీం తారసపడడంతో ఫైరింగ్ ప్రారంభమైంది. మకాంలో ఉన్న కామ్రేడ్స్ వెంటనే అప్రమత్తమై ఫైరింగ్ చేస్తూ సురక్షితంగా బయటపడ్డాం. ఈ ఘటనలో భౌతిక నష్టాలేమి జరగలేదు. ఈ సంఘటన తర్వాత తిరిగి అనివార్యంగా మన పీఎల్‌జీఏ బలగాలు ఏపీ భూభాగమైన పెదబయలు ఏరియాకే రిట్రీట్ కావాల్సి వచ్చింది. అప్పటికే వాకీలలోని బ్యాటరీలు డిస్‌చార్జ్ అయ్యాయి. దాంతో శత్రువు మనం ఉన్న స్థలాన్ని గుర్తించలేకపోయాడు. 17న ఉదయం తిరిగి బ్యాటరీలను చార్జ్ చేసాం. ఆ రోజు పగలు బ్యాటరీలు చార్జ్‌లోనే ఉన్నాయి. సాయంత్రానికి అవి డిస్‌చార్జ్ అయ్యాయి. 18 ఉదయాన్నే మనం ముందురోజున్న దేరా సమీపానికి శత్రుబలగాలు వచ్చి ఆగిపోయాయి. 18న మనం వాకీలు చార్జ్ చేయలేదు. దాంతో శత్రువు అక్కడే తచ్చాడుతూ ఉండిపోయాడు. 18 సాయంత్రానికి మనం కొద్ది దూరంలో ఉన్న మరో గ్రామానికి చేరుకున్నాం. ఆ రాత్రంతా వాకీలు చార్జ్‌లో ఉన్నాయి. 19 తెల్లవారు జామున 4 గం॥లకే మనం ఉన్న ఆ గ్రామాన్ని ఖాళీ చేసి గంట దూరంలో ఉన్న అడవిలో మకాం వేసాం.

అదేరోజు ఉదయం 6గం॥లకే మన మకాంకు అన్ని వైపుల నుండి శత్రుబలగాలు మనవైపు రావడాన్ని గమనించిన ప్రజలు మనల్ని అప్రమత్తం చేయడంతో దేరా ఖాళీ చేసి నడక ప్రారంభించాం. మేము వెళ్ళేదిశను గమనించిన శత్రువు బలగాలు మా వెనకాలే తన బలగాలను ఎంగేజ్ చేసాడు. రెండు గంటల దూరం వెళ్ళిన తర్వాత, ముందుగానే లందూల్ గ్రామం కొండపై మోహరించిన బలగాలకు మేము తారాసపడటంతో, శత్రుబలగాలు పెద్దఎత్తున ర్యాపిడ్ ఫైరింగ్ చేస్తూ, సెల్స్ వేస్తూ అడ్వాన్స్ కావడానికి ప్రయత్నం చేసాయి. మన పీఎల్‌జీఏ బలగాలు కూడా ధీటుగా ప్రతిఘటించడంతో, పోలీసు బలగాల దూకుడు తగ్గి నాయకత్వం, మిగతా బలగాలు, స్థానిక మిలీషియా, ప్రజల సహకారంతో క్షేమంగా రిట్రీట్ అయ్యాం. ఈ ఫైరింగ్‌లో రెండు బ్యాచీలుగా విడిపోయిన కామ్రేడ్స్ రెండు రోజుల తర్వాత మళ్ళీ కలుసుకొని, పరిస్థితిని సమీక్షించుకొని అవసరమైన నిర్ణయాలు తీసుకున్నాం. ఈ సమయంలో మన వాకీలను తిరిగి చార్జ్ చేసే అవకాశం రాలేదు. అయితే ఈ సారి శత్రువు తన బలగాలను ఖాళీ చేయకుండా ఆ ప్రాంతంలోనే మోహరించి ఉన్నాడు. అయితే స్థానిక మిలీషియా కామ్రేడ్స్ పెద్దఎత్తున కదిలి శత్రువును దెబ్బతీసేందుకు అనేక ప్రాంతాలలో బూబిట్రాప్స్‌ను ఏర్పాటు చేసారు. అలా ఏర్పాటు చేసిన బూబిట్రాప్స్‌లో కోంద్రు అనే గ్రామం దగ్గర 21వ తేదీ ఉదయం 6గం॥లకు ఒక బూబిట్రాప్ పేలి కూంబింగ్‌లో ఉన్న ఇద్దరు గ్రేహౌండ్స్ కామాండోలు గంభీరంగా గాయపడ్డారు. దీంతో శత్రువు తాత్కాలికంగా తన ఆపరేషన్‌ను ఆపుకొని తిరిగి వెనక్కి వెళ్ళాడు. ఈ పరిస్థితిపై చర్చించి ఒక అంచనాకు వచ్చిన నాయకత్వం అందరూ ఒకే దగ్గర కాకుండా రెండు బ్యాచీలుగా (ఏపీ, ఒడిశా వైపు) విడిపోవాలని నిర్ణయించుకొని అమలు చేసాం. 21వ తేదీన తాత్కాలికంగా వెనక్కి వెళ్ళిపోయిన పోలీసులు, మరలా 23వ తేదీ నుండి విశాల ప్రాంతాన్ని కవర్ చేస్తూ మోహరించారు. కానీ శత్రువు రహస్యంగా ఉంటూ, ఎటూ కదలకుండా అనేక పాయింట్స్‌లో ఎంగేజ్ అయ్యాడు. 24వ తేదీ సాయంత్రం రంగబయలు అనే గ్రామానికి చేరుకున్న మన నాయకత్వ టీం ఎప్పటిలాగే తిరిగి వాకీలను చార్జింగ్‌కు పెట్టాం. 25వ తేదీ ఉదయాన్నే ఆ గ్రామాన్ని ఖాళీ చేసి, దానికి ప్రక్కనే ఉన్న కొండపైన మకాం వేసాం. కొద్దిసేపటికే ఆ మాకాంను శత్రువు బలగాలు అన్ని వైపుల నుండి చుట్టుముట్టడాన్ని గమనించి అప్రమత్తమై దేరాను ఖాళీ చేసి ప్రజలు, మిలీషియా సహకారంతో ప్రయాణ మార్గాన్ని చెక్ చేయించుకుంటూ సాయంత్రం 5గం॥ల వరకు ప్రయాణం చేసి, ముందు మైదానం ఉండటంతో, చీకటి పడిన తర్వాత ముందుకు వెళ్ళాలని అనుకొని తగుడుపల్లి గ్రామ పరిసర కొండపైన ఆగాం. మన కామ్రేడ్స్ అందరూ అప్రమత్తంగా ఉండి వారి వారి కవర్స్‌లో ఉన్నారు. 6గం॥ల సమయంలో శత్రువుకు చెందిన ఒక ప్లటూన్ స్థాయి గ్రేహౌండ్స్ బలగాలు చాలా వేగంగా ఆ మాకాంను చుట్టుముట్టే ప్రయత్నంలో భాగంగా అతి సమీపానికి వచ్చాయి. ముందే అప్రమత్తమైన మన బలగాలు సెమి, ఆటో ఆయుధాలతో శత్రువుపై రాపిడ్‌గా ఫైర్ చేయడంతో హఠాత్తుగా జరిగిన ఈ ఫైరింగ్‌తో ఎలాంటి కౌంటర్ ఫైరింగ్ చేయకుండానే శత్రువు గందరగోళంతో కొంతదూరం పారిపోయాడు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని నాయకత్వంతోపాటు, పీఎల్‌జీఏ బలగాలు సురక్షితంగా బయటపడే ప్రయత్నంలో, ఫ్లాంక్‌లో ఉన్న శత్రుబలగాలు తేరుకొని చేసిన ఫైరింగ్‌లో కామ్రేడ్ దయ అమరుడయ్యాడు. వరుసగా 10 రోజులలో జరిగిన 3 సంఘటనలపై అందుబాటులో ఉన్న నాయకత్వం కొన్ని విషయాలను సమీక్షించగా, మనం ఉపయోగిస్తున్న వాకీల ద్వారా శత్రువు మన లొకేషన్‌ను గుర్తించి దాడులకు పాల్పడుతున్నట్లుగా అనుమానం కలిగింది. దానితో 26వ తేదీన కొన్ని (శత్రువు పంపిన మోటోటర్బొ)వాకీలను దంపు చేసి, మిగిలిన వాకీల వాడకాన్ని బంద్‌చేయడం జరిగింది. అలాగే శత్రువు కేంద్రీకరణ ఉన్న పెదబయలు ఏరియాను ఖాళీ చేసి, కటాఫ్ ఏరియాకు వెళ్ళడం జరిగింది. అప్పటినుండి వాకీలు చార్జ్ చేయడం పూర్తిగా ఆపి వేసాం. ఆ తర్వా నుండి శత్రువు కదలికలు పూర్తిగా నిలిచిపోయాయి. అయితే ఈ దాడులకు నిజమైన కారణాలను మాత్రం ఆ సమయంలో పూర్తిగా గుర్తించలేకపోయాం.

కొద్ది రోజులు గడిచిన తర్వాత ఆ 'మోటోటర్బొ' వాకీలకు ప్రోగ్రామింగ్ చేయడానికి చార్జ్ చేసాం. ఆ సందర్భంగా ఈ వాకీల బ్యాటరీలు చార్జ్ చేసిన కొద్ది గంటలకే ఎందుకు డిస్‌చార్జ్ అవుతున్నాయని వాకీ వాడకంలో అనుభవం ఉన్న కామ్రేడ్‌తో చర్చించాం. అందులో జీపీఎస్ ఉందేమో అనే అనుమానాన్ని వ్యక్తం చేసి మన పద్ధతుల్లో చెక్ చేసాడు. అయినా దానిద్వారా ఏమి అర్థం కాలేదు. మరొక వాకీ(ఇతర కామ్రేడ్స్ వాడుతున్న) బ్యాటరీని తీసుకొని ఈ రెండు బ్యాటరీలను పోల్చి చూసినప్పుడు ఇవి (తొందరగా డిస్‌చార్జ్ అవుతున్న బ్యాటరీలు) బరువుగా ఉండటంతో అనుమానం వచ్చి బ్యాటరీ ప్యాక్‌ను ఓపెన్ చేయడం జరిగింది. అప్పుడు అర్థమైందేమిటంటే బ్యాటరీప్యాక్‌లో ఉన్న 4 రీచార్జబుల్ సెల్స్‌లో 2 సెల్స్‌ను తొలగించి ఆ ఖాళీ స్థలంలో జీపీఎస్ ట్రాకర్లను అమర్చి, దానిని బ్యాటరీకి కనెక్ట్ చేసారని అర్థమైంది. వాటి పైనుండి ప్లాస్టిక్ పేపర్‌తో ప్యాక్ చేసారు. అది మన చెకింగ్‌కు అర్థం కాకుండా ఉండటానికి అనుసరించిన పద్ధతి అని అర్థమైంది. దీనిలోని జీపీఎస్ ట్రాకర్ మనం వాకీ చార్జ్ చేయగానే పని చేయడం ప్రారంభిస్తున్నదని అర్థమైంది. డిస్‌చార్జ్ కాగానే ఆగిపోతున్నది. అయితే జీపీఎస్‌ను బ్యాటరీకి కనెక్ట్ చేయడం మూలంగా బ్యాటరీ ఎక్కువ సమయం పని చేయకపోవడం జరిగిందని అర్థమైంది. ఈ కారణం చేతనే మనం అనేకసార్లు శత్రువుదాడికి గురికాకుండా తప్పుకోవడానికి అవకాశం దొరికిందని అర్థమవుతున్నది. శత్రువు జీపీఎస్ టెక్నాలజీని ఉపయోగించుకొని నాయకత్వాన్ని దెబ్బ తీయాలని పన్నిన పథకంలో అనుకున్న విధంగా సఫలం కాకపోవడానికి ముఖ్య కారణాలుగా చూసినప్పుడు 1. వాకీ బ్యాటరీ చార్జింగ్ కొన్ని గంటల వరకే పని చేయడం ద్వారా శత్రువు సకాలంలో మన మకాంలకు చేరుకోలేకపోయాడు. 2. ఎప్పటికప్పుడు శత్రువు కదలికలను ప్రజలు, మిలీషియా గమనించి మనల్ని అప్రమత్తం చేసారు. 3. మనం ఈ సమయమంతా కదలికల్లో ఉండడం, అప్రమత్తంగా ఉండటం, దానికి గురైనప్పుడు ధైర్యంగా శత్రువును ప్రతిఘటించడం మూలంగా భారీ నష్టాలను నివారించగలిగాం.

మనం వాడుతున్న ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌లో శత్రువు జీపీఎస్‌లను అమర్చడం ద్వారా మన లొకేషన్‌ను గుర్తించి దాడి చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడని ఈ అనుభవం ద్వారా మనకు అర్థమవుతున్నది. అయితే వీటి వాడకంలో మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పద్ధతుల గురించి మన సీఆర్‌సీ రూపొందించిన నియమాలను తు.చ తప్పక పాటించడం ద్వారా శత్రువు అనుసరిస్తున్న ఈ ఎత్తుగడల్ని తిప్పికొడదాం!

# పోలీసుల కుటిల లొంగుబాటు ఎత్తుగడల్ని తిప్పికొడదాం!

# ప్రజల పోరాట విజయాలను రక్షించుకుంటూ పురోగమిద్దాం!!

*ప్రియమైన ప్రజలకూ, ప్రజానిర్మాణాలకు...లాల్‌సలామ్!*

ఏఓబీ విప్లవోద్యమంపై శత్రువు తీవ్రమైన దాడినీ, నిర్బంధాన్నీ, అణచివేతను అమలు చేస్తున్నాడు. ఈ సంవత్సర కాలంలో మన ఉద్యమ ప్రాంతాల్లో ఎన్నో వేగవంతమైన మార్పులు చోటు చేసుకున్నాయి. 2021 జూన్‌లో జరిగిన తీగలమెట్ట ఎన్‌కౌంటర్‌లో డీవీసీ సభ్యులు కామ్రేడ్స్ రణదేవ్, అశోక్‌లతో సహా 6గురు కామ్రేడ్స్ అమరులయ్యారు. అక్టోబర్ నెలలో జరిగిన ఫైరింగ్‌లో మరో డీవీసీ మెంబర్ కామ్రేడ్ అనిల్‌తోపాటు కామ్రేడ్స్ సోని, చిన్నారావులు అమరులయ్యారు. ఏఓబీ ఉద్యమానికి కేంద్రకమిటీ నుండి ప్రత్యక్ష మార్గదర్శకత్వాన్ని అందిస్తున్న కామ్రేడ్ సాకేత్ (అక్కిరాజు హరగోపాల్) అనారోగ్యంతో అమరత్వం చెందారు. ఈ అమరుల త్యాగాలను ఎత్తిపడదాం. వారి ఆశయసాధనకు తుదకంటా పోరాడుతామని ప్రతినబూనుదాం. ఏఓబీ ఎస్‌జడ్‌సీ మెంబర్ కామ్రేడ్ అరుణ్‌తోపాటు ఏసీ మెంబర్లు కామ్రేడ్స్ రామె, నగేష్, సుందర్రావులు మరికొంతమంది పార్టీసభ్యులు, గ్రామ సంఘనాయకులు ఎంతో మంది అరెస్టయ్యి శత్రువు పెట్టిన తీవ్ర చిత్రహింసలను ధైర్యంగా తిప్పికొడుతూ, శత్రువు ముందు తలవంచక జైళ్ళలో నిర్బంధించబడ్డారు. ఈ కామ్రేడ్స్‌ను విడిపించుకొని విప్లవోద్యమంలోకి ఆహ్వానిద్దాం. శత్రువు అమలు జరుపుతున్న వూహాత్మక 'సమాధాన్–ప్రహార్' దాడిని రాజకీయంగా అర్థం చేసుకోలేక త్యాగసంసిద్ధత కోల్పోయి ప్రాణబీతితో, వ్యక్తిగత స్వార్థంతోశత్రువుముందు మోకరిల్లినవారిలో డీవీసీ మెంబర్ సుధీర్‌తోపాటు, మరికొంత మంది ఏసీ సభ్యులు, పార్టీ సభ్యులు ఉన్నారు. ఇలాంటి దిగజారడాలను అసహ్యించుకుందాం. లొంగిపోయి బానిసల్లా బ్రతికేకన్నా, పోరాడి తలెత్తుకొని నిలబడదామని నినదిద్దాం.

పై పరిణామాలన్నీ ఏఓబీ ఉద్యమంపై తాత్కాలికంగా తీవ్రమైన ప్రభావాన్ని వేశాయి. ఈ పరిస్థితిని ఆసరా చేసుకొని శత్రువు మన పార్టీని పూర్తిగా నిర్మూలించడానికీ, ప్రజల నుండి పార్టీని దూరం చేయడానికీ, అత్యంత వేగంగా, దూకుడుగా తన కుటిల ఎత్తుగడలను అవలంభిస్తున్నాడు. అనేక కుట్రలకు పాల్పడుతున్నాడు. అందులో భాగంగానే మన ఉద్యమ ప్రాంతాల్లో గ్రేహౌండ్స్‌లో పని చేసిన అనుభవమున్న అత్యంత క్రూరమైన పోలీసు ఆఫీసర్లను నియమించడం, నిరంతరం కూంబింగ్ ఆపరేషన్లను చేయడం, ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌నూ, రోడ్లనూ, సెల్‌టవర్ల(కమ్యూనికేషన్)నూ, కార్పెట్ సెక్యూరిటీని బలోపేతం చేసుకొని మన పార్టీపై, ప్రజలపై నిరంతరం దాడులను చేస్తున్నాడు. నేడు ఏఓబీలో ప్రభుత్వం, పోలీసులు, ప్రజావ్యతిరేకులు, అధికారం కోల్పోయిన శక్తులు, భూస్వాములు పార్టీని మొత్తం నిర్మూలించామనీ, ఇక పార్టీ లేదని విస్తృతంగా ప్రచారం చేస్తూ, ప్రజల మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తూ గ్రామాలలో ప్రజలపై, సంఘాలపై, సంఘ నాయకులపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చి, బెదిరింపులతో బలవంతంగా సరెండర్లు చేయించుకుంటున్నారు. పెదబయలు ఏరియాలో కోంద్రు ఆర్‌పీసీ పాకెట్‌లోని గ్రామాలనూ, కోరుకొండ ఏరియాలోని రాళ్ళగడ్డ పంచాయితీ గ్రామాల ప్రజలపై ఈ రకమైన ఒత్తిడితోనే సరెండర్లు చేయించుకున్నారని మేము భావిస్తున్నాము. అయితే శత్రువు ఇదంతా ఎందుకు చేస్తున్నాడు? మన పార్టీ నాయకత్వంలో మన్యంలో రూపుదిద్దుకున్న 4 దశాబ్దాల ప్రజాయుద్ధాన్ని సమూలంగా నిర్మూలించడం శత్రువుకు సాధ్యమా? అనే ప్రశ్నలను వేసుకొని మనం ప్రతి ఒక్కరం ఆలోచించాలి. 4 దశాబ్దాలుగా ప్రజలు పోరాడి సాధించుకున్న విజయాలను మనం ఒకసారి గుర్తు చేసుకోవాలి. 1980 నాటికీ మన్యంలో ఆదివాసీ ప్రాంతాల్లో ప్రభుత్వం, ఫారెస్టు, రెవెన్యూ, పోలీసుల దోపిడీ, ధౌర్జన్యాలకూ, షావుకార్ల, ఆదివాసేతరుల మోసాలకు గురవుతూ బానిసల్లా బ్రతుకుతున్న ప్రజల జీవితాల్లోకి వేగుచుక్కలా ప్రవేశించిన మన పార్టీ మార్గదర్శకత్వంలో ప్రజలు ప్రభంజనంలా కదిలి, ప్రజాయుద్ధంలో భాగస్వాములయ్యి, ప్రజా పోరాటాలనూ, గెరిల్లా యుద్ధాన్ని సమన్వయంతో నడిపి, 'అడవిపై హక్కు ఆదివాసీలదే' అనే నినాదంతో సమీకృతులయ్యి ఫారెస్టు, రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌ను అడవి నుండి తరిమివేశారు. షావుకార్ల, వడ్డీవ్యాపారుల, కాంట్రాక్టర్ల మోసాలకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటలు చేసాం. ఏపీఎఫ్‌డీసీకి వ్యతిరేకంగా పోరాడి కాఫీ తోటలను స్వాధీనం చేసుకున్నాం. అడవిపై హక్కును సాధించుకున్నాం. భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి వేలాది ఎకరాల భూములను సాధించుకున్నాం. గ్రామాలలో ఆదివాసీ తెగపెద్దల పెత్తనాన్నీ, ఆధిపత్యాన్ని కూలదోసి 'సంఘాలకే సర్వాధికారాలు' సాధించుకున్నాం. 'విప్లవ ప్రజా కమిటీ(ఆర్‌పీసీ)ల'ను నిర్మాణం చేసుకొని బీజప్రాయంలో ప్రజల రాజకీయ అధికారాన్ని నెలకొల్పాం. స్వావలంబనతో కూడిన అభివృద్ధి నమూనాను ముందుకు తెచ్చుకున్నాం. ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ద్వారా స్కూళ్ళనూ, హస్పిటల్స్‌నూ, మిల్లులను నడిపాం. చెక్‌డ్యాంలు కట్టాం, పొలాలు తయారు చేసుకున్నాం. కూరగాయలు పండించుకున్నాం. నిజమైన పేద ప్రజల అభివృద్ధి అంటే ఇదే కదా! ఆదివాసీ, పీడిత ప్రజల ఆకాంక్షలు ఇవే కదా! ఏనాడైనా ప్రభుత్వం, పోలీసులు ప్రజల ఆకాంక్షలు నెరవేర్చారా? ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారించారా? ప్రభుత్వం, పోలీసులు ఒకవైపు ప్రజలు పోరాడి సాధించుకున్న భూములనూ, కాఫీ తోటలను లాగేసుకుంటూ, ప్రత్యామ్నాయంలేక ప్రజలు వేసుకున్న గంజాయి తోటలను ధ్వంసం చేస్తూ, తిరిగి ఫారెస్టు అధికారాలు మన ప్రాంతంలోకి ప్రవేశించి ప్రజల భూముల్లో ఫెన్సింగ్‌లు వేస్తూ, బాక్సైట్‌ను తవ్వి తీయటానికి ప్రయత్నాలు చేస్తూ, తిరిగి ప్రజలను కూలీలుగా, బానిసలుగా మార్చడానికి కుట్రలు చేస్తూ, మరో వైపు అభివృద్ధి పేరుతో

*తరువాయి భాగం 46వ పేజీలో...*

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్రకమిటీ

**పత్రికా విజ్ఞప్తి**

**28 డిసెంబర్, 2022**

## ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపక చైర్మన్ కామ్రేడ్ జోస్ మారియో సిసాన్‌కు రెడ్‌శాల్యూట్స్!
## కామ్రేడ్ సిసాన్ ఆశయాల స్ఫూర్తితో
## ప్రపంచ సోషలిస్టు విప్లవ సాఫల్య దిశగా విప్లవ కృషిని ద్విగుణీకృతం చేద్దాం!

ప్రపంచ సోషలిస్టు విప్లవ నాయకుడు, ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపక చైర్మన్ కామ్రేడ్ జోస్ మారియో సిసాన్ అమరత్వం ప్రపంచ విప్లవోద్యమానికి తీరనిలోటు. కామ్రేడ్ సిసాన్‌కు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్రకమిటీ తలవంచి వినమ్రంగా విప్లవ జోహార్లు అర్పిస్తున్నది. కామ్రేడ్ సిసాన్ ఆశయాల స్ఫూర్తితో ప్రపంచ సోషలిస్టు విప్లవాన్ని సఫలం చేసేందుకు మరింతగా కృషి చేయవలసిందిగా యావత్తు ప్రపంచ కార్మికవర్గానికీ పిలుపునిస్తున్నది. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఫిలిప్పీన్స్, ఎన్‌పీఏ, ఎన్‌డీఎఫ్‌లలో యావత్తు క్యాడర్‌లకూ, ఫిలిప్పీన్ విప్లవ ప్రజానీకానికీ, కామ్రేడ్ సిసాన్ బంధుమిత్రులకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నది. నెదర్లాండ్స్ దేశంలో ప్రవాసంతో ఉంటున్న కామ్రేడ్ జోస్ మారియో సిసాన్ పదిహేను రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ 83వ ఏటా 2022 డిసెంబర్, 16వ తేదీ రాత్రి ఉట్రెక్ట్‌లో ఒక ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు.



కామ్రేడ్ మావో సే టుంగ్ అభివృద్ధి చేసిన మార్క్సిజం–లెనినిజాన్నీ, మార్క్సిజం –లెనినిజం–మావోయిజంగా, ప్రపంచ సోషలిస్టు విప్లవానికి మార్గదర్శక సిద్ధాంతంగా స్వీకరించిన ప్రపంచవ్యాప్త మొదటితరం మావోయిస్టులలో కామ్రేడ్ సిసాన్ ఒకరు. మాలెమాను ఫిలిప్పీన్స్ దేశానికి అన్వయించి అర్ధ శతాబ్ది క్రితం ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ (సీపీపీ)ని స్థాపించి వ్యవస్థాపక చైర్మన్ బాధ్యతలు చేపట్టారు. స్పానిష్ వలసవాదులతో ఫిలిప్పీన్స్ దేశంలో సామ్రాజ్యవాద ఆక్రమణ ప్రారంభమయింది. అమెరికా దేగకన్ను పడిన తర్వాత ఫిలిప్పీన్స్ పూర్తిగా అమెరికా సామ్రాజ్యవాద కోరలలో చిక్కుకుంది. ప్రపంచాధిపత్యం కోసం అమెరికా తన సైనికకేంద్రంగా ఉపయోగించుకుంటున్న అర్ధవలస–అర్ధభూస్వామ్య ద్వీప సమూహమయిన ఫిలిప్పీన్స్ దేశంలో ప్రజల విముక్తికి మావోయిస్టు ప్రజాయుద్ధమే మార్గమని కామ్రేడ్ సిసాన్ నిరూపించారు. పార్టీ, సైనిక, ఐక్యసంఘటనా రంగాలలో ఉద్యమన్ని అభివృద్ధి చేసారు. ప్రపంచవ్యాప్త మావోయిస్టు పార్టీలతో సంబంధాలు ఏర్పరచుకున్నారు. ప్రపంచ మావోయిస్టు శక్తులకు అండగా నిలిచిన కామ్రేడ్ సిసాన్ మరణం ప్రపంచ సోషలిస్టు విప్లవానికి తక్షణమే తీర్చుకోలేని తీవ్రలోటు.

కామ్రేడ్ సిసాన్ పుట్టినది భూస్వామ్య కుటుంబంలో. 1939 ఫిబ్రవరి 8వ తేదీన జన్మించిన కామ్రేడ్ సిసాన్ ఉన్నత చదువులు చదివారు. మొదట ఇంగ్లీషు సాహిత్య అధ్యాపకుడిగా పని చేసేవారు. ఆ తర్వాత రాజకీయశాస్త్ర అధ్యాపకుడిగా స్థిరపడ్డారు. ఫిలిప్పీన్స్‌ను అన్ని రకాలుగా దోచుకుంటున్న అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశ ప్రజలలో ఆగ్రహం రాజుకుంటున్న కాలం అది. దేశ స్వాతంత్ర్యానికి బాటలు వెతుక్కుంటున్న సమయం అది. ఈ రకమైన ఆలోచనలు కామ్రేడ్ సిసాన్‌ను 1962లో పార్టిడో కమ్యూనిస్టా ఇంగ్ ఫిలిపినాస్ సంస్థలో చేరేందుకు దారి తీసాయి. 1964లో ఏర్పడిన యువజన సంఘంలో చురుకుగా పనిచేస్తూ, నేషనలిస్ట్ యూత్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఆ తర్వాత కాలంలో మూవ్‌మెంట్ ఫర్ ది అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ నేషనలిజమ్ కార్యదర్శిగా ఉన్నారు. మార్కోస్ నియంతృత్వానికి, అమెరికా వియత్నాం యుద్ధానికీ వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్మించారు.

అయితే పార్టీ రివిజనిజం అవలంభిస్తున్నదని అర్థం చేసుకున్న కామ్రేడ్ సిసాన్ దాని నుండి తెగతెంపులు చేసుకున్నారు. నిజమైన కమ్యూనిస్టు శక్తులను సంఘటితం చేస్తూ, 1968 డిసెంబర్ 26వ తేదీన కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఫిలిప్పీన్స్‌ను స్థాపించారు. "ప్రజా సైన్యం లేనిదే ప్రజలకు విముక్తి సాధ్యం కాదన్న" మావోయిస్టు అవగాహనను ఆకళింపు చేసుకొని 1969 మార్చి 29వ తేదీన న్యూ పీపుల్స్ ఆర్మీని స్థాపించారు. 27 సంవత్సరాల వయసులో కామ్రేడ్ సిసాన్ ఫిలిప్పీన్ నాయకుడయ్యారు. ఆనాటి నుండి అమరుడయ్యేంత వరకు ఫిలిప్పీన్స్ ఉద్యమానికి నేతృత్వం వహించారు.

ఆచరణకు సిద్ధాంతం అవసరం అన్న విషయాన్ని అర్థం చేసుకున్న కామ్రేడ్ సిసాన్, మాలెమా సిద్ధాంత వెలుగులో ఫిలిప్పీన్స్ సమాజాన్ని అధ్యయనం చేసారు. 'అమాడో గెరెరో' అనే కలం పేరుతో విశ్లేషణాత్మక వ్యాసాలు, పుస్తకాలు రాసారు. 1967లో 'జాతీయ ప్రజాస్వామ్యం కోసం పోరాటం' అనే పుస్తకంతో ఆయన దేశంలో మార్క్సిస్టుగా, మేధావిగా గుర్తింపు పొందారు. 1993లో కామ్రేడ్ సిసాన్ రచించిన 'ఫిలిప్పీన్ సమాజం-విప్లవం' అనే పుస్తకంలో ఫిలిప్పీన్ సమాజ చరిత్రనూ, సమాజాన్ని విశ్లేషించారు. ఈ పుస్తకాన్ని నాటి ప్రభుత్వం నిషేధించింది. సిద్ధాంత, ఆచరణల మేలు కలయికతో ఫిలిప్పీన్స్ ఉద్యమం పురోగమించింది.

కామ్రేడ్ సిసాన్ అంతర్జాతీయ కమ్యూనిస్టు శక్తులను ఐక్యం చేసేందుకు గొప్ప దోహదం చేసారు. ప్రచండా, బాబ్ అవాకియన్ వంటి ఆధునిక రివిజనిస్టులపై పోరాటం చేసారు. ఇంటర్నేషనల్ లీగ్ ఫర్ పీపుల్స్ స్ట్రగుల్స్ (ఐఎల్‌పీఎస్) నాయకుడిగా సామ్రాజ్యవాద వ్యతిరేక, జాతి విముక్తి పోరాటాలను సమన్వయించేందుకు కృషి చేసారు. తత్వశాస్త్రం, ఆర్థికం, కళా, సాహిత్యాలు, ప్రజల ప్రజాస్వామిక విప్లవం వంటి అంశాలపై కామ్రేడ్ సిసాన్ రచనలను సీపీపీ ఈ సంవత్సరంలోనే 11 సంపుటాలుగా ప్రచురించింది. నిర్దిష్ట పరిస్థితులకు మాలెమా అన్వయాన్ని అర్థం చేసుకోవడానికి ప్రపంచ మావోయిస్టు శక్తులు ఈ రచనలను చదవడం చాలా అవసరం. అలాగే మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్, మావోల దోహదాన్ని పరిరక్షించేందుకు కామ్రేడ్ సిసాన్ గణనీయమైన దోహదం చేసారు. నేటి పరిస్థితులలో ప్రపంచ కార్మికవర్గానికి సైద్ధాంతిక, రాజకీయ నాయకత్వం అందించారు. ఫిలిప్పీన్స్ దేశం గురించే కాకుండా, ప్రపంచవ్యాప్త ఆర్థిక, రాజకీయ పరిస్థితుల గురించి కామ్రేడ్ సిసాన్ ఎప్పటికప్పుడు విశ్లేషణాత్మక వ్యాసాలు అందిస్తూ వచ్చాడు. అంతర్జాతీయంగా దోపిడీ వర్గాల ప్రతికూల, విప్లవానికి అనుకూల పరిస్థితులను అర్థం చేసుకునేందుకు ప్రపంచ మావోయిస్టు శక్తులకు ఈ వ్యాసాలు ఎంతగానో ఉపయోగపడేవి.

1977లో నాటి మార్కోస్ ప్రభుత్వం కామ్రేడ్ సిసాన్‌నూ, ఆయన జీవిత భాగస్వామి కామ్రేడ్ జూలియెట్‌ను అరెస్టు చేసింది. నియంత మార్కోస్ కామ్రేడ్ సిసాన్‌ను స్వయంగా ఇంటరాగేషన్ చేసాడు. చిత్రహింసలు పెట్టించాడు. ప్రపంచవ్యాప్తంగా వచ్చిన నిరసనలతో రెండు నెలల తర్వాత ప్రభుత్వం కామ్రేడ్ సిసాన్‌ను కోర్టులో ప్రవేశపెట్టింది. కామ్రేడ్ సిసాన్ తొమ్మిది సంవత్సరాలపాటు జైలులో ఉన్నారు. ఫిలిప్పీన్స్ రాజధాని నగర పొలిమేరల్లో సైనిక కారాగారంలో ఉన్న చీకటికొట్టులో కామ్రేడ్ సిసాన్‌ను రోజుకు ఇరవై గంటలు మంచానికి సంకెళ్ళతో బంధించి ఉంచారు.

ఆ కాలంలో మార్కోస్ నియంతృత్వానికి వ్యతిరేకంగా ప్రజాస్వామిక తిరుగుబాటు జరిగింది. 1986 మార్చిలో మరో ప్రభుత్వం ఏర్పడింది. ఈ ప్రభుత్వం అప్పటికే దేశంలో ఒక బలమైన శక్తిగా ఎదిగిన ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీతో చర్చల ప్రక్రియను ప్రారంభించింది. అప్పుడు కామ్రేడ్ సిసాన్ ఫిలిప్పీన్స్ ఉద్యమానికి ప్రపంచవ్యాప్త సంఘీభావం సంపాదించడం కోసం పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా 1988 సెప్టెంబర్‌లో నెదర్లాండ్ దేశం వెళ్ళినప్పుడు ఫిలిప్పీన్స్ ప్రభుత్వం ఆయన పాస్‌పోర్టును రద్దు చేసింది. దేశద్రోహ నేరంమీద కేసు మోపింది. దేశానికి రానివ్వలేదు. దాంతో కామ్రేడ్ సిసాన్ ఆనాటి నుండి నెదర్లాండ్స్‌లోనే రాజకీయ ప్రవాసంలో ఉండిపోయారు. అక్కడ నుండే పార్టీకి మార్గదర్శకత్వం అందించారు. 2002 ఆగస్టులో అమెరికా ప్రభుత్వం కామ్రేడ్ సిసాన్‌ను 'తీవ్రవాద సమర్థకుడి'గా ప్రకటించింది. ఆ తర్వాత నెదర్లాండ్స్ ప్రభుత్వం కూడా ఆయనపై వేధింపులు ప్రారంభించింది. 2009లో ఈయూ కూడా తీవ్రవాదలిస్టులో కామ్రేడ్ సిసాన్ పేరును చేర్చింది. అయితే అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం, సంఘీభావం ఆయన అక్కడ ఉండేందుకు సహాయపడ్డాయి.

అంచెలంచెలుగా పురోగమిస్తున్న ఫిలిప్పీన్స్ ఉద్యమంలో 1988 నాటికి అతివాద ఒంటెత్తుపోకడ ధోరణి ముందుకు వచ్చింది. మరికొన్ని సంవత్సరాల తర్వాత మితవాద పెడధోరణి ముందుకు వచ్చింది. ఈ ధోరణులు ఉద్యమాన్ని గణనీయంగా ప్రభావితం చేసాయి. ఈ ధోరణులపై దిద్దుబాటు ఉద్యమం ద్వారా సైద్ధాంతిక, రాజకీయ పోరాటం చేసి కామ్రేడ్ సిసాన్ పార్టీని నిలబెట్టారు. ఈ దిద్దుబాటు ఉద్యమం పార్టీ, ఎన్‌పీఏ, ప్రజాసంఘాలు, ఎన్‌డీఎఫ్‌లను బలోపేతం చేసేందుకు దోహదం చేసింది. ఈ ఉద్యమ సాఫల్యం తర్వాత పార్టీ తిరిగి పురోగమించింది. ఈ పురోగమన క్రమంలో, సాయుధ పోరాటం ద్వారా గెరిల్లా బేసులనూ, జోన్‌లను ఏర్పాటు చేయకుండా దేశవిముక్తి సాధ్యం కాదన్న స్పష్టమైన అవగాహనతో ఎన్‌పీఏని బలోపేతం చేసింది. ఐక్యసంఘటనగా నేషనల్ డెమోక్రటిక్ ఫ్రంట్‌ను ఏర్పరచి విస్తృత ప్రాతిపదికపై బలోపేతం చేసింది. వివిధ పీడిత వర్గాలనూ, సెక్షన్‌లనూ, లుమడ్, మోరో, కార్డిల్లెరా వంటి ప్రాంతాల ప్రజలను కలుపుకు వచ్చింది.

1970లో 'ఓప్లాన్ మమయాన్' క్యాంపెయిన్ నాటి నుండి 2011లో 'ఓప్లాన్ బయనిహాన్' వరకు వివిధ క్యాంపెయిన్‌లు నిర్వహిస్తున్న ఫిలిప్పీన్స్ ప్రభుత్వం ఫిలిప్పీన్స్ విప్లవోద్యమాన్ని అంతమొందించేందుకు ప్రయత్నం చేస్తున్నది. 2018 నుండి వైమానిక బాంబింగ్ చేస్తున్నది. ఈ నిర్బంధ క్యాంపెయిన్‌లను ఎదుర్కొంటూ, ఫిలిప్పీన్స్ ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోతూ, ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గ పోరాటాలకు ప్రేరణగా నిలుస్తున్న కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఫిలిప్పీన్స్‌కు కామ్రేడ్ సిసాన్ సరైన నాయకత్వం అందించారు.

కామ్రేడ్ జోస్ మారియో సిసాన్ కవి. జైలు జీవితంలో 'నియంతృత్వాన్నీ, బోర్‌డమ్‌నీ జయించడానికి స్వేచ్ఛగీతాలు' రాయసాగానని చెప్పుకున్నారు. 'శత్రువు మీద చేసే యుద్ధాల నుంచి గ్రహించే సారం ఒక మనిషిని యోధుణ్ణి చేస్తుంది' అంటారు సిసాన్.

ఈ మహానాయకుని అమరత్వానికి నివాళులు అర్పించడం అంటే వివిధ దేశాల మావోయిస్టు పార్టీల, శక్తుల మధ్య పెంపొందుతున్న సంఘీభావం, సమన్వయాలను పటిష్టం చేయడం. సామ్రాజ్యవాదం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నది. ఈ పరిస్థితులలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజల, జాతుల పోరాటాలు పెంపొందుతున్న ప్రస్తుత తరుణంలో, ప్రపంచ సోషలిస్టు విప్లవాన్ని ముందుకు తీసుకెళ్ళేందుకు యావత్తు కమ్యూనిస్టు పార్టీలు, శక్తులూ రెట్టించిన విప్లవోత్తేజంతో విప్లవ కృషిని కొనసాగించడం కామ్రేడ్ జోస్ మారియో సిసాన్‌కు అర్పించే నిజమైన నివాళి అవుతుంది.

కామ్రేడ్ జోస్ మారియో సిసాన్‌కు లాల్‌సలామ్‌లు!

**అభయ్,**

**అధికార ప్రతినిధి,**

**కేంద్రకమిటీ.**

# విప్లవోద్యమానికి సుదీర్ఘకాలం సేవలందించిన నాయకుడు కామ్రేడ్ ఎల్ఎస్ఎన్ మూర్తికి అరుణారుణ వందనాలు!

కామ్రేడ్ ఎల్ ఎస్ ఎన్ మూర్తి (లక్కవరపు సత్యనారాయణ మూర్తి) అర్ధశతాబ్దికిపైగా భారత విప్లవోద్యమం కోసం సాంస్కృతిక, ప్రచురణా, అనువాద రంగాలలో ఎనలేని సేవలు అందించి 76వ యేట అన్నవాహిక క్యాన్సర్‌కు చికిత్స పొందుతూ డిసెంబర్ 21వ తేదీన అమరత్వం చెందాడు.

కామ్రేడ్ ఎల్ఎస్ఎన్ మూర్తి (శ్రీనన్న, శరత్) అనారోగ్యంతో కొన్ని సంవత్సరాలుగా భౌతికంగా విప్లవ నిర్మాణానికి దూరంగా ఉన్నప్పటికీ, సైద్ధాంతికంగా, భావజాలపరంగా ఆఖరు వరకు విప్లవాన్నే అంటిపెట్టుకుని ఉన్నాడు. జననాట్యమండలి చరిత్ర రచన సందర్భంగా జేఎన్ఎమ్ కళాకారుడు, విప్లవ కార్యకర్త అమరుడు కామ్రేడ్ డప్పు రమేష్ ఆయనను కలిసినప్పుడు, తన విప్లవ కార్యాచరణ గురించి మాట్లాడుతూ, 'విప్లవోద్యమం, దాన్ని నడిపే పార్టీ ఒక సాధారణ వ్యక్తికి విప్లవోద్యమ అవసరాలరీత్యా ఎన్ని రంగాలలో తర్ఫీదిచ్చి, ఎన్ని రంగాలలో ఉపయోగపడేలాగా వారికి నైపుణ్యాలను అలవరుస్తుందో అన్నదానికి నేనొక ఉదాహరణ. ఉద్యమ, పార్టీ అవసరాలకోసం పార్టీయే నన్ను తీర్చిదిద్దింది' అన్న వినమ్రమైన విప్లవ కమ్యూనిస్టు కామ్రేడ్ ఎల్ఎస్ఎన్ మూర్తి.

కేంద్ర ప్రభుత్వ డిఫెన్స్ అకౌంట్స్‌శాఖలో పూణే, హైదరాబాద్‌లలో పని చేసిన కామ్రేడ్ లక్కవరపు సత్యానారాచణమూర్తిది నేటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, గుంటూరు జిల్లా, తెనాలిని ఆనుకొని ఉన్న కఠెవరం గ్రామం. ఆయన తాతయ్య స్వాతంత్ర్య ఉద్యమంలో పని చేయగా, తండ్రి కాంగ్రెస్‌లో పని చేసేవాడు. ఆ రకంగా ఆయనకు రాజకీయాలు పరిచయం అయ్యాయి. పూణేలో ఉద్యోగం చేస్తున్నప్పుడు కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అనే కార్మికసంఘంలో చేరాడు. సహోద్యోగితో కలిసి నగరంలో ఉన్న సీపీఐ పార్టీ కార్యాలయానికి వెళ్ళసాగాడు. అక్కడే మార్క్సిస్టు రాజకీయాల క్లాసులు విన్నాడు. దాంతో మార్క్సిజంపై ఆసక్తి కలిగి మార్క్సిస్టు గ్రంథాలు చదివాడు. సీపీఐ రాజకీయాలలో లోపాలను అర్థం చేసుకున్నాడు. 1967లో నక్సల్బరీ రైతాంగ సాయుధ తిరుగుబాటు జరిగినప్పుడు ప్రజల మీద కాల్పులు జరిపిన మార్క్సిస్టు పార్టీ రాజకీయాలలో లోపాలను అర్థం చేసుకున్నాడు.

నక్సల్బరీ రాజకీయాలను గురించి తెలుసుకోసాగాడు. మిత్రుల ద్వారా కొల్లిపర రామనరసింహరావు పరిచయమయ్యాడు. కొల్లిపర ద్వారా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) పరిచయమయింది. ఆయన సలహాతో పూణే నుండి హైదరాబాద్‌కు బదిలీ అయి వెళ్ళాడు. హైదరాబాద్‌లో నక్సల్బరీ రాజకీయాల ప్రేరణతో ప్రజలలో సాహిత్యం ద్వారా ఆ రాజకీయాల ప్రచార కృషి చేస్తున్న ఆర్ట్ లవర్స్ సంస్థ గురించి తెలిసి వారి సభకు వెళ్ళి సభ్యులను పరిచయం చేసుకున్నాడు. వారితో కలిసి 'గ్రామాలకు తరలండి' కార్యక్రమంలో పాలుపంచుకున్నాడు. ఈ క్రమంలో పార్టీతో సంబంధాలు పెంపొందాయి. 1971లో పార్టీలో వృత్తివిప్లవకారునిగా అజ్ఞాత జీవితం ప్రారంభించాడు.



కామ్రేడ్ మూర్తి కార్మికులలో పని చేసేవాడు. వారిలో నక్సల్బరీ రాజకీయాలను ప్రచారం చేసాడు. వారి సమస్యలపై పోరాటాలు నిర్మించాడు. ఈ పని చేస్తూనే పార్టీ నిర్ణయం మేరకు ఆర్ట్ లవర్స్ సంస్థలో కొందరు సభ్యులతో కలిసి 1972 జులైలో జననాట్యమండలిని నిర్మించాడు. కామ్రేడ్ మూర్తే దానికి ఆ పేరు పెట్టాడు. 1974 ప్రారంభం నుంచి 1975లో ఎమెర్జెన్సీ విధించే వరకు దానికి బాధ్యులుగా ఉన్నారు. ఆ తర్వాత పార్టీ ఆయనను ప్రచురణా రంగానికి బదిలీ చేసింది. ఈ రంగంలోనే కామ్రేడ్ మూర్తి చాలాకాలం పని చేసాడు. సాంస్కృతికరంగం పట్ల ఆసక్తి మాత్రం వదులుకోలేదు. జననాట్యమండలి అభివృద్ధి క్రమంలో ముఖ్య మలుపులలో ఆయన పాత్ర ఉన్నది.

విప్లవ జీవితారంభంలో అప్పటికే కార్యకర్తగా ఉన్న

జననాట్యమండలి కళాకారిణిని వివాహం చేసుకున్న కామ్రేడ్ మూర్తి ఆ వివాహం విఫలం అయిన తర్వాత తిరిగి చేసుకోలేదు.

1977 నాటికీ పార్టీ రాజకీయ పత్రికగా ప్రారంభమయిన 'క్రాంతి' పత్రికకు సంపాదక బాధ్యతలు చేపట్టి అనేక సంవత్సరాలపాటు ప్రచురణ బాధ్యతలు నిర్వహించాడు. వివిధ ప్రజాసంఘాల రాష్ట్ర మహాసభల నిర్వహణ బాధ్యతలలో భాగంగా ఉన్నాడు. 1982–85 మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రొవెన్షియల్(రాష్ట్ర స్థాయి) కమిటీ సభ్యునిగా కార్మికరంగ బాధ్యతలు చేపట్టాడు. 1995 నుండి 2000 వరకు దండకారణ్యలో పని చేసాడు. అక్కడ పత్రికారంగంలో, రాజకీయ శిక్షణలో సేవలు అందించాడు.

2001లో నాటి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు–లెనినిస్టు) (పీపుల్స్‌వార్) 9వ కాంగ్రెస్–2వ కాంగ్రెస్‌లో ప్రతినిధిగా పాల్గొన్నాడు. 2001 నుండి 2004 వరకు ఆంధ్ర రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఉండి తిరిగి కార్మికరంగంలో బాధ్యతలు నిర్వహించాడు. 2005లో పార్టీ ఆయనను పీపుల్స్ మార్చ్ పత్రిక నిర్వహణకు బదిలీ చేసింది.

కామ్రేడ్ మూర్తి గొప్ప అనువాదకుడు. పార్టీ ప్రచురణారంగంలో పని చేస్తూ, మరి కొందరితో కలిసి మావో ఏరిన రచనల సంపుటాలను అనువాదం చేసాడు. 6వ సంపుటం నుంచి 9వ సంపుటం వరకు ఇంగ్లీషు సంపుటాలను ప్రచురించాడు. పార్టీ మౌలిక దస్తావేజులనూ, వివిధ సందర్భాలలో విడుదల చేసిన సర్క్యులర్‌లను అనువాదం చేసాడు.

పీపుల్స్ మార్చ్‌లో పని చేస్తున్నప్పుడు 2009లో అరెస్టయిన కామ్రేడ్ మూర్తి అనేక సంవత్సరాలు రాజమండ్రి జైలులో ఉన్నాడు. విడుదల అయిన తర్వాత తీవ్ర అనారోగ్యం, వృద్ధాప్యంతో వచ్చే సమస్యలతో వృద్ధాశ్రమంలో ఉన్నాడు. ఆయన కోరిక మేరకు ఆయన మరణానంతరం ఆయన శవాన్ని ఉస్మానియా వైద్య కళాశాలకు అందజేసారు.

కామ్రేడ్ మూర్తి నక్సల్బరీ మొదటితరం నాయకత్వంలో ఆయన ఒకరు. నక్సల్బరీ ఉద్యమం సెట్‌బ్యాక్ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యమ వికాసానికి ఆంధ్ర రాష్ట్ర కమిటీ చేసిన కృషిలో చాలా చురుకుగా పాల్గొన్నాడు. ఆ తర్వాత సాయుధ పోరాట రాజకీయాలు పెంపొందడానికి దోహదం చేసాడు. చివరి వరకు ప్రజాయుద్ధంలో పార్టీ ఇచ్చిన బాధ్యతలలో కొనసాగాడు.

కామ్రేడ్ మూర్తి విప్లవానికి అందించిన సేవలు విప్లవ కార్యాచరణలో సుస్థిర స్థానం సంపాదించుకున్నాయి. ఆ ఆదర్శమూర్తి విప్లవ కార్యకర్తల మదిలో ఎల్లకాలం నిలిచి ఉంటాడు. ఆయన సుదీర్ఘ విప్లవ జీవితం నుండి ఆయన అనుభవాల గని నుండి నేర్చుకోవడానికి కృషి చేద్దాం. కామ్రేడ్ మూర్తి ఆశయ సాధనకై పునరంకితమవుదాం.

---

...10వ పేజీ తరువాయి భాగం

అరెస్టులనూ, ఎన్‌కౌంటర్ దాడులను వేలాది మంది ప్రజలు ప్రతిఘటించి తిప్ప కొట్టారు. ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధి పేరుతో 100కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించింది. వందలకోట్ల నిధులను కేటాయించి ఈ ప్రాంతంలోకి సాయుధ బలగాలను దింపడానికి రోడ్లు, బ్రిడ్జీలు, కమ్యూనికేషన్ వ్యవస్థను అభివృద్ధి పరిచారు. ఆ తర్వాత ప్రతి 3–5 కిలోమీటర్ల పరిధిలో క్యాంపులు పెట్టి కార్పెట్ సెక్యూరిటీని బలోపేతం చేసి, అణచివేతను తీవ్రతరం చేసారు. ఎక్కడైతే 'దున్నేవారికే భూమి–విప్లవ ప్రజాకమిటీలకే అధికారం' అనే కేంద్ర నినాదంతో ఉద్యమం ఉన్నత దశకు ఎదుగుతున్నదో అక్కడ శత్రువు తన సాయుధ బలగాలను మోహరించి అణిచివేయాలని చూస్తున్నాడు. తాత్కాలికంగా అక్కడ ఉద్యమం బలహీనపడినప్పటికీ, నేటికీ ప్రజల్లో 'దున్నేవారికే భూమి' సమస్య కేంద్ర నినాదంగానే ఉంటూ వేరు వేరు రూపాలలో పోరాడుతూనే ఉన్నారు.

గత దశాబ్దకాలంగా ఏఓబీ ప్రాంతంలో సీపీఐ(మావోయిస్టు) నాయకత్వంలో రైతాంగం, పెటీబూర్జువా, విశాల ప్రజారాశులు ఐక్యంగా నేటికీ తమ మౌలిక సమస్యగా ఉన్నా, భూమి సమస్యే కేంద్రంగా జరిగిన వర్గపోరాటాలలో ఎన్నో విజయాలు సాధించారు. భూస్వాముల, షావుకార్ల, వడ్డీవ్యాపారుల, ప్రభుత్వ ఫారెస్ట్ అధికారుల, తెగ పెత్తందారుల దోపిడీకి వ్యతిరేకంగా, దేశీయ, అంతర్జాతీయ, సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలకూ, కార్పొరేట్ సంస్థలకు వ్యతిరేకంగా, దోపిడీవర్గాల అధికారాన్ని కాపాడేందుకు సేవ చేస్తున్న ప్రభుత్వ సాయుధబలగాలకు వ్యతిరేకంగా ప్రజలు తెగించి పోరాడారు. తాము పోరాడి సాధించుకున్న తమ అడవినీ, భూములనూ, సమస్త వనరులనూ, తమ అధికారాన్ని కాపాడుకోవడానికి బలమైన శత్రువుతో తలపడుతూ నేటికీ పోరాడుతూనే ఉన్నారు. ప్రజలు సాధించుకున్న ఈ విజయాలను వమ్ముచేసేందుకు ఏఓబీ విప్లవోద్యమంపై నాటి 'గ్రీన్‌హంట్' నుండి నేటి 'సమాధాన్' వరకు శత్రువు క్రూరమైన దమనకాండను అమలు చేస్తున్నాడు. నేడు ఏఓబీ విప్లవోద్యమం తాత్కాలిక వెనుకంజలో ఉంది. అయినప్పటికీ, ఈ ఉద్యమం మళ్ళీ రెక్కలువిప్పి ఎన్నోరెట్ల బలంతో ముందుకు రావడం ఖాయం. ఏఓబీలో నాలుగు దశాబ్దాలుగా జరిగిన వర్గపోరాటంలో ప్రజలలో పెరిగిన రాజకీయ, ప్రజాయుద్ధ చైతన్యం నేడు విప్లవోద్యమం వెనకపట్టు పట్టిన తర్వాత అక్కడ దోపిడీవర్గాలు అమలు చేసే దమనకాండ, ప్రజలను తమ భూములనుండీ, అడవులనుండి తరిమివేసే దోపిడీవిధానాలు ప్రజల్ని మళ్ళీ రెట్టింపు కసితో విప్లవోద్యమంలో పాల్గొనీ, వర్గపోరాటాన్నీ, ప్రజాయుద్ధాన్ని మరింత బలంగా అభివృద్ధి చేసి పాలకవర్గాలను కూలదోసేవరకు పోరాడేలా చేయక తప్పదు. నేడు తాత్కాలికంగా ఏఓబీలో కొన్ని ప్రాంతాలలో మన పార్టీ పీఎల్‌జీఏ ప్రత్యక్షంగా లేకపోయినప్పటికీ, మన్యంలో బాక్సైట్ తవ్వకాలకూ, హైడ్రోపవర్ ప్రాజెక్టులకూ, ఏపీఎఫ్‌డీసీకి వ్యతిరేకంగా, కొరాపుట్‌లో మాలిపర్వత తవ్వకాలకు వ్యతిరేకంగా, మల్కనగిరి, పొడియా ఏరియాలో దాల్మియా సిమెంట్ ప్యాక్టరీకి వ్యతిరేకంగా, శ్రీకాకుళంలో రామకృష్ణాపురం భూములు సూదికొండ, నెమలికొండలను కాపాడుకునేందుకు ప్రజలు అత్యంత సమరశీలంగా నిర్వహిస్తున్న పోరాటాలే ఇందుకు నిదర్శనం.

# యుద్ధభూమిలో జన్మించిన పోరుబిడ్డ

# కామ్రేడ్ సుంద్రి (ఈడే)



కామ్రేడ్ కోవాసి సుంద్రి (ఈడే)కిష్టారం ఏరియా, వెద్రుం గ్రామంలో పుట్టి పెరిగింది. తన తండ్రి రైతుకూలీ సంఘంలో పని చేయడం ద్వారా చిన్నప్పటినుండే కామ్రేడ్ సుందరి పార్టీ రాజకీయాలతో పెరిగింది. తాను చిన్నతనం నుండే బాలలసంఘంలో సభ్యురాలయ్యింది. ఈ క్రమంలో ఆ సంఘంలో పనిచేస్తూనే ఇంటి పనిలో, వ్యవసాయపనుల్లో పాలుపంచుకునేది. తాను పెరిగి పెద్దదవుతున్న క్రమంలో సమాజంలోని దోపిడీనీ, ప్రభుత్వం ఈ ప్రాంతంలో అమలు జరుపుతున్న అత్యంత పాశవికమైన నిర్బంధాన్ని చవిచూసింది. ఈ క్రమంలో కామ్రేడ్ సుంద్రి జనమిలీషియాలో సభ్యురాలయ్యింది. అప్పటికి తన వయస్సు 14 సంవత్సరాలు. జనతనసర్కార్లు అభివృద్ధి చెందుతున్న ఆ ప్రాంతమంతా ప్రతి ఊరు, ప్రతి ఇల్లు ఏదో ఒక సంఘంలో సభ్యులై ఉంటారు. అలాగే సుంద్రి కుటుంబం కూడా ఆ సంఘాలలో పని చేస్తూ ఉండటం మూలంగా తనను విప్లవోద్యమంవైపు ప్రోత్సహించారు. ఈ ప్రాంతంలో జరిగే విప్లవోద్యమ నిర్మాణంలో తాను భాగస్వామి అవుతూ వచ్చింది. తర్వాత కొద్ది రోజులకు పార్టీలోకి వెళ్ళాలనే నిర్ణయాన్ని తన బాధ్యుల దగ్గర వెలిబుచ్చింది. 2020 అక్టోబర్ నెలలో కామ్రేడ్ సుంద్రి పార్టీలోకి పూర్తికాల కార్యకర్తగా భర్తీ అయ్యింది. ఒక సంవత్సర కాలం కిష్టారం ఏరియా స్థానిక దళంలో పని చేసింది.

పార్టీ అవసరాలరీత్యా 2022 జనవరిలో ఏఓబీ సీఆర్సీ 1వ పీఎల్కు బదిలీ అయింది. ఈ క్రమంలో పార్టీరోజువారి కార్యక్రమాలలో భాగమయ్యేది. పార్టీలో పట్టుదలగా చదువు నేర్చుకోవడం మీద శ్రద్ధ పెట్టేది. పార్టీ నిర్వహించిన రాజకీయ క్లాసులకు హాజరై తన విప్లవ చైతన్యాన్ని అభివృద్ధి చేసుకున్నది. సహజంగానే ఆదివాసీ గ్రామాలలో మహిళలు రక్తహీనత, పౌష్టికాహారలోపంతో బాధపడుతుంటారు. ఈ అనారోగ్య సమస్యలు కామ్రేడ్ సుందరిని కూడా వెంటాడాయి. వచ్చిన కొద్ది రోజులకే తీవ్ర అనారోగ్యానికి గురయ్యింది. అయితే తాను 'నేను పార్టీలో పని చేయలేను' అని ఏనాడు అనలేదు. 2022 ఏప్రిల్లో తీవ్ర అనారోగ్యానికి గురైంది. దానితో రెండుసార్లు హాస్పిటల్కు పంపి వైద్యం అందించినప్పటికీ ఆరోగ్యం కుదుటపడకపోగా, దినదినం మరింత క్షీణిస్తూ వచ్చింది. సెప్టెంబర్ 30వ తేదీన కామ్రేడ్ సుందరి అనారోగ్యంతో మన పీఎల్జీఏ కామ్రేడ్స్ మధ్యనే తుదిశ్వాస విడిచింది. ఇలాంటి మరణాలను కూడా రాజ్యం చేసిన హత్యగానే భావించాలి. పీడిత ప్రజల పక్షాన పోరులో భాగమై తుదిశ్వాస వరకు పనిచేసి అనారోగ్యంతో అమరురాలైన కామ్రేడ్ సుంద్రికి అరుణారుణ జోహార్లు.

***

*26వ పేజీ తరువాయి భాగం...*

పరిశీలించాలి. తరతరాలుగా తీవ్ర నిర్లక్ష్యానికి గురికాబడ్డ ఈ ప్రాంత ప్రజలపై హఠాత్తుగా పాలకవర్గాలు ఎందుకు అవదులులేని ప్రేమను గుప్పిస్తున్నాయో, దాని వెనక దోపిడీవర్గాల ప్రయోజనాలేమిటో క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి. ప్రజల ప్రయోజనాలకు భిన్నంగా ఈ ప్రాంతంలో పాలకవర్గాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్న దళారీలపట్ల నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలి. ప్రభుత్వాలు కల్పిస్తున్న తాత్కాలిక ప్రయోజనాలకు ఆశపడితే భవిష్యత్ అందకారంగా మారే స్థితి దాపురిస్తుందనే సత్యాన్ని అర్థం చేసుకున్నప్పుడే దోపిడీవర్గ కుట్రలకు వ్యతిరేకంగా పోరాడగల్గుతాం. గతంలో నారాయణపట్నా, బందుగాం, లక్ష్మింపూర్, లమ్తాపుట్, నందాపూర్, ప్రాంతాలలో ప్రజలు 'దున్నేవారికి భూమి' కోసం, ప్రజల్ని నిర్వాసితుల్ని చేసే ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సంఘటితమై పోరాడి విజయాలు సాధించిన చరిత్ర ఉంది. ఆ అనుభవాలను అందిపుచ్చుకుంటూ ఈ ప్రాంత వనరులను కాపాడుకోవడానికి 'జల్, జంగల్, జమీన్, ఇజ్జత్, అధికారలక్ష్యం'తో సమరశీల పోరాటాలు చేపట్టమే ఏకైకమార్గం.

# అనారోగ్యంతో సైతం శత్రువును నేలి చేసిన ధీశాలి కామ్రేడ్ మంగో



దండకారణ్యంలో 1980ల నుండి సీపీఐ (మావోయిస్టు) ఆధ్వర్యంలో ప్రజలు 'జల్, జంగల్, జమీన్, ఇజ్జత్, అధికారం' కోసం నేటికీ తమ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. 'దున్నేవారికే భూమి' ప్రాతిపదికన తెగ పెత్తందార్ల, భూస్వాముల, ఫారెస్టు భూములను స్వాధీనం చేసుకొని భూమిలేని పేదలకు పంపిణీచేసి, సాగు చేసుకుంటున్నారు. పాత దోపిడీ అధికారాన్ని ధ్వంసం చేసి జనతనసర్కార్లను నిర్మించుకున్నారు. జనతనసర్కార్ల నాయకత్వంలో విద్యా, వైద్యాన్ని ప్రజలకు అందిస్తున్నారు. 'సల్వాజుడుం', 'ఆపరేషన్ గ్రీన్‌హంట్', నేటికీ కొనసాగుతున్న 'సమాధాన్-ప్రహార్' దాడులను ఎదుర్కొంటూ, ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని మునుముందుకే తీసుకుపోతున్నారు. సరిగ్గా ఇలాంటి వాతావరణంలోనే కామ్రేడ్ మంగో పురుడుబోసుకుంది.

కామ్రేడ్ మంగో దక్షిణ్ బస్తర్ డివిజన్ ఊసూర్ బ్లాక్, పామేడ్ ఏరియా, కొండపల్లి పంచాయితీ, పెద్ద బట్టూమ్ గ్రామంలో నిరుపేద ఆదివాసీ రైతు కుటుంబంలో 22 సంవత్సరాల ముందు జన్మించింది. మొదట తన తల్లిదండ్రులు జేగురుగొండ ఏరియా, కుందేరు గ్రామంలో నివాసం ఉండేవారు. అయితే భూమి లేకపోవడంతో బ్రతుకుదెరువు కోసం పెద్ద బట్టూమ్‌కు వలస వచ్చారు. వాళ్ళ ఇంట్లో కామ్రేడ్ మంగోనే పెద్ద కూతురు. తనకు ఒక తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్ళు ఉన్నారు. ఇంటికి పెద్ద బిడ్డ కావడంతో ఇంటి పనుల పట్ల, పొలం పనుల పట్ల బాధ్యతగా ఉండేది. ఈ పనులను చూస్తూనే గొడ్లను మేపడానికి వెళ్ళేది. మొత్తంగా కామ్రేడ్ మంగో తల్లిదండ్రులకు ఆధారపడదగ్గ కూతురుగా ఎదిగింది. వెనకబడిన ఆదివాసీ సమాజపు కట్టుబాట్లు, తెగపెద్దల అణచివేత, పితృస్వామ్యం మొదలైన వాటిని చవిచూసింది. ఈ క్రమంలో ఆ సమస్యలపై పోరాడుతున్న ఆదివాసీ విప్లవ మహిళా సంఘంలో సభ్యురాలిగా చేరి, ఆ సంఘు కార్యక్రమాలలో భాగమయ్యింది. కొద్ది రోజుల తర్వాత పాటలపై తనకున్న మక్కువతో సీఎన్ఎమ్‌లో చేరి, అది నిర్వహించే కార్యక్రమాలలో పితృస్వామ్యంపై, భూస్వామ్య సంస్కృతిపై, సామ్రాజ్యవాదంపై పాటలు పాడి ప్రజలను సహచర కామ్రేడ్స్‌ను ఆకట్టుకునేది.

కామ్రేడ్ మంగో 2021 జులైలో అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా పార్టీలోకి పూర్తికాల కార్యకర్తగా భర్తీ అయింది. 2021 నవంబర్‌లో పార్టీ అవసరాలరీత్యా ఏఓబీ సీఆర్‌సీ 1వ పీఎల్‌కు బదిలీ అయింది. ఈ క్రమంలో తెలుగు స్కూల్, మిలటరీ డ్రిల్స్, సమిష్టి అధ్యయనం, పార్టీ క్రమశిక్షణ మొదలైన వాటిని పట్టుదలగా నేర్చుకునేది. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా ఏదైనా చూస్తే మొహమాటం లేకుండా చెప్పేది. అదే స్థాయిలో తన పొరపాట్లను కూడా ఒప్పుకునేది.

2022 అక్టోబర్‌లో కామ్రేడ్ మంగో అనారోగ్యాని(జాండీస్)కి గురికావడంతో హాస్పిటల్‌కి పంపి వైద్యం అందించాం. కానీ అనారోగ్య సమస్య నయం కాకపోగా, దినదినం మరింత జఠిలమయ్యింది. తిరిగి నవంబర్ 17న వైద్యం నిమిత్తం హాస్పిటల్‌కు వెలుతున్న క్రమంలో ఒక ద్రోహి ఇచ్చిన పక్క సమాచారంతో పోలీసులు కుంట సమీపంలో అరెస్టు చేసారు. కామ్రేడ్ మంగో అనారోగ్యాన్ని కూడా దృష్టిలో పెట్టుకోకుండా నరహంతకులైన పోలీసులు చిత్రహింసలకు గురిచేసారు. అయినప్పటికీ మంగో పార్టీ రహస్యాలను కాపాడి శత్రువు పెట్టిన చిత్రహింసలను భరిస్తూ, పోలీసుల హత్యకు గురైంది. కామ్రేడ్ మంగో శత్రువు దగ్గర ప్రదర్శించిన ధైర్యం మనందరికీ ఆదర్శం. తాను పరిపూర్తి చేయలేకపోయిన తన ఆశయాన్నీ, కలల్ని మనందరం ముందుకు తీసుకుపోదామని శపదం చేద్దాం. అదే కామ్రేడ్ మంగోకు అర్పించే నిజమైన నివాళి.

# పోరాడే ప్రజలపై దాడులు చేస్తూ, విప్లవోద్యమ సమూల నిర్మూలన లక్ష్యంతో ఏఓబిలోని రెండు రాష్ట్రాల పోలీసు బలగాలు ఎడతెరిపి లేకుండా సమన్వయంతో అమలు చేస్తున్న నిర్బంధం

ఆంధ్రప్రదేశ్‌లో గత మూడున్నర సంవత్సరాలుగా అధికారంలో కొనసాగుతున్న వైఎస్ఆర్‌సీపీ జగన్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన హామీలను తుంగలో తొక్కి తన ఆశ్రితులకూ, బడా భూస్వాములకూ, అంతర్జాతీయ దేశీయ కార్పొరేట్ సంస్థలకు సేవచేయడంలో నిమగ్నం అయ్యింది. దానితో ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అన్ని పీడితవర్గాల, సెక్షన్‌ల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళనకు దిగుతున్నారు. ఉద్యోగులు సీపీఎస్‌ను రద్దు చేయమనే డిమాండ్‌తో పోరాడటం, నిరుద్యోగులు ఉపాధి కల్పన కోసం, అంగన్‌వాడీలు, గ్రామ వాలంటీర్లు, ఉద్యోగ భద్రత, వేతనాల పెంపుకోసం, అమరావతి రైతులు రాజధాని నిర్మాణం కోసం, పోలవరం డ్యాం నిర్వాసితులు నష్టపరిహారం చెల్లించమని రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రజలు ఆ ప్రాంతాల వెనుకబాటుతనానికి కారణమైన ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా తమ తమ సమస్యలపై ఉద్యమిస్తున్నారు. అడవులలో ఖనిజ సంపదను దోచుకోవడానికి వ్యతిరేకంగా ఆదివాసీలు పోరాడుతున్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల విలీనానికి వ్యతిరేకంగా ఆందోళనబాట పట్టారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు పిడికిలెత్తారు. దళితులు, మహిళలపై దాడులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా నినదిస్తున్నారు. వైఎస్ఆర్‌సీపీ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రభుత్వ, ప్రజల భూములను కబ్జాలు చేస్తూ, వేలకోట్ల రూపాయల అక్రమ సంపాదనకు పాల్పడటాన్ని ప్రజలు ప్రతిఘటిస్తున్నారు.

ఒడిశా రాష్ట్రంలో అధికార బీజేడీ నవీన్ ప్రభుత్వం విదేశీ, దేశీయ కార్పొరేట్ సంస్థలకు ఎర్రతివాచీలు పరిచి, రాష్ట్రంలో ఆదివాసీ ప్రాంతంలలో ఉన్న విలువైన ఖనిజసంపదను దోచిపెడుతూ, లక్షలాది మంది ప్రజలను నిర్వాసితులను గావిస్తున్నది. ప్రభుత్వం అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాలకు వ్యతిరేకంగా నిర్వాసితులవుతున్న లక్షలాదిమంది ఆదివాసీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు.

సీపీఐ(మావోయిస్టు) నాయకత్వంలో 'దున్నేవారికే భూమి-విప్లవ ప్రజారాజ్యకమిటీలకే అధికారం' అనే కేంద్ర నినాదంతోపాటు స్వావలంబనతో కూడిన అభివృద్ధిని డిమాండ్ చేస్తూ, సామ్రాజ్యవాద నిర్దేశిత ఎల్‌పీజీ విధానాలకు వ్యతిరేకంగానూ, ప్రజల దైనందిన సమస్యల పరిష్కారాన్ని కోరుతూ బ్రాహ్మణీయ హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తూ, ప్రజల న్యాయమైన పోరాటాలన్నింటికీ తన సంపూర్ణ మద్దతును ప్రకటిస్తూ ఉద్యమిస్తున్నది. విప్లవోద్యమంపై, పోరాడే ప్రజలపై అమలు జరుగుతున్న వ్యూహాత్మక 'సమాధాన్-ప్రహార్' దాడిని ప్రతిఘటిస్తూ పోరాడుతున్నది.

తీవ్రమైన ఆర్థిక, రాజకీయ సంక్షోభంలో కూరుకుపోయిన రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సమస్యల్ని పరిష్కరించే పరిస్థితిని కోల్పోయాయి. దానితో తమ అధికారాన్ని నిలుపుకోవడానికి పోరాడే ప్రజలనూ, విప్లవోద్యమానికి నాయకత్వం వహిస్తున్న మావోయిస్టు పార్టీపై తమ ఫాసిస్టు అణచివేతను తీవ్రతరం చేసాయి. ప్రజలపై, ప్రజాసంఘాలపై, ప్రజాస్వామికవాదులపై చివరకు ప్రతిపక్షాలపై కూడా క్రూరమైన 'ఊపా', 'రాజద్రోహనేరం'లాంటి చట్టాలను ప్రయోగించడం, ఎన్ఐఏకు విచ్చలవిడి అధికారాలను కట్టబెట్టి ప్రత్యామ్నాయ రాజకీయ భావాలు కలిగిన గొంతులను నొక్కడానికి నిరంతరం దాడులు చేస్తూ, అక్రమ కేసులు బనాయించి సంవత్సరాల తరబడి బేయిల్స్ కూడా ఇవ్వకుండా జైళ్ళలోనే నిర్బంధించడం సర్వసాధారణంగా మారింది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామిక పద్ధతిలో పోరాడుతున్న అనేక ప్రజాసంఘాలు, ప్రజాస్వామికవాదులు నిజమైన ప్రజాపక్షపాతులు చివరకు అడ్వకేట్‌లపై కుట్రపూరితంగా మావోయిస్టులతో సంబంధాలున్నాయని నెపం మోపి ముంచింగిపుట్, జి.మాడుగుల, పెదబయలు, పిడుగురాళ్ళ, నగర్‌నార్(చత్తీస్‌ఘడ్), కొచ్చి(కేరళ) కేసుల పేర్లతో ఊపా చట్టాన్ని ప్రయోగించి ఎన్ఐఏ నిరంతరం వారి ఇళ్ళపై దాడులు, సోదాల పేర్లతో ఫోన్లు, లాప్‌టాప్‌లు, హార్డ్‌డిస్క్‌లు, పెన్‌డ్రైవ్‌లు, సాహిత్యం తదితరాలను స్వాధీనం చేసుకోవడం, విచారణ పేరుతో నిత్యం ఎన్ఐఏ ఆఫీసులచుట్టూ తిప్పుకోవడం, అరెస్టులు చేసి, బెయిల్‌కు వీలులేని కేసులు బనాయించి జైళ్ళకు పంపడం ద్వారా ప్రజలలో, వారి కుటుంబ సభ్యులలో భయోత్పాతాన్ని సృష్టించడం రాష్ట్రంలో నేడు నిత్యకృత్యంగా మారిపోయింది. కేంద్ర హోంశాఖమంత్రి అధ్యక్షతన నవంబర్(2022)లో హర్యానా రాష్ట్రంలో మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలలోని హోంమంత్రిత్వశాఖలతో జరిపిన సమావేశంలో "ఆయుధాలు ధరించిన వారితోపాటు, కలంద్వారా ప్రత్యామ్నాయ రాజకీయ భావజాలాన్ని ప్రచారం చేస్తున్నవాళ్ళుకూడా అంతే ప్రమాదకారులనీ, ఇద్దరిని సమానంగానే భావించి అణచివేయాల"ని ప్రధానమంత్రి స్వయంగా పిలుపునిచ్చారు. అంటే రాబోయే రోజుల్లో మేధావులు, ప్రజాస్వామికవాదులు, ప్రగతిశీలశక్తులు, లౌకికవాదులు, నిజమైన ప్రజాస్వామికవాదులందరూ అర్బన్ మావోయిస్టులపేరుతో అమలు జరిగే బ్రహ్మణీయ హిందూ ఫాసిస్టుదాడిని ఎదుర్కోవలసి ఉంటుంది.

కేంద్రప్రభుత్వ నాయకత్వంలో వ్యూహాత్మక 'సమాధాన్-ప్రహార్' దాడిని ఆంధ్ర, ఒడిశా రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగానూ, మెరుగైన సమన్వయంతోను సరిహద్దులను చెరిపివేసి, సాయుధ బలగాలు హంతక

దాడులు కొనసాగిస్తున్నాయి. పార్టీ, పీఎల్‌జీఏ కార్యకలాపాలు లేకున్నా, నిరంతరం అన్ని ప్రాంతాలలో కూంబింగ్ ఆపరేషన్స్ కొనసాగుతున్నాయి. గ్రామాలపై దాడులకూ, ప్రజల, ప్రజానిర్మాణాలనూ అక్రమ అరెస్టులకు గురి చేస్తున్నాయి. మానసిక యుద్ధంలో భాగంగా దుష్ప్రచారాన్ని ఒక క్యాంపెయిన్‌గా కొనసాగిస్తున్నారు. గ్రామాలను చుట్టుముట్టి వందలాది మందిని పట్టుకెళ్ళడం ద్వారా, 'జనసంపర్క్ శిబిరాల' నిర్వహణ పేరుతో బలవంతంగా సాధారణ ప్రజల్ని సమీకరించి వందలాది మావోయిస్టు మిలీషియా, పార్టీ, ప్రజాసంఘాల సభ్యులు లొంగిపోయినట్లుగా ప్రకటనలివ్వడం, పీఎల్‌జీఏ సాయుధశక్తిని బలహీనపరిచినామని చెప్పుకోవడంలో భాగంగా పోలీసులే కొన్ని సందర్భాలలో పాత ఆయుధాలనూ, ఆమ్యునేషన్‌ను ఇతర కొన్ని వస్తువులను చూపెడుతూ, ఆర్థికంగా దెబ్బతీసామని చెప్పడానికి డబ్బులు స్వాధీనపర్చుకున్నట్లుగా విలేఖర్లముందు ఫోటోలు తీసిపెట్టి ప్రకటనలిస్తున్నారు. ఇలాంటివి ముఖ్యంగా పార్టీ విప్లవదినాలు, నిరసన దినాల సందర్భంగా ప్రకటిస్తూ, మావోయిస్టు విప్లవ కార్యాకలాపాలను పూర్తిగా నియంత్రిస్తున్నామనీ, వారిని దెబ్బతీసి విజయం సాధించామని ప్రచారం చేస్తూ, ప్రజల మనోస్థైర్యాన్ని దెబ్బతీసి లొంగదీసుకొని తిరిగి గ్రామాలలో పాత దోపిడీవ్యవస్థను పదిలంగా కాపాడటానికి సర్వశక్తిని కేంద్రీకరించి పనిచేస్తున్నారు.

వేలకోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చుచేసి వ్యూహాత్మక ప్రాంతాలలోకి రోడ్లు, బ్రిడ్జీలు, సెల్‌టవర్ల నిర్మాణం శరవేగంగా యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడానికి పోలీసు సాయుధ బలగాల రక్షణలో యావత్తు ప్రభుత్వ యంత్రాంగం కేంద్రీకరించి పనిచేస్తుంది. కార్పెట్ సెక్యూరిటీ విస్తరణలో భాగంగా మల్కనగిరి జిల్లా, కటాఫ్ ప్రాంతం, జొంత్రిగ్రామంలో బీఎస్‌ఎఫ్ క్యాంపు నిర్మాణం చేసారు. ఉద్యమ ప్రాంతాల మధ్య సమన్వయాన్ని దెబ్బతీయడంలో భాగంగా ఏరియా, జిల్లా, రాష్ట్రాల సరిహద్దుల్లో ప్రత్యేకంగా కేంద్రీకరించి ఇన్‌ఫార్మర్ వ్యవస్థను బలోపేతం చేసుకొని, వందలాది బలగాలను మోహరించి నిరంతరం నిఘా పెడుతూ గాలింపులు చేపట్టడం, రాత్రి సమయాల్లో ప్రయాణ మార్గాలలో అంబుష్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా ఛత్తీస్‌ఘడ్, ఒడిశా సరిహద్దు శబరి నదిఒడ్డున ఉన్న మాలిపొదూర్ గ్రామ అటవీ ప్రాంతంలో నవంబర్ 11న రాత్రి ఒడిశా ఎస్‌ఓజీ, బీఎస్‌ఎఫ్ బలగాలు సంయుక్తంగా చేపట్టిన గాలింపు చర్యలలో గంజాయి మోసుకెలుతున్న కూలీలపై విచక్షణారహితంగా, విచ్చలవిడిగా జరిపిన కాల్పుల్లో ఇద్దరు సాధారణ ప్రజలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటనను నిజమైన ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరించడానికి ఎప్పటిలాగే నిసిగ్గుగా మావోయిస్టులకూ, పోలీసులకు మధ్య జరిగిన ఎదురుకాల్పులుగా ప్రకటించారు. ఈ సంఘటనపై చనిపోయిన కూలీల కుటుంబాలతోపాటు, కొరాపుట్, మల్కనగిరి జిల్లాల్లో ప్రజలనుండి తీవ్ర నిరసన వ్యక్తమయ్యింది. ఎమ్‌కేబీ డివిజన్ కమిటీ ఈ ఎన్‌కౌంటర్ హత్యాకాండకు నిరసనగా నవంబర్ 17న బంద్ పిలుపునిచ్చింది. ప్రజలు రాస్తారోకోలు, నిరసన ప్రదర్శనలు, పోలీసుస్టేషన్లను చుట్టుముట్టడం తదితర రూపాలలో ఆందోళనలకు దిగి ఈ ఎన్‌కౌంటర్ హత్యాకాండతోపాటు, గతంలో జరిగిన ఇలాంటి బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయవిచారణ జరిపి దోషులైన పోలీసులను శిక్షించాలనీ, చనిపోయిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. ప్రభుత్వం తన వర్గస్వభావాన్ని ప్రదర్శిస్తూ పోలీసులను రక్షించే వైఖరిని తీసుకొని ఆందోళన చేస్తున్న ప్రజలపైనే తప్పుడు కేసులను బనాయించింది. ఇలాంటి అణచివేత చర్యలన్నీ అనివార్యంగా ప్రజలను ప్రతిఘటించేలా సిద్ధపరుస్తున్నాయి. ఇవి అంతిమంగా దోపిడీవ్యవస్థను సమాధి చేయడం ఖాయం.

*38వ పేజీ తరువాయి భాగం...*

రోడ్లనూ, పోలీసు క్యాంపులనూ, సెల్‌టవర్లను నిర్మిస్తూ, ప్రజలకు వాలీబాల్, గొడుగులు, బట్టలు వంటివి ఇస్తున్నారు. బలవంతంగా సరెండర్లు చేయించుకుని ప్రజలే మవోయిస్టుల దిష్టిబొమ్మలు తగలబెడుతున్నారనీ, మన అమరుల స్థూపాలపై ప్రజలే మూడు రంగుల జెండాలు ఎగురవేస్తున్నారని ప్రకటనలు చేస్తున్నారు.

***ప్రియమైన ప్రజలారా!***

మనం ధైర్యంగా, దృఢంగా నిలబడాల్సిన సమయమిదే. ఎంతోమంది అమరుల రక్తం ధారపోసి సాధించుకున్న మన అడవినీ, భూమినీ, అధికారాన్నీ, పోరాట విజయాలను కాపాడుకోవాల్సిన సమయమిది. మన ముందు రెండే మార్గాలు ఉన్నాయి. లొంగిపోయి బానిసలుగా, కూలీలుగా బ్రతుకుదామా? తెగించి పోరాడి మన అడవినీ, భూములనూ, మన ప్రజల అధికారాన్ని కాపాడుకుందామా? ఆలోచించండి! పార్టీ అంటే వ్యక్తులు కాదు, పార్టీ అంటే 'మార్క్సిజం–లెనినిజం–మావోయిజం' అనే సిద్ధాంత మార్గదర్శకత్వంలో రూపుదిద్దుకున్న అజేయమైన ప్రజాశక్తి. ప్రజాయుద్ధమంటే వ్యక్తులు చేసే యుద్ధం కాదు, పీడిత ప్రజలు తమ 'అధికారం' కోసం చేసే యుద్ధం. కనుక పార్టీనీ, ప్రజాయుద్ధాన్ని సమూలంగా నిర్మూలించడం శతృవుకు సాధ్యం కాదు. వ్యక్తులు మరణించవచ్చు, అరెస్టుకావచ్చు, లొంగిపోవచ్చు. శతృవు లక్షలాది సైన్యాన్ని మోహరించి ప్రజలపై తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగించవచ్చు. అయినా ఇవేవీ కోట్లాది మంది పీడిత ప్రజల శక్తినీ, ఆకాంక్షలనూ, న్యాయమైన హక్కులను నిర్మూలించలేవు. నేడు మనం బలహీనంగా ఉండవచ్చు. అయినా ఈ ఓటములు తాత్కాలికమే. ఈ నిర్బంధాలు తాత్కాలికమే. ఇంతకంటే తీవ్రమైన నిర్బంధాలనెన్నింటినో ఓడించిన చరిత్ర మన్యం ప్రజలకు ఉంది. కనుక అధైర్యపడకండి. మళ్ళీ మనం శతృవు కుట్రలను సరిగ్గా అంచనా వేస్తూ, సరైన ఎత్తుగడలతో రహస్యంగా పని చేస్తూ మన శక్తిని కూడదీసుకోవాలి. ప్రజా శతృవులను ఓ కంట కనిపెడుతూ, శతృబలహీనతలను పసిగడుతూ, న్యాయమైన ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం కోసం, అడవిపై హక్కు కోసం, పీడిత ప్రజల అధికారం కోసం ఎన్ని ఆటంకాలెదురైనా ధైర్యంగా, దృఢంగా ప్రజాయుద్ధంలో ముందుకే సాగాలని కోరుతూ...

**విప్లవాభివందనాలతో,**

**విశాఖ - అల్లూరి సీతారామరాజు - అనకాపల్లి డివిజన్ కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు).**

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న భూస్వామ్య, సామ్రాజ్యవాద అనుకూల ఎల్‌పీజీ విధానాలను వ్యతిరేకిస్తూ కొనసాగుతున్న ప్రజాందోళనలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆంధ్రా, ఒడిశాలలో అనేక ప్రజానుకూల విధానాలు అమలు చేయడం ద్వారా ప్రజలు అభివృద్ధి, సంక్షేమంలో ముందుకెలుతున్నారనీ, ప్రస్తుతం ప్రజలు ఎలాంటి సమస్యల్ని ఎదుర్కోవడం లేదని ప్రజలు పోరాడటానికి ముందుకు రావడం లేదనీ, మావోయిస్టులే కృత్రిమంగా కొన్ని సమస్యల్ని సృష్టిస్తూ ప్రజలును తప్పుదారి పట్టిస్తూ, రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తుంటారని ఈ మధ్య పోలీసు ఉన్నతాధికారులు రాజకీయ నాయకుల్లాగా ప్రకటనలిస్తున్నారు. ఏఓబీలో మావోయిస్టు పార్టీనీ, విప్లవోద్యమాన్ని దెబ్బతీసామని కూడా పదేపదే ప్రకటనలు చేస్తున్నారు. కానీ అందుకు భిన్నంగా ఈ మధ్య కాలంలో ప్రజలు తాము ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పెద్దఎత్తున ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనకు దిగుతున్నారు. వాటిలో మచ్చుకు కొన్నింటిని ఈ క్రింద పరిశీలిద్దాం. ఈ పోరాటాల వెనుక గత 4 దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో జరుగుతున్న వర్గపోరాటం, ప్రజాయుద్ధం అందించిన విప్లవ చైతన్యం, పోరాటస్ఫూర్తి ప్రజలలో ఎంత బలంగా కొనసాగుతున్నదో అవగతం చేసుకోవచ్చు. పోలీసు అధికారుల మాటల్లోని బూటకత్వాన్ని కూడా ఇవి నగ్నంగా వ్యక్తపరుస్తున్నాయి.

దేశంలో గత 3 దశాబ్దాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామ్రాజ్యవాద అనుకూల ప్రజావ్యతిరేక ఎల్‌పీజీ విధానాలను అత్యంత దూకుడుగా అమలు చేస్తున్నాయి. నేడు సామ్రాజ్యావాదం, దేశీయ దళారీ, బూర్జువావర్గం దేశంలోని వనరులనూ, మార్కెట్‌లను చిత్తానుసారంగా దోచుకుంటున్నారు. ఒడిశా రాష్ట్రంలో పుష్కలంగా ఉన్న అత్యంత విలువైన ఖనిజ సంపదను అంతర్జాతీయ, బహుళజాతి సంస్థలు, దేశీయ కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా అప్పగించి దోచుకోవడానికి నవీన్ ప్రభుత్వం ఎర్ర తివాచీలు పరుస్తున్నది. వారి పెట్టుబడులను ఆకర్షించడానికి రాష్ట్రంలో అవసరమైన మౌలిక సదుపాయా(రోడ్లు, విమానాశ్రయాలు, నీళ్ళు, కరెంటు సరఫరా వ్యవస్థ, కమ్యూనికేషన్స్)లను అభివృద్ధి పరుస్తున్నది. ఫలితంగా రాష్ట్రంలోని లక్షలాది మంది ఆదివాసీల సాగుభూములు, నివాస స్థలాలు కోల్పోయి నిర్వాసితులుగా మారుతున్నారు. కొరాపుట్ జిల్లాలోని దేవమాలి పర్వతంలో అల్యూమినియం, బాక్సైట్ ఖనిజాలను తవ్వి తీసుకుపోవడానికి ఇండాల్కో కంపెనీలో ప్రభుత్వం ఒప్పందం చేసుకొని అనుమతులు ఇచ్చింది. దానివల్ల ప్రభావితమయ్యే 4 పంచాయితీలకు చెందిన వేలాది మంది ప్రజలు 'మాలిసురక్షాసమితి' అని పోరాట సంఘాన్ని నిర్మించుకొని గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వం ఎన్ని కుట్రలకూ, కుహకాలకూ, సాయుధ అణచివేతకు దిగినా, రాజీ పడకుండా సంఘటితంగా, సమరశీలంగా తమ ఉద్యమాన్ని



కొరాపుట్ జిల్లాలోని మాలి పర్వతం ఖనిజ నిక్షేపాల తవ్వకాల అనుమతులకు వ్యతిరేకంగా కదంతొక్కిన ప్రజానీకం

కొనసాగిస్తున్నారు. అయినప్పటికీ, ప్రభుత్వం ఇండాల్కో కంపెనీ తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుండా ఉద్యమ నాయకత్వంలోని కొందరిని కొనేయడం, ప్రజలలో ఒక సెక్షన్‌ను తక్షణ ఆర్థిక ప్రలోభాలకు గురిచేసి, ప్రజలలో చీలికను తీసుకురావడం, గుండాల ద్వారా బెదిరింపులకు దిగడం, పోలీసుల ద్వారా అక్రమ అరెస్టులు చేసి, తప్పుడు కేసులు బనాయించి జైళ్ళలో నిర్బంధించడంలాంటి పద్ధతుల్లో తమకు అనుకూల పరిస్థితిని సృష్టించుకొని హైకోర్టు తీర్పులద్వారా, ప్రజాభిప్రాయాన్ని తమకనుకూలంగా మలుచుకోవడానికి శతవిధాల ప్రయత్నాలు కొనసాగిస్తున్నది. వీటన్నింటిని ధిక్కరించి, ఎదురునిలిచి ప్రతిఘటిస్తూ, తమ న్యాయమైన పోరాటానికి విశాల ప్రజల మద్దతను కూడగడుతూ, వినూత్న పద్ధతుల ద్వారా అంతిమ విజయం సాధించే వరకు తమ పోరాటాన్ని ఆపకుండా కొనసాగిస్తున్నారు. ఈ పోరాట ప్రభావంతో జిల్లాలోని పొట్టంగి బ్లాక్‌లో చిట్టెంగొంది, కర్తఖండి, బాగ్‌డొంగర్, సింగమాలి ప్రాంత ప్రజలు ఉద్యమిస్తున్నారు.

మల్కనగిరి జిల్లాలోని శబరీనదిని ఆనుకొని ఉన్న కొత్తమట్టేరు పంచాయితీ పరిధిలో సిమెంట్‌రాయి నిక్షేపాలు ఉన్నాయని ప్రభుత్వం సర్వేలు చేయించే 2013లో ఆ రాయిని తవ్వితీసి సిమెంట్ ఫ్యాక్టరీని నిర్మించడానికి ఒక ప్రైవేటు కంపెనీకి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. దీనివలన పదుల గ్రామాల ప్రజలు పంట భూములను కోల్పోతారు. సిమెంట్ ఫ్యాక్టరీనుండి వెలువడే దుమ్ము, దూళి మూలంగా గాలి కలుషితంగా మారి పర్యావరణం దెబ్బతింటుంది. పంటలు ప్రభావితమవుతాయి. అడవులు దెబ్బతింటాయి. పశువుల, ప్రజల ఆరోగ్యాలు పాడవుతాయి. శబరీనది జలాలు కలుషితమై, దాని పరివాహక ప్రాంతాల గ్రామాల ప్రజలు త్రాగునీటి సమస్యను ఎదుర్కొంటారు. అంటే ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మంది ప్రజల జీవితాలను ప్రభావితం చేసే ఈ కంపెనీని కనీసం గ్రామసభలలో ప్రజల ఆమోదం కూడా లేకుండా చట్టవిరుద్ధంగా అనుమతులిచ్చి పనులు ప్రారంభించాలని ప్రయత్నించారు. గతంలో పార్టీ నాయకత్వంలో ఈ సమస్యపై కలిసివచ్చే పార్టీలనూ, ప్రజాసంఘాలనూ, వ్యక్తులను కలుపుకొని విశాల ప్రజలతో ఐక్యసంఘటన ఏర్పర్చి కంపెనీకి వ్యతిరేకంగా పోరాడారు. ఈ పోరాటానికి అన్ని ప్రాంతాల ప్రజల మద్దతును కూడగట్టారు. ఈ ప్రజాందోళనతో కంపెనీ వెనక్కి తగ్గి తన నిర్ణయాన్ని మార్చుకొని ఖాళీ చేసి వెళ్ళింది. తిరిగి 9 సంవత్సరాలు గడిచిన తర్వాత ఈ ప్రాంతంలో తాత్కాలికంగా పార్టీ బలహీనపడటాన్ని అవకాశంగా తీసుకొని ప్రజల్ని లొంగదీసుకోవచ్చనే దుష్టతలంపుతో ప్రభుత్వం 2022 సం॥లో దాల్మియా సిమెంట్ కంపెనీకి అనుమతులిస్తూ ఒప్పందం చేసుకుంది. స్థానికంగా అధికార బీజేడీ నాయకులు కంపెనీ విదిలించిన డబ్బులతో కంపెనీ తరపున వకాల్తా పుచ్చుకొని ప్రజలను నయానా బయానా లొంగదీసుకొని కంపెనీ నిర్మాణం కోసం ప్రయత్నాలు ప్రారంభించాలనుకున్నారు. పోలీసు బలగాల మద్దతుతో కంపెనీ అధికారులు గ్రామాల్లో పర్యటించడం మొదలుపెట్టారు. క్రమంగా కంపెనీ రవాణా సౌకర్యాల కోసం, రోడ్ల నిర్మాణం కోసం శ్రీకారం చుట్టారు. ఈ ప్రయత్నాలను పసికట్టిన నీలిగూడ పంచాయితీలోని గ్రామాల ప్రజలు రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకోవాలని నిర్ణయించుకున్నారు. కంపెనీ అధికారులను అడ్డుకున్నారు. యంత్రాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసారు. దాంతో ఖంగుతిన్న ప్రభుత్వం, కంపెనీ యజమాన్యం వెంటనే పోలీసు బలగాలను దింపి, గ్రామాలపై రాత్రికిరాత్రే దాడిచేసి ఐదుగురు యువకులను అరెస్టు చేసి తీసుకెళ్ళారు. వారిపై కంపెనీని డబ్బులివ్వాలని డిమాండ్ చేసారని తప్పుడు ఆరోపణలు మోపి, అక్రమ కేసులు బనాయించారు. దాంతో క్రోపోద్రోక్తులైన వందలాది మంది ప్రజలు సాంప్రదాయక ఆయుధాలు ధరించి మల్కనగిరి పోలీస్టేషన్‌ను చుట్టుముట్టారు. అరెస్టు చేసిన యువకులను బేషరతుగా విడుదల చేయాలనీ, పోలీసులు ప్రజలకు క్షమాపణ చెప్పాలనీ, కంపెనీ నిర్మాణం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేస్తే ప్రభుత్వం ప్రజలకు




హైడ్రోపవర్ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న అల్లూరి జిల్లా ప్రజలు

లొంగిపోయినట్లుగా భావిస్తారనీ, తప్పనిసరి పరిస్థితులలో అందులో ముగ్గుర్ని మాత్రమే విడుదల చేసి, ఇద్దరిపై తప్పుడు జనాయించి జైలుకు పంపారు. కంపెనీ వ్యతిరేక ఆందోళనను మరింత ముందుకు తీసుకుపోవాలని ప్రజలు నిర్ణయించుకొని సంఘటితంగా పోరాడుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రస్తుత అల్లూరిసీతారామరాజు జిల్లాలోని చింతపల్లి,-కొయ్యూరు మండలాల సరిహద్దు ప్రాంతంలో గల ఎర్రవరం గ్రామంవద్ద 1200 మెగావాట్ల సామర్థ్యంతో హైడ్రోపవర్‌ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడానికి ఆదాని కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం వలన 3000 ఎకరాలకుపైగా భూములు ముంపుకు గురవుతాయి. 34 గ్రామాలకు చెందిన సుమారు 15000 మంది ప్రజలు నిర్వాసితులవుతారు. అడవులు దెబ్బతింటాయి. పర్యావరణ సమస్యలు తలెత్తుతాయి. దీనిలో అధికార వైఎస్ఆర్ నాయకుల వాటాలు కూడా ఉన్నాయి. ఈ ప్రాజెక్టుతోపాటు అనంతగిరి మండలంలో పెదకోట, గుజ్జిలి, చిట్టెంపాడు గ్రామాల పరిధిలో 4800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మరో హైడ్రోపవర్‌ప్రాజెక్టు నిర్మాణానికి ఆదాని గ్రూపుతో ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నది. ఈ ప్రాజెక్టుల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ప్రభావిత గ్రామాల ప్రజలు ఈ సమస్యపై కలిసివచ్చే అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు, వ్యక్తులతో ఐక్య కార్యాచరణ పోరాట కమిటీని ఏర్పర్చుకొని ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. ప్రభుత్వం 1/70, పెసా చట్టాలను ఉల్లంగించి గ్రామసభల ఆమోదం లేకుండా ఆగమేఘాల మీద ఆదాని గ్రూపుకు అనుమతులిచ్చిందని ఆదివాసీ, పీడిత ప్రజల ప్రయోజనాలు పట్టించుకోకుండా కార్పొరేట్ సేవలో నిమగ్నమైన ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించి పోరాడాలని ప్రజలు గ్రామసభలు జరుపుకొని తీర్మాణించుకొన్నారు. ఈ ఉద్యమాన్ని గతంలో జరిగిన బాక్సైట్ వ్యతిరేక ఉద్యమంలాగా కొనసాగించాలనీ, అందుకు ఎన్ని త్యాగాలకైనా సిద్ధం కావాలని అంతిమ విజయం సాధించేవరకు పోరాడుతామని పిలుపునిచ్చారు. ఈ న్యాయమైన పోరాటానికి మద్దతును ప్రకటిస్తూ అన్ని ప్రాంతాల ప్రజలు ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని మన్యం మనుగడ కోసం, జల్, జంగల్, జమీన్, ఇజ్జత్, అధికారం కోసం బలమైన ప్రజాఉద్యమాన్ని నిర్మించాలనీ, ఆదివాసీ ప్రాంతాలలో కార్పొరేట్ సంస్థల ప్రవేశాన్ని అడ్డుకోవాలని మన పార్టీ పిలుపునిచ్చింది. దానితో ప్రభుత్వం వివరణ ఇస్తూ, ప్రాజెక్టు నిర్మించే ప్రాంతంలోని భూములు మెజారిటీగా రిజర్వు ఫారెస్టు పరిధిలోకి వస్తాయనీ, 1, 2 గ్రామాలకు సంబంధించిన ప్రజల భూములు మాత్రమే స్వాధీనం చేసుకుంటామని అందుకు వారందరికీ ఉద్యోగాలు కల్పిస్తామనీ, ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామని ఎప్పటిలాగా పాతపాటను ఎత్తుకున్నది. ప్రజలు, ప్రభుత్వ మోసపూరిత మాటలు నమ్మవద్దని ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకొని జల్, జంగల్, జమీన్‌పై అధికారం ఆదివాసీలదేనని పోరాడాలని నిర్ణయించుకున్నారు.

విశాఖ నగరంలోని ఋషికొండను కూడా వదిలిపెట్టకుండా దాన్ని త్రవ్వి, చదునుచేసి, కొంత భాగాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి, మిగిలిన భూములను అధికార వైఎస్ఆర్‌సీపీ నాయకుల కబ్జాచేసి, రియలెస్టేట్ వ్యాపారం చేసి వేలకోట్ల రూపాయలు అర్జించాలని చూస్తున్నారు. దీని మూలంగా తలెత్తే పర్యావరణ సమస్యలతోపాటు, చారిత్రాత్మక ఋషికొండను రక్షించుకోవడానికి నగర ప్రజలతోపాటు, రాష్ట్ర ప్రజలు ఉద్యమిస్తున్నారు.

శ్రీకాకుళం జిల్లాలోని పలాస-కాశిబుగ్గ జంట పట్టణాల మధ్య ఉన్న నెమలికొండపై జీడిపిక్కల ఫాక్టరీలలో, పట్టణంలో రోజువారి కూలీ చేసుకుంటూ జీవనం సాగిస్తూ, కనీసం సొంత ఇల్లు కూడా లేని సుమారు 10,000 కుటుంబాలు కొన్ని దశాబ్దాలుగా నివాసం ఉంటున్నాయి. అలాగే జీడిపిక్కల ఫ్యాక్టరీల నుండి పట్టణంలో వెలువడే వాయుకాలుష్యాన్నీ, వాతావరణంలోని వేడిని ఈ కొండ నుండి వీచే స్వచ్ఛమైన గాలి ఒక మేరకు తగ్గించి పట్టణ ప్రజలకు ప్రాణవాయువును అందిస్తున్నది. అలాంటి ఈ కొండపై వైఎస్ఆర్‌సీపీ నాయకులు రియలెస్టేట్ మాఫియా అయిన దువ్వాడ (ఎమ్ఎల్‌సీ శ్రీనివాస్, శ్రీధర్, శ్రీకాంత్)సోదరుల కళ్ళుపడ్డాయి. ఈ కొండనుండి మట్టి తవ్వితీసి అమ్ముకునే వ్యాపారానికి ప్రభుత్వం అండదండలతో శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత కొండపై ఉన్న భూములతో రియలెస్టేట్ వ్యాపారం చేసి, కోట్ల సంపాధించాలనే పథకం వేసుకున్నారు. దీనితో నిర్వసితులయ్యే వేలాది అసంఘటిత కార్మికులు, పేద కుటుంబాలతోపాటు, పలాస-కాశిబుగ్గ పట్టణాల ప్రజలు సంఘటితమయ్యారు. పోలీసుల దాడులనూ, అధికార యంత్రాంగం బెధిరింపులనూ, రియలెస్టేట్ మాఫియా దువ్వాడ సోదరుల గూండాయిజాన్ని ఎదిరించి వివిధ రూపాలలో ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడి చివరకు దువ్వాడ మాఫియా సోదరులనూ, అధికార వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ అరాచకాలను ప్రతిఘటించి నెమలికొండను రక్షించుకున్నారు.

సుమారు 30 సంవత్సరాల క్రితం శ్రీకాకుళం జిల్లాలోని రామకృష్ణపురం గ్రామంలో భూస్వామి రావుల సాంబశివరావు పార్టీ జోక్యంతో 30 ఎకరాల భూములను ప్రజల నివాస స్థలాల కోసం అప్పగించాడు. ఆ భూములు ప్రజల స్వాధీనంలోనే ఉన్నప్పటికీ, వివిధ కారణాల చేత పంపిణీ జరగకుండా సమిష్టి భూములుగానే ఉంటున్నాయి. ఈ భూమి నేషనల్ హైవేకు పక్కన ఉండటంతో ప్రస్తుతం ఆ భూముల విలువ కోట్ల రూపాయలకు పెరిగింది. దానితో జిల్లాలోని రియలెస్టేట్ మాఫియా దువ్వాడ సోదరులకు ఆ భూములపై కన్ను పడింది. ప్రభుత్వ యంత్రాంగం అండదండలతో ఈ భూములకు దొంగపట్టాలు సృష్టించుకొని ఆక్రమించారు. ఆ తర్వాత ఎమ్‌పీ విజయసాయిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రి సీదిరి అప్పలరాజుల భాగస్వామ్యంతో ఈ భూములను చరణ్ అనే కార్పొరేట్ సంస్థకు అమ్మకానికి పెట్టారు. ఈ చరణ్ గ్రూప్ ఇక్కడ స్మార్ట్‌సిటీ నిర్మాణానికి పూనుకొని రియలెస్టేట్ వ్యాపారం చేయడానికి దాని చుట్టుపక్కల ఉన్న సుమారు 150 ఎకరాల రైతుల పంట భూములను అధికార పార్టీ మద్దతుతో ఆక్రమించుకొనీ, భారీ యంత్రాలను ఉపయోగించి భూములను చదును చేయడం ప్రారంభించింది. దానితో చుట్టుపక్కల ఉన్న అనేక గ్రామాలకు చెందిన వందలాది మంది ప్రజలు కదిలి భూముల ఆక్రమణకూ, స్మార్ట్ సిటీ నిర్మాణానికి వ్యతిరేకంగా రోజులతరబడి ఆందోళన కొనసాగించారు. ఈ గ్రూపు పోలీసు యంత్రాంగాన్ని దింపి, ప్రజలను బెదిరించి లొంగదీసుకోవాలని చేసిన ప్రయత్నాలు ప్రజల పోరాటం ముందు తోకముడచక తప్పలేదు. దీంతో ప్రజలు పోరాడి ఆ భూములను కాపాడుకున్నారు. ఇవేకాకుండా రాష్ట్రంలో ప్రజలు అనేక సమస్యలపైనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక నూతన పద్ధతుల్లో పోరాడుతున్నారు. పోలీసు అధికారులు చెప్పినట్లుగా కాకుండా ప్రజలు అనేక సమస్యల్ని ఎదుర్కొంటూ విప్లవోద్యమం ఇచ్చిన చైతన్యంతో పోరాడుతూ విజయాలను సాధిస్తూ గత పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు.




తెలంగాణ-చత్తీస్‌ఘడ్ బార్డర్, కోమటి గ్రామ సమీపంలో
నిర్మించిన కామ్రేడ్ సాకేత్(అక్కిరాజు హరగోపాల్) స్మారకస్థూపం